
# బొమ్మరిల్లు

వాసిరెడ్డి సీతాదేవి



# బొమ్మరిల్లు

-వాసిరెడ్డి సీతాదేవి

మద్రాసు జనరల్ ఆసుపత్రిలోని క్యాంటీన్.

తెల్ల కోట్లలో యువతీ యువకులు కుర్చీలలో కూర్చుని ఉన్నారు. కొందరు బైటికి వెళ్తున్నారు. మరికొందరు సీట్లకోసం వెతుక్కుంటున్నారు.

ఆ వాతావరణంలో ఉత్సాహం ఉరకలు తీస్తోంది. యవ్వనం ఉరవళ్ళు పరవళ్ళు తొక్కుతోంది. కిలకిల నవ్వులు. 'హాయ్! హాయ్!' అనే పలకరింపులు. ఫలహారాలు అందించే సర్వర్స్ ను కొందరు టీస్ చేస్తుంటే, కొందరు స్నేహితులతో మాట్లాడినట్టు జోక్స్ విసురుతూ మాట్లాడుతున్నారు.

కొందరు కబుర్లలో మునిగిపోతే, మరికొందరి కళ్ళు యువతుల్ని పరిశీలిస్తున్నాయ్.

ఒక మూలగా ఉన్న టేబుల్ దగ్గిర నలుగురు ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూర్చుని ఉన్నారు. కాఫీ సిప్ చేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కొంచెం దూరంలో ఉన్న యువతులు ఎందుకో కిలకిల నవ్వుతున్నారు. చాలామంది యువకులు కళ్ళు నవ్వులు వినిపిస్తున్న వైపుకు తిరిగాయి.

"ఒరేయ్ హనుమంతూ! నీ పేరు మార్చుకోరా! బొత్తిగా బాగాలేదు" అన్నాడు సుధాకర్.

"అవునుర్రా! కమలాకర్ అని పెట్టుకో!" అన్నాడు రమేశ్.

"నాకీ పేరేబాగుందిరా! అచ్చ తెలుగు పేరు. హనుమంతరావు. ఆంధ్రాకు వెళ్ళి పదిమంది ఉన్నచోట 'ఒరే హనుమంతురావ్!' అని పిలవండి. కనీసం ఇద్దరైనా తిరిగి చూస్తారు." స్పోర్టివ్ గా అన్నాడు హనుమంతరావు. అందరు గొల్లున నవ్వారు?

"ఎందుకు పిరికి రింగో!" (ఎందుకు నవ్వుతున్నారు?) అన్నాడు జయకాంతన్.

"నిన్ను చూసే! పేరు బ్రహ్మాండంగా ఉంది. కాని ముఖమేమాడు చెక్కలా వుంది. కాళ్ళూ చేతులూ తుమ్మమొద్దులా..." మళ్ళీ అందరూ నవ్వారు.

"ఎన్నా పేశరా?" (ఏమంటున్నాడు?) గౌతమ్ చూస్తూ అడిగాడు.

"ఉన్నఒల్లుం సోల్లలే!" (నిన్ను ఏమీ అనలేదు). అన్నాడు హనుమంతరావు.

జయకాంతన్ చూడటానికి లారీడ్రైవర్ లా ఉంటాడు. చాలా మొరటుగా కన్పించడమే కాకుండా మొరటుగా ప్రవర్తిస్తాడు కూడ. సుధాకర్ మాటలు అర్థం అయి ఉంటే ఈపాటికి అతను టేబుల్ కిందకు దూరాల్సి వచ్చేది.

గౌతమ్ గంభీరంగా ఉన్నాడు. ఆ మాటలు అతనికి వెకిలిగా అన్పించాయి.

"ఒకరిరూపాన్ని విమర్శించడం, అదీ ఆ వ్యక్తికి తెలియని భాషలో దారుణం. మన మానసిక స్థాయిని తెలుపుతుంది" అన్నాడు గౌతమ్.

"వీడొకడ్రా. ప్రతిదానికీ నీతులు బోధిస్తాడు" అన్నాడు సుధాకర్.

"అయితే నువ్వు అన్న మాటలు జయకాంతన్ కు చెప్పమంటావా?"

"ఒరేయ్! బాబూ! అంతపని చెయ్యకురా. నావళ్ళు హూనం చేసేస్తాడు." బ్రతిమాలుకున్నాడు సుధాకర్.

"ఎన్న? అవన్ ఎన్నపేశం?" గౌతమ్ ను ప్రశ్నించాడు జయకాంతన్.

సుధాకర్ భయం భయంగా గౌతమ్ ముఖంలోకి చూశాడు.

అంతలో ఎవరోపిలవడంతో జయకాంతన్ లేచి బయటికి వెళ్ళాడు.

"అంత భయపడేవాడివి అలాంటి మాటలు ఎందుకనాలీ? దాన్నే అంటారు అసమర్థుని దుర్జనతం అని" అన్నాడు గౌతమ్. సుధాకర్ ముఖం ముడుచుకున్నాడు.

"అసలు సంగతికి వద్దాం? వాతావరణంలో గాంభీర్యాన్ని సడలించడానికి అన్నట్టు అన్నాడు రమేశ్.

"ఏమిటి అసలు విషయం?"

"అదే నీపేరు మార్పు గురించి"

"వాడికి ఏపేరుంటేనేంరా! పూల రంగడు!" అన్నాడు సుధాకర్.

"అవును! జల్సారాయుడు వాడికేం! ఎంతమంది ఆడపిల్లల్ని తన చుట్టూతా తిప్పుకుంటున్నాడో చూడటం లేదూ!" అన్నాడు రమేశ్.

హనుమంతరావు తలపైకెత్తి సిగరెట్ పొగను విలాసంగా ఊదాడు.

"ఒరేయ్ అంబుజాన్ని కాపాడుకోరా!"

హనుమంతరావు నిర్లక్ష్యంగా నవ్వాడు.

"అవున్రాపిట్ట ఎగిరిపోయేలా ఉంది. ఈ మధ్య ఆ రాఘవన్ తో తిరుగుతోంది"

హనుమంతరావు ఘోల్లున నవ్వాడు.

"నవ్వుతావేంరా? మేము అబద్ధం చెప్పడంలేదు. మొన్నరాత్రి బీచ్ లో చూశాను వాళ్ళిద్దర్నీ!"

"ఓహో! అయితే నువ్వు కూడా ఆ అమ్మాయిని వెంటాడుతున్నావన్నమాట!" గౌతమ్ అన్నాడు.

"ఛ! అదేంమాట! నేను మనవాడికి ద్రోహం చేస్తానా!"

"నీమొహం! అది నువ్వు ఎంత వెంటపడ్డా తిరిగి కూడా చూడదు. దానికి కావాల్సింది డబ్బు!" అన్నాడు హనుమంతరావు.

"అదికావాలన్నా నేను దాని ముఖం చూడను" ఉడుక్కున్నాడు సుధాకర్.

"ద్రాక్షపళ్ళు పులుపు" అన్నాడు గౌతమ్.

"ఏమంటోయ్. నేను ఏం మాట్లాడినా నువ్వు మహా ఇదిచేస్తున్నావ్?" కోపంగా అన్నాడు సుధాకర్.

"సులోచన కూడా దక్కేలాలేదు. దాన్ని నిన్న శ్రీనివాస్ తో పానగల్ పార్కులో చూశాను"

"ఊ" అన్నాడు హనుమంతరావు నిర్లక్ష్యంగా.

"నిజంగా రా! గౌతమ్ కూడా చూశాడు! ఏరా గౌతమ్ నేను చెప్పింది నిజమే కదూ?" అన్నాడు రమేశ్.

గౌతమ్ మాట్లాడలేదు. ముఖం చిట్లించుకున్నాడు.

"ఏరా గౌతమ్ నీకోటు బొత్తిగా చిరిగిపోయినట్టు ఉంది. సాయంకాలం నాతో బజారుకురా!"

"ఎందుకూ?"

"కొత్త కోటుకుట్టిస్తాను" అన్నాడు హనుమంతరావు.

"అక్కర్లేదు" గౌతమ్ ముఖం ఎర్రబడింది.

"ఒరేయ్ మేము అంబుజం గురించీ, సులోచన గురించీ మాట్లాడుతూ ఉంటే, నువ్వు వాడి కోటు గురించి మాట్లాడతావేంరా?" అన్నాడు రమేశ్.

"జాగ్రత్తపడరా బాబూ! లేకపోతే పిట్టలు ఎగిరిపోయే ప్రమాదం ఉంది"

"ఉష్! అంతేగదా?"

"అంతేనంటావా?"

"మరిలేకపోతే? వాళ్ళకోసం నేను నిద్రపోకుండా దేవదాసులా తాగుతూ పాటలు పాడుకుంటాననుకుంటున్నారా?" హనుమంతరావు అన్నాడు మరో సిగరెట్ వెలిగించుకుంటూ.

"అంత మరీగొప్పలు కొట్టుకురా?"

"మీ బొంద! ఇందులో గొప్పలు కొట్టడం ఏముంది? చిట్టినాయనల్లారా నేను వాళ్ళ కోసం దిగులుపడటంలేదు. ఎలా వదిలించుకోవాలా అని ఆలోచిస్తున్నాను. నాకు ఆ బాధ తప్పినందుకు సంతోషంగా ఉంది" హనుమంతరావు కాలిన సిగరెట్టును కిందపడేసి బూట్ కాలితో నలిపేశాడు.

"క్రొత్తపిల్లల్ని పట్టినట్టున్నాడురోయ్ మనవాడు" అన్నాడు సుధాకర్.

"నా దృష్టిలో ఆడదానికీ,ఈ సిగరెట్టుకూ అట్టే తేడాలేదు. అనుభవించడం...."

"ఆ తర్వాత కాలికింద నలిపెయ్యడం!" గౌతమ్ వ్యంగ్యంగా అన్నాడు.

"అవును! నాకు నీలా ఫూలిష్ సెంటిమెంట్సు లేవు. నేను కోరుకోవాలే గానీ అంబుజాక్షులూ, వనజాక్షులూ కోకొల్లల్లు. దాని బాబులాంటి వాళ్లు నా చుట్టూ తిరిగారు"

"అవున్రా! తిరుగుతారు! ఎందుకు తిరగరు? ఆధునిక లైలాలు మజ్నూలు చుట్టూ తిరగడంమానేసి చాలాకాలం అయింది. ఇప్పుడు వాళ్ళు జేబులు చుట్టూ తిరుగుతున్నారు.

నీ జేబుబరువుగా ఉన్నంతకాలం నీచుట్టూ తిరిగేవాళ్ళు ఉంటూనే ఉంటారు. అది ఖాళీ అయ్యాక చూడు...." అన్నాడు గౌతమ్.

అందరూ గౌతమ్ కేసి చూశారు.

"నిజమేరా! గౌతమ్ అప్పుడప్పుడు బ్రహ్మాండమైన సత్యాలు చెబుతాడు."

"వాడు అలాగే అంటాడులే!"

"వాడి మాటల్లో నిజంలేకపోలేదని నాకు అనిపిస్తుంది. నీకంటే నేను అందంగా ఉంటానా? మరి నీ చుట్టూతిరిగేవాళ్ళు నా చుట్టూ తిరగరేం?" అన్నాడు రమేశ్.

"అదేం కాదులే!"

"మరి?"

"నీ అందచందాలు చూసే తిరుగుతున్నారంటావ్?" అన్నాడు సుధాకర్.

"అవును! వాళ్ళు నా డబ్బును చూసితిరగడంలేదు. నా వ్యక్తిత్వంలో ఏదో ఆకర్షణ ఉండి ఉండాలి. కేవలం డబ్బుకోసమే తిరిగే వాళ్ళయితే నాచుట్టూ ఎందుకు తిరగాలి. మా డాడీ చుట్టూ తిరగొచ్చునుగా?"

"అదీ నిజమేలా అనిపిస్తుంది" సాలోచనగా అన్నాడు రమేశ్.

"దీనికి జవాబు ఏమిటి!" అన్నట్టు గౌతమ్ ముఖంలోకి చూశాడు హనుమంతరావు.

"మీ నాన్నవయసు ఉడిగిపోయినవాడు. ఆయనకు జీతం నేర్పిన అనుభవం ఎంతో ఉన్నది. ఒకవేళ అమ్మాయిలు చుట్టూ తిరిగినా ఆయన నీలా తన వ్యక్తిత్వం, అందచందాలు చూసి తిరుగుతున్నారని భ్రమలో పడడు. ఆయనకు తెలుసు వాళ్ళకు కావల్సింది తను కాదనీ, తన డబ్బేననీను! ఆ వయసులోని వాళ్ళు సాధారణంగా అమ్మాయిలు మీదకంటే వెండి బంగారాల మీదే వ్యామోహపడతారు. డబ్బంటే పడి చచ్చిపోతారు. అందుకే నీ చుట్టూ తిరిగేవాళ్ళు మీ డాడి చుట్టూ తిరగరు!" తెలిసిందా నాయనా అన్నట్టు హనుమంతరావు కళ్ళలోకి చూశాడు గౌతమ్.

"నీకు ఈ విషయంలో బొత్తిగా అనుభవంలేదు. అందుకే అలా మాట్లాడుతున్నావు. వయసు మళ్ళినవాళ్ళకే ఆడవాళ్ళ మీద మోజు ఎక్కువ. కాని వయసులో ఉన్న ఆడపిల్లలు వాళ్ళను పట్టించుకోరు"

"కాని విదేశాల స్త్రీలు నలభై దాటిన మగవాడినే ఎక్కువ ఇష్టపడతారట" అన్నాడు సుధాకర్.

"కారణం. ఆ పురుషులకు స్త్రీలను ఎలా గౌరవించాలో తెలుసు"

"కానేకాదు. మనవాళ్ళు స్త్రీని దేవత అన్నారు. మాతృమూర్తి అన్నారు. మన దేశంలో స్త్రీని గౌరవించినంతగా మరేదేశంలోనూ గౌరవించరట. కానిరోజులు మారిపోతున్నాయ్. మనదేశపు స్త్రీలు పాశ్చాత్య సభ్యతను అనుకరిస్తున్నారు. ఫ్యాషన్ పేరుతో శరీరంలోని వంపుల్ని బజార్లలో ప్రదర్శిస్తున్నారు. స్వతంత్రం పేరుతో విచ్చలవిడిగా తిరుగుతున్నారు. ఇదంతా పాశ్చాత్య స్త్రీలను అనుకరించటంవల్లే జరుగుతున్నది"

"నువ్వు పొరపడుతున్నావ్ రమేశ్! పాశ్చాత్య స్త్రీలు గురించి తెలియకుండా దారుణంగా మాట్లాడకు. అక్కడి స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో కృషి చేస్తూ దేశపురోవృద్ధిలో భాగం పంచుకుంటున్నారు. ఇంతకాలం తనేమో తన సంసారమేగా నాలుగుగోడల మధ్య మగ్గిపోయారు మనదేశంలో స్త్రీలు. వారు ఇప్పుడిప్పుడు బయట అడుగుపెడుతున్నారు. కొత్తగా నడక నేర్చుకునేవాడు అక్కడకూడా పడటంజరుగుతూ ఉంటుంది. అంతమాత్రంచేత

మన భారతీయ సంస్కృతిని మట్టిపాలయిపోతుందని గగ్గోలు పెట్టనక్కర్లేదు. స్త్రీకి ఒక నీతి పురుషుడికి ఒక నీతి కాదు. హనుమంతరావు అమ్మాయిల్ని మారుస్తూ తిరుగుతూ ఉంటే మీకు అదో గొప్పతనంగా కన్పిస్తున్నది. అదే అంబుజం విషయం వచ్చేసరికి మీకు చాలా ఘోరం జరిగిపోతున్నట్లు అన్పిస్తున్నది" అన్నాడు గౌతమ్.

"అబ్బబ్బ! బోర్! సరదాగా కబుర్లు చెప్పుకోక ఏమిట్రా ఉపన్యాసాలూ మీరూనూ!" అన్నాడు హనుమంతరావు సిగరెట్ను పెట్టెమీద కొడుతూ.

"ఒరేయ్ హనుమాన్! అదుగో చూడరా మన కాలేజీబ్యూటీ వస్తుంది" అన్నాడు రమేశ్.

హనుమంతరావు కళ్ళు పెద్దవి చేసుకొని చూడసాగాడు. పెదవులు నాక్కుంటున్నావ్?"

"ఛ! ఉండరా నువొకడివి!"

"ఎందుకనో మనవాడు రేణుకను వదిలేశారు?" అన్నాడు రమేశ్.

"వదిలెయ్యడం ఏమిటి? ఆమె జోలికిపోతే పళ్ళు రాలిపోతాయని తెలుసు మనవాడికి" అన్నాడు గౌతమ్.

"చింతకాయలు రాలినట్టేనా...."

"ఛ! నోరుముయ్యండిరా. నేనుకావాలనుకోవాలేగాని....ఇంతవరకూ నాకు ఆ ఆలోచనేరాలేదు."

"కొయ్!కొయ్! అన్నాడు సుధాకర్.

"కోతలు కోసేది మీరు. మీరందరూ దద్దమ్మలు. నన్నుచూస్తే ఏడుపు. నేను కావాలనుకుంటే ఎంతసేపు! అది ఎప్పుడూ డల్ గా కన్పిస్తుంది. ఒక సరదా లేదు--పాడూ లేదు-- ఈసురోమంటూ ఉండేవాళ్ళంటే నాకు పరమ అసహ్యం!" అన్నాడు హనుమంతరావు.

"లేతలేత సొరకాయలు బలే కోస్తున్నావ్ లే!"

"దమ్ములేవురా! ఆవిడగార్ని చూస్తేనే మనవాడికి చమట్లు పడ్తాయి" రెచ్చగొట్టాడు సుధాకర్.

"పడ్డింది. చూస్తూండండి...ఒకరోజు దాన్ని కూడా...."

ఛ....బొత్తిగా సంస్కారంలేదు" గౌతమ్ కంఠం తీవ్రంగా ఉంది.

"కరెక్టు! ఎవరికి? దానికేనా బొత్తిగా సంస్కారంలేనిది. అదే నేనూ...."

"ఆమెకుకాదు....నీకు"

హనుమంతరావు ఓ క్షణం గౌతమ్ ముఖంలోకి చూశాడు. హనుమంతరావుకు గౌతమ్ అంటే ఇష్టం. ఆమాటే మరొకడు అని ఉంటే చొక్కా కాలర్ పట్టుకుని చెంపచెళ్ళు మనిపించేవాడు.

"తోటివిద్యార్థినుల్ని అదీ ఇదీ అనడానికీ సిగ్గెలా వెయ్యడంలేదురా. రేపో మాపో డాక్టర్లం కాబోతున్నాం. ఎందుకు మనకీ చదువులు!" అన్నాడు గౌతమ్ విసురుగా.

"ఏమిట్రోయ్. ఆవిడగార్ని అంతవెనకేసుకొస్తున్నావ్? ఏమిటి కథ! ప్రేమిస్తున్నావా? ఆమాట చెప్పు! నేను ఆమె జోలికి వెళ్ళను!"

"పిచ్చిగా మాట్లాడకు. నీ చెల్లెలూ ఇదే కాలేజిలో చదువుతోందిగా?"

"అవును! అయితే?"

"నీ చెల్లెల్ని ఏ కుర్రవాడైనా అవమానిస్తే ఏం చేస్తావ్?"

"దవడపళ్ళు రాలగొడతాను" రోషంగా అన్నాడు హనుమంతరావు.

మిగతా ఇద్దరూ గౌతమ్ నూ హనుమంతరావునూ మార్చి మార్చి చూశారు.

సుధాకర్ కు ఉషారుగా ఉంది. హనుమంతరావు గౌతమ్ ను అంతగా అభిమానించడం అతనికి ఈర్ష్యగా ఉంటుంది.

బాగా అయింది హనుమంతుగాడికి. ఈ దెబ్బతో గౌతమ్ ముఖంకూడా చూడడు.

"ఓహో! అలాగే! అంటే పరాయి ఆడపిల్లల్ని అవమానించే హక్కు నీకు జన్మతోనే సంక్రమించిందన్నమాట. నీ చెల్లెల్ని మాత్రం ఎవరూ ఏమీ అనకూడదు" గౌతమ్ వ్యంగ్యంగా అన్నాడు.

"అవును! అంత!" మొండిగా అన్నాడు హనుమంతరావు.

"అంత అహంకారం పనికిరాదురా. నువ్వు మంచివాడివేరా? అదే...ఆ జేబు ఉంది చూశావ్ అదే చెడ్డది. ఆడబ్బే నీ చేత ఇలా చేయిస్తుంది. ఇకనీతో వాగి లాభంలేదు. నా ముందు మాత్రం ఇలాంటి మాటలు ఇంకెప్పుడూ మాట్లాడకు. నా స్నేహం నీకు కావాలనుకుంటే...వాక్యం పూర్తి చెయ్యకుండానే చివున లేచి వెళ్ళిపోయాడు గౌతమ్.

"ఏమిట్రోయ్ రేణుకను అంటే వాడికి అంతకోపం వచ్చింది?" సుధాకర్.

"ప్రేమిస్తున్నాడేమో!" రమేశ్.

"వాడిమొహం! వారాలు తిని బతికేవాడికి ప్రేమ ఏమిటి?"

"నోళ్ళు మూస్తారా?" హనుమంతరావు కోపంగా అన్నాడు.

"అదేమిట్రావాడి మీద కోపం మామీద చూపిస్తావ్?"

"వాడిమీదనాకు కోపంలేదు. వచ్చినా అది ఎంతోసేపు ఉండదు. వాడు వారాలు తినే బతకవచ్చు. కానీ వాడు యాచకుడు కాడు. వాడి మనసుకు బీదతనం లేదు. కాని మీరో? నేను కొత్త షర్టువేసుకోవడం పాపం! నాకివమంటే నాకివమనిపోటీ పడ్తారు. గౌతమ్ కు నేనే ఆఫర్ చేసినా తీసుకోడు. తినో తినకో ఆ వచ్చే స్కాలర్ షిప్ తోనేబతుకుతున్నాడు. ట్యూషన్సు కూడా చెప్పుకొని సంపాదించుకుంటున్నాడు. ఇంకెప్పుడూ వాణ్ణి గురించి నాదగ్గిర తేలిగ్గా మాట్లాడకండి"

హనుమంతరావు చివ్వున లేచి నిల్చున్నాడు.

సుధాకర్, రమేష్ బిక్కచచ్చిపోయి ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు."

ఆడపిల్లల వైటింగ్ రూం.

రంగు రంగుల చీరలు, గాజుల గలగలలు, పత్తికాయలుపగులుతున్నట్టు పకపకలు.

రేణుక గడ్డంకింద చెయ్యి పెట్టుకొని కూర్చుంది. తనచుట్టూ ఉన్న వారి మాటలు గానీ, నవ్వులు గానీ ఆమెకుకన్పించడం లేదు. ఆమె కళ్ళు దూరంగా దేన్నో చూస్తున్నాయ్. ఆమె మనసు రెక్కలు కట్టుకొని నీలాకాశంలో

ఎగురుతున్నది. గమ్యం కోసం వెతుకుతున్నది. గమ్యం చాలా దూరంగా కనీకన్పించకుండా ఉన్నది. ఆ గమ్యం గౌతమ్ ను చేరుకోవడమే.

గౌతమ్! గౌతమ్! మనసులోనే ఎన్నోసార్లు అనుకుంది.

గౌతమ్! ఎంతచక్కని పేరు. పేరుకు తగ్గట్టు బుద్ధుడిలాగే కన్పిస్తాడు. ఆ ముఖం ఎప్పుడూ ప్రశాంతంగానే కన్పిస్తుంది. తనకు అతని ముఖంలోకి అలా చూస్తూ యుగాలు గడపాలనిపిస్తుంది. ఎందుకు టిప్ టాప్ గా ఉండడు. అతని దుస్తులు చూస్తుంటేనే తెలుస్తుంది. అతను ఎంత బీదవాడో! ఆడపిల్లలకేసి కన్నెత్తి కూడా చూడడు. కల్పించుకొని మాట్లాడటానికి ప్రయత్నించడు. రోగుల్ని చూస్తున్నప్పుడు, సీనియర్స్ రోగాల గురించి వివరిస్తున్నప్పుడూ ఎంతశ్రద్ధగా వింటాడు? తపసిలా కన్పిస్తాడు. నర్సులకూ, రోగులకూ కూడా అతనంటే ఇష్టం. చిన్నగా మాట్లాడతాడు. రోగుల్ని చూస్తున్నప్పుడు అతని ముఖంలో ఆదరణా, కళ్ళలో ఆర్ద్రతా కన్పిస్తాయి. తను దొంగలా అతన్ని గమనిస్తూనే ఉంటుంది. కానీ అప్పుడప్పుడు అతను అనుకోకుండా తనకేసి చూస్తాడు. తనకు ఏదో దొంగతనం చేస్తూ చిక్కిపోయినట్టు అన్పిస్తుంది.

విద్యార్థులమధ్య అతను ప్రత్యేకంగా కన్పిస్తాడు. బహుశా తనకు ఇష్టం కనక అలా కన్పిస్తాడేమో? లక్షమందిలో ఉన్నా తను గౌతమ్ ఉనికి గుర్తించగలదు.

ఉపాధ్యాయులకూ, డాక్టర్లుకూ అతనంటే ఎంతో గౌరవం. అతని తెలివితేటల్ని మెచ్చుకుంటారు. మూర్తీభవించిన సంస్కారంలా ఉంటాడు.

తనకంటే ఒకసంవత్సరం సీనియర్. అందువల్లనే ఎక్కువగా చూసే అవకాశం తనకు దొరకదు. తను అతన్ని పరీక్షగా ఎప్పుడు చూసింది?

ఆ అవును! ప్రాక్టికల్ చేస్తున్న రోజు. తన అవస్థ పడుతూ వుంటే అతను ఎంతసేపటినుంచి గమనిస్తున్నాడో "నేను హెల్ప్ చెయ్యనా?" మృదువుగా అడిగాడు. అప్పుడే అతన్ని తను పరిశీలనగా చూసింది. ఎందరో తోటివిద్యార్థులతో తను మాట్లాడుతుంది. కాని అతనితో మాట్లాడాలంటే ఏదో తడబాటు కలిగింది. మొదటిసారి ఒక యువకుడితో మాట్లాడటానికి తను తడబడింది. తన సమాధానానికి ఎదురు చూడకుండానే ప్రాక్టికల్ కు సహాయం చేశాడు.

ఆ రాత్రంతా తను ఆలోచిస్తూనే పడుకుంది. అతను తనను కావాలనే చనువు పెంచుకోవడానికి పలకరించాడనుకుంది. మళ్ళీ మళ్ళీ పలకరిస్తాడని ఆశించింది. కానీ అలా జరగలేదు. తను ఎదురుపడ్డా చూసీచూడనట్టే వెళ్ళిపోతాడు. ఒకటి రెండుసార్లు తనే ఏదో అడిగింది. తను అడిగిన దానికి సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు. తనకు నిరాశతోపాటు అతని మీద చిరాకు కూడా కలుగుతుంది.

ఛ! అతన్ని గురించి తను యింతగా ఆలోచించడం ఏమిటి? తను కావాలనుకుంటే ఆమాత్రం మగవాడే దొరకడా? అంతపట్టీపట్టనట్టు ఉండే వాడిని తను అహర్నిశలు తల్చుకోవడం ఏమిటి?

ఎన్నోసార్లు అతని పేరును కూడా ఉచ్చరించకూడదు అనుకుంది. అయినా తన మనసు మాత్రం అతని నామాన్నే జపిస్తుంది. తన కళ్ళలో అతని రూపమే మెదులుతుంది. అతను అంత దూరంలో కన్పించగానే తన మనసులో ఏదో మధురమైన ఆలాపనతో పాటు తన గుండె కూడా ఆగిపోయినట్టు అనిపిస్తుంది. అతను తనను పట్టించుకోకుండా వెళ్ళగానే గుండెలో ఏదో గుబులు. అక్కడ నిల్చోవాలనిపించదు. ఎక్కడా నిల్చోవాలనిపించదు. ఎక్కడికో పరుగులు తియ్యాలనిపిస్తుంది.

ఎందుకు?

తను గౌతమ్ ను ప్రేమిస్తున్నది. ప్రేమలో ఇంత బాధ ఇంత ఆనందం ఉన్నాయా?

"ఏయ్ రేణూ?"

"ఏమిటే పగలే కలలు కంటున్నావ్?"

"ఎవరా రాజకుమారుడు?"

"ఇంకెవరు, గౌతమ్!"

గౌతమ్ పేరు విన్పించగానే త్రుళ్ళిపడింది. ఆలోచనలనుంచి బయట పడింది. చుట్టూ కలయచూసింది.

"ఇలా కలలుకంటూ పెద్ద పెద్ద నిట్టూర్పులు విడవకపోతే ఆ రాజకుమారుడితో చెప్పెయ్యరాదూ?"

రేణుక సుగంధి కేసి బిక్కుబిక్కుమంటూ చూసింది.

"అదేమిటే అలా చూస్తావ్? నాకు ఎలా తెలిసిపోయిందనా?" అన్నది సుగంధి.

రేణుకకు ఏంమాట్లాడాలో బోధపడలేదు.

"ఎలా చెబుతుందే? ఆయనగారేమో సుద్ధబుద్ధావతారం!" అన్నది సుధ.

"మనభారతదేశం కర్మభూమి! ప్రయత్నించు అతన్ని నీవైపు చూసేలా చెయ్యి" అన్నది వాణి.

"ఏ చూపులూ లేకుండానే ఇంత పెద్దపెద్ద నిట్టూర్పులు తీస్తుందనుకుంటున్నారా?" అన్నది సుధ.

"ఏమిటే మీగోల" అన్నది రేణుక బిక్కమొహం పెట్టి.

"ఆ రుషి పుంగవుణ్ణి ఆకర్షించే ఉపాయం చెప్పనా?"

"చెప్పవే! ఊ త్వరగా?" అన్నది వాణి.

"మధ్యలో నీకెందుకు అంత తొందర?" అన్నది మీనాక్షి.

పాపం దానికి నోట్లో నాలుక లేదే! ఇద్దరూ ఇద్దరే! మనమన్నా కలిసి సహాయం చేద్దామని"

"అయితే చెప్పనా?"

"నేను వెళ్ళిపోతా మీరిట్లా వాగితే!" అంటూ రేణుక లేచినిల్చుంది.

"కూర్చోవే! నీకు సహాయం చేద్దామని మేంచూస్తుంటే....ఎందుకే అంత కోపం!" అన్నది సుగంధి.

"కోపం కాదు. నటన!" సుధ అన్నది.

అందరూ సుధకేసి చూశారు.

"నేనేం నటించడం లేదు. అలాంటివి నాకు చేతకావు"

"అంటే నాకు చేతనవుతాయనా నీ ఉద్దేశం!" సుధ కంఠం తీవ్రంగా ఉంది.

"సుధా! మరీ అంత ఇదిగా మాట్లాడకు. ఇప్పుడు రేణుక నిన్నేమన్నదని, కూర్చో రేణూ!" అంటూ చెయ్యిపట్టుకొని లాగి కూర్చోపెట్టింది సుగంధి.

"సుగంధికి ఇలాంటి ట్రిక్స్ బాగా తెలుసు, కూర్చోవే రేణూ! ఊ చెప్పు సుగంధీ!"

"అదుగో అలా పిలిస్తే వీపు చిట్లగొడతానని చెప్పాను. గుర్తుందా?"

"అబ్బబ్బ! అసలు సంగతి తేల్చండే. ఇంతకీ ఆ రాజకుమారుడ్ని తనవైపుకు ఆకర్షించుకోవాలంటే రేణుక ఏం చెయ్యాలి?" అడిగింది మీనాక్షి.

"ఇదిగో చెబుతున్నా! రేణూ! శ్రద్ధగా విను! అతన్ని ఓరచూపులతో చూడు. పసివాడు మిఠాయి కేసిచూసినట్టు చూడు. నీ అందమైన మెడను కొంచెం పైకెత్తి, పక్కకు విరిచి నెమలిలా చూడు! అతని ముందు నుంచి చిన్నగా రాజహంసలా నడుస్తూ, మధ్య మధ్య వెనక్కు చూస్తూ నడువు."

"తల్లీ! ఇక చాలు! ఆపు!" రెండు చేతులూ జోడిస్తూ అన్నది రేణుక. వస్తున్న నవ్వును పెదవుల మధ్య బలవంతంగా బంధించింది.

"ఆహా! అద్భుతం. మన సుగంధికి చాలా ఎక్స్ పీరియన్సే ఉన్నట్టుందే?"

"ఏడ్చార్లే! కాసేపు నోళ్ళుమూసుకొని కూర్చోండి"

మీనాక్షి, వాణీ నోళ్ళు చేతులతో మూసుకున్నారు. అది చూసి సుగంధికి నవ్వాగలేదు. రేణుక కూడా పకపక నవ్వింది. సుధ మాత్రం గంభీరంగా కూర్చుంది.

"నేపుట్టి మునిగిపోయినట్టు కూర్చోపోతే నువ్వూ నవ్వరాదే!" అన్నది వాణి సుధను చూస్తూ.

"మీరు నవ్వుతున్నారుగా చాల్లే!" అన్నది సుధ విసురుగా.

సుధ అంతచిరాకు పడటానికి కారణం వాణికి తప్ప మరెవరికీ అర్థం కాలేదు. వాణి సుధ కళ్ళలోకి చూసింది.

"ఎందుకే అలా చూస్తావ్? నా ముఖంలో బొమ్మలు ఆడుతున్నాయా?" కయ్యిన లేచింది సుధ.

"అరే బాబా! మధ్యలో పానకంలో పుడకల్లా మీరేమిటే?" మీనాక్షి అందుకుంది.

"ఇక నీ పాఠం ప్రారంభించు!" అన్నది వాణీ సుగంధితో.

"నీకు అందం ఉంది. ఏం లాభం? ఆ అందాన్ని ప్రదర్శించడం రాదు. అసలు మగవాళ్ళ మనసుల్ని ఎలా దోచుకోవాలో నీకు బొత్తిగా తెలిసి చావదు"

"అదేమిటో త్వరగా తేల్చి చెప్పుబాబూ! మమ్మల్ని సస్పెన్సుతో చంపేస్తున్నావ్?" అన్నది మీనాక్షి.

"మధ్యలో మీరు ఇలాగే మాట్లాడుతూ ఉంటే ఇక ఈ పాఠం ముందుకు సాగినట్టే. పదవే రేణూ! నీకు రహస్యంగా చెబుతాను."

"ఛ! నాకేం అక్కర్లేదు. వాళ్ళకే తొందరగా ఉంది. వాళ్ళకే ఆ చెప్పే పాఠం ఏదో చెప్పేయ్." అన్నది రేణుక.

"అమ్మదొంగా! నీకూ వినాలనే ఉంది. పైకిమాత్రం పెద్ద బెట్టు చేస్తున్నావ్?" అన్నది వాణి.

"ఎంతవరకు చెప్పానూ?"

"అదే మగవాళ్ళ మనసుల్ని దోచుకోవడం రేణుకకు తెలియదు"

"ఆ ఆ అదే! సరదాగా అతడు కన్పించగానే చిరునవ్వులు కురిపించాలి. పత్తికాయలు పగిలినట్టూ, చిరుగజ్జెలు మ్రోగినట్టూ- అంతేగాని వానలో తడిచి బిగిసిపోయిన నులకమంచంలా ఉంటే ఏ మగవాడు దగ్గరకు వస్తాడే?"

వానలో తడిచిరెండు కోళ్ళు పైకిలేచిన నులకమంచం రేణుక కళ్ళలో మెదిలింది. పగలబడి నవ్వసాగింది. మిగతా ఇద్దరూ ఆమెతో శృతి కలిపారు.

"ఏ....ఏ....వానలో తడిచి....బిగు...బిగు...సుకు...పోయిన... మం...చం..." పొట్ట చేత్తో పట్టుకుని నవ్వలేక నవ్వుతోంది వాణి.

"స్టాప్!" అన్నది సుగంధి.

"ఛ! పోవే! నువ్వు మరీనూ?" రేణుక సుగంధిని మోచేత్తో పొడిచింది.

"నేనెక్కడికి పోతాను. మీ ఇద్దరికీ ఆ మూడుముళ్ళూ పడేలా చూశాకే కాలేజినుంచి వెళ్తాను" అన్నది సుగంధి.

మళ్ళీ నవ్వులు.

సుధ అందరికేసి చురచురా చూడసాగింది.

"నా మాట విని ఒక్కసారి పలకరించి చూడు"

"పలకరించి ఏం లాభంలేదు. సమాధానం చెప్పి వెళ్ళిపోతాడు" అనేసి చటుక్కున నాలుక కరచుకుంది రేణుక.

--ఓహో అయితే గ్రంథం ప్రారంభించావన్నమాట! ఏదో వాళ్ళంతా సరదాకు అంటున్నారనుకుంటున్నాను. ఇంతసేపూ! అయినా అతని వెంట నువ్వు పడటం ఏమిటే? ఆ బట్టలూ-అతనూ... బొత్తిగా దరిద్రుడిలా ఉన్నాడు..అతన్ని చూస్తుంటే నాకు జాలి వేస్తుంది. నువ్వు పలకరించినా నీ ఎదుట నిల్చోడానికి అతనికి దమ్ములుండొద్దూ? అయినా అతనంటే నీకు వ్యామోహం ఏమిటి!" సుధ గబగబా అనేసింది.

సుగంధీ, మీనాక్షి సుధ ముఖంలోకి తెల్లబోయి చూశారు.

వాణి మాత్రం ముసిముసిగా నవ్వుకుంది.

"వ్యామోహంకాదు-ప్రేమ. దాన్నే ప్రేమ అంటారు. ప్రేమకు అంతస్థులు అడ్డురావని నీకు తెలియదా?" అన్నది మీనాక్షి.

"అందుకే ప్రేమకు కళ్ళు లేవంటారు" అన్నది వాణి.

"కళ్ళేకాదు బుర్రకూడా లేదు" అన్నది సుధ.

"ఇక ఆపండేతల్లీ! మీకో నమస్కారం?" విసుగ్గా అన్నది రేణుక.

సుధ మాటలు రేణుకకు ములుకుల్లా గుచ్చుకుంటున్నాయ్.

"రేణూ నేను చెప్పినట్టు చెయ్యవే" అన్నది వాణి.

"ఓహో అయితే నీకు ప్రేమ పాఠాలు చెప్పడం వచ్చన్నమాట!" అన్నది మీనాక్షి.

"ఆ సుగంధికంటే కూడా బాగా చెప్పగలను"

"అయితే చెప్పు!" అన్నది సుగంధి.

"అందరూ వినండి జాగ్రత్తగా వినండి. ఇది అందరికీ ఒకనాడు ఉపయోగపడుతుంది. వింటున్నారా!"

"చంపక చెప్పవే త్వరగా!"

"ఊ ఊ! మరేమో..." ఓ క్షణం తలగోక్కుని మళ్ళీ ప్రారంభించింది. "మరేమో గౌతమ్ ముందువెళ్తూ ఉంటాడు. ఆ వెనకే రేణుక నడుస్తూ ఉంటుంది. చిన్నగా దగ్గుతుంది. అతను వెనక్కి తిరిగి..."

"చూస్తాడు"

"చూడడు"

"అందువల్ల వరిగేది...."

"వినండే బాబూ! కొంతదూరం నడిచాక రేణుక గబగబా అతన్ని దాటుకుంటూ వెళ్తుంది. అలా అలా వయ్యారంగా నడుస్తూ చేతిలోని చిన్న పర్సును జార విడుస్తుంది. అతను ఆ పర్సును చూస్తాడు పొరపాటుగా పడిపోయింది అనుకుంటాడు. వంగి తీస్తాడు. గబగబా ముందుకు వెళ్ళి "మీ పర్సు పడిపోయిందండీ" అంటూ పర్సు అందిస్తాడు. వయ్యారంగా అందుకొని ఓరగా చూస్తూ, తియ్యగా థాంక్సు చెబుతుంది. కృతజ్ఞతా పూర్వకంగా అతని కళ్ళలోకి చూస్తుంది..."

ఆ తర్వాత అతను "అంఖియ మిలాకే జియ భరమాకేచెలె నహీం జానా!" అంటూ హైపిచ్ లో పాట ఎత్తుకుంటాడు" అన్నది సుధ మధ్యలో అందుకుని వ్యంగ్యంగా.

"అవును! అచ్చం అలాగే జరుగుతుంది" అన్నది వాణి నవ్వుతూ.

"రేణూ వాళ్ళంతా నీకు తాటాకులు కడ్తున్నారే?" అన్నది సుధ.

రేణుక మాట్లాడలేదు.

"అయినా నువ్వు గౌతమ్ ను ప్రేమించడం ఏమిటి?" మళ్ళీ అన్నది సుధ.

"ఏం? అతనికి ఏం తక్కువైంది?"

"అతనిలో నీకు కన్పించిన ప్రత్యేకత ఏమిటో?"

"అతనిలో చాలామందిలో లేని సంస్కారం ఉన్నది. ముఖ్యంగా ఆడపిల్లల్ని ఆవురుమంటూ చూడడు" రేణుక కంఠం బరువుగా గంభీరంగా ఉన్నది.

"అలా చూడాలంటే ఎంత ధైర్యం కావాలి? అంత బీదవాడికి ఆడపిల్లలకేసి చూసే ధైర్యం ఎలా ఉంటుంది. ఆత్మహీనతా భావంతో అలాంటి వాళ్ళు కుంగిపోతూ ఉంటారు. ఎవరి ముందూ ధైర్యంగా తలెత్తి నిల్చోలేదు" అన్నది సుధ.

"నువ్వు శ్రీమంతుల బిడ్డవు. అంతమాత్రం చేత బీదవాళ్ళను చులకనగా మాట్లాడకు" వాణి అందుకుంది.

"మధ్యలో నీ సలహా ఏమిటి? ఇదుగో రేణూ! మంచికేసి చెబుతున్నాను. హనుమంతరావు లక్షాధికారి కొడుకు. అతనికి నువ్వంటే తగని ఇష్టం అతన్ని...."

"సుధా!" రేణుక దాదాపు అరిచినట్టే అన్నది.

"ఇంకెప్పుడూ అలా మాట్లాడకు. హనుమంతరావుకూ నీకూ సరిపోతుంది. నేనూ బీదదాన్నే..." అంటూ చివ్వున లేచి కసిగా బయటికి నడిచింది.

"ఏం? హనుమంతరావుకు ఏం తక్కువైంది?" సుధ మాటలకు రేణుక గడపలో ఆగి వెనక్కు చూసింది.

"అందుకేగా నీకైతే మంచి జోడీ అన్నాను" అని బయటికి వెళ్ళిపోయింది.

సుధ ప్రవర్తన సుగంధకీ, మీనాక్షికీ కూడా కోపాన్ని తెప్పించింది.

రేణుక వెనకే వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

వాణి సుధ ముఖంలోకి అదోలా చూసింది. చిరునవ్వు నవ్వింది.

"ఎందుకే అలా నవ్వుతావ్?"

"ఒకటి అడగనా?"

"అడుగు!"

"నువ్వు గౌతమ్ ను ప్రేమిస్తున్నావు గదూ?"

సుధ తృళ్ళిపడింది.

"అవును ప్రేమిస్తున్నావ్? నాకు తెలుసు"

"ఎవరు చెప్పారు?"

"నేను ఆమాట అనగానే నువ్వు తృళ్ళిపడ్డావ్! దాచాలనుకున్న విషయం ఎదుటి మనిషికి తెలిసిపోయిందని అకస్మాత్తుగా వింటే తృళ్ళిపడటం సహజం!"

"గొప్ప సైకాలజీ!"

"అవును! అదే మానవ సైకాలజీ! నీ ధోరణిలో, ప్రతిమాటలో రేణుక అంటే ఈర్ష్యపడుతున్నట్టు కనిపెట్టాను."

"ఛ! నాకు రేణుక అంటే ఈర్ష్య ఏమిటి? గౌతమ్ ను- ఆ అష్టదరిద్రుణ్ణి నేను ప్రేమించడం ఏమిటి?"

"బుకాయించకు నువ్వు రేణుకనుచూసి ఈర్ష్య పడుతున్నావ్. రేణుక నీకంటే అందమైంది. గౌతమ్ కు రేణుక అంటే ఇష్టం అని నువ్వే నాతో ఒకసారి అన్నావ్. ఆడపిల్లల్ని కన్నెత్తికూడా చూడనివాడు రేణుకను చూసీ చూడనట్టే కన్పిస్తూ, ఆమె ప్రతికదలికనూ గమనిస్తాడని చెప్పావ్. ఆ విషయం రేణుకకంటే నీకే ఎక్కువ తెలుసు. అంటే నువ్వు గౌతమ్ ను గమనిస్తున్నావన్న మాటేగా?"

"పిచ్చిమాటలు మాట్లాడకు. నేను కావాలనుకోవాలేగాని ఆ గౌతమ్ లాంటి వాళ్ళను వందమందిని చుట్టూ తిప్పుకోగలను"

"గౌతమ్ లాంటి వాళ్ళను తిప్పుకోగలవేమో కాని గౌతమ్ నుమాత్రం తిప్పుకోలేవు"

సుధ ముఖం రోషంతో ఎర్రబడింది.

"అలాగా? అయితే చూడు! గౌతమ్ ను నా చుట్టూ తిప్పుకుంటాను. పిచ్చివాడిలా నా చుట్టూ ప్రదక్షిణలు చేస్తాడు."

"అసంభవం!"

"సంభవం అయితే?"

"అలా ఎన్నటికీ జరగదు"

"షరతు ఏమిటి?"

"మధ్య నేను షరతు పెట్టడం ఏమిటి? పద! క్లాసుకు టైం అయింది" అంటూ లేచింది వాణి.

సుధ పెద్ద అందమైంది కాదు. వయసులో ఉన్నది. కట్టూ బొట్టులో చాలా శ్రద్ధ చూపుతుంది. ఆకర్షణీయంగా కన్పిస్తుంది.

శ్రీమంతులబిడ్డ. తల్లిదండ్రులకు ఏకైక సంతానం. డాక్టరీకూడా హోదాకూ, సరదాకూ చదువుతున్నది.

ఆమెకు యువకుల్ని ఆకర్షించి ఆ తర్వాత దూరంగా ఉండి, వాళ్ళు బాధపడుతుంటే చూడటం సర్దా. ఆమె మూడో సంవత్సరం చదువుతున్నప్పుడు రఘు అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అందుకు కారణం సుధేనని చాలా మందికి అనుమానం.

తను కావాలనుకుంటే తిరస్కరించే యువకుడు ఉండడని ఆమె విశ్వాసం.

గౌతమ్ మీద ఆమె దృష్టి ఇటీవలే పడింది. అదీ గౌతమ్ రేణుకను ప్రేమిస్తున్నాడనే అనుమానం వచ్చిన తర్వాతనే. అతను తనను నిర్లక్ష్యం చెయ్యడం సుధలో పట్టుదలను పెంచింది.

వాణీ వెళ్ళిపోయింది.

సుధ క్లాసుకు వెళ్ళలేదు.

ఆలోచిస్తూ కూర్చుంది.

గౌతమ్ తను ఆకర్షించలేదా? అష్టదరిద్రుడు. తనలాంటి బంగారు పిచ్చుక కోరితే తిరస్కరించగలడా? తనను చూసి కాకపోయినా తన డబ్బుకైనా లొంగిపోతాడు.

సిరి తనకు తానై వలచివస్తే వద్దనే మూర్ఖుడు ఉంటాడా? ఉండడు!

గౌతమ్ తన బీదతనాన్ని ప్రతి నిముషం గుర్తుచేసుకుంటూ ఉంటాడు. అతనిలో ఆత్మహీనతాభావం ఉంది. అందుకే అంత ముభావంగా ఎవరితోనూ కలవకుండా ఉంటాడు.

అలాంటివాడిని డబ్బు ఎరచూపి వశం చేసుకోవడం ఏమంత కష్టమైన కార్యం కాదు.

కాలేజి సాంస్కృతిక ఉత్సవం జరుగుతున్నది.

చీఫ్ గెస్టుగా ఆరోగ్యశాఖ మంత్రి వేదిక మీద ఉన్నారు. కాలేజీ ప్రిన్స్ పాల్ అధ్యక్షాసనాన్ని అలంకరించి ఉన్నాడు. సాంస్కృతిక శాఖకార్యదర్శి గౌతమ్ కంఠం మైక్ లో నుంచి విన్పిస్తోంది.

"ఆదరణీయులైన అధ్యక్షులకూ, గౌరవనీయులైన మా ప్రిన్స్ పాల్ గారికి, విచ్చేసిన పెద్దలకూ నా నమస్కారాలు. నాతోటి విద్యార్థులకూ, విద్యార్థినులకూ శుభాకాంక్షలు.

మానవుని శరీరం ఎదగడానికి ఆహారం ఎంత ముఖ్యమో, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించడానికి సాంస్కృతిక కార్యక్రమాలూ అంతే అవసరం. నూటికి డెబ్బయ్ ఐదుమందికి కడుపునిండా తిండి దొరకని ఈ దేశంలో మానసిక ఆహ్లాదం గురించి ఆలోచించడం హాస్యాస్పదమే. అది కేవలం కడుపునిండినవారు వెతుక్కొనే కాలక్షేపం మాత్రమే.

మనదేశానికి స్వతంత్రం వచ్చింది. తెల్లవాడి స్థానాన్ని నల్లవాడు ఆక్రమించుకున్నాడు. కాని సామాన్యుడి జీవితంలో మార్పు ఏమీ రాలేదు. సామాన్యుడు అంటే ఎవరంటారా? శ్రమ పడేవాడూ, చమటకార్చి ఉత్పత్తిని పెంచేవాడూ సామాన్యుడు. ఆ శ్రమశక్తి ఫలితాన్ని అనుభవంచేవాడే అసామాన్యుడు. ఉదాహరణకు రెండేళ్ళక్రితం వరకూ మన ఈ ఆరోగ్యశాఖ మంత్రిగారు సామాన్యులు. సామాన్యులు ఓట్లు పొంది ఈనాడు మంత్రి అయ్యారు. ఓట్లు వేసినవారు ఇంకా సామాన్యులుగానే ఉన్నారు, కాని వారి ఓట్లతో గెలిచిన ఈ అనంతరామన్ గారు మంత్రి అయి అసామాన్యులు అయ్యారు.

సభలో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. మంత్రిగారి ముఖం మాడిపోయింది. కానీ తట్టుకోని పెదవులు మీదకు చిరునవ్వు తెచ్చి పెట్టుకున్నాడు.

"పాపం! ఏడవలేకనవ్వుతున్నాడురా!" వెనకనుంచి ఒకడు అరిచాడు.

ఒక క్షణం ఆగి గౌతమ్ మళ్ళీ ప్రారంభించాడు.

"సామాన్యుడు కూడా బ్రతుకుతూనే ఉన్నాడు. అతను ఇంకా ఉచ్ఛాస నిశ్వాసాలు తీస్తున్నాడు కనక బ్రతికిఉన్న వాడికిందే లెక్క, యంత్రంలా బ్రతికే మానవుడి బ్రతుకుకూడా ఒక బ్రతుకేనా? ఒక్కసారి ఆలోచించండీ" హృదయంలో స్పందనలేని, రక్తంలో వేడిలేని, జీవితంలో నవ్యతంలేని జీవితం మృత్యువుతో సమానం.

ఈనాడు మన స్వతంత్రభారతంలో ఎన్నో ప్రణాళికలు వేస్తున్నాం. దేశం అభివృద్ధిపథంలో నడుస్తున్నదని చెబుతున్నారు నాయకులు (సభలో చప్పట్లు) రోజురోజుకూ ఉన్నవాడికీలేనివాడికీ మధ్య ఏర్పడిన అగాధం పెరుగుతుందేగాని తరగడం లేదు.

కర్మసిద్ధాంతంమీద నమ్మకం రోజురోజుకూ పెరుగుతోంది. మతం పేరుమీదా, కులం పేరుమీదా ఓట్లూ సీట్లూ పంచుకుంటున్నారు. (హియర్ హియర్) మనదేశం కర్మభూమి. మన సంప్రదాయం చాలా గొప్పదని పెద్దలు వేదికలెక్కి ఉపన్యాసాలు ఇస్తున్నారు. కాని మన సభ్యతా, సంస్కృతీ మనిషికీ మనిషికీ మధ్య మతం పేరుతో, కులాల పేరుతో అడ్డుగోడల్ని లేపాయి. దీపం చీకటిని పారద్రోలడానికి ఉపయోగపడుతుంది. అలాకాకుండా ఆ దీపమే ఇంటిని తగలేసేదిగా మారినప్పుడు ఆ దీపాన్ని ఆర్పేయండి"

ప్రిన్సిపాల్ బెల్ కొట్టాడు.

గౌతమ్ మాట్లాడటంమాని వెనక్కు చూశాడు.

"మాట్లాడాలి గౌతమ్ మాట్లాడు" స్టూడెంట్సు కేకలు.

మళ్ళీ గౌతమ్ ప్రారంభించారు-" యువతరంలో మార్పు రావాలి. ఎనాటమీ చేసే మెడికల్ స్టూడెంట్సులో కూడా కులాభిమానం ఉండటం హాస్యాస్పదం. సిగ్గుచేటు. మానవుడికి మానవుడికీ మధ్య ఏర్పడిన ఈ గోడల్ని పడగొట్టింది.

మానవజాతిపుట్టుకతోనే కులాలముద్రలతో పుట్టలేదు. ముందు మనిషి పుట్టాడు. ఆ తర్వాత మతం, కులాలు పుట్టాయి. ధర్మశాస్త్రాలు పుట్టాయి. పదిమంది హిందువుల స్థానంలో ఒక మానవుడు చాలు. బైబిల్, ఖురాన్, గీత అన్నింటిలోసారం ఒక్కటే. అది మానవతాన్ని పెంచి మానవ సౌభ్రాతృత్వాన్ని స్థాపించడం. కాని మనం ఈనాడు చూస్తున్నదేమిటీ? చేస్తున్నదేమిటి?

స్వతంత్రంవచ్చాక మన దేవుడిగుళ్ళల్లో రద్దీ మరీ ఎక్కువైంది? కారణం ఏమిటి? ఉండీలలో లక్షల కొద్దీ నోట్లకట్టలు వేసేవాళ్ళు ఎవరు? భగవంతుణ్ణీ (ఒకవేళ ఉంటే గింటే...చప్పట్లు) కూడా లంచం పెట్టి తమవైపుకు త్రిప్పుకోవాలనే ప్రయత్నం కన్పించటంలేదూ?

"నేను ఆ దేవుణ్ణే, ఉన్నట్టయితే, దిగి రమ్మంటున్నాను. నువ్వు గొప్పవాడివో మానవతం గొప్పదో చూడమంటున్నాను."

"సభలో చప్పట్లు. గౌతమ్ ఓ క్షణం ఆగి మళ్ళీ అందుకున్నాడు. శ్రమజీవి చమటకు తగిన విలువనిచ్చినరోజే మనదేశంలో మానవతం తలెత్తుకొని మనగలదు. అది ఎలా సాధ్యం; ఈ వ్యవస్థలో, ఈ దోపిడీ వ్యవస్థలో అది సాధ్యంకాదు"

ప్రిన్స్ పాల్ మళ్ళీ గంటకొట్టాడు. ఒక లెక్చరర్ గౌతమ్ దగ్గరకు వచ్చి చెవులో ఏదో చెప్పాడు.

గౌతమ్ ప్రేక్షకులకు నమస్కరించి మరో మాట మాట్లాడకుండా కూర్చున్నాడు.

సభలో కలకలం బయలుదేరింది.

మంత్రిగారు లేచారు. వెనక నుంచి పిల్లి కూతలు విన్పించాయి.

మీటింగు ఎలాగో పూర్తి అయింది అనిపించారు.

ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమం జరిగింది.

గౌతమ్ చుట్టూ స్టూడెంట్సు చేరారు. చాలా బాగా మాట్లాడావంటూ అభినందించారు.

రెండోరోజు మధ్యాహ్నంవార్డులో ఒక రోగిని పరీక్షిస్తున్నాడు గౌతమ్.

"నిన్న మీరు చాలా బాగా మాట్లాడారు"

గౌతమ్ నిటారుగా నిల్చున్నాడు. వెనక్కు తిరిగి చూచాడు. రేణుక నిల్చుని ఉంది.

"థ్యాంక్యూ!"

"మీరు ఇంకా మాట్లాడతారనుకున్నాను. కాని అకస్మాత్తుగా ఆపేశారు"

"నేను ఆపలేదు. ఆపించారు"

"ఎందుకలా జరిగింది"

"భయం!"

"భయమా? ఎవరికీ?"

"పెద్దలకు వ్యవస్థ మారాలంటూ ఇంకా ఏమేమి మాట్లాడతానోనని భయం. మార్క్సిజం బోధిస్తానని భయం"

రేణుక గౌతమ్ ముఖంలోకి ముగ్ధురాలైనట్టు చూస్తున్నది. గౌతమ్ ఆమెతో అన్ని మాటలు మాట్లాడటం మొదటిసారి.

గౌతమ్ ఆగి ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

రేణుక చటుక్కున చూపుల్ని కిందకు వాల్చింది.

"నాది ఒక కోరిక?" రేణుక చిన్నగా అన్నది.

"ఏమిటి?" ఆమె ముఖం మీద నుంచి చూపులు మరల్చకుండానే అడిగాడు.

రేణుక పర్స్ లో నుంచి పార్కర్ పెన్ తీసింది. "దీన్ని మీరు తీసుకోవాలి?"

"ఎందుకూ!"

"నిన్న మీరు అంతబాగా మాట్లాడినందుకు?"

"అదేమిటి? దానికి దీనికీ...."

"సంబంధం ఉంది. అభినందన సూచకంగా ఇస్తున్నాను. తిరస్కరించరనే నమ్మకంతోనే ఇస్తున్నాను"

గౌతమ్ ఓ క్షణం ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"తీసుకోరా?"

"ఒక షరతు మీద!"

"ఏమిటి?"

"సాయంత్రం నాతో మీరు బీచికి వస్తానంటే...."

రేణుక చివున తలెత్తి గౌతమ్ ముఖంలోకి చూసింది. ఏదో అనాలనుకుంది. తడబడింది.

"మీ ఫ్రెండ్సు వస్తున్నారు. త్వరగా చెప్పండి"

"అలాగే!"

"సరిగ్గా ఐదుగంటలకు హైకోర్టు దగ్గరకు రండి. ఫోర్టు బీచ్ కి వెళ్దాం"

"మరి ఇది...."

"అప్పుడే తీసుకుంటాను." అంటూ గౌతమ్ ముందుకు వెళ్ళిపోయాడు.

వాణి వెనకనుంచి వచ్చి రేణుక భుజం మీద చెయ్యి వేసింది.

తృళ్ళిపడి వెనక్కు చూసింది. గాభరా పడింది.

"ఎందుకు రేణూ అంత గాభరా? గో అహెడ్! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!"

"ఏమిటి నువ్వంటున్నది?" తడబడింది రేణుక.

వాణి నవ్వుతూ "నా దగ్గిరా దాపరికం అక్కర్లేదు. నేను నీమంచి కోరేదాన్నే. కాని ఆ సుధారాణితో జాగ్రత్తగా ఉండు. ఒకకంట కనిపెట్టి ఉండు. అంతకంటే నేను చెప్పేది ఏమీ లేదు" వాణి ముందుకు వెళ్ళిపోయింది.

రేణుక ముఖంలో ముసిముసి నవ్వుల దొంతర్లు అలుముకుంటున్నాయి కళ్ళల్లో కొట్టవచ్చినట్టు ఆనందపు తళుకులు తేలిపోతున్నాయ్. వార్డు నుంచి బయటికి వస్తుంటే పాదాలు నేలకు తగిలినట్టు, గాలిలో తేలిపోతున్నట్టు అన్పించసాగింది.

గాలిలో ఎగరాలని ఉంది. పరుగులు తియ్యాలని ఉంది. రెస్ట్ లెస్ గా ఉంది. ఆ ఆనందాన్ని భరించలేకుండా ఉంది.

తమాషా? మనిషిని ఆవేదనా, బాధకూడా నిల్చున్నచోటు నిల్చోనివ్వవు. అనందంకూడా అంతే!

"ఏమిటోయ్ నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్?" సుధారాణి కంఠం.

ఓ క్షణం నిలబడి సుధారాణి ముఖంలోకి చూసింది.

"ఏదో గుర్తొచ్చింది?"

"అంత ఒంటరిగా నవ్వుకునే విషయం ఏమై ఉంటుందా అని!"

"నీకు అనవసరం" అనాలనిపించింది. కాని సమాధానం చెప్పకుండా ముందుకు వెళ్ళిపోయింది రేణుక.

వెళ్ళిపోతున్న రేణుకను చూస్తూ సుధారాణి అదోలా నవ్వింది.

ఆ కళ్ళలో ఈర్ష్య తేలు పిల్లలా అలజడిగా తిరగసాగింది.

రేణుక తలవంచుకుని బీచ్ లో కూర్చుని ఇసుక మీద గీతలు గీస్తున్నది.

ఎదురుగా కూర్చున్న గౌతమ్ ఆమెకేసి కన్నార్పకుండా చూస్తున్నాడు.

రేణుకలోని అణువణువూ అనిర్వచనీయమైన అనుభూతితో స్పందిస్తోంది. మనసులో ఏదో సంచలనం. ఆ సంచలనాన్ని అదుపులో పెట్టుకోవడానికి అన్నట్టు ఇసుకలో పిచ్చిగీతలు గీస్తోంది. అనుకోకుండా గౌతమ్ అని రాసింది. అదిచూసి గౌతమ్ ఆ పేరు పక్కగా రేణుక అని రాశాడు.

రేణుక తలెత్తి చూసింది. గౌతమ్ తల వంచుకుని ఇసుక మీద ఏదో రూపాన్ని గీయడానికి ప్రయత్నిస్తున్నాడు. రేణుక గౌతమ్ ను తనివితీరా చూస్తూ కూర్చుంది.

గౌతమ్ పొడవుగా, పెద్దగా చాయలేకపోయినా ఆకర్షణీయంగా ఉంటాడు అనుకొనేది. ఈ రోజు ఆమె కళ్ళకు అతను మరీ అందంగా కన్పిస్తున్నాడు.

గౌతమ్ తల ఎత్తాడు. రేణుకకు దొంగతనం చేసినట్టు అనిపించింది. చటుక్కున చూపుల్ని మరల్చుకుంది.

'ఎందుకండి అంత గాభరా! నా ముఖం చూడాలని ఉంటే హాయిగా చూడవచ్చుగా? నేను ఏమీ అనుకోను!" అన్నాడు గౌతమ్ చిరునవ్వు నవ్వుతూ. రేణుకకు ఏం మాట్లాడాలో తోచలేదు. మరీ ఇబ్బందిగా అనిపించింది. ఎలా కూర్చోవాలో, చేతులు ఎలా పెట్టుకోవాలో కూడా తెలియనంతటి సంచలనం ఏదో ఆమెను ఇబ్బంది పెడుతోంది.

"ఇంత సిగ్గేమిటి? ఇలా రావడం ఇదంతా కొత్తగా ఉంది కదూ?"

"అవును!" అన్నట్టు తల ఊపింది.

"ఏదైనా చెప్పండి"

"మీరే చెప్పండి. మీరేగదా ఇక్కడకు తీసుకొచ్చారు?" అన్నది రేణుక.

"అంటే మీకు ఇక్కడకు రావడం-ఇలా నాతో బీచ్ కి రావడం ఇష్టంలేదా? నా బలవంతంమీదనే వచ్చారా!"

"ఆ అదికాదు-నేననేది-మీరే ఏదైనా చెప్పాలనుకొని పిల్చారేమోనని..." నసిగింది.

"మీకు ఏమీ చెప్పాలని లేదా!"

ఎందుకు లేదూ? ఉన్నది. ఒక్కటి కాదు ఎన్నో విషయాలు. ఇలాగే యుగాల తరబడి కూర్చుని మాట్లాడాలని ఉంది. కాని ఏం మాట్లాడాలో తోచడం లేదు! మనసులోనే అనుకుంది.

"మాట్లాడరేం!"

"ఏం మాట్లాడను?"

"మీకు నేనంటే ఇష్టమేనా?"

"అదికూడా చెప్పాలా! కొన్ని విషయాలు చెప్పకుండా ఉంటే బాగుంటాయి. అలాంటి విషయాల్ని అర్థం చేసుకున్నప్పుడే వాటి లోతును తెలుసుకున్న భావం కలుగుతుంది. భాషలో పెట్టేసరికి పేలవంగా ఉంటాయి."

"మీరు నవలలు బాగా చదువుతారా?"

రేణుక చివ్వున తలెత్తిచూసింది.

గౌతమ్ ముసిముసిగా నవ్వుతున్నాడు.

రేణుకకు అతను తనను ఎగతాళి చేసినట్టుగా అనిపించింది.

"కోపంవచ్చిందా రేణూ!"

రేణూ! ఆ పిలుపు...వేణునాదంలా విన్పించింది రేణుక చెవులకు.

"సరదాగా అన్నాను అంతే! నాకూ అలాంటి విషయాల గురించి మాట్లాడడం రాదు. మనసును తనకు అనుకూలమైన మనసును అర్థం చేసుకొన శక్తి ఉంది, అందువల్ల నేనీ మనసును నేను అర్థం చేసుకోగలిగాను. ధైర్యంగా బీచ్ కిరమ్మని చెప్పాను"

"అప్పుడేమిటి? ముందు నేను పలకరించాకేగా?" అన్నది రేణుక.

"అవును! నువ్వంటే నాకు మొదటినుంచీ అభిమానమే. అది కేవలం నీ బాహ్యా సౌందర్యం మీది ఆకర్షణ మాత్రమే కాదు. నీ ప్రవర్తనా నీ వ్యక్తిత్వం నన్ను ఆకర్షించాయి. నేను చాలా బీదవాణ్ణి, నువ్వు చాలా ఎత్తుగా కన్పించేదానివి. అందుకే నన్ను నేను అదుపులో పెట్టుకోవడం కోసం నిన్ను తప్పించుకుని తిరిగేవాణ్ణి.

నువ్వు నన్ను చూసే చూపుల్లో నీ మనసు నాకు అర్థం అయింది. అయినా నేను చొరవ తీసుకోలేకపోయాను. ఈ రోజయినా ఎందుకు రమ్మన్నానో తెలుసా?

"చెప్పండి"

"ఒకర్ని గురించి ఒకరం అరమరిక లేకుండా మాట్లాడుకోవడం మంచిదని. నా మీద నువ్వు అభిమానాన్ని పెంచుకోవడంగానీ, నీమీద నేను ప్రేమను పెంచుకోవడంగానీ అంతమంచిదికాదేమోనని చెప్పాలనే"

"ఇది చెప్పాలనేనా మీరు ఇక్కడకు పిల్చింది." గాయపడిన పక్షిలా చూసింది"

"రేణూ నేను చెప్పేది శ్రద్ధగా విను. మేము ఒకప్పుడు బాగా కలిగిన కుటుంబానికి చెందిన వాళ్ళమే. మా నాన్నకు లేని వ్యసనం లేదు. వళ్ళూ ఇల్లూ కూడా గుల్ల చేసుకొని వెళ్ళిపోయాడు. అప్పుడు నాకు ఐదేళ్ళు. నా తరువాత పిల్లలు లేరు. అంతవరకు అమ్మ అదృష్టవంతురాలనే చెప్పాలి. అమ్మ ఆ ఊళ్ళో ఎవరింట్లో ఏ శుభకార్యం అయినా వెళ్ళి చాకిరీ చేసేది. ఎలాగో నన్ను పెంచి పెద్ద చేసింది. ఊళ్ళో ఉన్న స్కూల్లో పదివరకు చదువుకున్నాను. అమ్మకు నేను చదివి చాలా గొప్పవాడిని కావాలని కోరిక. ఈ విషయంలో అందరు తల్లులూ అలాగే ఉంటారనుకో. అమ్మకు నా అనేవాణ్ణి నేను ఒక్కణ్ణే. కనక పంచప్రాణాలు నామీదే పెట్టుకొని తను తినీ తినకా నన్ను పెంచింది. నాకు ఎక్కడ ఏం తక్కువ అవుతుందోనని పాకులాడేది. నేను పది ఫస్టుక్లాసులో పాసయ్యాను. గుంటూర్లో వారాలు తిని ఇంటర్ చదివాను. స్కాలర్ షిప్ కూడా వచ్చేది. నా చదువు విషయంలో మా హైస్కూలు హెడ్ మాస్టరుగారు చాలా సహాయం చేశారు. ఆయనే వారాల ఇళ్ళు కూడా కుదిర్చారు.

ఇంటర్ స్టేట్ ఫస్టు వచ్చాను. మెడిసిన్ లో సీటు వచ్చింది. స్కాలర్ షిప్ వచ్చింది. అమ్మ ఆనందానికి అంతులేదు. నేను బాగా చదివి డాక్టర్ని అయి అమ్మను సుఖపెట్టాలనేదే అప్పటి నా ఏకైక ధ్యేయం!" గౌతమ్ కంఠం బొంగురు పోయింది. పైకి మాట్లాడలేనట్టు ఓ క్షణం ఆగాడు.

"మరి ఇప్పుడు ఆ ధ్యేయం మారిందా!"

"అవును!"

"అదేమిటి?"

"అమ్మ నేను రెండో సంవత్సరం పూర్తిచేసి వెళ్ళినప్పుడు చనిపోయింది?"

"చనిపోయిందా?"

"అవును పాము కరిచి చనిపోయింది. అప్పటినుంచి నేను ఇంటికి వెళ్ళాల్సిన పనికూడా లేకుండా పోయింది"

"మీకు మరెవరూ లేరా?"

"ఉన్నారు! బంధువులు! ఎవరిమీద ఏం భారం పడుతుందోనని ఎవరికి వారే దూరంగా ఏ సంబంధంలేనట్టు ఉండేవారు. నేను కొన్ని ట్యూషన్స్ కూడా చెబుతున్నాను. ఎలాగో కోర్సు పూర్తి చేశాను. మరో హౌస్ సర్జెన్సీ

అయితే...సరే అసలు విషయం! నువ్వు చూస్తే శ్రీమంతులబిడ్డలా కన్పిస్తావు. ఈ వయసులో ఆలోచనారహితంగా యువతీయువకుల మధ్య ఆకర్షణ ఏర్పడడం, అది పెరగడం...దాన్నే ప్రేమ అని ముద్దుగా పిల్చుకోవడం...వగైరా...వగైరా..."

ఆగి రేణుకముఖంలోకి చూశాడు.

రేణుక తల వంచుకొని వింటున్నట్టు కూర్చుంది. గౌతమ్ ఆగగానే తల ఎత్తింది. సూటిగా అతని ముఖంలోకి చూసింది. రేణుకలో ఇప్పుడు తడబాటులేదు.

"నేను మీరనుకున్నట్లు శ్రీమంతురాల్ని కాదు. మా నాన్నగారు డిప్యూటి కలెక్టర్ కుటుంబం చాలా పెద్దదే. నేనే ఇంటికి పెద్దకూతుర్ని. మా నాన్నకు నా మీద ఎంతో నమ్మకం. తొందరపడి ఎలాంటి నిశ్చయానికి రానని తెలుసు. నా నిర్ణయానికి ఎదురు చెప్పరు"

"మనం కలిసి తిరిగే ముందు, దగ్గరగా వచ్చేముందు ఒకర్ని గురించి ఒకరు క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం అనే నేను నా గురించి చెప్పాను. ఎవరికి నా స్వంత విషయాల గురించి చెప్పడం నాకు రుచించదు. నేను తాడూ బొంగరం లేనివాణ్ణి. రేపు వెంటనే ఉద్యోగం వస్తుందనే నమ్మకం కూడా లేదు. ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకొనే స్తోమత కూడా లేదు. అందుకే మీరు బాగా ఆలోచించుకొని...."

"ప్రేమించమంటారు?" నవ్వుతూ అన్నది.

గౌతమ్ ఆశ్చర్యంగా రేణుక ముఖంలోకి చూచాడు.

"ఏమిటి అలా చూస్తారు? ఇక మీరు నాకేం చెప్పనక్కర్లేదు"

"మన కులాలు కూడా ఒకటిగాదు. మీ కులం కంటే మా కులం చాలా తక్కువ కులం"

"యూ సిల్లీ! నిన్న మీ ఉపన్యాసంలో చెప్పింది ఏమిటి? మనిషి ముందుపుట్టాడు ఆ తర్వాత కులాలు పుట్టాయి అన్నారు అవునా?"

"వేదికలు మీద ఉపన్యాసాలు ఇవ్వడం వేరు-ఆచరణలో పెట్టడం వేరు?"

"అంటే...మీరు...మీరు..." ఉద్రేకంతో మాటలు తడబడ్డాయి.

"నా విషయంకాదు. మీ విషయం"

"ఓహో! అయితే నన్ను అంత సంకుచిత మనస్తత్వం కలదాన్ని అనుకుంటున్నారా?"

"ప్లీజ్ రేణూ! అలా కోపం తెచ్చుకోకు. నేను చెప్పాలనుకున్నది చెప్పాను"

"చాలా సంతోషం! ఇక పదండి. హాస్టల్ గేట్సు మూస్తారు" రేణుక లేచి నిల్చుంది.

"ఇంత త్వరగానా?" ఇష్టం లేనట్టు లేచాడు గౌతమ్.

"ఏదీ నా పెన్!"

"ఏ పెన్?"

"ఆహా! అమ్మాయిగారు ఇంత త్వరగా ప్లేట్లు ఫిరాయిస్తున్నారే! బాబోయ్ నిన్ను నమ్ముకుంటే..."

"ఆ సముద్రంలో దిగాల్సిందే!" రేణుక మాట పూర్తి చేసి కిలకిలా నవ్వింది. గౌతమ్ శృతి కలిపాడు. రేణుక పర్సు తెరిచి పెన్ ఇచ్చింది. అలా ఇస్తున్నప్పుడు రేణుక చెయ్యి పట్టుకున్నాడు. రేణుక చేతిని చటుక్కున లాక్కుంది.

"అరే! కాలిందా?"

"ఏమిటి?"

"చెయ్యి!"

"అవును!" కిసుక్కున నవ్వింది రేణుక.

"నాకు పెన్ అక్కర్లేదు" ముందుకు నడుస్తూ అలిగినట్లు అన్నాడు గౌతమ్ "కోపం వచ్చిందా?"

మాట్లాడకుండా ఇసుకలో నడుస్తున్నాడు. కొంచెం దూరం వెళ్ళి ఆగి వెనక్కు చూశాడు. రేణుక కాశ్మీర్ సిల్కు చీర గాలికి పైకి ఎగురుతున్నది. లంగా కన్పిస్తోంది. ఆ చీరను ఎగరకుండా పట్టుకొని నడవడానికి అవస్థ పడుతోంది, గౌతమ్ వెనక్కు వచ్చాడు.

"నేను సహాయం చెయ్యనా?" నవ్వుతూ అడిగాడు.

రేణుక సిగ్గు పడిపోయింది.

"కొంటెతనం చాలా ఉంది. పైకి మహాబుద్ధిమంతుడిలా ఫోజుకొడ్తారు!" చీర మరీ పైకి లేచేసరికి ఇసకలో చతికిలపడింది.

"అదేమిటి మళ్ళీ కూర్చున్నావ్?"

"కొంచెంగాలి తగ్గనివ్వండి"

"పోని ఒక పని చెయ్యి"

"ఏమిటి?"

"ఎత్తుకోమంటావా?"

"ఛ! మీరు...."

"నేను నువ్వు అంటున్నాను. నువ్వేమో మీరు మీరు అంటూ బోరుకొడ్తున్నావ్!"

"మీరు ఇన్ని మాటలు మాట్లాడగలరనుకోలేదు"

"మూగవాణ్ణి అనుకున్నావా? అయితే మూగవాడిలా సైగలు చేస్తాలే! పద!" అంటూ చెయ్యి అందించాడు.

ఆమె అందుకొనిలేచి నిల్చుంది.

"ఇప్పుడు నాకు ఎలా ఉందో తెలుసా?"

"తెలుసుకోగలను" అన్నది రేణుక.

"నీకూ అలాగే ఉందా?" కొంటెగా ముఖం దగ్గరగా పెట్టి కళ్ళలో చూశాడు.

"ఇలా ఏడిపిస్తే మీతో రాను"

"సరే అయితే నేను వెళ్ళిపోనా?"

"ఊఁ"

"చెయ్యి వదిలించుకొని గబగబా ముందుకు నడిచాడు"

"రేణుక మొండిగా మళ్ళీ కూర్చుంది"

వెనక్కు వచ్చి గౌతమ్ కూడా ఆమె కెదురుగా కూర్చున్నాడు.

రేణుక టైం చూసుకుంది.

"బాబోయ్! ఎనిమిది దాటింది పదండి"

గౌతమ్ లేవలేదు.

"ఊఁ లేపండి"

చెయ్యి అందించాడు.

పట్టుకోకుండా అలాగే నిల్చుంది.

గౌతమ్ చెయ్యి పైకెత్తి అలాగే కూర్చున్నాడు.

"అబ్బ లేవండీ!"

గౌతమ్ లేవలేదు.

"మొండిఘటం!" అంటూ చెయ్యి పట్టుకొని లేవబోయింది.

గౌతమ్ ముందుకు లాగాడు.

రేణుక అతనివడిలో పడిపోయింది.

"ఛీ! వాళ్ళు చూస్తున్నారు!" కొంచెం దూరంలో కూర్చున్న వాళ్ళను చూపిస్తూ అన్నది.

"చూడనివ్ నాకేం!" అంటూ లేచాడు గౌతమ్.

సుధారాణి గారేజ్ నుంచి కారు బయటకు తీసింది.

"ఈ వేళప్పుడు ఎక్కడికమ్మా. ఇవాళ కోయంబత్తూరు వాళ్ళు వస్తారని నాన్న చెప్పలేదూ?"

"ఇదిగో మమ్మీ! ఆ అబ్బాయి నీకు నచ్చితేనే...."

"అబ్బబ్బ మమ్మీ! ఇక ఆ విషయం ఎత్తకు"

"డాడీ వాళ్ళను తీసుకొని వస్తారు"

"నేను వచ్చేంతవరకూ ఉంటే చూస్తాను. లేదా మీరే ఏదో చెప్పి వాళ్ళను పంపించేయండి"

తల్లి మరో ప్రశ్న వెయ్యడానికి కూడా అవకాశం ఇవ్వకుండా కారు స్టార్ట్ చేసింది. తల్లి నెత్తి బాదుకుంది.

కొత్త ఫియట్ బీచ్ రోడ్ మీద పోతున్నది. ఉన్నట్టుండి స్పీడు పెరిగింది "సర్" మంటూ గాలిని చీలుస్తూ కారు ముందుకు దూసుకొని పోతున్నది.

తెల్లని వెన్నెల్లో కారు రోడ్డు నల్లటి త్రాచులా తళతళలాడుతున్నది. కారు ముందుకు పోతున్నది. రోడ్డు వెనక్కు పుట్టలోకి జొరబడుతున్న త్రాచులా వెనక్కు పోతున్నది.

చల్లటిగాలి సుధారాణి ముఖాన్ని చురుగ్గా తాకుతున్నది.

రేణుకా గౌతమ్

తను ఎన్ని ప్రయత్నాలు చేసి తను గౌతమ్ ను ఆకర్షించలేకపోయింది. వాణితో పందెం వేసింది. కాని తనకు ఓటమి తప్పలేదు.

సుధ మనసులో నాగుపాము బుసకొట్టింది.

ఇద్దరూ ఈ మధ్య సినిమాలు, పార్కులకూ, హోటళ్ళకూ తిరుగుతున్నారు. అందరికీ తెలుసు. వాళ్ళిద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారట. రేణుకకు ఈ మధ్య గర్వం ఎక్కువైంది. తనతో మాట్లాడటం మానేసింది.

వాళ్ళిద్దరూ సన్నిహితంగా ఉంటే తనెందుకు బాధపడాలి? ఆ మాత్రం దరిద్రుడు తనకు దొరకడనా? లక్షాధికారులు తను కోరుకోవాలేగాని తన కాళ్ళముందు మోకరిల్లుతారు. కాలేజీలోని ఎందరో తన ఒక్క చిరునవ్వును పొంది తన్మయత్వము చెందేవాళ్ళు ఉన్నారు. తనకి గౌతమ్ పిచ్చి ఏమిటి?

గౌతమ్ గర్వం, అతని నిర్లక్ష్యం తనలోని అహాన్ని రెచ్చగొట్టింది. అతని గర్వం అణచాలనుకుంది. అతన్ని తనవైపుకు తిప్పుకొని కొన్ని రోజులు ఆడించి ఆ తర్వాత అవమానించి తిరస్కరించాలనే కోరిక తనలో ప్రారంభం అయింది. ఆ కోరికే తనకు  తెలియకుండా తన మనసు అతనివైపు తిప్పింది.

గౌతమ్ తను అంతగా కోరుకుంటున్నట్టు తనకు తెలియదు. రేణుకతో సన్నిహితంగా తిరగడం చూసినప్పటినుంచీ తనలో ఏదో అశాంతి ప్రారంభం అయింది. తన మనుసులోని ఒక భాగం ఏదో తనకు కాకుండా విడిపోయినట్టు, బాధ కలగసాగింది. నిరంతరం అశాంతి.

మనసును ఏదో కసి చుట్టి వేస్తున్నది. గౌతమ్ మీద కసి, రేణుక మీద కసి, తనమీద తనకు కసి.

రేణుక ఎందుకో అకస్మాత్తుగా ఊరికి వెళ్ళింది ఈ రోజు మధ్యాహ్నం బండిలో. తను అనుకోకుండా స్టేషన్ కు వెళ్ళడం వాళ్ళిద్దరూ కన్పించడం తన మూడ్ ఆఫ్ అయిపోవడం జరిగింది. తాను తన పిన్ని కూతురికి సెండాఫ్ ఇవ్వడానికి వెళ్ళింది. కాని బండి కదిలేదాకా ఉండలేకపోయింది. రేణుకా, గౌతమ్ చుట్టూ ప్రపంచాన్నే మరిచి కబుర్లు చెప్పుకుంటున్నారు. అనుకోకుండా గౌతమ్ ఒకసారి తనకేసి చూసి వెంటనే చూపులు తిప్పుకున్నాడు. రేణుక మాత్రం తనకేసి చూడను కూడా లేదు.

ఆమె ఆలోచనలు బుర్రలో సుడులు తిరుగుతున్నాయ్. యాంత్రికంగా కారు నడుపుతోంది.

యూనివర్శిటీ బిల్డింగ్ దగ్గిర సడన్ బ్రేక్ పడింది. కారు చిన్న శబ్దం చేసి ఆగింది. ఆ శబ్దానికి దరిదాపుల్లోని వాళ్ళు తిరిగి చూశారు. పేవ్ మెంటు మీద ఆలోచిస్తూ నడుస్తున్న గౌతమ్ కూడా ఆగాడు. కారుకేసి చూశాడు.

సుధారాణి కన్పించింది. కారు ఎందుకు అలా ఆగిందో అర్థం అయింది. ముందుకు రెండడుగులు వేశాడు.

"మిస్టర్ గౌతమ్!"

గౌతమ్ ఆగాడు.

సుధ కారు దిగింది.

గౌతమ్ వెనక్కు వచ్చి "హలో సుధారాణిగారూ! ఇలా వచ్చారేం?" అన్నాడు మర్యాదగా.

"సుధారాణీ"...కాకుండా 'గారూ' కూడా... అంత పొడుగ్గా పిలవకపోతేనేమో? సుధా అనకూడదూ హాయిగా!" హాయిగా నవ్వుతూ అన్నది.

గౌతమ్ ఓ క్షణం మౌనంగా ఆమె ముఖంలోకి చూశాడు.

"బీచికి వచ్చారా?"

గౌతమ్ కారు అద్దంపైన రెండు చేతులూ ఆనించి వంగి "అవును" అన్నాడు.

"ఆసుపత్రీ, రోగులూ, రోగాలూ, మందులూ, పుస్తకాలూ తప్ప మీకు మరోధ్యాస లేదనుకున్నానే?" వ్యంగ్యంగా అన్నది.

"డాక్టర్ డిగ్రీ మీకు ఒక అలంకారం మాత్రమే. కాని నాకు అది జీవితం!"

"కాని ఈ మధ్య కొంచెం గాడి తప్పినట్టున్నదే! వెన్నెలరాత్రిళ్ళలో బీచ్ లూ, సినిమాలూ

..." అంటూ ఆగి గౌతమ్ ముఖంలో చూసింది.

"ఊ ముగించండి! ఆపారేం?" చిరునవ్వుతో అన్నాడు గౌతమ్.

"మీకు అర్థం అయ్యాక కూడా చెప్పడం అనవసరమని..."

"అవును! నాకు అర్థం అయింది" అన్నాడు గంభీరంగా.

"సుదారాణీగారూ!" గారూ అనే శబ్దాన్నే నొక్కుతూ సంబోధించాడు.

"చెప్పండి!"

"జీవితం నీరసమైన తన్మయత్వంలో వికసించదు. చెరకు గడ ఎడారిలో పెరుగదు.

"మీరంతా రోజూ కప్పులకొద్ది చెరుకురసం జుర్రుకోవడము చూస్తూనే ఉన్నాను"

"ఓహో అదా! ప్రస్తుతం మీరు చెరకురస పానంలో తన్మయులై ఉన్నారన్నమాట!"

"నేనూ మనిషినే! నాకూ జీవితం... రసమయజీవితం...కావాలనే ఉంటుంది" అన్నాడు గౌతమ్.

గౌతమ్ కు, సుధారాణి మనసు ఏనాడో అర్థం అయింది. రేణుక చూసి ఈర్ష్యపడుతుందని కూడా తెలుసు. ఎలాగయినా ఆ అమ్మాయి మనసు మార్చాలని అనుకొనేవాడు. కాని ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో అర్థం అయేదికాదు. తనమీద సుధారాణి వ్యామోహాన్ని పెంచుకోవడం ఎవరికి మంచిదికాదని అతనికి అనిపించేది. ఆమె కళ్ళలో ఈర్ష్యనీ, మాటల్లో కాసినీ పసికట్టాడు. ఆ విషయం రేణుకతో మాత్రం చర్చించలేదు.

ఆ రోజు లభించిన అవకాశాన్ని జారవిడుచుకోకూడదని నిశ్చయించుకున్నాడు.

"నిజంగా?" అదోలా చూస్తూ గౌతమ్ చేతిమీద చెయ్యి వేసింది.

గౌతమ్ చెయ్యి లాక్కోలేదు.

కాని తనచేతిని పట్టుకొని ఉన్న సుధ చేతిని చూశాడు.

సుధ చటుక్కున చెయ్యి లాక్కుంది.

"మీరు మరీ ఇంత సీరియస్ గా ఎందుకుంటారూ? ఎప్పుడు చదువేనా!" మాటమారుస్తూ అన్నది. గౌతమ్ పలకలేదు.

"అంత కష్టపడటమెందుకూ? పైగా ట్యూషన్స్ కూడా చెబుతారనుకుంటానూ?"

"రేపటి కోసం నేను కడుపు నిండుగా తింటూ నా మీద ఆధారపడినవాళ్ళకు ఇంత తిండైనా పెట్టడానికి!"

సుధ గతుక్కుమన్నది. గౌతమ్ ముఖంలోకి జాలిగా చూసింది.

"నన్ను చూసి జాలిపడుతున్నారా" గౌతమ్ నవ్వుతూ అడిగాడు.

"అవును! మిమ్మల్ని చూస్తే నాకు ఎప్పుడూ జాలిగానే ఉంటుంది"

"ఎందుకో?"

"మీకు బాగా డబ్బు ఉంటే మంచిబట్టలు వేసుకుంటారు. ట్యూషన్స్ చెప్పి కష్టపడనక్కర్లేదు హనుమంతరావు వాళ్ళలా కులాసాగా త్రుళ్ళుతూ జలసాగా తిరుగుతూ కాలం గడిపేవారు కదా? పాపం!" అనిపిస్తుంది.

గౌతమ్ అదోలా నవ్వాడు.

"నన్ను చూసి ఎవరూ జాలిపడనక్కర్లేదు. బీదతనం పాపంకాదు సిగ్గు పడాల్సిన పని అంతకన్నా కాదు. నాకంటేకూడా బీదవాళ్ళు నిస్సహాయులూ కోట్లకొద్ది జనం ఉన్నారు ఈ దేశంలో ఈ బూర్జువా సమాజం నన్ను వెధవను చేసింది. సుమంగళిలా ఫోజులుకొట్టడం నావల్లకాదు. హనుమంతరావులాంటి స్నేహితులు దగ్గరచేరి నేను టెర్లిన్ ఫ్యాంటు సంపాదించుకోగలను. ఆడపిల్లల ముందు ఫోజులు కొట్టగలను. అలా చేస్తున్నవాళ్ళను చూస్తూనే ఉన్నాను" అంటూ ఆగి సుధ ముఖంలోకి చూశాడు.

"చిరిగిన కోటు వేసుకొని వార్డులోకి వస్తుంటే నీకు ఏమీ అనిపించదా? సిగ్గుగా ఉండదూ. ఎందుకుండదూ? అది సహజమే. అందుకే నువ్వంటేనాకు జాలి."

"సిగ్గా ఎందుకూ? తప్పుచేసినవాడు సిగ్గుపడాలి. పరుల శ్రమను దోచుకొని విలాసాలను అనుభవించేవాళ్ళు సిగ్గుపడాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే బీదవాళ్ళు కాదు సిగ్గుపడాల్సింది.

వాళ్ళను అలా తయారుచేసినవారూ, మీలాంటి వాళ్ళూ సిగ్గుపడాలి" గౌతమ్ కంఠం గంభీరంగా పలికింది.

సుధ తెల్లబోయినట్టు చూసింది.

"మీ బీదతనానికి మధ్యలో మేమెందుకు సిగ్గుపడాలి? నీ ఆర్గ్యుమెంటు నాకు అర్థం కాలేదు."

"పాపం! నీకు ఎలా అర్థం అవుతుంది?"

"పోనీయ్ అర్థం అయ్యేలా చెప్పరాదూ?"

"అది ఒక్క మాటలో చెబితే అర్థం అయ్యే విషయంకాదు. ముఖ్యంగా నీలాంటివాళ్ళకు!" గౌతమ్ ముఖం చాలా గంభీరంగా ఉన్నది.

సుధకు తను మాట్లాడిన దాంట్లో ఉన్న తప్పేమిటో బోధపడలేదు. అయినా గౌతమ్ ను శాంతపరచడానికి అన్నట్లు అన్నది. "అవును! బీదతనం పాపం కాదు. ధనవంతులకంటే బీదవాళ్ళ సంఖ్య చాలా ఎక్కువే. వాళ్ళను చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంటుంది. కాని వాళ్ళు బీదవాళ్ళు కావడానికి భాగ్యవంతులదే తప్పంతా అన్నట్టు నువ్వు మాట్లాడటం తమాషాగా ఉంది. ఎవరి అదృష్టం వాళ్ళది. పూర్వజన్మలో చేసిన కర్మ ఫలితం అనుభవించాలిగా?" వేదాంతిలా అన్నది సుధ.

గౌతమ్ మాటలు ఆమె ఇంతకు ముందు ఎవరినోటా వినలేదు. గౌతమ్ ఉద్రేకంతో అంటూ ఉంటే ఆమెకు అతను ఎంతో అందంగా కనిపించాడు. తన్మయత్వంతో అతన్ని చూస్తూ ఉంటే ఆమెకు షేక్స్ పియర్ పాత్రలు గుర్తుకు వచ్చాయి.

ఆ పాత్రలు కంతం చెబుతున్నంత అందంగా ఉపన్యాసాలు ఇస్తాయి.

"అయితే మీ ఉద్దేశ్యం ధనవంతులంతా సుఖంగా ఉన్నారంటారా?

గౌతమ్ వాక్ ప్రవాహం ఆగింది.

"ఏం మీరు సుఖంగా లేరా?" ఆమె కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అడిగాడు.

"ఊహూ! ఆమాటకొస్తే ధవంతులకంటే చాలామంది బీదవాళ్ళే సుఖంగా ఉంటారు. నాకంటే ఆ ఎదురుగా కనిపించే పల్లెకారుల ఇంట్లో పెరిగే ఆడపిల్ల సుఖంగా ఉంటుంది?"

"ఎందుకని"

"ఆమెకు ఉన్న స్వేచ్ఛ నాకు లేదు. ఆమె తనకు నచ్చినట్లు....

గౌతమ్ పకపక నవ్వాడు.

"ఎందుకు అలా నవ్వుతున్నారు? నా మాటలు వింటుంటే మీకు ఎగతాళిగా ఉందికదూ!"

"కాదు! కాదు! మీ కష్టాలు చూస్తుంటే నవ్వొస్తోంది."

సుధ ముఖం చిన్నబుచ్చుకుంది.

"బాధ కలిగించానా?"

సుధ మాట్లాడలేదు.

"ఇక నాకు శెలవు ఇప్పిస్తారా?" అన్నాడు గౌతమ్.

"అలా బీచికి వెళ్ళి కూర్చుందాం. మీతో మాట్లాడాలి. వస్తారా?"

"రాను!" ఖచ్చితంగా అన్నాడు.

సుధ ముఖం మీద ఏదో చళ్ళుణ తగిలినట్టు అయింది.

ముఖంలో ఉలికి వస్తున్న భావాల్ని అణుచుకుంటూ "నాతో బీచ్ కి రావడం చిన్నతనంగా భావిస్తున్నారా?"

"అబ్బే అదేంకాదు త్వరగా వెళ్ళాలి. పని ఉంది."

"మీతో మాట్లాడాలి."

"ఏం మాట్లాడాలనుకుంటున్నారో నాకు తెలుసు."

సుధ తృప్తిపడినట్టు చూసింది.

"తెలుసా?"

"ఆ"

"ఏం తెలుసు?"

"మీరు మాట్లాడాలనుకొనే విషయం!"

"ఎలా తెలుసు?"

"ఆ మాత్రం అర్థం చేసుకోగలను"

"లేదు నేను నమ్మను. నా గురించి ఎవరో మీకు లేనిపోనివి కల్పించి చెప్పి ఉంటారు" అక్కసుగా అన్నది.

ఆమె ఎవర్ని ఉద్దేశించి అన్నదో గౌతమ్ కు అర్థం అయింది.

"నేను నిజమే చెబుతున్నాను. కొన్ని విషయాలు చెప్పకుండానే అర్థం అవుతాయి. మీరు అనవసరంగా ఎవర్నో మధ్యలో లాక్కు వస్తున్నారు"

"నన్ను మీరు...మీరు...అంటూ మన్నించనక్కర్లేదు"

"నువ్వు అని సంబోధించే చనువు మీ దగ్గర నాకు లేదు"

"కావాలంటే సంపాదించుకోవచ్చుగా?"

"ఏమిటి డబ్బా"

"కాదు చనువు"

గౌతమ్ నవ్వాడు.

"నేను చెప్పదల్చుకున్న విషయం మీకు తెలుసునన్నారుగదూ!"

"అవును!"

"మరి మీ సమాధానం?"

"అదికూడా చెప్పకుండానే అర్థం చేసుకోవలసిన విషయం. మీరు కొంచెం వివేకంతో ఆలోచిస్తే మీకే సమాధానం దొరుకుతుంది."

"అది మీ నోటినుంచి వినాలని ఉంది"

గౌతమ్ మాట్లాడలేదు.

"మీరు అర్థం చేసుకున్నా నేను చెప్పాలనే నిర్ణయించుకున్నాను."

"అయితే చెప్పండి త్వరగా!"

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను"

"చాలా పాత డైలాగ్. అరిగిపోయిన రికార్డులోని పదం" సుధకు అతని మాటలు కంకరరాళ్ళలా గుండెకు తగిలాయి.

ఆ బాధ ముఖంలో స్పష్టంగా కనిపించింది.

గౌతమ్ తను చాలా మొరటుగా మాట్లాడినందుకు తనలో తనే సిగ్గుపడ్డాడు.

సుధ ముఖం, చెవులూ ఎర్రబడ్డాయి. ముఖంలోకి ఏదో మొండితనం తెచ్చి పెట్టుకున్నట్టు కనిపించింది.

"పాత డైలాగే అయినా అది నిత్యనూతన,మైంది. ఏం రేణుక నోటివెంటవస్తే ఆ డైలాగ్ సరికొత్తగా విన్పిస్తుందా?"

"లేదు ఎవరి నోట వెంటవచ్చినా అది నాకు పాత డైలాగ్ లాగే ఉంటుంది"

"నువ్వు హిపోక్రాటివి!"

గౌతమ్ సుధ ముఖంలోకి చూశాడు.

"సారీ! నువ్వు అన్నాను"

"పర్వాలేదులే. ధనవంతులు బీదవాళ్ళను ఎలాగయినా పిలవవచ్చును."

"అదిగో మళ్ళీ ధనం అంటున్నారు! మీ మాటల్లోనే బీదతనం అంటే మీకు ఎంత అసహ్యామో తెలుస్తుంది. బాగా డబ్బు సంపాదించాలన్న కోర్కె కూడా కనిపిస్తుంది. మీకు డబ్బు కావాలి. అది నాదగ్గర పుష్కలంగా ఉంది. నాకు మీరు కావాలి."

గౌతమ్ అదోలా చూస్తూ "ఊ చెప్పండి! ఆగిపోయారేం?"

"మీ హౌస్ సర్జెన్సీ పూర్తికాబోతుంది. ఆ తర్వాత మీకు ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు"

"అవును!"

"డిస్పెన్సరీ ఓపెన్ చెయ్యడం ప్రాక్టీసు పెట్టుకోవడం మీకు సాధ్యంకాదు."

"అదీ నిజమే!"

"అందుకే నన్ను పెళ్ళిచేసుకోండి"

"నాకు అంత అదృష్టమా?"

"మీరు మాట్లాడే ధోరణిలో వ్యంగ్యం స్పురిస్తున్నది. కాని నేను వాస్తవం చెబుతున్నాను. కాళ్ళ దగ్గరకు వచ్చిన సిరిని తన్నెయ్యడం తెలివైనవాళ్ళ పనికాదు. బతకటం చేతకాని దద్దమ్మలు చేసేపని"

"ఇంకా?"

"పొట్టకోసం ఇంత శ్రమ పడనక్కర్లేదు. రాజకుమారుడిలా బతకొచ్చును. ఆ మాటకొస్తే మీరు ఉద్యోగమే కాదు...ప్రాక్టీసు కూడా చెయ్యనక్కర్లేదు. ఫర్ దర్ స్టడీస్- చెయ్యాలనుకుంటే ఫారెన్ కూడా వెళ్ళొచ్చును"

"మరి నువ్వు కూడా వస్తావా?"

"ఎగతాళి చేస్తున్నావా? నన్ను వెక్కిరిస్తున్నావా!" సుధ రోషంగా అన్నది.

"నేను కాదు ఎగతాళి చేస్తున్నది. మీరు. నా బీదతనాన్ని వేలెత్తి చూపించి వెక్కిరిస్తున్నారు. ఆ అధికారం మీకు నేను ఇవ్వలేదు. నేను మీ దగ్గరకు వచ్చి యాచించలేదు. డబ్బున్న వాళ్ళకు చూస్తే చులకనభావం కలుగుతుందనేది నాకు తెలియని విషయంకాదు. నేను దరిద్రుణ్ణే కావచ్చును. కాని ఆ దారిద్ర్యం నా మనసుకు లేదు. ఆ దారిద్ర్యం నా వ్యక్తిత్వాన్ని కృంగదీయలేదు. బీదతనానికి నేను ఏనాడూ భయపడి డబ్బున్నవాళ్ళ అండను పొందడానికి ప్రయత్నించలేదు"

సుధ గాభరాగా గౌతమ్ ముఖంలోకి చూసింది.

అతను ఉద్రేకంతో ఊగిపడుతున్నాడు.

"నాకు రెండు చేతులు ఉన్నాయ్. శరీరంలో బలం ఉంది. నాలో ఆత్మవిశ్వాసం ఉంది"

సుధ తడబాతుగా చూసింది.

"సారీ గౌతమ్! మిమ్మల్ని బాధపెడితే క్షమించండి. నన్ను అర్థం చేసుకోండి. మీ సుఖంకోసమే నేను అలా అన్నాను"

"మీ త్యాగానికి నా థ్యాంక్స్! కాని ఆ త్యాగం నాకు అక్కర్లేదు"

"ప్లీజ్! నన్ను అర్థం చేసుకోండి"

"అర్థం చేసుకున్నాను. ఈ బీదవాణ్ణి మర్చిపోండి. నేను మీకు తగినవాణ్ణికాదు. ఇక వస్తాను." అంటూ గిర్రున వెనక్కు తిరిగాడు.

"గౌతమ్!" పరాజయం ఆక్రోశించింది.

విజయం ఆగింది.

వెనక్కు తిరిగి చూసింది.

జాలిగా చూసింది.

"గౌతమ్ ఒక్కమాట!" సుధ దగ్గరగా వచ్చింది.

"చెప్పండి"

"ఒక్క విషయం అడుగుతాను. నిజం చెబుతారా?"

"అబద్ధం చెప్పాల్సిన అవసరం, ముఖ్యంగా మీ దగ్గర నాకు లేదు అడగండి"

"నాలో ఏం తక్కువైంది! నాలో లేని సుగుణాన్ని రేణుకలో చూశారు?"

గౌతమ్ సుధ కళ్ళలోకి చూస్తూ ఉండిపోయాడు.

"నాకంటే ఎర్రతోలు ఉన్న మాట నిజమే! అదేనా మీ ఆకర్షణకు కారణం?"

"కాదు"

"మరి ఏమిటి?"

"మీలో లేనిసంస్కారం ఆమెలో ఉన్నది"

"ఏమిటా సంస్కారం"

"ఎదుటి వారి మంచితనాన్ని అర్థం చేసుకోవడానికి మనలో కూడా మంచితనం ఉండాలి. అలాగే ఇతరుల్లోని సంస్కారాన్ని అర్థం చేసుకోవడానికి కూడా మనలో సంస్కారం ఉండాలి. ఆమెకు గర్వం లేదు మీలాగ!"

"గర్వమా? ఏం చూసుకొని?"

"ఆమెకు మీకు లేని అందం ఉన్నది. మీకు లేని తెలివితేటలు ఉన్నాయ్. బ్రిలియంట్ స్టూడెంటు"

"ఇంకా?"

"మీకు డబ్బు గర్వం. ఆ డబ్బుతో ప్రపంచంలో దేన్నయినా కొనగలననే అహం ఉన్నది. అంతవరకు పర్వాలేదు. మనుషుల్ని, మనసుల్నీ కూడా కొనగలను అనుకుంటున్నారు. అది పొరపాటు. అది మీ సంస్కారానికి నిదర్శనం!"

"గౌతమ్!" దాదాపు అరిచినట్టే అన్నది.

"క్షమించండి. నేను ఎప్పుడూ ఎవర్నీ ఇలా హర్ట్ చెయ్యలేదు. మీరే నాచేత ఇన్ని మాటలు అనిపించారు. మీరు హనుమంతరావును పెళ్ళి చేసుకోండి సుఖపడ్తారు."

"మీరు నన్ను అవమానిస్తున్నారు" సుధ నాగినిలా చర్రునలేచింది.

"మిమ్మల్ని అవమానించాలని నా భావంకాదు"

"మరేమిటి?"

"హనుమంతరావుకు మీరంటే చాలా ఇష్టం"

"వాడంటే నాకు అసహ్యం!"

"అతను మీరు అనుకున్నంత చెడ్డవాడు కాడు. మనసు చాలామంచిది. కొన్ని బలహీనతలు ఉన్నమాట నిజమే. అది అతని తప్పుకాదు. ధనంతోపాటే ఉంటే బలహీనతలు అందరిలో ఉన్నట్టే. అతనిలోనూ ఉన్నాయ్.

"అంటే మీ ఉద్దేశ్యం ధనవంతులందరిలోనూ దుర్గుణాలుంటాయనేగా?"

"అవును! అది నా ఉద్దేశ్యం కాదు. అది వాస్తవం. స్త్రీని వాడు డబ్బుతో బజార్లో కొనే వస్తువుగా భావిస్తాడు. అది ధనంతో వచ్చిన అహంకారం. మీరు చేస్తున్నది ఏమిటి? మీ ధనం ఆశ చూపించి నా మనసు కొనాలని ఆశించలేదూ? మీకు డబ్బుంది మీరు కోరిన ఏ యువకుడైన తోక ఆడిస్తూ కుక్కలా మీ పాదాలు నాకుతాడని మీ అభిప్రాయం"

"నీకు డబ్బు లేదు. అందుకే డబ్బు ఉన్నవాళ్ళంటే కసి!" కావాలని ఏకవచన ప్రయోగం చేసింది.

"నాకు డబ్బులేదు, నిజమే! డబ్బున్న వాళ్ళంటే నాకు కసి. అది కూడా నిజమే! కాని ఆ కసి నాకు డబ్బులేదు కనక ఏర్పడింది కాదు"

"మరెందుచేతనో?" వ్యంగ్యంగా అన్నది సుధ.

"డబ్బున్న వాళ్ళంతా పరాన్న భుక్కులు. పేరాసైట్స్, కొన్ని వందల మానవుల శ్రమశక్తిని దోచుకుంటే గాని ఒక్కడు శ్రీమంతుడు...అదే మీ నాన్నలాంటి శ్రీమంతుడు కాలేడు. అందుకే మీరంటే నాకు కసి."

"మా అదృష్టం చూసి మీకు ఈర్ష్య"

"సుధారాణిగారూ! ఇకవస్తాను!"

"గౌతమ్! నా దగ్గిర వెండి బంగారాలు ఖజానాలున్నాయ్. వాటితో నీలాంటి వాళ్ళను ఎందరినైనా కొనగలను"

గౌతమ్ ఆగాడు.

వెనక్కు తిరిగాడు.

"పాపం! మిమ్మల్ని చూస్తుంటే జాలివేస్తుంది"

"నన్ను చూసి నీకు జాలా?" పకపక నవ్వింది సుధారాణి.

"పాపం! మీ నవ్వు ఎలా ఉందో మీకు తెలియడంలేదు. ఏడవలేక నవ్వుతున్నారు. నిజంగా మిమ్మల్ని చూస్తుంటే నాకు జాలి వేస్తుంది. వాస్తవంగా బీదవాణ్ణి నేను కాదు, మీరు"

కోపంతో సుధారాణి పెదవులు వణుకుతున్నాయ్.

"నీకు కావాల్సింది డబ్బుతో కొనుక్కోలేనప్పుడు నువ్వు బీదదానివే"

"యూ రోగ్! షట్ అప్!" అరుస్తూ వెళ్ళి కార్లో కూర్చుని డోర్ గట్టిగా వేసింది.

గౌతమ్ చూస్తుండగానే కారు స్పీడుగా వెళ్ళిపోయింది.

గౌతమ్ చూస్తూ నిల్చున్నాడు.

సుధను తల్చుకుంటే నిజంగానే అతనికి బాధగా ఉన్నది. అవసరం అయినదానికంటే కటువుగా ప్రవర్తించానేమోనని బాధపడ్డాడు.

* * *

గౌతమ్ హాస్టల్ కు చేరేసరికి ప్రొద్దుపోయింది. హాస్టల్ టేబుల్ మీదపెట్టి ఉన్న భోజనం వడ్డించుకున్నాడు. తినబుద్ధి కాలేదు. మజ్జిగమాత్రం తాగి లేచాడు.

గదికి రాగానే "ఎరా ఇంత ఆలస్యం అయింది! మీ హీరోయిన్ ఊళ్ళోలేదుగా?" రూంమేట్ శంకర్ అడిగాడు.

గౌతమ్ మాట్లాడలేదు. అసలే విసుగ్గా ఉన్నది. పైగా అలాంటి జోక్స్ అంటే అతనికి బొత్తిగా గిట్టదు.

"మనవాడికేంరా అండ కాకపోతే మరో అండ" అన్నాడు వేణు.

"ఛ! గౌతమ్ అలాంటివాడు కాదు. వాడినంటే కళ్ళుపోతాయ్. చెంపలేసుకోమ్మా!" అన్నాడు శంకర్ వేణుతో.

గౌతమ్ వినిపించుకోనట్టే బట్టలు మార్చుకున్నాడు.

"బుద్ధిమంతుడిలా చాలారోజులు ఫోజులు కొట్టాడు. కాని ఈమధ్య బలే జల్సారాయుడిలా తయారయ్యాడులే"

"నిజంగానా? మనవాణ్ణి ఇంతకాలం శ్రీరామచంద్రుడి అవతారం అనుకున్నానే?"

"నీ మొహం! మధ్యాహ్నం ఒక హీరోయిన్ ను బండి ఎక్కించాడు అవునా?"

"అవును!"

"సాయంత్రం మరో బంగారు బాతుతో మెరీనా బీచి రోడ్డులో...."

"నోరు ముయ్యండిరా!" అన్నాడు గౌతమ్.

"అలాగే మూస్తాంగాని...ఒక సందేహం తీర్చరా బాబు!" అన్నాడు వేణు.

"ఏమిటి?" అడిగాడు కుతూహలంగా శంకర్.

"ఆ ప్రశ్న వెయ్యాల్సింది నువ్వు కాదురా చిట్టి నాయనా! గౌతమ్" చక్కగా బీచ్ లో ఇసుక తిన్నెల మీద కూర్చుని కలల్లో తేలిపోవాల్సినవాళ్ళు రోడ్డు పక్కగా, కారును ఆనుకొని నిల్చున్నారేంరా?"

"అది మాఇష్టం! నువ్వెవడివి అడగటానికి?" అన్నాడు గౌతమ్.

"అదేం ప్రశ్నరా? నేను నీ క్లాస్ మేటునూ, రూంమేటునూ కూడా!"

"మరో సంవత్సరంలో డాక్టర్ పట్టా పుచ్చుకోబోతున్నారు. ఏం లాభం? జూనీయర్ కాలేజీ స్టూడెంట్స్ లా ప్రవర్తిస్తున్నారు" విసుక్కున్నాడు గౌతమ్.

"అసలు ఇప్పటికీ ఆ కారులో షికారుకొచ్చిన 'ఆ పసిడి చాన' ఎవర్రా?"

"ఇంకెవరు? మన కాలేజీ క్వీన్!"

"కాలేజీక్వీనా! రేణుకాదేవి..."

"కాలేజీక్వీన్ అన్నాను బ్యూటిక్వీన్ అనలేదు"

శంకర్ ఆలోచనలో పడ్డాడు.

గౌతమ్ మంచంమీద పడుకొని గోడవైపు తిరిగాడు.

"ఒరేయ్ నీది వట్టి మట్టి బుర్రరా బ్రదర్! క్వీన్-అంటే అర్థం రాణి. రాణి అంటే ఎవరో తెలుసుకోలేవా?"

"సుదారాణీయా?" కళ్ళు పెద్దవి చేసి కుతూహలంగా అడిగాడు శంకర్.

"మరేమనుకున్నావ్? మనవాడు పెద్ద చాన్స్ కొట్టాడు. మనలాంటి వాగుడు గాళ్ళు ఎందుకూ పనికిరార్రా! ఇలాంటి ముచ్చులు ఉన్నారు చూశావ్! చాలా తెలివైనవాళ్ళు చూసి చూసి గాలం వెయ్యవలసి చోటే వేస్తారు"

"అవునుర్రా! సుధారాణి బంగారు గుడ్లు పెట్టే బాతు"

"నోళ్ళు ముయ్యమన్నానా?" చివ్వున లేచి కూర్చున్నాడు గౌతమ్.

"అంతకోపం ఎందుకురా బ్రదర్. సుధారాణిని నమ్మకు. సిన్సియర్ గా ప్రేమలో పడ్డావంటే హరోం హరి...ఏదో అలా అలా..."

గౌతమ్ ముఖం చీదరించుకున్నట్లు పెట్టుకున్నాడు.

"లేదురా! ఆ రాణి నిజంగానే గౌతమ్ అంటే పడిచచ్చిపోతుంది"

"నిజమైన ప్రేమ అంటావ్!"

"అంతకు మించిందేరా! ఆరాధన. ఆరాధిస్తుంది"

"వాళ్ళ ప్రేమ అమర ప్రేమ అని చెప్పు!"

"అవును!"

"వారి మధ్య తుఫాన్ రేగితే?"

"అయినా వాళ్ళు వెలిగించిన ప్రేమజ్యోతి ఆరిపోదు"

"ఉప్పెన వస్తే?"

"మనవాళ్ళు పెనుగాలులై ఆ ఉప్పెనను వెనక్కు నెట్టేస్తారు"

"మీ బొందలా ఉంది మీ సంభాషణా మీరునూ" గౌతమ్ విసుక్కున్నాడు.

"మనవాడికీ నిజంగానే కోపం వచ్చిందిరోయ్! గప్ చుప్!" నోటిమీద వేలు వేసుకున్నాడు వేణు.

గౌతమ్ పడుకున్నాడు.

రేణుకను తల్చుకుంటూ పడుకున్నారు.

రేణుకతోతాను గడపబోయే భవిష్యత్తు గురించి కలలుకంటూ పడుకున్నాడు.

* * *

"ఒరేయ్ గౌతమ్!"

"ఏమిటి?" హనుమంతరావు దగ్గిరకు వచ్చాడు గౌతమ్.

"కూర్చోరా టీ తాగుదాం"

గౌతమ్ కూర్చున్నాడు. వేణు అప్పటికే హనుమంతరావు దగ్గిర కూర్చున్నాడు.

వేణు హనుమంతరావుని అంటిపెట్టుకొనే ఉంటాడు. హనుమంతరావు వేణుకు బట్టలుకూడా కుట్టిస్తాడు. ఇద్దరూ సాధారణంగా ఒకే రకం బట్టలు వేసుకుంటారు. తెలియనివాళ్ళు చాలా మంది ఇద్దర్నీ అన్నదమ్ములనుకుంటారు. హనుమంతరావుకు తాళం వేస్తూ అతని అడుగులకు మడుగులొత్తుతూ తిరిగేవేణు అంటే గౌతమ్ కు అసహ్యం. ఇలాంటివాళ్ళు ఉండడంవల్లనే ధనవంతులకు బీదవాళ్ళను చూస్తే చులకనభావం అనుకుంటాడు.

హనుమంతరావుకు గౌతమ్ అంటే ఇష్టం. వేణులా గౌతమ్ ను తనతో తిప్పుకోవాలని ఉంటుంది. కాని అది సాధ్యపడటంలేదు.

"రేపు రాత్రి మా ఇంటికి డిన్నర్ కు రావాలిరా" అన్నాడు హనుమంతరావు.

"ఏమిటి విశేషం?" అన్నాడు గౌతమ్.

"మా నాన్నగారి స్నేహితుడికొడుకు ఫారెన్ నుంచి వస్తున్నాడు. మా డాడి ఆ సందర్భంగా పెద్దపార్టీ ఇస్తున్నాడు. సిటీలో ఉన్న పెద్ద పెద్ద ధనవంతులంతా వస్తారు.

"ఎవరికోసమో మీ నాన్న అంత ఖర్చు చేస్తున్నాడు?" ఆశ్చర్యంగా అడిగాడు గౌతమ్.

"అతను ఆర్కిటెక్చర్ స్పెషలైజ్ చేసి వస్తున్నాడు"

"అయితే!" గౌతమ్ కు అతని డిగ్రీకి పార్టీకీ ఉన్న సంబంధం ఏమిటో బోధపడలేదు.

"ధనవంతుల ఇళ్ళలో పార్టి చాలా లావిష్ గా ఉంటాయని విన్నాను- నేను తప్పకవస్తాను" అన్నాడు వేణు.

"నువ్వు వస్తావులేరా? గౌతమ్ ను రమ్మంటున్నాను"

"ఏరా వస్తావా?" అన్నాడు వేణు.

"రాను" ఖచ్చితంగా అన్నాడు గౌతమ్.

"ఏం?"

"నేను ధనవంతుణ్ణి కాదు"

"నా స్నేహితుడిగా రావోయ్. మరీ అంత బెట్టు చెయ్యకు" అన్నాడు హనుమంతరావు.

గౌతమ్ మౌనంగా టీ సిప్ చేస్తూ ఉండిపోయాడు.

"నన్ను డిస్సపాయింట్ చెయ్యకు. తప్పక రావాలి"

తన ఇంట్లో పార్టీలు ఎంత ఘనంగా జరుగుతాయో గౌతమ్ కు చూపించాలని హనుమంతరావుకు ఉన్నది.

"ఏరా మాట్లాడవ్!"

"అలాగే వస్తాను"

"థ్యాంక్యూ!"

"మెనూ ఏమిటి?" వేణు అడిగాడు.

"స్కాచ్ విస్కీ....."

"ఒకో బాటిల్ ఎంత ఉంటుంది?" వేణు కుతూహలంగా అడిగాడు.

"రెండు వందల ఇరవై బ్లాకులో కొనాలి"

"మొత్తం విస్కీ మీద ఎంత ఖర్చు చేస్తారు?" గౌతమ్ అడిగాడు.

"దాదాపు నాలుగువేలు కావచ్చును"

"బాప్ రే!" అన్నాడు వేణు.

"మొత్తం పార్టీకి ఎంత ఖర్చు అవుతుంది!"

"ఒక్కొక్క వ్యక్తికి డ్రింక్ కాక ఏభై రూపాయలు మెనూకు వేసుకున్నాం. మొత్తం పదివేలన్నా అవుతుంది."

"ఒక స్నేహితుడి కొడుకు విదేశం నుంచి వచ్చినందుకు పదివేలు పెట్టి మీ నాన్న పార్టీ ఇస్తున్నాడా?" గౌతమ్ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"ఆడవాళ్ళు కూడా తాగుతారా?" వేణు కుతూహలంగా అడిగాడు.

"కొందరు తాగుతారు. అందుకే షాంపైన్ బాటిల్స్ కూడా తెప్పించాం. అందువల్లనే ఖర్చు పదివేల దాకా కావచ్చును"

"మీ నాన్న అనవసరంగా ఒక్క దమ్మిడీకూడా ఖర్చు పెట్టడని విన్నాను?"

"అవును! నా ఖర్చుల మీద రోజూ గొడవే!"

"మరి ఒక స్నేహితుడి కొడుకు కోసం ఇంత ఖర్చు పెడుతున్నాడా? ఆశ్చర్యంగానే ఉంది"

"అది బిజినెస్ రహస్యం. బిజినెస్ మ్యాన్ పది పైసలు ఖర్చుపెడ్తే ఇరవై పైసలు వస్తాయనే గ్యారంటీ ఉంటేనే మనీ ఇన్వెస్టు చేస్తాడు"

"బిజినెస్సా? ఇందులో బిజినెస్ ఏముంది?"

"ఆ వచ్చే అతను ఆర్కిటెక్ట్ అని చెప్పానుగా!"

"అయితే?"

"మా నాన్న కాంట్రాక్టరు"

"తెలుసుకాని ఈ పార్టీ వల్ల మీ నాన్నకు ఒరిగేదేముందో అర్థం కావడంలేదు"

"బిజినెస్ అంటే అదేరా? నీకూ నాకూ అర్థం కాదు. నాన్నను నువ్వు నన్ను వేసిన ప్రశ్నే వేశాను"

"ఊ"

"ఏమన్నాడు?" వేణు అడిగాడు.

"వీడొకడు మధ్యలో పానకంలో పుడకలా నేనూ ఉన్నానంటాడు" అనుకున్నాడు గౌతమ్.

"ఇవాళ పార్టీకి వచ్చే వాళ్ళంతా ధనవంతులు"

"అయితే?"

"పైగా స్వంత ఇళ్ళు లేనివాళ్ళు త్వరలో కట్టడానికి ఆలోచిస్తున్న వాళ్ళు, స్వంత ఇళ్ళు ఉన్నవాళ్ళను పిలవడం లేదు"

గౌతమ్ హనుమంతరావు ముఖంలో కొత్తగా చదువు నేర్చుకుంటున్న పిల్లవాడు.

సంయుక్తాక్షరాలు రాసిన బోర్డు కేసి చూసినట్టు చూశాడు.

"అందులో ఒక పెద్ద మనిషి కొన్ని లక్షలతో హోటల్ బిల్డింగ్ కట్టాలనుకుంటున్నాడు"

గౌతమ్ కు ఇంకా ఈపార్టీ వల్ల హనుమంతరావు తండ్రికి వచ్చే లాభం ఏమిటో అర్థం కాలేదు.

"వాళ్ళందరికీ సురేష్ ను పరిచయం చేస్తాం!"

"అతని పేరు సురేశా?" వేణు ఏదో అనాలి కనుక అన్నట్టుగా అడిగాడు.

"అవును"

"ఊ ఆ తరువాత?"

"ఆ వచ్చే వాళ్ళలో కొందరైనా సురేష్ చేత డిజైన్ వేయించుకుంటారు"

"ఇప్పుడు అర్థం అయింది, అందులో మీ నాన్నకు కొంత కమీషన్ ఉంటుంది" క్లూ దొరికినట్టు అన్నాడు గౌతమ్.

"ఛ! కాదు మానాన్న అంత ఇంత మొత్తాలకు కక్కుర్తి పడడు"

"అసలు సంగతి ఏమిటో చెప్పరా బాబూ!"

"మీరు చెప్పనిస్తేగా?"

"చెప్పు!"

"సురేష్ డిజైను వేసిన బిల్డింగ్ కాంట్రాక్టు మా డాడీ తీసుకుంటాడు"

"ఒకవేళ వాళ్ళు ఆ కాంట్రాక్టు మీ డాడీకి ఇవ్వకపోతే?"

"ఇస్తారనే నమ్మకంతోనే ఇదంతా చెయ్యడం. బిజినెస్ లో డబ్బును ఇన్వెస్టు చెయ్యడం లాభాలు వస్తాయనే ఆశతోనే!"

"అంటే ఇదోరకం గేంబులింగ్ అన్నమాట!"

"జీవితమే ఒక గేంబులింగ్ భాయ్!" హనుమంతరావు గౌతమ్ భుజం తట్టాడు.

"అయితే గుర్రపందాలూ, జూదం ఆడొచ్చుగా?"

"వాటిలోలేని సేఫ్టీ బిజినెస్ లో ఎక్కువ ఉన్నది"

గౌతమ్ ఆలోచనలో పడ్డాడు.

"గౌతమ్ నా నీలం సూటు ఇస్తాను. వేసుకుంటావా?"

"ఎందుకూ?" కనుబొమ్మలు ముడిపడ్డాయి.

"చెప్పానుగా పార్టీకి వచ్చేవాళ్ళంతా గొప్ప గొప్ప వాళ్ళేనని!"

"గొప్పవాళ్ళు అనకు. డబ్బున్న వాళ్ళు అను"

"అవ్వ పేరే ముసలమ్మ" అన్నాడు వేణు హనుమంతరావును సమర్థిస్తూ.

"ఏడ్చినట్టుంది నీ ఉపమానం!" నోటివరకు వచ్చిన మాటల్ని బయటికి కక్కలేకపోయాడు గౌతమ్.

"పోనీయ్ గొప్పవాళ్ళు కారు. ధనవంతులే! కాని వాళ్ళంతా చాలా టిప్ టాప్ గా వస్తారు. వాళ్ల మధ్యకు నువ్వు ఇలాంటి బట్టల్తో వస్తే నీకేసి ఎవరూ చూడరు"

"మరీ మంచిది. హాయిగా అందర్నీ నేను చూస్తాను."

"నీ ఇష్టం!"

"మరి అంత అభిమానం పెంచుకుంటే మనలాంటివాళ్ళకు బతకడం కష్టం!" అన్నాడు వేణు.

వేణుకేసి ఓ క్షణం జాలిగా చూశాడు గౌతమ్.

"నా దృష్టిలో అభిమానాన్ని చంపుకొని బ్రతకడం ఒక బ్రతుకు కాదని!"

వేణు ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

వెంటనే గౌతమ్ కి బాధ అనిపించింది.

తను తొందరపడ్డాడు. వేణూ సంగతి తనకు తెలుసు. తనకు అతన్ని అవమానించే అధికారం ఏముందీ?

ఎదుటి మనిషికి బాధ కలిగించడం ఎంత సులభం?

"సారీ! వేణూ!" అన్నాడు వేణు భుజం తడుతూ.

"మనలో మనకు ఈ సారీలు చెప్పుకోవడం ఏమిటి?" అన్నాడు వేణు.

వేణులాంటి వ్యక్తుల్ని చూసి జాలి పడాలి. అంతేగాని అసహ్యించుకోకూడదు. గౌతమ్ అనుకున్నాడు.

"డిన్నర్ కు వస్తావు గదూ?" హనుమంతరావు లేస్తూ అడిగాడు.

"వస్తాను తప్పక వస్తాను. వేణుకూడా వస్తున్నాడుగా?"

"ఆ వస్తున్నాను" అన్నాడు వేణు.

వేణు హనుమంతరావును ఒక మంచి సూట్ అడగాలనుకున్నాడు. గౌతమ్ ముందు అడగలేకపోయాడు.

గౌతమ్ ఆసుపత్రికేసి నడిచాడు.

వేణు హనుమంతరావు వెనుక వెళ్ళాడు.

* * *

గౌతమ్ హనుమంతరావు చెప్పిన సమయంకంటే ముందే వచ్చాడు.

అప్పటికే వేణు వచ్చి ఉన్నాడు.

వేణు ముఖంలో అంత సంతోషం కనిపించడం లేదు.

హనుమంతరావు టీడ్ సూటు వేసుకున్నాడు. వేణు సాధారణమైన ఫ్యాంటూ, బుష్ షర్టూ వేసుకుని ఉన్నాడు.

"హనుమంతరావు సూటు అరవు ఇవ్వనన్నాడా?" అడగాలనుకున్నాడు. కాని అసలే చిన్నబోయి ఉన్న వేణు ముఖం చూస్తూ అడగలేకపోయాడు.

"రా!రా! గౌతమ్" హనుమంతరావు ఆహ్వానించాడు.

"నాతో నిల్చుని అతిథుల్ని రిసీవ్ చేసుకుంటావా?"

"ఊహూ! ఒక పక్కగా ఉన్న టేబుల్ దగ్గిర కూర్చుని మీ అతిథుల్ని చూస్తాను" అన్నాడు గౌతమ్ నవ్వుతూ.

"అలాగే! నీ ఇష్టం!"

"నేను వెళ్ళి గౌతమ్ దగ్గిర కూర్చుంటాను" అంటూ వేణు కూడా గౌతమ్ తోవెళ్ళి ఓ పక్కగా ఉన్న బల్ల దగ్గిర కుర్చీలో కూర్చున్నాడు.

హనుమంతరావు అతిథుల్ని ద్వారం దగ్గిర రిసీవ్ చేసుకుంటున్నాడు. అతని తల్లిదండ్రులు షామియానాలో నిలబడి అందర్నీ పలకరిస్తున్నారు. హనుమంతరావు ఏ ఒక్కర్నీ వేణుకు పరిచయం చెయ్యడం లేదు. వేణు మనసులో కోపంగా ఉంది. చిన్నగా వెళ్ళి గౌతమ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

"మనం వచ్చి ఉండకూడదు" అన్నాడు వేణు.

"ఏం?" అడిగాడు గౌతమ్.

"వాళ్ళంతా ఎంత టిప్ టాప్ గా వస్తున్నారో చూస్తున్నావుగా? వాళ్ళ ముందు మనం విద్యుద్దీపాల ముందు ఆముదపు దీపాలలా ఉన్నాం."

గౌతమ్ చిరునవ్వు నవ్వాడు.

వచ్చే అతిథులు ఒకర్నొకరు 'హల్లో' అంటూ కరచాలనం చేస్తూ పలకరించుకుంటున్నారు. సీతాకోకచిలకలా అలంకరించుకున్న ఆడవాళ్ళు "హాయ్! హాయ్!" అంటూ పలకరించుకుంటున్నారు. గౌతమ్ మౌనంగా కూర్చొని అందర్నీ పరిశీలనగా చూస్తున్నాడు.

సన్నగా మ్యూజిక్ వినిపిస్తున్నది. అందంగా అలంకరించబడిన ఆ భవనం ఇంద్రభవనంలా ఉన్నది వేణు కళ్ళకు. వచ్చేవాళ్ళు తమ లోకానికి సంబంధించినవాళ్ళు కన్పించడంలేదు. ఆత్మహీనతా భావంతో కుంచించుకుపోతూ గౌతమ్ ముఖంలో చూశాడు. అతని ముఖంలో ఎలాంటి భావం కన్పించలేదు. వేణుకు అక్కడినుంచి చిన్నగా వెళ్ళిపోవాలని ఉన్నది. ఆమాటే గౌతమ్ తో అనాలనుకున్నాడు.

గౌతమ్ చిత్రమైన వ్యక్తి! తనకంటే చాలా చాలా బీదవాడు. అతనికి ఏమీ అనిపించడం లేదా? ఎందుకు ఉండదూ? పైకి బింకంగా కూర్చున్నాడు! అంతే! గౌతమ్ ను గురించి ఆలోచిస్తున్నాడు వేణు.

కలకలం బయలుదేరింది. దాదాపు ఓ ముప్పయ్ సంవత్సరాల వయసులో ఉన్న యువకుడితో లోపలకు వచ్చాడు హనుమంతరావు. అతను చాలా సింపుల్ గా ఉన్నాడు. చిన్న గడ్డం ఉన్నది. అతన్ని ఒక్కొక్కరికి పరిచయం చేస్తున్నాడు. అతనే ముఖ్య అతిథి సురేశ్ అని గౌతమ్ కు అర్థం అయింది.

గౌతమ్ పక్క టేబుల్ ముందున్న వాళ్ళకు పరిచయం చేస్తున్నాడు సురేశ్ ను హనుమంతరావు. హనుమంతరావు తల్లిదండ్రులు కూడా అతనితో ప్రతి టేబుల్ దగ్గరకూ వస్తున్నారు.

"మిస్టర్ దత్తా! దాసప్రకాశ్ హోటల్ యజమాని!"

సురేశ్ కరచాలనం చేశాడు.

"ఈమె మిసెస్ దత్తా!" ధగ ధగలాడే అలంకరణలో ఉన్న స్త్రీని పరిచయం చేశాడు.

"హాయ్! హౌడూ యూడూ!" అంటూ కరచాలనం కొరకు చెయ్యి చాచింది.

సురేశ్ రెండుచేతులూ జోడించి నమస్కరించాడు.

ఆమె ముఖంలో రంగులు మారాయి. తమాయించుకుని చిరునవ్వుతో "మీ స్నేహితుడు ఆర్కిటెక్ట్ లా లేడు. సినిమా హీరోలా ఉన్నాడు. హాయిగా సినిమాల్లో వేషాలు వెయ్యొచ్చు" అన్నది మిసెస్ దత్తా సురేశ్ ను పసివాడు బర్త్ డే కేక్ కేసి చూస్తున్నట్టు చూస్తూ.

"వెయ్యొచ్చును. కాని ఇప్పటికే ముప్పయ్ ఏళ్ళు దాటిపోయాయి" అన్నాడు సురేశ్ నవ్వుతూ.

గౌతమ్ వారి సంభాషణను కుతూహలంగా వింటున్నాడు.

హనుమంతరావు మిసెస్ దత్తాతో ఏదో జోక్ చేశాడు. అందరూ పకపక నవ్వారు. సురేశ్ పక్క టేబుల్ కేసి చూశాడు. ముందు రెండు అడుగులు వేశాడు. హనుమంతరావు గౌతమ్ నూ, వేణునూ పరిచయం చేశాడు. సురేశ్ గౌతమ్ ఎదురుగా కూర్చున్నాడు. హనుమంతరావు తల్లీ దండ్రీ ముఖముఖాలు చూసుకున్నారు.

"మీరు కుమార్ రాజా గారి దగ్గర కూర్చుంటే బాగుంటుంది" అన్నాడు హనుమంతరావు తండ్రి.

"వారిని కలిశానుగా? కాసేపు ఇక్కడ కూర్చుని వస్తాను" అన్నాడు సురేశ్.

వేణుకు ఇప్పుడు హాయిగా ఉన్నది.

హనుమంతరావు అతిథి సత్కారంలో పడిపోయాడు. అందరికీ అన్నీ అందాయో లేదో చూస్తున్నాడు. విస్కీగ్లాసులు వచ్చాయి.

గౌతమ్ తనకు అక్కర్లేదని చెప్పాడు. వేణు తీసుకున్నాడు.

"మీరు డ్రింక్ తీసుకోరా?" సురేశ్ గౌతమ్ కేసి పరిశీలనగా చూస్తూ ప్రశ్నించాడు.

"అలవాటు లేదు"

"విస్కీనీ ఆడదాన్ని అందుబాటులో ఉన్నప్పుడు వదలకూడదు భాయ్" అన్నాడు సురేశ్.

సురేశ్ ను చూడగానే గౌతమ్ కు ఒక గౌరవభావం ఏర్పడింది. ఈ మాటతో చివ్వున తలెత్తి చూశాడు.

"నేను వచ్చేప్పుడు నాలుగు విస్కీ బాటిల్స్ తెచ్చాను. ఒక్కటి కస్టమ్స్ ఆఫీసరుకు ఇచ్చాను"

"మిగతా మూడూ వదిలేశాడా?" వేణు అడిగాడు.

"భారతీయ కస్టమ్స్ ఆఫీసర్ ఒక పార్కర్ పెన్ లేక స్కాచ్ విస్కీ బాటిల్ తో సంతృప్తిపడ్తాడు"

గౌతమ్ చూస్తూ ఉండిపోయాడు.

"మిసెస్ దత్తా కాస్త వయసు ముదిరినా కొబ్బరిలా బాగానే ఉన్నట్టుంది" పక్కకు చూస్తూ చిన్నగా అన్నాడు.

వేణు పకపక నవ్వాడు.

గౌతమ్ కు అతనిని చూస్తుంటే ఏవగింపు కలగసాగింది. విదేశాలకు వెళ్ళి వీళ్ళు నేర్చుకొని వచ్చే కల్చర్ ఇదేనా?"

"అమెరికాలో ఎంతకాలం ఉన్నారు?" అడిగాడు మాట మారుస్తూ గౌతమ్.

"ఐదేళ్ళు" విస్కీ సిప్ చేస్తూ అన్నాడు సురేశ్.

"ముందు కెనడా వెళ్ళాను. భారతీయుల పరిస్థితి అంత బాగుండదు అక్కడ. అక్కడ టీచర్లకూ, డాక్టర్లకూ, నర్స్ లకూ ఉద్యోగాలు దొరుకుతాయి. మిగతావాళ్లకు తెల్లవారి దొరికే పనేమిటో తెలియదు. ఇంగ్లండు వాళ్ళకంటే కెనడా వాళ్ళు భారతీయుల్ని ఎక్కువ అసహ్యించుకుంటారు"

"మరి ఇక్కడ ఎందుకు ఉంటున్నారు అంతమంది? వేణు అమాయకంగా ప్రశ్నించాడు.

"ఎందుకా డబ్బు సంపాదన కోసం! మేము విదేశాల్లో ఎలా బతుకుతున్నామో మాకు తెలుసు. అక్కడి నుండి భారతదేశం వస్తే ఫారెన్ రిటర్న్ డ్ అని చాలా గొప్పగా చూస్తారు. మేమూ గొప్పవాళ్ళంగానే ఫోజు వేస్తాం! ఎందుకంటే అక్కడ కడుపు మాడ్చుకొని డబ్బు సంపాదించి పట్టుకొస్తాంగా!" అన్నాడు గ్లాసు ఖాళీ చేస్తూ సురేశ్.

గౌతమ్ సురేశ్ ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

బేరర్ వచ్చి సురేశ్ గ్లాసు నింపిపోయాడు. "మీరు చాలా స్లో అన్నాడు వేణు గ్లాసు కేసి చూస్తూ...

"నాకు పెద్దగా అలవాటు లేదు" సిగ్గుపడిపోతూ అన్నాడు వేణు.

"ఈ దేశంరాగానే జీతం గురించి అడుగుతారు. కొన్ని వేలు చెప్తాం. అక్కడ కూలిచేసి కూడా నేలకు రెండువేలు సంపాదించవచ్చు"

"నిజంగా?" ఆశ్చర్యంగా అడిగాడు వేణు.

"అవును! మీరూ వెళ్ళండి డాక్టరీ పూర్తి అయ్యాక"

"వెళ్ళాలనే ఉన్నది" అన్నాడు వేణు.

"డబ్బు సంపాదించు కోవడానికేనా? మనదేశంలో వెయ్యి రూపాయలు సంపాదించేవాడు.

బాత్ రూందగ్గరనుంచీ మేమే శుభ్రం చేసుకుంటాం. మనవాళ్ళు అక్కడ ఐస్ క్రీం అమ్ముతారు. హోటళ్ళలో ప్లేట్లు కడుగుతారు. కూరగాయలు దుకాణం పెడ్తారు. ఇక్కడి వాళ్ళకు వాళ్ళంతా చాలా గొప్పవాళ్ళుగా కన్పిస్తారు.

"మీరు ఎంతకాలం విదేశాల్లో ఉన్నారు?"

"మొత్తం ఎనిమిదేళ్ళు! ముందు కెనడాలో మూడేళ్ళు ఉన్నాను. ఆ తరువాత అమెరికా వెళ్ళాను. అక్కడ ఐదేళ్ళు ఉన్నాను"

"అమెరికాలో ఏం చేసేవారు?"

"ప్రొఫెసర్ గా పని చేశాను"

"ఇంటులెక్చుయర్స్ అంతా విదేశాలకు ఎందుకు పరుగులు తీస్తున్నారు!"

"చెప్పానుగా డబ్బు కోసం!"

"మీరు?"

"ఈ దేశంమీద కోపంతో"

"అదేమిటి?"

"ఆశ్చర్యంగా ఉంది మీ ప్రశ్న వినడానికి. మీరు ఈ దేశంలోనే ఉన్నారు. చదువుకుంటున్నారు. చూడటానికి లోయర్ మిడిల్ క్లాసుకు చెందినవారిలాగే ఉన్నారు! అయినా మేధావులు ఈ దేశం నుంచి ఎందుకు పారిపోతున్నారో అర్థం చేసుకోలేకపోతున్నారా?"

గౌతమ్ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"ఉన్నత విద్యనూ పొందినవారికి ఈ దేశంలో క్లర్కు ఉద్యోగం కూడా అతి కష్టంమీద దొరుకుతుంది. నాకెన్నో డిగ్రీలు ఉన్నాయ్. ఇక్కడ నెలకు నాలుగువందలు కూడా సంపాదించలేకపోయాను"

"ఎందుకని?" వేణు అడిగాడు.

"ఎందుకా! ఇక్కడ నాకు ఇద్దరు శత్రువులు ఉన్నారు"

"ఎవరు వాళ్ళు?" ఆశ్చర్యంగా అడిగాడు వేణు.

"ఒకటి బీదతనం. రెండు పెద్దల అండ లేకపోవడం! లంచం ఇవ్వలేను. సిఫారసు చేయించుకోలేను"

"మీ కోపం వ్యక్తిగతమైంది."

"అవును! మీకు తెలియదు. నేను ఎన్ని బాధలు పడి చదువుకున్నానో, వారాలు తిని చదువుకున్నాను. తండ్రి చిన్నప్పుడే పోయాడు. మా అమ్మ వంట పని చేసి నన్ను పోషించింది. సాయంత్రాలు నేను ట్యూషన్స్ కూడా చెప్పేవాణ్ణి. అంత కష్టపడి చదువుకున్న నాకు ఉద్యోగం దొరకలేదు.

నాకు భవిష్యత్తు కన్పించలేదు. విదేశాలు వెళ్తేనే విద్యకు గుర్తింపు ఉంటుందని నాకు తెలుసు. అలాంటప్పుడు ఎందుకు వెళ్ళను. లంచగొండి నాయకులు వేదికలు ఎక్కి జనానికి నీతిని బోధిస్తారు. అర్థాకలితో ఉన్న టీచర్ లు భావి పౌరులను తీర్చిదిద్దాలనీ, నిజాయితీతో పని చెయ్యాలనీ బోధిస్తారు"

"కాని మన దేశ పరిస్థితుల్లో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది ప్రగతి పథంలో"

"పయనిస్తున్నాం" అంటూ వాక్యం పూర్తి చేశాడు సురేశ్. అతని కంఠంలో వ్యంగ్యం ధ్వనించింది.

"శిక్షితులైన యువకులు విదేశాల నుంచి తిరిగివస్తే వాళ్ళకు ఉద్యోగం దొరుకుతుందనే గ్యారంటీ లేదు. ఆటమిక్ ఎనర్జీలో ప్రవీణుడైన యువకుడు ఢిల్లీలో ఆత్మహత్య చేసుకున్న విషయం విన్నారా?"

గౌతమ్ వేణు ముఖంలోకి చూశాడు.

"విని ఉండరు. బుద్ధిగా క్లాసు పుస్తకాలు చదువుకుంటారు..దేశంలో ఏం జరుగుతుందో మీలో చాలా మందికి తెలియదు.

"అతను ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడు?"

"అతని ప్రతిభను ఓర్చలేని పెద్ద ఆఫీసర్లు చేసే అవమానాలను భరించలేక...."

"ఆ తర్వాత?"

"ఆ తరువాత ఏముందీ? అంతా మామూలే! పార్లమెంటులో కొందరు సభ్యులు గొడవ చేశారు. వన్ మాన్ కమిటి వేశారు. ఎంక్వయిరీ ప్రారంభం అయింది. అది పూర్తి అయ్యేసరికి జనం అతని సంగతి మర్చిపోయారు"

"అన్యాయం!" అన్నాడు గౌతమ్.

సురేశ్ చిరునవ్వు నవ్వాడు.

"బాగా సంపాదించుకున్నారా డాలర్స్" అడిగాడు వేణు.

"బాగా అనలేను కాని సంపాదించాను. ఒక ప్రఖ్యాత ఫర్మ్ లో జూనియర్ ఆర్కిటెక్ట్ గా పని చేస్తూ డాక్టరేట్ సంపాదించుకున్నాను. తర్వాత ప్రొఫెసర్ను అయ్యాను. చాలా బిల్డింగులకు ప్లాన్స్ వేశాను. కాని నాకు పేరు రాలేదు. ఆ పేరంతా ఆకంపెనీకే వచ్చింది. ఆయన డబ్బు సంపాదన బాగానే ఉన్నది. భారతీయులందరిలాగే పిసినారిగా జీవించాను. అవసరాల్ని వీలయినంత వరకు తగ్గించుకొని డబ్బు చేర్చాను. విదేశీయులు పిసినారిగా చిన్నచూపు చూసినా లక్ష్యపెట్టలేదు. మరి ఆ డబ్బు కోసమేగా దేశాన్ని వదలి అంత దూరం వెళ్ళేది! ముప్పయి వేల డాలర్స్ ఉన్నాయ్. ఈ దేశంలో మార్చుకుంటే రెండు లక్షలు సంపాదించుకోగలను.

నేను ఎయిర్ కండిషన్డ్ ఇంపాలా కారు తెచ్చుకున్నాను. దాన్ని నేను రెండువేల డాలర్లు అంటే పదిహేను వేలకు కొన్నాను. దాన్ని ఇక్కడ అమ్మి తేలిగ్గా మరో లక్ష సంపాదించుకోగలను. ఇంకా మూవీ కెమెరా, టెలివిజన్, నయాగరా టేప్ రికార్డర్ వగైరా చిన్న చిన్న వస్తువులు చాలా  సంపాదించాను. వాటిని అమ్మితే కనీసం మరో లక్ష వస్తుంది.

నేను అక్కడికి వెళ్ళలేదనుకోండి. అతి కష్టం మీద ఉద్యోగం సంపాదించినా ఈ దేశంలో ఇన్ని సంవత్సరాల్లో ఒక ఐదు వేలయినా బ్యాంకులో వేసుకొనే స్థితిలో ఉండే వాణ్ణి కాదేమో?"

అతని మాటల్లో గర్వం లేదు. మాటల్లో నిజాయితీ ఉన్నది. గౌతమ్ కు అతని మీద మొదట ఏర్పడిన ఏహ్య భావం తొలగిపోయింది.

"మీరు మళ్ళీ వెళ్తారా?" గౌతమ్ అడిగాడు.

"వెళ్ళను"

"ఇక్కడ మీ ప్రావిణ్యతను ప్రయోగించి మరో తాజ్ మహల్ కడ్తారా?" వేణు సరదాగా అడిగాడు.

"తాజ్ మహల్ గోరీ! నేను ఈ దేశం గోరీలు కట్టాలని రాలేదు. ఇళ్ళు కట్టాలని వచ్చాను"

"గొప్ప భవనాలు నిర్మిస్తారా! లక్షాధికారులూ, కోటీశ్వరులూ ఈ దేశంలోనూ చాలా మంది ఉన్నారు" అన్నాడు గౌతమ్.

"కాదు వీలైనంత తక్కువ ఖర్చుతో సామాన్యుల కోసం కట్టడానికి ప్రయత్నిస్తాను. నేను విదేశాలలో సంపాదించిన డబ్బు నాకు చాలు. దానిమీద వచ్చే వడ్డీతో బ్రతగ్గలను"

గౌతమ్ సురేశ్ ముఖంలో గౌరవపూర్వకంగా చూశాడు. ఇంత సంస్కారం, మంచి భావాలు గల యువకుడు స్త్రీలను గురించి ఎందుకు అంత చులకనగా మాట్లాడాడు? విదేశీ ప్రభావమా?

"ఒక సందేహం?" అన్నాడు గౌతమ్.

"అడగండి"

"మీకు స్త్రీలంటే గౌరవం లేదు కదూ!"

సురేశ్ గౌతమ్ ముఖంలోకి చూశాడు.

"మా అమ్మ అంటే నాకు చాలా గౌరవం" అన్నాడు సురేశ్.

"కాని పరాయి స్త్రీలంటే నాకు చులకన భావం లేదు. స్త్రీలను నేను గౌరవిస్తాను. కానీ మిసెస్ దత్తా లాంటి స్త్రీలను నేను భరించలేను. గౌరవించలేను"

ఏమిటి సురేశ్ నువ్వక్కడే కూర్చుండిపోయావ్? కుమార్ రాజావారు నీతో మాట్లాడాలంటున్నారు!" హనుమంతరావు తండ్రి అన్నాడు.

హనుమంతరావు తన తండ్రికి గౌతమ్ నూ, వేణునూ రాగానే పరిచయం చేశాడు.

వాళ్ళ నమస్కారాలకు తలపంకించి దూరంగా ఎవర్నో "రండి! రండి!" అంటూ ఆహ్వానించడానికి వెళ్ళిపోయాడు. ఇప్పుడు కూడా ఆ ఇద్దరి ఉనికినీ గుర్తించనట్టే ప్రవర్తించాడు. వేణు మనసు చివుక్కు మన్నది.

గౌతమ్ అదేమీ పట్టనట్టే నిర్లక్ష్యంగా కూర్చుండిపోయాడు.

"వస్తానులెండి" అని సమాధానం ఇచ్చి

"ఇంకా ఈ దేశంలో రాజ్యాలూ రాజులూ ఉన్నారా?" అన్నాడు సురేశ్ నవ్వుతూ.

హనుమంతరావు తండ్రి ఆముదం తాగినట్టు ముఖంపెట్టి గౌతమ్ కేసి, వేణు కేసి చులకనగా ఒక చూపు చూసి అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

"రాజ్యాలు పోయాయి. కాని ఇంకా కుమారా రాజాలు ఉన్నారు" అన్నాడు గౌతమ్.

"సరే వస్తానండీ! మిమ్మల్ని చూడగానే ఎందుకో మీతో పరిచయం పెంచుకోవాలనిపించింది. నేను ఈ ఊళ్ళోనే ఉంటాను మళ్ళీ కల్సుకుందాం!"

"ఓకే!"

సురేశ్ గౌతమ్ తోనూ వేణుతూనూ కరచాలనం చేసి హనుమంతరావు తండ్రిని వెతుక్కుంటూ వెళ్ళాడు.

"ఇలాంటి పార్టీలకు మనలాంటి వాళ్ళు రావడం అంత బుద్ధితక్కువ మరోటి లేదు"

గౌతమ్ వేణు ముఖంలోకి చూశాడు.

"హనుమంతుగాడి నాన్న చూశావా మనకేసి ఎలా చూశాడో?"

"ఎలా చూశాడు?"

"బొద్దింకల్ని చూసినట్టు చూశాడు"

"అనెలా చెప్పగలవు. గొంగళిపురుగుల్ని చూసినట్టు చూసి ఉండొచ్చుగా!" జాలిగా వేణును చూస్తూ అన్నాడు గౌతమ్.

"గౌతమ్ ఇలా రా?" గాభరాగా హనుమంతరావు గౌతమ్ ను పిల్చాడు.

గౌతమ్ తాపీగా లేచి వెళ్లాడు.

అందరికీ దూరంగా తీసుకెళ్ళాడు.

"ఏమిటి ఏమైంది? ఎందుకంత గాభరా పడ్తున్నావ్?"

"కొంప మీద కొచ్చింది"

"ఏమిటి? ఎవరి కొంప మీదకు?"

"నీ కొంప మీదకే!"

"నాకు కొంప వుంటేగదా ఏ ప్రమాదమైనా రావడానికి" పకపక నవ్వాడు.

"ఇది నవ్వులకు సమయంకాదు!"

"అదేదో మరీ చంపకుండా చెప్పు!"

నువ్వేమైనా ఉత్తరాలు సుధారాణికి రాశావా?"

గౌతమ్ తృళ్ళిపడ్డాడు హనుమంతరావు ముఖంలోకి విస్మయంగా చూశాడు.

"చెప్పరా నాయనా! అసలు ఆవిడతో నీకు స్నేహం ఎప్పటి నుంచి?"

"నాకా? ఆవిడతో స్నేహమా? నీకేమైనా మతిపోయిందా?"

"ఉత్తరాలు ఏమీ రాయలేదా?"

"ఛ! నేను సుధారాణికి ఉత్తరాలు రాయడం ఏమిటి?"

"బ్రతికాం పో!" రిలీఫ్ గా అన్నాడు హనుమంతరావు.

"చంపక అసలు విషయం ఏమిటో చెప్పరా?"

"సుధారాణి ఆత్మహత్య చేసుకుందట!"

"ఆత్మహత్య చేసుకుందా?"

"ప్రయత్నం చేసింది. ఇంకా చావలేదు. అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చేర్పించారట. నీకోసం పోలీసులు హాస్టల్ కు వచ్చారట. శంకర్ ఫోన్ చేశాడు. నువ్వు హాస్టల్ కు వెళ్ళకు. నేను ఎక్కడైనా రహస్యంగా ఉంచే ఏర్పాటు చేస్తాను"

హనుమంతరావు గబగబా చెప్పుకుపోతున్నాడు.

గౌతమ్ హనుమంతరావు ముఖంలోకి పిచ్చి చూపులు చూస్తూ ఉండిపోయాడు.

"కారు సిద్ధంగా ఉంది. పద! నిన్ను మా స్నేహితుడి ఇంట్లో డ్రాప్ చేసి వస్తాను. కేసు తేలేంతవరకూ అక్కడే ఉండవచ్చును. అతను చాలా మంచివాడు. అతని వల్ల మనకు ఏ అపాయం ఉండదు"

గౌతమ్ కు హనుమంతరావు ఏ భాషలో మాట్లాడుతున్నాడో బోధపడటం లేదు.

"ఏమిటోయ్ అంత రహస్యాలు మాట్లాడుతున్నారు. నేను వినకూడదా?" అంటూ వేణు వచ్చాడు.

అసలే గాభరాలో ఉన్న హనుమంతరావుకు వేణు ప్రవర్తన నచ్చలేదు.

"అవును! రహస్యాలు. కాసేపు నువ్వు నీ కుర్చీలోనే ఉండు నేను వస్తాను"

హనుమంతరావు మాటతో వేణు ముఖం మాడిపోయింది. చరచరా అక్కడి నుండి వెళ్ళిపోయాడు. తన కుర్చీ దగ్గరకు వెళ్ళలేదు. బయటికి వెళ్ళిపోయాడు.

"వీడొక్కడు మధ్యలో! మేనర్స్ కూడా తెలియదు" విసుక్కున్నాడు హనుమంతరావు.

"బయలుదేరు"

"సుధారాణి ఆత్మహత్యా ప్రయత్నం చేసిందా? అయితే నాకోసం పోలీసులు గాలించడం ఏమిటి?" పూర్తి షాక్ నుంచి కోలుకోకుండానే ప్రశ్నించాడు.

"ఆమె దిండు కింద ఏదో ఉత్తరం ఉన్నదట. తను ఆత్మహత్య చేసుకోవడానికి కారణం నువ్వేనని రాసిందట"

"నేనా?" పిచ్చివాడిలా ప్రశ్నించాడు.

"అవునో కాదో ఆలోచించే సమయం లేదు. ఆవిడ అలా రాసి పెట్టింది. ఇంకా ఏమేమి రాసిందో వివరాలు తెలియవు"

గౌతమ్ గిర్రున వెనక్కు తిరిగాడు.

"ఎక్కడికి?" చెయ్యి పట్టుకొని ప్రశ్నించాడు హనుమంతరావు.

"హాస్టల్ కు"

"నీకు మతి పోయిందా?"

"ఇంకా పూర్తిగా పోలేదు"

"అక్కడ నీ కోసం పోలీసు వాళ్ళు ఎదురు చూస్తున్నారు"

"చూడనియ్! నేను తప్పు చేస్తేగా భయపడి దాక్కోవడానికి!"

"నా మాట విను"

"నేను దాక్కున్నానే అనుకో, నేను నిజంగానే అపరాధిని అని అందరూ భావిస్తారు. అందుకే అన్యాయాన్ని ఎదుర్కోవడానికి వెళ్తున్నాను" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా గౌతమ్ చరచరా బయటికి వెళ్ళిపోయాడు.

* * *

గౌతమ్ ను అరెస్టు చేశారు. ఆ రాత్రి రిమాండ్ లో ఉన్నాడు.

రెండోరోజు ఉదయం హనుమంతరావు జామీన్ ఇచ్చి విడిపించాడు.

కాలేజీలో ప్రతివాళ్ళ నోటా ఇదే విషయం.

ఎక్కువమంది గౌతమ్ నిరపరాధి అని నమ్మారు.

కొందరు మాత్రం అతన్ని అపరాధిని చూసినట్టే చూశారు.

గౌతమ్ ఏ అభిప్రాయానికి విలువ ఇవ్వలేదు. ఏమీ జరగనట్టే తిరుగుతున్నాడు.

మూడో రోజు రాత్రికి సుధకు స్పృహ వచ్చింది. అపాయం నుంచి బయటపడిందని చెప్పారు డాక్టర్లు.

సుధ ఉత్తరంలో గౌతమ్ తనను ప్రేమించినట్టు కల్లబొల్లి కబుర్లు చెప్పి మోసం చేశాడనీ, తనకు మూడో నెల అనీ, ప్రపంచానికి ముఖం చూపించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాననీ రాసింది.

డాక్టర్ పరీక్షలో ఆమె గర్భవతి కాదని తేలింది.

గౌతమ్ మీద కేసు కొట్టేశారు.

సుధ సిగ్గుతో కాలేజీకి రావడం మానేసింది.

కేసు కొట్టేసిన రాత్రి గౌతమ్ బుర్ర ఆలోచించడం ప్రారంభించింది. అంతవరకూ తను నిరపరాధినని నిరూపించుకోవడానికి పడే మానసిక సంఘర్షణతోనే గడిచిపోయింది.

సుధ బ్రతికింది.

ఒకవేళ చచ్చిపోయి వుంటే?

తనను ఉరికంబం ఎక్కించేవారా?

సుధ తనను అంతగా ప్రేమిస్తోందా? చివరకు ప్రాణాలను తీసుకోవడానికి కూడా వెనకాడ లేదు.

దీన్ని ప్రేమ అనాలా? ప్రేమించే వ్యక్తి చివరి ఘడియల్లో ప్రియుడి మీద ప్రతీకారాన్ని కోరుతుందా?

ఉంటారు కసితీర్చుకునే ఆడవాళ్ళు ఉంటారు. చిత్రాంగి పాత్ర సృష్టి, ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొనే జరిగి ఉండాలి. అది నిజమో కాదో! కాని అలాంటివాళ్ళు మాత్రం ఈనాటికి ఉన్నారు.

నిజమైన ప్రేమ బలికోరదు.

సుధ ఏనాడూ తనను ప్రేమిస్తున్నట్టు ప్రవర్తించలేదు. సుధకు మగపిల్లల్ని చుట్టూ తిప్పుకోవడం, ఆకర్షించడం, ఆ తర్వాత తిరస్కరించడం హాబీ! ఫ్లర్టింబ్ టైప్ అని తనకు తెలుసు.

తనూ రేణుకా కలసి తిరుగుతున్నప్పటినుంచీ ఆమెలో ఈర్ష్య బయలుదేరింది. ఆ ఈర్ష్య ద్వేషంగా మారింది. ఈర్ష్య ద్వేషాలు మనిషిని అశాంతి పాలు చేస్తాయి. సాలె పురుగు తన చుట్టూ తనే గూడు అల్లుకుంటుంది. అందులో ఊపిరి సలపక, ఎంతో శ్రమపడి ఆగూడు చీల్చుకొని బయటికి వస్తుంది. ఈర్ష్యాద్వేషాలు కూడా మనిషిని సాలెగూడు లాంటి విష వలయంలోకి నెట్టేస్తాయి. ఈర్ష్యాద్వేషాలు ఉన్న వ్యక్తి తన గోళ్ళతో తన శరీరాన్నే గాయపర్చుకుంటాడు. ఆ సంగతి అతనికి అర్థం కాదు. ఎవరో గాయపర్చారని భ్రమపడి ప్రతీకారం తీర్చుకోవటానికి ప్రయత్నిస్తాడు.

ఇంత అన్యాయమా? చావబోతూ కూడా కసి తీర్చుకోవడమా? చివరి క్షణాల్లో ఒక నిరపరాధిని ఉరికంబానికి ఎక్కించే ప్రయత్నమా? హారిబుల్.

ఆలోచిస్తున్న గౌతమ్ కళ్ళముందు సుధ రూపం మెదిలింది.

ఆ సున్నితమైన శరీరంలో ఇంత క్రూరత్వం దాగి ఉందా?

అంతలోకే సుధ మీద జాలి కలిగింది.

పిచ్చిపిల్ల!

సుధకు ఏం తక్కువైంది?

కష్టం అంటే ఏదో తెలియని జీవితం.

రేణుకకు ఈ విషయం తెలిస్తే?

తండ్రిపోయిన బాధతో ఉన్నది. ఆమె ఇక్కడ లేకపోవడం మంచిదే అయింది. రేణుక వచ్చేసరికి తను నిరపరాధిగా రుజువు అయిపోయింది.

లేకపోతే!

గౌతమ్ ఆలోచనల నుంచే నిద్రలోకి జారిపోయాడు.

## 10

రేణుక నిర్జీవ ప్రతిమలా గోడకు చేరబడి కూర్చున్నది.

చేతిలోని వుత్తరం గాలికి రెపరెప లాడింది.

ఆమె కళ్ళు గాజుగోళీల్లా కళా విహీనంగా ఉన్నాయి. ఆ చూపుల్లో జీవంలేదు. ఆ ముఖంలో చైతన్యం లేదు.

"అక్కా! అమ్మ మళ్ళీ ఏడుస్తూంది" చిన్న చెల్లెలు సరళ ఏడుస్తూ చెప్పింది.

రేణుక చెవులకు విన్పించలేదు.

"అక్కా!అక్కా!" రేణుక భుజం మీద చెయ్యి వేసింది, ఊపింది ఐదేళ్ళ సరళ.

రేణుక కదిలింది.

చూపులు తిప్పి చూసింది.

సరళ ఏడుస్తోంది "అమ్మ ఏడుస్తోంది" అంటోంది.

అవును!

అమ్మ ఏడుస్తోంది

నేను ఏడుస్తున్నాను.

నువ్వు మాత్రం ఏడవడం లేదూ!

"అక్కా!అక్కా!" అక్కను గట్టిగా కుదిపింది సరళ. అక్క సరిగా పలక్కపోయేసరికి బావురుమన్నది.

రేణుక ఈలోకంలో వచ్చింది గాభరగా చెల్లెల్ని వళ్ళోకి తీసుకుంది.

"ఏడవకమ్మా!"

"అమ్మ ఏడుస్తోంది. నాకేమో ఆకలేస్తోంది"

"చిన్నక్క ఎక్కడ?"

"బయట చెమ్మచెక్క ఆడుకుంటోంది"

పద నీకు అన్నం పెడతాను. చేతిలో ఉన్న ఉత్తరాన్ని మడిచి బీరువాలో బట్టలక్రిందగా పెట్టింది.

సరళకూ, చిన్న తమ్ముడు చంద్రానికి భోజనం పెట్టి నిద్రపుచ్చింది. వాళ్ళకు కూడా భోజనాలు పెట్టి చదువుకొమ్మని పురమాయించింది.

తల్లి దగ్గరకు వచ్చింది. తల్లి గదిలో ఓమూల చాప మీద ముడుచుకొని పడుకొని ఉన్నది. కొంతసేపు అలా పడుకున్న తల్లిని చూస్తూ నిల్చున్నది.

అమ్మ ఈ ఇరవై రోజుల్లో ఎంత చిక్కిపోయింది?

ఒక మనిషిలో ఇరవై రోజుల్లో ఇంత మార్పు వస్తుందని తన ఊహకు కూడా అందని విషయం. పదేళ్ళ వయసు ఒక్కసారిగా మీదపడినట్టు అయింది.

"అమ్మా!" తల్లి పక్కన కూర్చుని మీద చెయ్యి వేసింది.

తల్లి సుందరమ్మ కళ్ళు తుడుచుకుని లేచి కూర్చుంది.

"అమ్మా! నువ్వు ఇలా ఇరవై నాలుగ్గంటలూ ఏడుస్తూ ఉంటే ఎలా? ఎంత చిక్కిపోయావో తెలుసా? నాన్న పోయారు. నువ్వు కూడా మాకు లేకపోతే ఏమైపోవాలి మేము?" గద్గద కంఠంతో అన్నది రేణుక.

"ఏం చెయ్యను తల్లీ. గుండెను ఎంత రాయి చేసుకుందామన్నా నా వల్ల కావటం లేదు. ఇటువంటిరోజు చూడాల్సి వస్తుందని కల్లో కూడా అనుకోలేదు. మిమ్మల్నందర్నీ ఏం చెయ్యను! ఎట్లా ఒడ్డు చేర్చ గలనో ఏమో?"

"ఆ విషయంలో నువ్వు బెంగ పడకమ్మా! ఇంకా ఒక సంవత్సరం ఓపిక పట్టు. నాకు డిగ్రీ వచ్చేస్తుంది. ఇంటి భారం తీసుకుంటాను"

"నువ్వా?"

"అవునమ్మా నాన్నకు మాట ఇచ్చాను. చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనూ చదివించి, పెళ్ళిళ్ళు చేసే బాధ్యత నాది"

"నువ్వు ఆడపిల్ల తల్లివి. నీకున్నా, రేపు మీ ఆయనకు ఈ ఇంటి బరువును మీద వేసుకోవడం ఇష్టం ఉండకపోవచ్చు. అలాంటి ఆశలు పెట్టుకోకూడదు తల్లీ"

రేణుక పెదవుల పై విరిసిన పాలలాంటి చిరునవ్వు, రేఖలీలా మాత్రంగా కన్పించింది.

"అలాంటి పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకమ్మా!"

"ఎంతకాలం ఆడపిల్ల సంపాదన మీద బతకగలం?"

"మరి ఆడపిల్లను మగపిల్లవాడిలా ఎందుకు చదివించారు? మగపిల్లలు కంటే ఎక్కువగానే మీరు నన్ను పెంచారు"

"పెళ్ళి అయ్యేంత వరకే! పెళ్ళి అయ్యాక ఆడపిల్ల పరాయింటి పిల్ల అవుతుంది"

"నేను అసలు పెళ్ళే చేసుకోకపోతే?"

"సుందరమ్మ కూతురి ముఖంలోకి విస్మయంగా చూచింది.

"ఏమిటమ్మా అలా చూస్తావ్? ఆడపిల్ల పెళ్ళి చేసుకోకుండా ఎలా ఉంటుందనేనా? అవన్నీ పాతకాలపు భావాలు. ఏం మగవాళ్ళు పెళ్ళి చేసుకోకుండా ఉండిపోయిన వాళ్ళెందరులేరు? మన శేఖర్ బావ ఏం చేశాడు? బ్రహ్మచారిగానే

ఉంటూ ఆరుగురు తోబుట్టిన వాళ్ళను ప్రయోజకుల్ని చేశాడు"

"అది వేరమ్మా! నువ్వు ఆడపిల్లవు" ఆడపిల్ల పెళ్ళి లేకుండా ఎలా ఉంటుంది అన్న భావం ఆమె కంఠంలో ద్యోతకమైంది.

"ఏం? ఎందుకు ఉండకూడదూ? ఈ రోజుల్లో ఎందరు అలాంటి వాళ్ళు లేరు"

"మా కోసం నీ జీవితాన్ని పాడు చేస్తాననుకుంటున్నావా తల్లీ. ఆ గుంటూరు సంబంధం నీకు నచ్చితే...ఆ అబ్బాయి కూడా డాక్టర్...నీ చదువు పూర్తి కాగానే ఆ మూడు ముళ్ళు వెయ్యిస్తాను.

మా పాట్లు ఏవో మేం పడతాం! అంతేకాని....."

"అమ్మా! ఇప్పుడు ఆ విషయాలన్నీ ఎందుకు? సంవత్సరం తర్వాత విషయం. ఇప్పుడే తొందరపడి ఆ గుంటూరు వాళ్ళతో ఏమీ మాట్లాడకు. వాళ్ళు తొందర పెడితే మా అమ్మాయి ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోదని చెప్పు"

"పాతికేళ్ళు పైన పడుతుంటే ఇంకెప్పుడు చేసుకుంటావే?"

"అమ్మా! నీకు ఇదే చెప్తున్నాను. ఇక నా పెళ్ళి గురించి ఆలోచించడం మానేయ్"

"భోజనానికి రామ్మా!"

"నాకు ఆకలిగా లేదు"

"నువ్వు తినమ్మా!"

"నువ్వు రాకుండా నేను మాత్రం ఎలా తింటానమ్మా"

సుందరమ్మ లేచింది.

రేణుక వంటగదిలోకి ఆలోచిస్తూ యాంత్రికంగా నడిచింది.

తల్లీకూతుళ్ళు భోజనం అయిందనిపించి లేచారు. ఎవరికీ తినాలని లేదు. ఒకరి కోసం మరొకరు కూర్చున్నారు.

సుందరమ్మ వెళ్ళి మళ్ళీ చాపమీద పడుకుంది.

రేణుక డైనింగ్ టేబుల్ ముందు నుంచి లేచి వెళ్ళి బీరువా తెరిచింది. బట్టలు క్రింది నుంచి ఉత్తరం బయటికి తీసింది. మళ్ళీ డైనింగ్ టేబుల్ దగ్గిరకు వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఉత్తరం మరోసారి చదవసాగింది-

"ప్రియమైన రేణూ,

"మీ నాన్నగారు పోయారని తెలిసింది. చాలా బాధగా ఉన్నది. ఆ విషయం నాకు గౌతమ్ చెప్పాడు. నీకు నా సానుభూతి ఎలా తెలపాలో కూడా తెలియడం లేదు.

అసలే బాధలో ఉన్న నిన్ను నా ఈ ఉత్తరం మరీ బాధిస్తుందని తెలుసు. అయినా రాయక తప్పలేదు. నీకు చెప్పుకుంటే గాని నా ఆత్మకు శాంతి ఉండదు. ఇప్పుడు చెప్పకపోతే మరింకెప్పుడూ చెప్పలేను. అందుకే ఈ ఉత్తరం రాస్తున్నాను. చేతనయితే నన్ను క్షమించు. నీ మనసు నాకు తెలుసు. నువ్వు క్షమిస్తావని కూడా నాకు తెలుసు.

రేణూ నేను వెళ్ళిపోతున్నానే!

చాలా దూరం వెళ్ళిపోతున్నాను.

నన్ను ఎవరూ అందుకోలేనంత దూరం వెళ్ళిపోతున్నాను.

ఇప్పుడు టైం ఎంత అయిందో తెలుసా? రాత్రి 11 గంటలు దాటింది. పరీక్షలకు కూడా పది తర్వాత నేను మెలకువతో ఉన్నట్టుగా నాకు గుర్తులేదు. పిలిస్తే పలికే నిద్ర నాకు దూరం అయింది. రెండురోజులైంది నేను నిద్రపోయి అంటే ఎవరూ నమ్మరు.

కష్టం అంటే ఏమిటో తెలియకుండా పూలపాన్పు మీద పెరిగాను.

కాని...కాని...దాదాపు సంవత్సరం నుంచి నా మనసులో ఒక విషయం తుమ్మ ముల్లులా గుచ్చుకుంటూనే ఉన్నది. అదీ సహజంగా ఈ వయసులో ఉండే ప్రేమ వ్యవహారం అని నీకు వేరే చెప్పనక్కర్లేదు. అది మరెవరితోనో అయితే నాకు ఏ బాధా లేదు.

నువ్వు వట్టి అమాయకురాలివి. నీకు అసలు విషయం ఏనాడో చెప్పాల్సింది. అలా చెప్పకపోవడం వల్లనే ఇంత అనర్థానికి దారి తీసింది. నీ మనసు నాకు తెలుసు. నేను ప్రేమిస్తున్న వ్యక్తిని... నన్ను ప్రేమిస్తున్న వ్యక్తిని..నువ్వు ప్రేమించి అడ్డుగోడగా నిలబడేదానివి కూడా కాదని నాకు తెలుసు.

రేణూ! అసలు ఈ మగవాళ్ళను నమ్మకూడదే! ముఖ్యంగా మునిముచ్చులా ఉండే వాళ్ళను అసలు నమ్మకూడదు. గౌతమ్ అంటే నీకు ఇష్టమని నాకు తెలుసు. కానీ మీ పరిచయం ఇంత దూరం వస్తుందనుకోలేదు. అందుకే నిన్ను ముందుగా హెచ్చరించలేదు. గౌతమ్ నేను రెండేళ్ళుగా కలిసిమెలిసి తిరుగుతున్నాం దొంగచాటుగా జరుగుతోంది ఈ వ్యవహారం ఇంత కాలం. తన హౌస్ సర్జెన్సీ పూర్తి అయ్యేంత వరకూ మా ఈ ప్రేమ వ్యవహారాన్ని రహస్యంగా ఉంచమని గౌతమ్ సలహా ఇచ్చాడు. ఇంత తాడూ బొంగరం లేనివాడితో తిరుగుతున్నట్టు తెలిస్తే మా డాడి కాలేజీ కూడా మాన్పించి వెంటనే ఓ మిలియనేర్ తో నాపెళ్ళి జరిపించేస్తాడని నా భయం. అందుకే రహస్యంగా అతి జాగ్రత్తగా ఎవరికీ అనుమానం కూడా రాకుండా అతి మెలుకువతో ప్రవర్తిస్తూ వచ్చాం.

గౌతమ్ మనీ దగ్గిర చులకనగా మాట్లాడేదాన్ని. ఎందుకో తెలుసా? నువ్వు నాకంటే అందంగా ఉంటావ్. నీకు అతనంటే ఇష్టం అని తెలుసు నీ ఆకర్షణలో పడతాడనే భయంకొద్దీ అలా మాట్లాడేదాన్ని. నీ మనస్సు విరచాలని ప్రయత్నించేదాన్ని. అదే నా దుర్గతికి కారణం అయింది. అసలు విషయం మనసు విప్పి నీకు చెప్పాల్సింది. కాని చెప్పలేకపోయాను.

నేను భయపడిందే జరిగింది. మీ ఇద్దరూ కలిసి తిరుగుతున్నట్లు నాకు చాలా ఆలస్యంగా తెలిసింది. గౌతమ్ ను అడిగితే అంతా అబద్ధం అని చెప్పాడు. నేను అతన్ని గుడ్డిగా నమ్మాను. ఆడది అనాదిగా నమ్ముతూనే ఉన్నది. మోసపోతూనే ఉన్నది.

అంతవరకూ చదివి రేణుక ఇక చదవలేను అన్నట్టు తలపట్టుకొని కూర్చుంది. ఐదు నిముషాల తర్వాత మళ్ళీ చదవసాగింది.

రేణూ! నాలుగురోజుల నుంచి నీకు ఈ విషయం రాయాలా వద్దా అని మధనపడి చివరికి నువ్వు కూడా నాలా మోసపోకూడదనే ఈ ఉత్తరం రాస్తున్నాను. ఈ ఉత్తరం అందేసరికి నేను శాశ్వతంగా ఈ ప్రపంచం నుంచి, ఈ కుళ్ళు ప్రపంచం నుంచి, ఈ దగాకోరు మనుష్యుల నుంచి వెళ్ళిపోతున్నాను. మళ్ళీ ఎవరెంతమొత్తుకున్నా తిరిగిరాని ప్రదేశానికి వెళ్ళిపోతున్నాను.

గౌతమ్ ని నువ్వు ప్రేమిస్తున్నావని నాకు తెలుసు. అతను నిన్ను ప్రేమిస్తున్నాడో లేదో నాకు సందేహమే.

నాలుగు రోజులనాడు మేము కలుసుకొనే మెరీనా బీచికి వెళ్ళాను. నువ్వు ఊళ్ళో లేవుగా? గౌతమ్ నాకంటే ముందే వచ్చి ఎదురు చూస్తున్నాడు. నేను ఏదో ఓ విషయం తేల్చుకుందామనే ఆ రోజు నిర్ణయించుకున్నాను. గౌతమ్ ను నిలదీసి అడిగాను. నువ్వు ఊరికివెళ్ళే రోజు గౌతమ్ నీకు సెండాఫ్ ఇవ్వడం చూశాను. ట్రైన్ కదిలే ముందు నీ చేతిని అందుకొని పెదవులకు ఆనించుకొనడం కూడా చూశాను. ట్రైన్ కదిలింది. నేనూ మా డాడి ఎవర్నో పంపించడానికి స్టేషన్ కు వచ్చాం. బయటికి వస్తున్నప్పుడు నన్ను చూసి బిత్తరపోయాడు. డాడీ ఉండటం వల్ల ఏమీ మాట్లాడలేకపోయాను. పది పదిహేను రోజులు నన్ను తప్పించుకు తిరిగాడు.

ఆరోజు బీచికి రాకపోతే అతని బండారం నీముందు పెడతానన్నాను. భయపడ్డాడు. అందుకే ఆ రోజు వచ్చాడు.

ఏమీ జరగనట్టే నటించాడు. ఎంత నటన.

నిలదీసి అడిగాను. మొదట బుకాయించాడు. ఆ తర్వాత నీతో తిరుగుతున్నట్టు అంగీకరించాడు.

రేణూ! ఇదంతా నా దురదృష్టం. అప్పటికే మా పరిచయం హద్దులు మీరింది. నువ్వు తెలివైన దానివి. దూరంగా ఉన్నావ్. అందువల్లనే అతని ఆకర్షణ నువ్వంటే రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది.

ఆడది లొంగిపోనంత వరకూ మగవాడు ఆడదాని చుట్టూ తిరుగుతాడు. ఆ తర్వాత ఆడదాన్ని నిర్లక్ష్యం చేస్తాడు. స్త్రీ ఒకసారి లొంగిపోయాక అతన్ని వదలలేదు. నా విషయంలో అదే జరిగింది. కష్టం సుఖం ఎరగనిదాన్ని, లోకం పోకడ తెలియనిదాన్ని. జీవితం అంటే రంగుల హరివిల్లు అని భ్రమపడేదాన్ని అందుకే మోసపోయాను. నాకు నెల తప్పింది.

ఆ మాటచెబితే ఏమన్నాడో తెలుసా?

"ఆ బిడ్డ నా బిడ్డేనని నమ్మకం ఏమిటి? నువ్వు ఎంతమందితో తిరిగావో!" అన్నాడు.

రేణూ అప్పుడు నాకు ఏమనిపించిందో తెలుసా? పరుగులు తీసి సముద్రగర్భంలో కలిసిపోవాలనిపించింది.

ఇంకా "నేను నిన్ను ప్రేమించడం లేదు. పెళ్ళికి ముందే హద్దులు మీరిన నిన్ను నేను వివాహం చేసుకోను. నువ్వు బంగారు బాతువు, డబ్బు ఉన్న దానివి. డబ్బున్న వాళ్ళంటే నాకు కసి. అందుకే నీతో తిరిగాను. నేను రేణుకను ప్రేమిస్తున్నాను. నీకు నాలాంటి వాళ్ళు ఎంతమంది అయినా దొరుకుతారు" అన్నాడు.

విన్నావా! రేణూ! గౌతమ్ అలా ప్రవర్తించి ఉంటాడని నీకు నమ్మబుద్ధి పుట్టడం లేదు కదూ? నువ్వే కాదు, కాలేజీలో ఎవరూ నమ్మరు. అతను చాలా తెలివైనవాడు. తన పాత్రను చక్కగా నటించాడు.

"నీచుడా! నీముఖం చూస్తేనే పంచపాపాలూ చుట్టుకుంటాయి?" అన్నాను.

అందుకు అతను ఒక విషపు నవ్వు నవ్వాడు.

నేను కోపంతో కసిగా కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళాను. యాక్సిడెంటు అయితే బాగుణ్ణు అనుకున్నాను. కాని క్షేమంగా ఇంటికి చేరాను.

మనసారా ప్రేమించినవాడికి నా సర్వస్వం సమర్పించాను. పైగా నేను గర్భవతిని అని తెలుసుకుంటే మమ్మీ, డాడీ ఎంత కృంగిపోతారో నాకు తెలుసు.

బాగా ఆలోచించి, నాలుగు రోజులు రాత్రింబవళ్ళు మధనపడి ఈ నిర్ణయానికి వచ్చాను.

నిద్రమాత్రలు వేసుకొని శాశ్వతంగా నిద్రపోతున్నాను.

రేణూ నువ్వయినా త్వరపడు. వెంటనే గౌతమ్ ను పెళ్ళిచేసుకో లేకుంటే నీకంటే అందమైన యువతి పరిచయం అయితే నిన్ను మోసం చేస్తాడు.

నువ్వయినా సుఖంగా ఉండు.

గుడ్ బై రేణూ!

ఇట్లు
నీ
సుధ"

రేణుక కళ్ళనుంచి ధారాపాతంగా కన్నీరు కారుతోంది. చేతిలోని కాగితాలు తడుస్తున్నాయి. అక్షరాలూ అల్లుకు పోతున్నాయ్.

గౌతమ్ ఇంత నీచుడా?

ఒక నిండు జీవితాన్ని బలిగొన్న పశువా?

సుధ రూపం కళ్ళముందు మెరిసింది.

పాపం! సుధ ఈ పాటికి చచ్చిపోయి ఉంటుంది. శ్రీమంతుల ఏకైక సంతానం. నిలువునా ప్రాణాలు తీసుకుంది.

ఆ తల్లిదండ్రులు కడుపులో చిచ్చు రగిలించి వెళ్ళిపోయింది.

ఇంత జరిగాక సుధ, తాను గౌతమ్ చేసుకొని సుఖంగా కాపురం చేస్తుందని ఎలా అనుకున్నది?

తన మూలంగానే ఒక నిండు ప్రాణం పోయింది.

తను హంతకురాలు, గౌతమ్ హంతకుడు.

పిచ్చిపిల్ల! ఈ సంగతి ముందే తనతోచెప్పి ఉండవచ్చుగా? ఆ తర్వాత తనే రంగంలో నుంచి తప్పుకొనేది.

గౌతమ్! అబ్బ ఆ పేరు ఉచ్చరించాలంటేనే అసహ్యం వేస్తున్నది.

అతని రూపం ఎంత భయంకరంగా కనిపిస్తున్నదో?

తను ముందెప్పుడూ పెళ్ళిచేసుకోకూడదని నిర్ణయించుకుంది. నాన్నకు కుటుంబ బాధ్యత తీసుకుంటానని మాట ఇచ్చింది.

రేణుక కళ్ళముందు వంటినిండా గాయాలతో, బేండేజీలతో మరణశయ్య మీద ఉన్న తండ్రి కన్పించాడు. తండ్రి మాటల్ని మననం చేసుకోసాగింది.

"తల్లీ నేను బ్రతకను"

"నాన్న!" తను బావురుమన్నది.

"ఏడవకమ్మా! నువ్వు ధైర్యంగా ఉండాలి" రెండు చేతులతో ముఖం దాచుకొని వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఏడవకు తల్లీ. నేను చెప్పేది విను, ఆలస్యం అయితే చెప్పలేకపోవచ్చును".

"చెప్పు నాన్నా! నన్నేం చెయ్యమంటావో చెప్పు" బెక్కుతూ అన్నది.

"నా మరణంవల్ల నీకు అన్యాయం జరుగుతుందని నాకు తెలుసమ్మా! నేను నిన్ను కోరబోయే కోరిక ఏ తండ్రీ తనబిడ్డను కోరకూడదు తల్లీ!"

"చెప్పు నాన్నా! మీకోసం ఏదైనా చేస్తాను. మీరు నన్ను ఎన్నో ఆశలు పెట్టుకొని పెంచారు. డాక్టర్ చదివించారు. ఏనాడూ నా కోర్కెను తిరస్కరించలేదు. చెప్పు నాన్నా!"

"నువ్వు నేను లేని లోటును తీర్చాలి తల్లీ! నలుగురు రెక్కలురాని పిల్లల్నీ, అమాయకురాలైన తల్లినీ నీకు వదిలేసి వెళ్ళిపోతున్నాను.

"నాన్న! నీకు నయం అవుతుంది. అలా అనకు!"

"మనిషి కోరుకున్నట్టే అన్నీ జరిగితే ప్రపంచంలో ఇంక దుఃఖం ఎందుకుంటుందమ్మా? నువ్వు నాకో మాట ఇవ్వాలి! అప్పుడే నా ఆత్మకు శాంతి..."

"చెల్లాయిల్నీ, తమ్ముళ్ళనూ పెంచి పెద్ద చేస్తాను. అమ్మను అపురూపంగా చూసుకుంటాను. ఆ విషయంలో నువ్వు బెంగపడకు నాన్నా!"

"నన్ను క్షమించగలవా తల్లీ!"

"క్షమించడం ఏమిటి నాన్నా! నన్ను డాక్టర్ను చేశారు. ఇంటికి పెద్ద బిడ్డను. నా బాధ్యతను నేను నిర్వహిస్తాను"

"అందుకు నువ్వు చాలా పెద్ద త్యాగమే చెయ్యాల్సి ఉంటుందమ్మా!"

"అది త్యాగం కాదు. అది నా బాధ్యత" ఖచ్చితంగా అన్నది రేణుక.

"అమ్మా రేణూ!" ఆపైన మాటలు పెగల్లేదు.

"నీకేం ప్రమాదం లేదు నాన్నా!"

తండ్రి కూతురి కళ్ళలోకి చూశాడు. ఆ కళ్ళలో ఎన్నో చెప్పాలనే ఆతృత ఉన్నది. కాని క్రమంగా మూతలు పడ్డాయి. కోమాలోకి జారిపోయాడు..."

అంతే మళ్ళీ కళ్ళు తెరవలేదు.

"నాన్నా! నాన్నా!" పెద్దగా అరిచాననుకుంది. కాని ఎవరో కంఠం నొక్కేసినట్టు ఆమె మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

"నన్ను ఎంత అన్యాయం చేసిపోయావు దేవుడో!" తల్లి ఏడుస్తోంది.

తల్లి రాగంతో రేణుక తృళ్ళిపడి ఈ లోకంలోకి వచ్చింది.

చేతిలో ఉన్న కాగితాలు కసిగా చించివేసింది. రెండు చేతులతో కాగితం ముక్కల్ని నలిపి లేచివెళ్ళి కిటికీలోనుంచి బయటికి పారేసింది.

అలసటగా వెళ్ళి మంచానికి అడ్డంగా పడింది. తల్లి ఏడుస్తున్నది. పడుకోబోయేముందు తల్లిపక్కన రోజూ కాసేపు కూర్చుని ధైర్యం చెప్పేది.

ఈ రోజు ఆమెకు ఆ ఓపిక లేనట్టు అన్పించింది.

తల్లి ఏడుస్తుంది. బాధకు మారు చిరాకు అనిపించింది.

కళ్ళు మూసుకుంది. నిద్రరావడం లేదు.

గౌతమ్...సుధారాణి...సుధారాణి...గౌతమ్... మార్చిమార్చి మూసుకున్న కళ్ళకు కన్పిస్తున్నారు.

ఈ ఇరవై రోజులుగా గౌతమ్ కు తన నిర్ణయాన్ని ఎలా వినిపించాలా అని మధనపడింది. ఇప్పుడు ఆ అవసరం కూడా లేకుండా పోయింది.

అతని ముఖంకూడా చూడాలని లేదు.

గౌతమ్ నిజంగా అలా ప్రవర్తించి ఉంటాడా?

లేకపోతే సుధారాణి ఆడపిల్ల ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమిటి?

అందుకే అంటారు అతి వినయం ధూర్త లక్షణం అని...

కాని గౌతమ్ లో అతి వినయం లేదు. వినయంగా కన్పిస్తాడు. అవసరం అయితే చాలా గట్టిగానే ఏ పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కోగలిగిన గుండె నిబ్బరం ఉన్నది.

చిన్న చెల్లెలు నిద్రలో "నాన్నా!నాన్నా"! అంటూ ఏడుస్తున్నది.

రేణుక చివ్వున మంచం దిగింది.

సరళ ను ఎత్తుకొని బుజ్జగిస్తూ తన మంచం దగ్గరకు వచ్చింది. తన పక్కన పడుకోబెట్టుకొని చిచ్చి కొడుతూ తనూ నిద్రలోకి జారిపోయింది.

## 11

రేణుక కాలేజీకి వచ్చింది.

అలా వస్తున్నట్టు గౌతమ్ కు ఉత్తరం రాయలేదు. గౌతమ్ రాసిన ఉత్తరాలకు సమాధానం కూడా రాయలేదు.

ఆసుపత్రిలో ఎదురుగా రేణుక. ఓ క్షణం గౌతమ్ ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయాడు.

"ఎప్పుడొచ్చావ్?"

"ఉదయం"

"సారీ! రేణూ! మరీ అలా అయిపోతే పోయినవాళ్ళు వస్తారా?" నువ్వు ధైర్యంగా ఉండాలి.

రేణుక ఉలకలేదు పలకలేదు.

"నా ఉత్తరాలు అందాయా?"

తల ఊపింది.

మరో ప్రశ్నకు అవకాశం ఇవ్వకుండా రేణుక గబగబా తన వార్డులోకి వెళ్ళిపోయింది.

రేణుక ప్రవర్తన గౌతమ్ కు అర్థంకాలేదు. ఆమె వెళ్తున్న వైపు చూస్తూ నిల్చుండిపోయాడు.

ఆత్మీయుల్ని చూసినప్పుడు అణుచుకున్న దుఃఖం కట్టలు తెంచుకొని వెల్లువై ప్రవహిస్తుంది. ఆసుపత్రిలో డాక్టరై ఉండి ఏడవడం బాగుండదు. అందుకే అలా వెళ్ళిపోయింది. మనసు సముదాయించుకుంటూ తన పనిలో మునిగిపోయాడు.

సాయంత్రం రేణుకను కలుసుకోవడానికి హాస్టల్ కు వెళ్ళాడు.

ఆరోగ్యం బాగాలేదనీ, నిద్రపోతున్నదనీ కబురు వచ్చింది.

రెండో రోజు కూడా ఆసుపత్రిలో రేణుక గౌతమ్ ను తప్పించుకొని తిరగసాగింది.

గౌతమ్ కు ఆమె ప్రవర్తన అర్థంకాలేదు. రెండు మూడు రోజులు గౌతమ్ కూడా చూసీ చూడనట్టే నటించాడు. అయినా రేణుక ప్రవర్తనలో ఎలాంటి మార్పు కన్పించలేదు.

అయితే సుధారాణి విషయంలో తనను అపార్థం చేసుకున్నదన్నమాట! ఈ విషయంలో ఆడవాళ్లంతా ఒకలాగే ప్రవర్తిస్తారు. చదువుకున్నవాళ్ళూ, చదువులేనివాళ్ళూ కూడా ఒకేలా ప్రవర్తిస్తారు. అసలు ఆడవాళ్ళకు చెప్పుడు మాటలంటే ఎందుకో ప్రీతి! రేణుక కూడా ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తుందని తను కలలో కూడా ఊహించలేదు. తనమీద అనుమానం కలిగితే అసలు విషయం నిలదీసి అడిగి తెలుసుకోవచ్చుగా?

గౌతమ్ కు కోపం వచ్చింది. రోషం వచ్చింది. అతని అభిమానం లోతుగా గాయపడింది. అసలు విషయం ఏమిటో తేల్చుకోవాలనే పట్టుదల బయలుదేరింది.

వారం తర్వాత తాడోపేడో తెల్చుకోవాలన్నట్టు ఒకనాటి సాయంత్రం హాస్టల్ కు వెళ్ళాడు. విజిటర్స్ గదిలో కూర్చున్నాడు.

"రేణుకమ్మగారికి తలనొప్పిగా ఉందట!"

"ఫర్వాలేదు. తలనొప్పేగా? రమ్మని చెప్పు ఆమె వచ్చేంతవరకు నేను వెళ్ళనన్నానని చెప్పు!" కోపంగా అన్నాడు గౌతమ్.

పదిహేను నిముషాల తర్వాత రేణుక వచ్చి గడపలో నిల్చుంది. కళ్ళు ఉబ్బి ఉన్నాయ్.

ఆమె రూపం చూడగానే గౌతమ్ కోపం మంచుముక్కలా కరిగి పోయింది.

"రేణూ! ఏడుస్తున్నావ్? ఎంతకాలం అలా ఏడుస్తూ ఉంటావ్?" నువ్వు డాక్టర్ వి. మరొకరికి ధైర్యం చెప్పడం మన వృత్తి ధర్మం" రేణుక మాట్లాడలేదు.

"కూర్చో!"

రేణుక యాంత్రికంగా ఖాళీగా ఉన్న కుర్చీలో...గౌతమ్ కు దూరంగా ఉన్న కుర్చీలో కూర్చుంది.

"వెళ్ళి బట్టలు మార్చుకొనిరా! బీచ్ కి వెళ్దాం!"

రేణుక చివ్వున తలెత్తి చూసింది. ఆ చూపులు ఇష్టంలేని వస్తువును దేన్నో అనుకోకుండా చూసినట్టున్నాయ్.

"ఏమిటి అలా చూస్తున్నావ్?"

"నేను ఎక్కడికీ రాను!"

"ప్లీజ్ !"

"సారీ!" ఖచ్చితంగా పలికింది.

గౌతమ్ రేణుక ముఖంలోకి లోతుగా చూశాడు.

తండ్రి పోయిన దుఃఖం వల్ల కలిగిన మనో క్లేశం మాత్రమే కాదు. ఆమె చూపుల్లో కన్పిస్తున్నది. తనమీద అసహ్యం కన్పిస్తోంది. అంటే... అంటే వచ్చీ రాకముందే ఎవరో సుధారాణి కథ విన్పించారన్న మాట! గౌతమ్ కు వళ్ళు మండిపోయింది.

"నువ్వు వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. నీ ధోరణి వింతగా ఉన్నది. నన్ను తప్పుకు తిరగాలని ప్రయత్నిస్తున్నావ్. ఇష్టంలేని వాళ్ళ చుట్టూ తిరుగుతూ వాళ్ళకు న్యూసెన్స్ అయ్యేవాణ్ణి కాను. నీకు ఇష్టం లేకపోతే చెప్పు. మళ్ళీ నీకు ఎదురుగా కూడా రాను."

రేణుక తల వంచుకొని ఉన్నది. ఆమె ముఖంలో కదిలే భావాలు గౌతమ్ కు కన్పించడం లేదు.

"కాని నాకు కారణం వినాలని ఉంది. అందుకే ఇవాళ వచ్చాను."

రేణుక నుంచి సమాధానం లేదు.

"నువ్వు కూడా నమ్ముతున్నావా?"

"ఏమిటి?" చివ్వున తలెత్తింది రేణుక.

"అదే నేను సుధను మోసం చేశానని!"

కళ్ళుండీ వాస్తవాన్ని చూడలేనంత అమాయకురాల్ని కాదు."

"ఓహో! అలాగా?" వ్యంగ్యంగా వుంది గౌతమ్ కంఠం.

రేణుకకు వళ్ళు మండిపోయింది.

"కుష్టురోగి శరీరంలోని ఒక్కొక్క భాగమే కుళ్ళి రాలిపోతున్నా బతకాలని తాపత్రయ పడ్తాడు! ఎందుకు? ప్రాణికి బ్రతుకు మీద ఉండే తీపి గురించి నీకు నేను చెప్పనక్కర్లేదు. సుధ శ్రీమంతుల బిడ్డ. ఏ కష్టం లేదు. అలాంటి సుధ ప్రాణం తీసుకోవడానికి ఊరికే ప్రయత్నించిందని నన్ను నమ్మమంటావా?" తీవ్రంగా అడిగింది రేణుక.

గౌతమ్ రేణుక ముఖంలోకి వెర్రివాడిలా ఓ క్షణం చూశాడు.

"చెప్పు సమాధానం! ఒకవైపు సుధను మోసం చేశావ్. మరో వైపు నీ బండారం బయట పడ్డాక కూడా ఇంకా నన్ను నమ్మించాలనే చూస్తున్నావ్!"

"రేణూ!"

"నా పేరు రేణుక!"

"సారీ! చూడండి రేణుకా దేవిగారూ! మీరు విన్నది, ఊహించేది అంతా అబద్ధమే. కళ్ళుండీ ఎదురుగా కన్పించే వస్తువును చూడకుండా కళ్ళు మూసుకొని మరోదాన్ని చూడటానికి ప్రయత్నిస్తున్నారు"

"చనిపోయే ముందు ఎంత దుర్మార్గుడు కూడా అబద్ధం చెప్పడు"

"అవును! నేను అలాగే అనుకుంటూ ఉండేవాణ్ణి"

"సుధ నాకు అన్ని విషయాలూ రాసింది"

"సుధ ఉత్తరం రాసిందా?"

"ఆ అవును! నాకు అంతా తెలుసు. నన్ను మాటలతో మభ్యపెట్టటానికి ప్రయత్నించావు"

"నేను బహువచనంలో సంబోధిస్తున్నాను"

"సారీ!" అన్నది రేణుక.

"ఫర్వాలేదులే. మీ మాటలు మీరే మర్చిపోయారు. అందుకే గుర్తుచేశాను"

రేణుక మాట్లాడలేదు.

"నేను ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాను నమ్మితే నమ్ము సుధ బతికే ఉందిగా? వెళ్ళి మాట్లాడక పోయావ్!"

"ఏ ముఖం పెట్టుకొని....."

"మధ్యలో నువ్వేం చేశావ్?"

"ఆమె ప్రేమిస్తున్నవాణ్ణీ...."

"ఆగు! నువ్వు విన్నది అబద్ధం! ఆమె రాసింది అబద్ధం! నువ్వు ఊహించుకుంటున్నది.

అబద్ధం! సుధకు నామీద ప్రేమ ఉంది అనడం అబద్ధం! నేను ఆమెను ప్రేమించానని చెప్పడం అన్నింటికంటే పెద్ద అబద్ధం! ఆమెను నేను మోసం చేశానని చెప్పడాన్ని ఏమనాలో నాకు బోధపడటం లేదు."

"అబద్ధం...అబద్ధం...అబద్ధం...అన్నీ అబద్ధాలే! అయితే సుధ ఆత్మహత్యకు ఎందుకు పాల్పడింది"

"ఈర్ష్య! నేనంటే కాదు...నువ్వంటే ఈర్ష్య? ఈర్ష్య ప్రేమకంటే బలమైంది. ఆమెకు ఏంకావాలో ఆమెకే తెలియదు. ఇలాంటివారు ప్రపంచం అంతా తమచుట్టూనే తిరుగుతుందని భ్రమలో బ్రతుకుతారు. ఆ ప్రపంచం తమ చుట్టూ తిరగడం లేదు... మరొకరి చుట్టూ కూడా కొంత ప్రపంచం తిరుగుతుందనే  నిజాన్ని వారు భరించలేరు. ఎలాగయినా ఆ ప్రపంచాన్ని కూడా తమ చుట్టూనే తిప్పుకోవాలని ప్రయత్నిస్తారు. ప్రయత్నం ఫలించకపోతే వారిలోని ఈర్ష్య ద్వేషంగా మారుతుంది. ఆ ద్వేషం ప్రతీకారాన్ని కోరుతుంది. అప్పుడు వాళ్ళు ఏం చేస్తున్నారో వాళ్ళకే తెలియదు" ఆపి ఓ క్షణం రేణుక ముఖంలోకి చూశాడు.

రేణుక అతనినే చూస్తోంది నిర్వికారంగా చూస్తున్నది.

"నేను చెబుతున్నది వింటున్నారా రేణుకా దేవిగారూ!"

"చెప్పండి"

"నేను ఎప్పుడూ సుధారాణితో మాట్లాడలేదు. ఆమెకు నా మీద ప్రత్యేకమైన అభిమానం కూడా ఏమీలేదు. నేను బీదవాణ్ణి. నా గురించి ఆమె ఎప్పుడూ ఆలోచించి కూడా ఉండి ఉండదు. నువ్వంటే నాకు ఇష్టం అని ఎలాగో ఆమెకు అర్థం అయింది. చాలా తెలివైనది. చదువు మీద ధ్యాస ఆమెకు ఏనాడూ లేదు. సరదా కోసం చదువుతోంది. ఇలాంటి విషయాల మీద ఆమె తెలివితేటల్ని కేంద్రీకరిస్తుందను కుంటాను. ఆ తర్వాత మన మధ్య చనువు ఏర్పడింది. మనం బయట కూడా తిరుగుతున్నాం. అప్పుడు ఆమె నన్ను పరిశీలించి చూడసాగింది. తనకు తెలియకుండానే ఆకర్షణను పెంచుకుంది. అది కేవలం నీ మీద ఈర్ష్య వల్ల కలిగే ఆకర్షణే! ఒకటి రెండుసార్లు నాతో ముఖాముఖి మాట్లాడటానికి ప్రయత్నించింది. నేను ముభావంగా సమాధానం చెప్పి ఉండిపోయాను"

"అబద్ధం! నేను నమ్మను"

"అది మీకర్మ! దానికి నేను బాధ్యుణ్ణికాను. నేను చెప్పేది ముందు పూర్తిగా వినండి"

కటువుగా ఉన్నది గౌతమ్ కంఠం.

"ఆమె అహం దెబ్బతిన్నది. శ్రీమంతుల ఇంట్లో అల్లారు ముద్దుగా పెరిగింది. తన చుట్టూ తిరగవలసిన ప్రపంచం తాలూకు ముక్క ఒకటి మరొకరి చుట్టూ తిరుగుతోంది. అది ఆమె సహించలేక పోయింది. ఈర్ష్య ద్వేషంగా మారింది. ప్రతీకారం తీర్చుకోవాలనుకుంది. కసి... కసి... భరింపలేని కసి ఆమెలో బయలుదేరింది. ఏదో చెయ్యాలి? ఎవర్నో కాటు వెయ్యాలి. అప్పుడు కాని ఆ విషానికి అవుట్ లెట్ ఉండదు. ఆ విషాగ్నిలో నుంచి తను బయటపడదు. అందుకే నిద్రమాత్రలు తిన్నది. చావాలని తిన్నదని నేను అనుకోను."

"గౌతమ్!"

"గారూ!"

"సారీ!"

"వినండి! కసి తీర్చుకోవాలి. ఎవరిమీద? నా మీద! కాదు నీమీద! నీకు నేను దూరం అయితే గాని నువ్వు బాధపడవు. ఆమెకు కసి నామీద కంటే నీమీదే ఎక్కువ"

"ఎలా తెలుసు?"

"అదే సైకాలజీ! శరీరాల్ని కొయ్యడం మాత్రమే కాదు మనం మనసుల్ని కూడా కోసి మానవ మనోభావాలను అర్థం చేసుకోవాలి. మనుషుల్ని కొయ్యడం అంటే కత్తితో కొయ్యడం కాదని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదనే అనుకుంటున్నాను"

"ఆ మాత్రం అర్థం చేసుకొనే బుర్ర నాకూ ఉంది?"

"నిజంగా?" తెచ్చిపెట్టుకున్న ఆశ్చర్యంతో వ్యంగ్యంగా అన్నాడు గౌతమ్.

రేణుక వళ్ళు మండిపోయింది. గౌతమ్ తనను అవమానిస్తున్నాడు అతనికి ఆ హక్కు ఎవరిచ్చారు?

"నన్ను అవమానించే హక్కు మీకెవరిచ్చారు?"

"కొన్ని హక్కులు వాటంతటవే సంక్రమిస్తుంటాయి"

రేణుక మాట్లాడలేదు.

"వినండి. ఆమె చావాలని ఆ మాత్రలు వేసుకోలేదు. డాక్టర్ చదువుతున్న ఆమెకు ఆ కొద్ది మాత్రలకు ఎవరూ చనిపోరని తెలుసు. పైగా ఆ వేసుకున్న మాత్రలు "కాం పో జ్". పైగా అన్నం తినకముందు వేసుకుంది. అన్నానికి పిలవడానికి వచ్చినవాళ్ళు చూస్తారని తెలుసు. అలాగే జరిగింది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. నేను తన ఆత్మహత్యకు కారణం అయినట్టు ఉత్తరం రాసిపెట్టింది. కేవలం అల్లరి చెయ్యడానికే! నీకు ఉత్తరం రాసింది. మెడికల్ రిపోర్టులో అది అబద్ధం అనే తేలింది. నామీద కేసును ఆమె తండ్రి రద్దు చేసుకున్నాడు. నన్ను క్షమాపణ కూడా అడిగాడు.

ఆమె కాలేజీకి ఎందుకు రావడంలేదు? మొహం చెల్లక! తన తప్పు తను గ్రహించింది. కాని దాని తాలూకు నీలినీడలు మాత్రం మన జీవితాలను చుట్టేశాయ్"

రేణుక గౌతమ్ ముఖంలోకి బేలగా చూసింది. గౌతమ్ ఆమెకేసి చూడటం లేదు. గంభీరంగా మంద్రస్థాయిలో తనకుతానే చెప్పుకుంటున్నట్టు మాట్లాడుకుపోతున్నాడు.

"ఇదంతా చెప్పి నిన్ను నమ్మించాలని కాదు. నిజం చెప్పకుండా ఉండలేకనే ఏనాటికైనా నిజం తెలిసి, గౌతమ్ ఆనాడే నిజంచెప్పి ఉంటే ఎంత బాగుండేదని నువ్వు...సారీ! మీరు బాధపడకుండా ఉండటానికే...ఇంత కంఠశోష పడుతున్నాను. అంతేగాని... నువ్వు నన్ను అసహ్యించుకుంటున్నా నీవెంటబడి, నీకు న్యూసెన్సు అవుతానని మాత్రం భావించవద్దు.

నేను నిన్ను అమితంగా ఆరాధించాను. అయినా నీకంట పడలేదు. పెద్దగా చొరవ కూడా తీసుకోలేదు. కారణం నేను బీదవాణ్ణి. నువ్వు చొరవ చూపించావు. ఆ తర్వాత మనం దగ్గిరకు వచ్చాం. నువ్వు దూరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చి వుంటే అలాగే ఉందాం! వస్తాను. శెలవు!"

రెండు చేతులూ ఎత్తి నమస్కరించి లేచి నిలబడ్డాడు గౌతమ్.

రేణుకకు ఎవరో నొక్కుతున్నట్టు అయింది. ఏదో అనాలనుకుంది. చూస్తూనే ఉండిపోయింది.

"వస్తాను"

గౌతమ్ చరచరా బయటికి నడిచాడు "గౌతమ్" రేణుక బలవంతంగా గొంతు పెగల్చుకొని అరిచింది.

అప్పటికే గౌతమ్ హాస్టల్ గేటు దాటుతున్నాడు.

ఆమె పిలుపు అతనికి అందలేదు.

## 12

"రేణూ! గౌతమ్ నీతో మాట్లాడటం లేదా?"

రేణుక మంచంమీద కూర్చొని లాలింపుగా అడిగింది వాణి. రేణుక అప్పటికే దిండులో ముఖం దూర్చి వెక్కివెక్కి ఏడుస్తోంది.

"నువ్వు గౌతమ్ మనసు గాయపర్చావా?"

రేణుక సమాధానం లేదు.

"సుధ సంగతి నాకు బాగా తెలుసు. నువ్వంటే ఆమెకు చాలా ఈర్ష్య. గౌతమ్ అంటే అభిమానం కంటే అతను నిన్ను అభిమానిస్తున్నాడన్న ఈర్ష్య ఎక్కువగా ఉండేది. అందువల్లనే గౌతమ్ తనవాణ్ణిగా చేసుకోవాలనే పట్టుదల వచ్చింది. అది సాగలేదు. అందుకే కసి తీర్చుకోవడానికి అటువంటి నీచానికి వడిగట్టింది"

రేణుక చివ్వున కూర్చుంది. ప్రశ్నార్థకంగా తడికళ్ళతో వాణి ముఖంలో చూసింది.

"సుధ నాతో షర్తు కట్టింది"

"షర్తా! ఏమని?" బొంగురు కంఠంతో అడిగింది.

వాణి ఆనాడు తనకూ సుధకూ జరిగిన సంభాషణ వినిపించింది.

రేణుక వాణి ముఖంలోకి పిచ్చిచూపులు చూసింది.

"అవును! రేణూ గౌతమ్ మంచివాడు. అతను నిన్నే ఆరాధిస్తున్నాడు.సుధ విసిరిన రంగుల వలకేసి కన్నెత్తి కూడా చూడలేదు"

"వాణీ!" మళ్ళీ బావురుమన్నది రేణుక.

"ఛా! ఎందుకు ఏడుస్తావ్? అసలే తండ్రిపోయి బాధపడుతున్న నీకు సుధ తీరని అన్యాయం చేసింది. ఊర్కో! ఇప్పటికైనా తెలిసిందిగా!"

"ఇక గౌతమ్ నా ముఖం చూడడు. నువ్వు ముందే నాకీ విషయం చెబితే ఎంత బాగుండేది?"

"నేను శెలవు తీసుకొని ఊరికి వెళ్ళాను. నువ్వు వచ్చేసరికి నేను లేను. ఈలోగా పరీక్ష ప్రాక్టికల్ తప్పడం...కొన్ని కారణాల వల్ల ఇంటి దగ్గిరే ఉండిపోవాల్సి రావడం జరిగింది. పరీక్షలకు వచ్చాక తెలిసింది. ఎంతకాలంగా గౌతమ్ నీతో మాట్లాడటం లేదు."

"ఆరు నెలలైంది"

వాణి ఆలోచిస్తూ ఉండిపోయింది.

"గౌతమ్ నన్ను క్షమిస్తాడా?"

"ఎందుకు క్షమించడూ? అతనితో మనసువిప్పి అన్ని విషయాలూ మాట్లాడు"

"మాట్లాడి ప్రయోజనం లేదు"

"అదేమిటి?"

"ఎటూ అతన్ని నేను పెళ్ళిచేసుకొనే స్థితిలో లేను. మళ్ళీ లేనిపోని ఆశలు కల్పించడం నాకు ఇష్టం లేదు"

వాణి రేణుకను పిచ్చిదాన్ని చూసినట్టు చూసింది.

"ఎందుకు గౌతమ్ ను పెళ్ళిచేసుకోలేవు? మరో సంబంధం మీ పెద్దవాళ్ళు కుదిర్చారా?"

"లేదు వాణీ! ఈ జన్మకు నాకు పెళ్ళి జరగదు"

వాణి రేణుక ముఖంలోకి అయోమయంగా చూసింది.

"అదేమిటి?"

"నాన్నకు మాట ఇచ్చాను"

"ఏమని?"

"ఇంటి బాధ్యతను తీసుకొంటానని!"

"దానికీ పెళ్ళికీ సంబంధం ఏమిటి?"

"పెళ్ళి చేసుకుంటే నా చెల్లెళ్ళ బాధ్యతా, తమ్ముళ్ళ బాధ్యతా నెత్తిన వేసుకోవడం వీలయ్యే పనికాదు"

"అందుకని నీ జీవితాన్ని...."

"నాశనం చేసుకోను. సార్థకం చేసుకుంటాను. ఇది త్యాగం కాదు, నా బాధ్యత"

"ఏమో నీతో నేను ఏకీభవించలేకున్నాను. ఆ విషయం గౌతమ్ తో చర్చించడం మంచిదని నా అభిప్రాయం. కనీసం నీమనసులో అతనంటే అసహ్యం లేదని అతనికి తెలియచెప్పు. అతను నిరపరాధిగా నువ్వు నమ్ముతున్నట్టు అతనికి తెలియాలి. నువ్వు ఈరోజే గౌతమ్ ను కలుసుకొని అన్ని విషయాలూ అరమరిక లేకుండా చెప్పు"

రేణుక ఆలోచిస్తూ కూర్చుంది.

"నేను వెళ్తున్నాను. ఇవాళ్టినుంచి ఆసుపత్రికి రాకు. శెలవు తీసుకో, నేను గౌతమ్ కి నువ్వు సాయంకాలం రమ్మన్నావని చెబుతాను"

"రాడు!"

"నీకెందుకు? అతను వచ్చేలా నేను చేస్తానుగా! నువ్వు రెస్టు తీసుకో!" అంటూ వాణి వెళ్ళిపోయింది.

రేణుక వాణి వెళ్ళినవైపు చూస్తూ "గౌతమ్ వస్తాడా? గౌతమ్! నన్ను క్షమించగలడా?" మనసులోనే మళ్ళీ మళ్ళీ అనుకున్నది.

రేణుక తల వంచుకొని ఇసుకలో పిచ్చిపిచ్చి గీతలు గీస్తున్నది. ఆ గీతలు గీచే తీరులో ఆమెలోని మానసిక అశాంతి స్పష్టంగా కన్పిస్తోంది.

గౌతమ్ గంభీరంగా ఆలోచిస్తూ ఉవ్వెత్తున లేచి ఎగిరి పడుతోన్న సముద్రపు అలల్ని చూస్తున్నాడు.

"చెప్పు గౌతమ్! నా నిర్ణయం సరైంది కాదా? చావు బ్రతుకుల్లో ఉన్న నాన్నగారికి యిచ్చినమాట నిలబెట్టుకోవడం నా విధి కాదా?"

గౌతమ్ చివ్వున తలతిప్పి రేణుక కేసి చూశాడు.

"నీ నిర్ణయం సరైంది కాదని ఎవరు అనగలరు? అది నీ బాధ్యత"

అశాంతిగా ఇసుక మీద కదులుతున్న రేణుక వేళ్ళు ఆగిపోయాయి. చివ్వున తలెత్తి గౌతమ్ ముఖంలోకి చూసింది. రిలీఫ్ గా నిట్టూర్చింది.

"నిజంగా? నువ్వంటున్నది నిజమేనా?"

"అబద్ధం... అదీ నీ దగ్గిర ఆడాల్సిన అవసరం నాకేముంది? నీ పరిస్థితిలో నేను ఉన్నా అదే చేస్తాను"

రేణుక గౌతమ్ ముఖంలోకి సంతృప్తిగా చూసింది.

"కాని...." ఆగిపోయాడు గౌతమ్.

"ఆగిపోయావేం? చెప్పు!"

"నేను పెళ్ళి మాత్రం మానుకోను. అంత త్యాగం నేను చెయ్యను. కుటుంబ బాధ్యత కోసం పెళ్ళి మానుకోవలసిన అవసరం లేదు"

"నువ్వు మగవాడివి. నా సంగతి వేరు. స్త్రీ వివాహం చేసుకున్న తర్వాత పుట్టింటి బాధ్యతను నిర్వహించడం అసంభవం!" అన్నది రేణుక.

"అవున్లే. మీ చెల్లెళ్ళనూ, తమ్ముళ్ళనూ చదివించాలి. పెంచి పెద్ద చెయ్యాలి"

"అవును!"

"ఆ తర్వాత ఆ పిల్లల పిల్లలకు కావల్సినవి చూడాలి. మళ్ళీ వాళ్ళను..."

"ప్లీజ్ అలా మాట్లాడకు!"

"ఆ తర్వాత ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. వృద్ధాప్యంలో నువ్వు ఒక్క దానివి..."

"ప్లీజ్ గౌతమ్!" దాదాపు అరిచినట్టే అన్నది రేణుక.

"ఊహించడానికే అంత భయంకరంగా ఉన్న నీ భవిష్యత్తు గురించి...అందుకే ఆలోచించుకోమంటున్నాను. కుటుంబ బాధ్యతను నిర్వహించవద్దు అని నేను చెప్పడం లేదు. మీ వాళ్ళను గాలికి వదిలెయ్యమనడం లేదు. కాని అందుకోసం అవివాహితగానే ఉండిపోతాననే నిర్ణయం తీసుకోవడమే తెలివితక్కువ తనం అంటున్నాను. తర్వాత పశ్చాత్తాప పడతావంటున్నాను..."

"నేను పెళ్ళి చేసుకుంటే నాలో స్వార్థం చోటు చేసుకోకమానదు. నాకూ పిల్లలు పుడతారు. నా భర్తా, నా సంసారం అనే వ్యామోహంలో పడిపోతాను. అప్పుడు నాన్న స్థానాన్ని నేను భర్తీ చెయ్యలేను. నా మీద నాకే నమ్మకం లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను"

గౌతమ్ ఆలోచిస్తూ మునివేళ్ళతో ఇసుకను తవ్వుతున్నాడు.

"గౌతమ్! నువ్వు ఒక మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకో"

"ఆ విషయంలో నీ సలహా అడిగినప్పుడు చెప్పు! ఇప్పుడు అక్కర్లేదు"

"నన్ను క్షమించు గౌతమ్!"

"ఓ క్షమించేశాను" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు గౌతమ్. ఆ నవ్వు ఎంతో పేలవంగా కన్పించింది రేణుకకు.

"రేణూ! నీ నిర్ణయానికి నేను అడ్డురాను. నీకోసం ఎంతకాలం ఎదురు చూడమంటావో చెప్పు!"

"గౌతమ్!" దాదాపు ఏడుస్తూనే అన్నది.

"ఎందుకు ఏడుస్తావ్? ఇది సెంటిమెంట్సుకు సమయం కాదు. మనం వివేకంతో ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి"

"మా చిన్న చెల్లెకి ఇప్పుడు ఆరో సంవత్సరం. కనీసం నా బాధ్యతలన్నీ పూర్తి అయ్యేసరికి మరోపది పన్నెండేళ్ళు పట్టవచ్చును. అప్పటి వరకూ నా కోసం నిన్ను అవివాహితుడిగా ఉండమనడం..."

"నువ్వు అనడం లేదు. నేనే ఉంటానంటున్నాను. అదీ నీకోసం కాదు. నాకోసమే. నువ్వు నాకు కావాలి. నా ఆనందం కోసం! ఓకే, పది పన్నెండేళ్ళేగా? నాకు అమెరికా వెళ్ళే అవకాశం వచ్చేలా ఉంది. త్వరలోనే వెళ్ళిపోతాను. నేను ఎక్కడ ఉన్నా నీకు నా అవసరం ఉన్నదనుకున్నప్పుడు రెక్కలు కట్టుకొని వచ్చి నీ ముందు వాల్తాను. ఓకే! ఇక లే! వెళ్దాం!" తలమీద మృదువుగా చెయ్యి వేసి లాలింపుగా నిమిరాడు అదోలా నవ్వుతూ గౌతమ్.

"గౌతమ్!" అంటూ అతని చేతులు రెండూ పట్టుకొని బావురుమన్నది రేణుక.

"ఛ! ఏమిటిది? నువ్వు మంచి నిర్ణయాన్ని తీసుకున్నావ్. సంతోషంగా నిర్వహించాలి. కాని ఇలా ఏడుస్తూ...

"అందుకు కాదు..నాకోసం కాదు"

"మరి నా కోసమా?" పకపకా నవ్వాడు గౌతమ్.

"లే! డోంట్ బి సిల్లీ!" అంటూ రేణుకను చెయ్యి పట్టుకొని లేవదీశాడు గౌతమ్.

## 14

రేణుక రిక్షా దిగింది.

చాలా అలసటగా లోపలకు అడుగుపెట్టి యాంత్రికంగా వరండా గడపలోనే ఆగిపోయింది.

లోపల తల్లీ, పెద్ద తమ్ముడు రామూ ఘర్షణ పడుతున్నారు.

"ఏమిట్రా నువ్వనేది? నీకు కొంచెం అయినా బుద్ధి ఉందా? కృతజ్ఞత ఉందా? మాట్లాడవేంరా? ఇది నీకు న్యాయంగా ఉందా?"

"ఏమిటమ్మా నీగోల? నేను పెళ్ళి చేసుకుంటే ఎవరికో అన్యాయం జరిగిపోతున్నట్టు అరుస్తావేమే?" విసుగ్గా ఉంది రాము గొంతు.

"ఒరేయ్!ఒరేయ్! ఎంత మాటన్నావురా? ఎవరికో అన్యాయమా? ఎవరో కాదురా! అదీ నీ అక్క! ఇంటికి పెద్దబిడ్డ. మీకోసమే అది పెళ్ళీ పెటాకులు లేకుండా ఉండిపోయింది.

"నేను ఉండమన్నానా? అందుకని నేనూ పెళ్ళీ పెటాకులు లేకుండా ఉండిపోవాలా?"

"నోరు ముయ్యరా! మరీ పెద్దా చిన్నా లేకుండా ఎంతమాట పడితే అంత మాటంటున్నావ్?"

"నువ్వే నన్ను రెచ్చగొడ్తున్నావ్?"

రేణుక దర్వాజాను గట్టిగా పట్టుకొని నిల్చుంది. కాళ్ళలో సత్తువలేనట్టు నిల్చుంది.

"ఆయన దారిన ఆయన వెళ్ళిపోయాడు. ఇటువంటివన్నీ చూడమని నన్ను వదిలేసి వెళ్ళాడు. అది లేకపోతే అందరం అడుక్కు తినేవాళ్ళంరా? బిడ్డ ఎంత కష్టపడి సంపాదించి మిమ్మల్ని ఇంత వాళ్ళను చేసిందో ఆలోచించు! అది తన మానాన తను పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే, నువ్వు ఇంత చదువు చదివేవాడివా! ప్రిన్సిపాల్ నీకు తన కూతుర్ని ఇచ్చేవాడా? ఆ పిల్ల నిన్ను చేసుకొనేదా? మెట్రిక్ చదివి ఏ గుమాస్తాగానో పని చేస్తుండే వాడివి ఈ పాటికి!" దగ్గు తెర ఆమె వాగ్ధోరణికి అడ్డుపడింది.

రాము తలవంచుకొని నిల్చున్నాడు.

తల్లి ఖళ్ళు ఖళ్ళున దగ్గుతూ ఉన్నది.

రేణుకనూ ఎవరూ చూడలేదు.

రాము పెళ్ళిచేసుకుంటాననంటున్నాడా? అయితే తను విన్నది నిజమే నన్నమాట!

ప్రిన్స్ పాల్ గారి అమ్మాయి ఉషతో తిరుగుతున్నాడని చెప్పారు. కాని తను నమ్మలేకపోయింది. రాము నిదానంగా ఉంటాడు. తన కళ్ళకు ఇంకా పసివాడిగానే కన్పిస్తాడు. అవును! రాముకు ఇరవై రెండోఏడు కూడా వచ్చింది. ఎం.ఏ. రెండో సంవత్సరం చదువుతున్నాడు.

తల్లి ఖాండ్రించి పక్కనే ఇసుకలో ఉన్న డబ్బాలోకి ఊసింది.

రేణుక ఆలోచనల నుంచి బయటపడింది.

"నీ పెళ్ళికి తొందరేం వచ్చిందిరా! నువ్వు ఎం.ఏ. పాసయి ఉద్యోగంలో చేరు. కొంతకాలం ఇంటి బాధ్యత నువ్వు తీసుకో. నీకు ఉద్యోగం రాగానే అక్క పెళ్లి చేస్తాను. ఆ తర్వాత"

రాము చివ్వున తలెత్తి తల్లి ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు.

రేణుక తనలో తనే నవ్వుకుంది.

అమ్మ తనకు పెళ్ళి చేస్తుందా? ఇంకా తనను పెళ్ళికావాల్సిన పిల్లగానే భావిస్తుందా? తల్లి మనసు!

"ఏమిట్రా అలా చూస్తావ్?"

"అక్కయ్యకు నువ్వు పెళ్ళి చేస్తావా?"

"ఏంరా! ఏం? ఎందుకు చెయ్యకూడదూ? అదేం ముసల్ది అయిపోయిందా? దానికి పెళ్ళి చేసుకొనే వయసు మళ్ళీ పోయిందా?"

"అది కాదమ్మా! అక్కయ్యకు తగినవాణ్ణి నువ్వెక్కడ చూస్తావమ్మా?"

"నేను చూడలేకపోతే అదీ చూసుకొంటుంది. దాన్ని పెళ్ళి అయ్యేదాకా నువ్వు చేసుకోవడానికి వీల్లేదు"

"నేనూ అదే అన్నాను.కాని"

"కాని?... ఈ చెప్పు! ఆ పిల్ల ఇప్పుడే పెళ్ళి కావాలని అంటున్నదా?"

రాము మాట్లాడలేదు.

"ఆ పిల్లకు చెప్పు! మా అక్కయ్య పెళ్ళి చేసుకొనేంతవరకూ నేను చేసుకోనని చెప్పు!"

రాము అలాగే నిల్చున్నాడు.

"నాకు తెలుసురా! మీరంతా స్వార్థపరులు. నీ సంగతి నువ్వు చూసుకున్నావ్. నిన్ను ఇంత చేసిన అక్క గురించి ఒక్కసారి ఆలోచించలేవు. నువ్వు స్వార్థపరుడివి. పో! వెళ్ళి పెళ్ళి చేసుకో! కాని మళ్ళీ ఈ గడప తొక్కకు!" దగ్గు తెరల మధ్య దాదాపు అరుస్తూనే అన్నది.

"అమ్మా!" రేణుక లోపలకు వచ్చింది.

"రా తల్లీ! రా! నీ తమ్ముడు ప్రయోజకుడైనాడు. వాడికి పెళ్ళి కావాలట! ఆ తర్వాత చెల్లెల్లిద్దరికీ చిన్న తమ్ముడికీ కూడా పెళ్ళి చేస్తే ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారు. నేనూ ఎక్కువ రోజులు వుండను. ఈ లోపల నీ తల ముగ్గు బుట్ట అవుతుంది. చర్మం ముడతలు పడుతుంది."

"అమ్మా!" రేణుక దాదాపు అరిచింది.

"విన్నావా తల్లీ! అందుకే చెప్పాను. ఎవరిపాట్లు వాళ్ళు పడ్తారు. నువ్వు పెళ్ళిచేసుకోవే తల్లి అని. అప్పుడు విన్నావా? వీడిని ఎం.ఏ.లో చేర్పించావు. చదువు పూర్తి కావడానికి మరో ఆరు నెలలు వుంది. అది పూర్తి అయ్యాక ఉద్యోగం చేస్తాడనీ, నీ భుజాల మీది బరువును తన భుజాల మీదకు తీసుకుంటాడనీ అనుకున్నాను. నీకు పెళ్ళి చేసి నా బాధ్యత తీర్చుకుందామనుకున్నాను. నీ తమ్ముడు ఎంత స్వార్థపరుడో చూడు. పెళ్ళి చేసుకుంటాడట పెళ్ళి! ఆ మాట చెప్పడానికి వాడికి నోరు ఎలా వచ్చిందో?"

"అక్కయ్యా! కారు ఏమైంది? రిక్షాలో వచ్చేవేం?" మాట మారుస్తూ అన్నాడు రాము.

"చిన్న రిపైర్ వచ్చింది. వర్కుషాపుకు పంపించాను" అన్నది చిరునవ్వుతో రేణుక.

"నేను చెప్పింది నీ చెవికి కూడా ఎక్కడం లేదా?" తల్లి అడిగింది.

"రాము ఏం తప్పుచేశాడమ్మా నువ్వంత ఇదై పోవడానికి? పెళ్ళి చేసుకుంటానన్నాడు అంతేగా" అన్నది రేణుక.

రాము చిన్నగా అక్కడ నుంచి తప్పుకున్నాడు.

"నువ్వు అలా ఉండగా వాడెలా పెళ్ళి చేసుకుంటాడే?"

"ఏం ఎందుకు చేసుకోకూడదూ? ఈ రోజుల్లో అవన్నీ ఎవరు పట్టించుకుంటున్నారమ్మా!

మరీ నీచాదస్తం కాకపోతే? అయినా నాకు ఇంకేం పెళ్ళి?"

"అదేమిటి? ఈ రోజుల్లో నలభైదాటినవాళ్ళు కూడా చేసుకుంటుంటేనూ? ముప్పయ్ ఏళ్ళు నిండని..."

"రామూ కంటే నేను పదేళ్ళు పెద్ద. రామూకు ఇప్పుడు ఇరవై రెండేళ్ళు. అంటే నాకంటే చిన్న వయసు?"

"నీకు అంత వయసు ఎక్కడే? అయినా ముప్పయ్ రెండేళ్ళు దాటిన అక్కను వదిలేసి వాడు చేసుకోవడం ఏమిటి?"

"వాడు నాకు పెళ్ళి చేస్తాడా? ఏమిటమ్మా నీ చాదస్తం! చిన్న చెల్లీ, తమ్ముడూ చదువులు పూర్తయి ప్రయోజకులవడానికి మరో పదేళ్ళయినా పట్టవచ్చును"

"ఏమిటే నీ ధోరణి, అంతవరకూ పెళ్ళి చేసుకోవా ఏమిటి?"

"అంతవరకే ఏమిటి? అసలు పెళ్ళే చేసుకోను! ఇక నా పెళ్ళిమాట మర్చిపో! చిన్నవాళ్ళ దగ్గిర మాటిమాటికి నా పెళ్ళి గురించి వాదించి నన్ను అవమానించకు" అంటూ రేణుక లోపలకు వెళ్ళిపోయింది.

ఎదురుగా వున్న నిలువుటద్దంలో ఆమెకు తన ప్రతిబింబం కన్పించింది. రోజూ చూస్తూనే ఉన్నది. ఆరోజు పరిశీలించి చూసింది. ముఖంలో, కళ్ళలో ఎంతో అలసట కన్పించింది. చెంపల దగ్గర, పాపిట్లోనూ తెల్లని జుట్టు నల్ల జుట్టు మధ్య నుంచి తొంగి చూస్తున్నది.

అనుకోకుండా రేణుక నిట్టూర్చింది.

ఇవాళ తనకేమైంది? ఉదయంనుంచీ దిగులు దిగులుగా ఉన్నది. ఆ దిగులుకు ప్రత్యేక కారణం ఏమీ కన్పించడం లేదు. కేసులు కూడా చూడాలనిపించలేదు. సీరియస్ కేసులు చూసి మిగతావి తన జూనియర్ కు అప్పగించి ఇంటికి వచ్చింది. వస్తూనే ఇలాంటి సంభాషణ ఎదురౌతుందని తను భావించలేదు.

ఉదయం నుంచి గౌతమ్ గుర్తుకు వస్తున్నాడు. గౌతమ్ తో బీచ్ లో కూర్చుని ఎన్నో కలలు కన్నది. ఎన్నో ఊహించుకున్నది.

గౌతమ్ ఎలా ఉన్నాడో, ఎక్కడ ఉన్నాడో, నీకోసం ఎంత కాలమైనా వేచి ఉంటానన్నాడు మరి. ఒక్కసారైనా చూట్టానికి రాలేదేం? ఒక్క ఉత్తరం కూడా రాయలేదు.

పెళ్ళి చేసుకున్నాడేమో?

చేసుకొనే ఉంటాడు. ఈ మగవాళ్ళ మాటలు నమ్మడానికి వీల్లేదు.

ఏమిటి తను ఆలోచిస్తున్నది? తనకోసం నిట్టూర్పులు విడుస్తూ గౌతమ్ జీవితమంతా బ్రహ్మచారిగా ఉండాలని తన కోరికా? ఎంత స్వార్థం?

ఈ మధ్య తన గుండెల్లో ఏదో భూగోళమంతా ఖాళీ హోరు పెడ్తున్నట్టు అన్పిస్తున్నది. ఇంత హడావిడిలో కూడా తను నిర్జన ప్రదేశంలో ఒంటరిగా ఉండిపోయినట్టు అన్పిస్తున్నది. ఎంతమంది చుట్టూ వున్నా, మానవుడు వంటరివాడేనా?

మరొకసారి అద్దంలో తన అలసిపోయిన ముఖాన్ని అక్కడక్కడ కన్పిస్తున్న తెల్లని జుట్టునూ, మానవుడు వంటరివాడేనా?

రేణుక నర్సింగ్ హోంపెట్టి ఐదేళ్ళు పూర్తి అయింది. గుంటూరులో రేణుకా నర్సింగ్ హోం అంటే తెలియని వాళ్ళుండరు. ఆమె హస్తవాసి మంచిదనే పేరు పడిపోయింది. రేణుక ఉన్నవాళ్ళ దగ్గిర ఫీజు వదలదు. లేనివాళ్ళను పీడించదు. బాగానే సంపాదించింది. లక్షరూపాయలు పెట్టి ఇల్లు కట్టించింది. కారు కొన్నది. ఒక జూనియర్ డాక్టర్ని కూడా అపాయింటు చేసుకున్నది. తమ్ముళ్ళన్నా చెల్లెళ్ళన్నా అపారమైన ప్రేమను పెంచుకున్నది. వాళ్ళను మరీ ముద్దుచేసి చెడగొడ్తున్నావని తల్లి రేణుకను మందలిస్తూ ఉంటుంది. రేణుక చిరునవ్వు నవ్వి ఊరుకుంటుంది.

పెద్దవాడు రాము ఎం.ఏ. ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. పెద్ద చెల్లెలు రాధిక బి యస్ సి సెకండ్ ఇయర్ లో ఉన్నది. చిన్న తమ్ముడు పది చదువుతున్నాడు. చిన్న చెల్లెలు ఎనిమిది చదువుతుంది.

రేణుక బాగా సంపాదిస్తోంది. పిల్లలు ఏది కావాలన్నా కాదనకుండా తెచ్చి యిచ్చేది. నలుగుర్లో తండ్రిలేని లోపాన్ని వాళ్ళు ఫీజులు లేకుండా ఎక్స్ కర్షన్స్ కూ బట్టలకూ అడిగిన డబ్బు ఇచ్చేది.

రామం పీ.జి.సెంటర్ ప్రిన్సిపాల్ కూతురితో తిరగడం గురించి విన్నరోజు రేణుక ఆలోచనలో పడింది. రామం ఎం.ఏ. పూర్తిచేసి సంసార బాధ్యతలో తనకు చేదోడుగా ఉంటాడనుకుంది.

కానీ...ఈరోజు తాను విన్నది ఏమిటి? రామం పెళ్ళికోసం తొందరపడుతున్నాడు. తన మార్గం తను చూసుకుంటున్నాడు. పెళ్ళి చేసుకొని వేరేకాపురం పెడతాడు. తను ఇలాగే మరి పదేళ్ళు అందర్నీ పెంచి పెద్దచేసి అలసిపోతుంది. తలంతా పండిపోతుంది. ఒంటరిగా మిగిలిపోతుంది. అమ్మ నిజమే చెప్పింది.

"ఇదేమిటి ఇవాళ తను ఇలా ఆలోచిస్తున్నది? తన తండ్రికి ఏమని వాగ్దానం చేసింది? గౌతమ్ ను తాను ఎందుకు దూరం చేసుకుంది? తండ్రిలేని లోటును తీర్చడానికే కదా! తను నిజంగా ఆ పని చెయ్యగలిగిందా? రామం పెళ్ళి చేసుకుంటానంటే తండ్రి బాధపడ్తాడా?

తాను చేసిన త్యాగానికి ప్రతిఫలం చిన్నవాళ్ళనుంచి...తను పెంచి పెద్ద చేసినవాళ్ళ నుంచి...ఆశిస్తుందా?

లేదు! లేదు!

రామం!పాపం! తనముందు చెప్పడానికి సిగ్గుపడుతున్నాడు! అందుకే తను రాగానే వెళ్ళిపోయాడు. పిచ్చి సన్యాసి! తను, వాడు పెళ్ళిచేసుకుంటానంటే బాధపడుతుంది అనుకున్నాడా!

రేపే తను ప్రిన్సిపాల్ గారితో మాట్లాడి, ముహూర్తాలు పెట్టించాలి. తాను తండ్రికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. పెళ్ళి అయితే మాత్రం ఎక్కడికి వెళ్తాడు? ఇంట్లోనే ఉంటాడు?

రేణుక ఆలోచనల నుంచి నిద్రలోకి జారిపోయింది. ఆ రాత్రి అన్నం తినాలనిపించలేదు.

## 15

రామం పెళ్ళి సింపుల్ గా జరిగింది. తల్లి రేణుకను చూస్తూ కళ్ళు తుడుచుకుంది.

పెళ్ళయ్యాక రామం ఎక్కువగా అత్తగారింట్లోనే ఉంటున్నాడు. చిన్నగా ఒక్కొక్క వస్తువే తనదనేది లేకుండా మామగారింటికి చేరవేశాడు. రేణుక చూస్తూనే ఉన్నది. చూడనట్టే ఉండిపోయింది. రామం క్రికెట్ ఛాంపియన్. అతను గెల్చుకున్న కప్పులు కూడా తీసుకెళ్ళిన రోజు రేణుక మనస్సు చివుక్కుమన్నది. కానీ ఏమీ అనలేకపోయింది. రామం ఎప్పుడో చుట్టంచూపుగా గాని రావడం లేదు. అయినా రేణుక ఒక్కమాట అనలేదు. తల్లి ఒకటి రెండుసార్లు కొడుకుని నిందించింది. రేణుక రామాన్ని సమర్ధించింది. రామం అత్తవారింట ఇల్లరికపు అల్లుడిలా వెళ్ళిపోయాడు. అది తల్చుకొని కొన్నిరోజులు వంటరిగా కన్నీరు కార్చేది కొంతకాలం.

మరో రెండు సంవత్సరాలు గడిచాయి. రాధిక ఎమ్.ఎస్.సి. ఫస్టు ఇయర్ లో ఉన్నది. ఒకరోజు రేణుక తన జూనియర్ డాక్టర్ తో సినిమాకు వెళ్ళింది. ఇంటర్ వెల్ లో లైట్లు వెలిగాయి. ముందు సీట్లో కూర్చున్న వాళ్ళను చూసి తెల్లబోయింది రేణుక.

రాధ ప్రక్కన ఒక అందమైన యువకుడు కూర్చుని ఉన్నాడు. రాధ కూర్చున్న కుర్చీ వెనుకభాగం మీద రాధిక పైగా చెయ్యివేసి కూర్చుని వున్నాడు. రాధిక మీదకు వంగి ఏదో మాట్లాడుతున్నాడు. వాళ్ళిద్దరూ ఈ లోకంలోని మనుషుల్లా లేరు. చుట్టూ ప్రపంచాన్నే విస్మరించినట్టు ఒకరి మీదకు ఒకరు వంగి గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.

రేణుకకు రాధ మీద కోపం వచ్చింది. సినిమా పూర్తి అయ్యీ కాకముందే ఇంటికి వచ్చేసింది. రాధ కోసం వరండాలోనే కూర్చుని ఎదురుచూడసాగింది.

"రేణూ! రాధ సంగతి ఏమీ బాగాలేదు" అన్నది తల్లి.

"ఏం? ఏం జరిగింది?" మీరు తెలియనట్టే అడిగింది రేణుక.

"కాలేజీ నుంచి తిన్నగా ఇంటికి రావడం లేదు. ఇవాళ ఇంతవరకూ రాలేదు. మధ్యాహ్నం రామం వచ్చాడు. అది సుధీర్ అనే కుర్రాడితో తిరుగుతున్నదట. అతను చాలా ధనవంతుడట. ఎంతో మందిని మార్చాడటవాడు బాధపడుతూ చెప్పాడు" తల్లిమాటలు పూర్తికాలేదు.

దూరంగా మోటార్ బైక్ ఆగింది. రాధిక దిగింది. లోపలకు వస్తూ తల్లీ, అక్కా వరండాలో లైటు వెలుగులో నిల్చుని ఉండటాన్ని గమనించింది. గతుక్కు మన్నది. ఓ క్షణం తటపటాయించి లోపలకు వెళ్ళబోయింది.

"ఆగు!"

రాధిక ఆగి తల్లి ముఖంలోకి చూసింది.

"ఎవడేవాడు!"

"ఎవరు?"

"నిన్ను ఆ మోటార్ సైకిల్ మీద దించి వెళ్ళినవాడు"

"అతను నా క్లాస్ మేట్! కమలా వాళ్ళింటికి నోట్సు తెచ్చుకుందామని వెళ్ళాను. ఆలస్యం అయ్యింది. బస్సు స్టాప్ లో నిలబడ్డాను. ఎంతకూ బస్ అందలేదు. ఇంతలో సుదీర్..."

"ఆపు! నువ్వు వాడితో ఎంతకాలంగా తిరుగుతున్నావ్?"

"అమ్మా!" రేణుక దాదాపు అరిచినట్టే అన్నది.

"నువ్వూరుకో! నువ్వే వాళ్ళను చెడగొడుతున్నావ్.

రేణుక మనస్సు చివుక్కు మన్నది.

తను వాళ్ళను చెడగొడుతున్నదా? స్థాణువులా నిలబడిపోయింది రేణుక.

"ఎందుకమ్మా అక్కయ్యని అంటావ్?"

"చాల్లే! ఊరుకో! అక్కయ్య మీద నీకు అంత అభిమానమే ఉంటే నువ్వు ఇలాంటి పనులు చెయ్యవు. అది పెళ్ళి పెటాకులూ లేకుండా..."

"అమ్మా" గట్టిగా అరిచింది రేణుక.

మరుక్షణంలో అక్కడినుంచి వెళ్ళిపోయింది.

రాధ కూడా రేణుక వెనకే వెళ్ళింది.

"నన్ను క్షమించు అక్కా! నా వల్ల అమ్మ నిన్ను బాధపెట్టింది"

రేణుక అదోలా నవ్వింది.

"అయితే రాధా! నిజంగా నీకు బస్ అందలేదా?"

రాధ తలవంచుకుంది.

"నిజం చెప్పు! నువ్వు సినిమాకు వెళ్ళావు గదూ?"

"ఎవరు చెప్పారు?"

"వెళ్ళావా? లేదా?"

"ఎవరు చెప్పారో ముందు చెప్పు!"

"నేనే చూశాను"

రాధ తృళ్ళిపడింది!

"ఎందుకంత తప్పు చేసిన దానిలా బాధపడ్తావ్? అతనెవరు?"

"సుధీర్!"

"ఏ వూరు? ఏ కులం? ఎవరి అబ్బాయి?"

"నాకు తెలియదు"

"ఏమీ తెలుసుకోకుండానే అతనితో తిరుగుతున్నావా"

రాధ మాట్లాడలేదు.

"అతన్ని గురించి పూర్తిగా తెలుసుకోకుండానే...."

"అతను చాలా మంచివాడు! మేమిద్దరం...."

"ప్రేమించుకొంటున్నారు" రేణుక అందుకుని అన్నది.

"అవును!"

"పెళ్ళి చేసుకుంటానన్నాడా?"

"అనలేదు. కాని చేసుకుంటాం!"

"రాధా! పిచ్చిగా మాట్లాడకు. ఇది సినిమా కథ కాదు. ప్రేమిస్తున్నాను అన్న ప్రతివాడు వెంటబడి పెళ్ళి చేసుకోవడానికి"

"అతను చాలా మంచివాడు!"

"ప్రేమించే ప్రతి ఆడదీ తన ప్రియుడ్ని గురించి అనేమాట ఇదే!"

రాధకు వళ్ళు మండింది.

"ప్రేమ గురించి నీకేం తెలుసు?" అన్నది దురుసుగా రాధ.

రేణుక చెల్లెలి ముఖంలోకి చూసింది. చూస్తూనే ఉండిపోయింది.

"అవును! నిజమేనమ్మా! నాకు ప్రేమ గురించి ఏమీ తెలియదు" రేణుక తనకు తానే చెప్పుకుంటున్నట్టు బరువుగా, చిన్నగా అన్నది.

రాధ ముఖం వెలవెలా బోయింది. తను అన్నదేమిటో అప్పటికి బోధపడలేదు.

"సారీ అక్కా! ఏదో వాగేశాను"

"లేదమ్మా, ఉన్నమాటే అన్నావ్!"

"నన్ను క్షమించలేవా అక్కా?" గద్గద కంఠంతో అన్నది రాధ.

"పిచ్చి పిల్లా, నువ్వు ఎందుకు అంతగా బాధపడ్తావ్? నువ్వన్నదాంట్లో తప్పేమీ లేదు. వెళ్ళు అన్నం తిను" గొంతులో ఉబికి వస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూ చరచరా తన గదిలోకి వెళ్ళిపోయింది.

మంచానికి అడ్డంగా పడి వెక్కివెక్కి ఏడ్చింది. మనసులోని బాధ కరిగి కన్నీరై ప్రవహించింది. మనసు తేలికపడినట్లనిపించింది.

రాధ ఏమన్నది?

తనకు ప్రేమంటే ఏమిటో తెలియదా?

ప్రేమించడం చేతకానందువల్లనే తనకు పెళ్ళికాలేదు అని రాధ అనుకుంటుందా? అందుకే ఆమెను చూసి తను ఈర్ష్య పడుతున్నదనే భావం రాధకు కలిగిందా? రాధను చూసి తను ఈర్ష్య పడటమా?

రామం తెలివైనవాడు.

రాధ కూడా తెలివైనదే.

తనే వట్టి పిచ్చి మొద్దు.

తన స్వార్థం తను చూసుకోలేకపోయింది.

తనలాంటి వాళ్ళు బ్రతకడం చేతగాని వాళ్ళు!

ఈ ప్రపంచంలో ఎవరికి వారే మరొకరి కొరకు త్యాగం చెయ్యడమంత తెలివితక్కువ తనం మరోటి లేదు. తను ఎవరికోసం, తన ప్రేమను త్యాగం చేసిందో వాళ్ళ దృష్టిలోనే తను చులకన అయింది.

తను పెంచినవాళ్ళు, తనకు ఏంకావాలో తెలుసుకొని తమ భవిష్యత్తుకు బాట వేసుకుంటున్నారు. కాని...ఏ ఒక్కళ్ళు తనకు ఏం కావాలో అడగడంలేదు. తను ఎవరికీ అక్కర్లేదు.

చివరికి ఎవరిదారి వారు నిర్ణయించుకొని వెళ్ళిపోతారు. తను ఒక్కతి మాత్రం మిగిలిపోతుంది.

రేణుక లేచింది.

యాంత్రికంగా అద్దం ముందుకెళ్ళి నిలబడింది.

కళ్ళచుట్టూ నల్లటి వలయాలు కన్పించాయి.

పాపిట్లోనూ, చంపల దగ్గిరా తెల్లజుట్టు నల్లజుట్టు మధ్యనుంచి స్పష్టంగా కన్పిస్తోంది.

కళ్ళలో అలసట కన్పిస్తోంది. తన ప్రతిబింబాన్ని చూస్తూ అదోలా నవ్వుకుంది.

తన అసిస్టెంటు సుమతి రోజూ జుట్టుకు రంగు వేసుకోమని గోల పెడుతుంది.

తను జుట్టుకు రంగు వేసుకుంటే ఇంత పెద్దదిగా కన్పించదు. నిజమే. కాని తను అలా కన్పించి ఎవర్ని ఆకర్షించాలి?

గౌతమ్ రూపం కళ్ళముందు మెదిలింది. కళ్ళలో నీరు ఉబికింది.

"అక్కా, అక్కా" రాధ తలుపు కొడుతున్నది.

కళ్ళు తుడుచుకొని తలుపుతీసింది.

"అక్కా నువ్వు అన్నం తినలేదటగా?"

"ఆకలిగా లేదు"

"ఊహూ, నువ్వు తినకపోతే నేనూ తినను. నాకు మహా ఆకలిగా ఉంది" మారాం చేస్తున్నట్టు అన్నది రాధిక.

రేణుక రాధ వెనకే డైనింగ్ హాలులోకి వెళ్ళింది.

## 16

రాధ సుధీర్ తో తిరుగుతోందని వింటూనే ఉన్నది.

రేణుక మళ్ళీ ఆ విషయంలో కలుగజేసుకోలేదు.

రెండు మూడుసార్లు రాధ ఏదో చెప్పాలని ప్రయత్నం చేసింది. రేణుక ముభావంగా ఉండడంవల్ల ఏమీ చెప్పలేకపోయింది.

ఆ రోజు కాలేజీ నుంచి త్వరగా వచ్చింది. వస్తూనే గది తలుపులు బిగించుకుని పడుకుంది. తల్లి ఎంత పిల్చినా తలుపులు తెరవలేదు. చిన్న తమ్ముడు రఘూ కూడా పిల్చాడు. లోపలనుంచే సమాధానం ఇచ్చింది. తనకు ఆరోగ్యం

సరిగా లేదని గొడవ చెయ్యొద్దని విసుక్కుంది.

రేణుకకు ఆ రోజు అర్జంటు కేసు రావడం వల్ల ఆపరేషన్ లో ఉండిపోయింది. ఆలస్యంగా ఇంటికి వచ్చింది. వస్తూనే తల్లి ఏడుస్తూ "దానికి ఏమైందో? లోపల ఆరుగంటలు నుంచి తలుపులు బిగించుకొని పడుకుంది" అని చెప్పింది.

రేణుక తలుపు కొట్టింది. రాధ తలుపు తీసింది. జుట్టు రేగి ఉంది. కళ్ళు వాచి ఉన్నాయి. ఏడుస్తూ పడుకొని ఉంటుందని అర్థం అయింది.

"ఏమయింది రాధా?" ఆప్యాయంగా అడిగింది.

రాధ రేణుక అలా అడగ్గానే బావురుమంది.

రేణుక రాధను పట్టుకుని బుజ్జగించింది.

"ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నావ్?" అని అడిగింది.

"సుధీర్ మోసం చేశాడు అక్కా!" అంటూ మళ్ళీ వెక్కివెక్కి ఏడవసాగింది.

రేణుకకు ఏం మాట్లాడాలో బోధపడలేదు. చెల్లెల్ని రెండు చేతులతోనూ పొదివి పట్టుకొని ఉండిపోయింది.

"రాధా, అసలు ఏమైందో చెప్పమ్మా" లాలనగా అడిగింది.

"అంత మంచితనం చూపించకు అక్కా! నేను భరించలేను. నీ మాట వినలేదు. నిన్ను అవమానించాను. నన్ను తిట్టు కొట్టు, కాని జాలిపడకు"

"రాధా, ఏమిటా పిచ్చిమాటలు? అసలు ఏం జరిగిందో చెప్పకుండా?"

రాధ కళ్ళు తుడుచుకుంది.

"సుధీర్ ను నీదగ్గరకు తీసుకురావాలనుకున్నాను. అతను రోజూ ఏదో సాకుతో తప్పించుకోసాగాడు. చివరకు ఈ రోజు పెళ్ళి విషయం సిగ్గు విడిచి నేనే అడిగేశాను"

"ఏమన్నాడు?" ఆతృతగా అడిగింది రేణుక.

"తనకు అభ్యంతరం లేదట"

"మరి?"

"అతని తల్లిదండ్రులు లక్షలు కట్నం ఇచ్చే పిల్లకోసం గాలిస్తున్నారట. వాళ్ళను ఎదిరించే శక్తి తనలో లేదట."

"ఊ"

రాధ రేణుక ముఖంలోకి చూసింది.

రేణుక ముఖం గంభీరంగా ఉన్నది.

"మీ అక్క అంత సంపాదిస్తోంది. లక్ష రూపాయలు కట్నంగా ఇవ్వలేదా?" అంటున్నాడు.

రేణుక రాధ ముఖంలోకి చూస్తూనే ఉండిపోయింది.

"రేపు నీతోవచ్చి మాట్లాడతానన్నాడు"

రేణుక ఆలోచనలో పడింది.

"లక్ష రూపాయలు మా అక్క ఎక్కడనుంచి తెచ్చిస్తుంది? నువ్వు వచ్చి మాట్లాడినా లాభం లేదన్నాను."

రేణుక ముఖంలోకి ఓ క్షణం చూసి మళ్ళీ రాధ అన్నది.

"కనీసం ఏభైవేలన్నా లేకపోతే వాళ్ల అమ్మా నాన్నా ఒప్పుకోరు అంటున్నాడు"

"ప్రేమించేటప్పుడు అమ్మనూ, నాన్ననూ అడిగే ప్రేమించాడా?" కోపంగా అన్నది రేణుక.

రాధ తలదించుకున్నది.

"ఇవాళే చెప్పేస్తాను. కట్నం ఇచ్చే పిల్లనే చేసుకోమని. అందరిలా నాకు కన్నతండ్రి ఉన్నాడా? కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యడానికి?" అంటూ చివ్వున లేచి చరచరా బయటికి వచ్చి బాత్ రూంలోకెళ్ళి తలుపు బిగించుకుంది రాధిక.

రేణుక కణత మీద కంకరరాయి తగిలినట్టే అయిపోయింది. రాధిక వెళ్ళినవైపే వెర్రిదానిలా చూస్తూ ఉండిపోయింది. ఓ నిముషం తెప్పరిల్లి లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

బుర్ర పని చెయ్యడం లేదు. బట్టలు కూడా మార్చుకోకుండానే మంచానికి అడ్డంగా పడింది. బాగా అలసి ఉన్న మనసు నిద్రలోకి జారిపోయింది.

రేణుక అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. గోడ గడియారం కేసి చూసింది. చీకట్లో గడియారం ముళ్ళూ, అక్షరాలూ మెరుస్తున్నాయి.

పన్నెండున్నర దాటుతోంది. కడుపులో ఏదో మంటగా ఉన్నది. ఆ మంట గుండెలదాకా ఎగబాకుతోంది.

"ఏమిటిది ఇలా ఉంది?

తను భోజనం చెయ్యకుండా పడుకున్నట్టు గుర్తుకు వచ్చింది.

వెంటనే లేచి డైనింగ్ హాలులోకి వెళ్ళింది. ఫ్రిజ్ తెరచి నీళ్ళ బాటిల్ తీసుకున్నది. గటగట రెండు గ్లాసుల నీళ్లు తాగాక గాని కడుపులో మంట ఆరలేదు. ఎదురుగా ఉన్న పళ్ళెం నుంచి రెండు అరటిపళ్ళు తీసుకొని తినేసింది. గదిలోకి వచ్చి పడుకుంది. నిద్ర పట్టడంలేదు. మనసులో ఎలాగో ఉన్నది.

రేణుక ఆలోచించసాగింది.

తనకు మెలుకువ వచ్చింది. రాగానే కడుపు మంట గురించి తప్ప మరో ఆలోచన రాలేదు. ఆ మంట చల్లారిన తరువాత గాని బుర్రలోకి వేరే ఆలోచన రాలేదు. మరి ఈ దేశంలో నూటికి డెబ్బయ్ వంతు ప్రజలు బీదవాళ్ళేగా? వాళ్ళ ఆలోచనలు ఎప్పుడూ కడుపు చుట్టూనే వుంటాయన్న మాట వాళ్ళు ప్రేమను గురించి ఆలోచించరు. వాళ్ళు కల్పనా లోకంలో విహరించరు. ఆకలివేస్తే అన్నం తిన్నట్టు, దాహం వేస్తే మంచినీళ్ళు తాగినట్టు సెక్సును అనుభవిస్తున్నారేగాని దానికి రంగులు పూసి ప్రేమలోకంలోకి, విసిరివేసే కథలంటే ఎందుకు జనం ఇంతగా పడి చస్తున్నారు? ఎవరాజనం కడుపు నిండినవాళ్ళేగా?

ఏమిటి తను ఇలా ఆలోచిస్తోంది? తను ఇప్పుడు ఆలోచించవలసింది సాహిత్యాన్ని గురించా?

"అందరివలె నాకు కన్నతండ్రి ఉన్నాడా, నాకు కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యడానికి?" రాధిక మాటలు మళ్ళీ మళ్ళీ చెవుల్లో రింగు మంటున్నాయ్.

అంటే రాధ ఉద్దేశ్యం లక్ష రూపాయలు కట్నం ఇచ్చి పెళ్ళి చెయ్యమనేగా?

సుధీర్ మోసం చేశాడని ఏడవడం-నాటకం అన్నమాట! సుధీర్ తో ఆలోచించి ఆడిన నాటకం ఇది! ఏభైవేలకు కనికరించే చేసుకుంటానన్నాడట అంటే ఏభైవేలు ఇచ్చి పెళ్ళి చెయ్యాల్సిన బాధ్యత తనమీద వున్నట్టు రాధ భావిస్తున్నదా? తన తండ్రి ఉంటే ఏభైవేలు ఇవ్వగలిగేవాడా? ఆ మాటకు వస్తే నాన్న ఇన్ని సౌకర్యాలు మాత్రం కలిగించగలిగేవాడా తనకొచ్చే జీతం రాళ్ళతో? నాన్న బ్రతికి ఉంటే తను వివాహం చేసుకొని వెళ్ళిపోయి వుండేది. తన సంపాదన...తనకూ ఒక ఇల్లూ- ఆ ఇంట్లో భర్తా...పిల్లలూ... వుండేవారు... తనూ...తన సంసారం....

రాధకు తనేం తక్కువ చేసింది.

రాధ చిన్నపిల్లకాదు.

రాధ చదువుకుంటోంది.

ప్రేమించిన ప్రియుడుతో తిరుగుతోంది.

పెళ్ళి గురించి ఆలోచిస్తోంది.

కనీసం అప్పుడైనా తన అక్కను గురించి- కేవలం తన చెల్లెళ్ళ కోసం, తమ్ముళ్ళకోసం యంత్రంలా సంపాదిస్తూ బ్రతుకుతున్న అక్క గురించి- ఒక్కసారైనా ఆలోచించి ఉంటుందా?

ఊహూ! ఆలోచించి ఉండదు. అలా ఆలోచించగలిగినప్పుడు అంత మాట తనముందు అనదు. అనలేదు.

ఇప్పుడు తనేం చెయ్యాలి? ఏభైవేలు కట్నం ఇచ్చి రాధ పెళ్ళి చెయ్యాలా? ఏభైవేలు ఎక్కడ్నించి తేవాలి? అవును తను బాగానే ఆర్జించింది. మంచి ఇల్లు కట్టింది. నర్సింగ్ హోం కట్టించింది. దానికి కొంత బ్యాంకు నుంచి అప్పు తీసుకుంది. ఇంకా ఆ అప్పు పూర్తిగా తీరలేదు.

## 17

రేణుక బద్ధకంగా నిద్రలేచింది.

కళ్ళు మండుతున్నాయ్!

కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయ్!

పళ్ళు తోముకుని బద్ధకంగా డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది.

తల్లి మౌనంగా కాఫీకప్పు ముందు పెట్టింది.

పక్క కుర్చీలో కూర్చుంది. కాఫీ ఇచ్చి అలా పక్కనే కూర్చుంది. అంటే తల్లి తనతో ఏదో ముఖ్య విషయం మాట్లాడబోతున్నదని ఇట్టే తెలిసిపోయింది రేణుకకు.

ఇంకేం విషయం?

రాధ పెళ్ళి విషయమే కావచ్చు.

అమ్మకూడా మారిపోతున్నది ఎంతసేపూ చిన్నవాళ్ళ గురించేగాని తన గురించి ఆలోచించడం మానేసింది.

రాధిక పెళ్ళి గురించి మాట్లాడుతుంది.

చంద్రం డాక్టర్ చదవాలంటున్నాడని చెబుతుంది.

చిన్నది నెక్లెస్ కావాలని ఏడుస్తున్నది!

కోడలికి నెల తెప్పిందట! సారె పంపించాలి!

ఇలా ప్రతిరోజూ ఏదో ఒక డిమాండ్ చేస్తూనే ఉంటుంది.

తన గురించి ఆలోచించడం మానేసింది.

తనను ముసలిదానికింద కట్టేసింది.

"ఇంకా దానికి పెళ్ళేమిటి?" అనుకుంటోందేమో?

"అమ్మాయ్, రాధ విషయం ఏమాలోచించావ్!" చిన్నగా అన్నది.

రేణుక మౌనంగా కాఫీ తాగుతూ ఉండిపోయింది.

"నేను కానీ కట్నం ఇవ్వను. ప్రేమించేటప్పుడు నన్ను అడిగి ప్రేమించిందా? ఇద్దర్నీ పోయి గంగలో దిగమను" అనాలనుకుంది.

"ఏమ్మా మాట్లాడవ్? దాని బతుకు....?"

"ప్రేమించిననాడు కట్నం అడగడం ఏమిటి?" వ్యంగ్యంగా అన్నది.

"మన కర్మ! ఏం చేస్తాం చెప్పు! ఆడపిల్లవాళ్ళం!"

"ఈ పెళ్ళి మానెయ్యమను. నేను మరొకర్ని చూసి చేస్తాను"

"నేను చేసుకుంటే సుధీర్ నే చేసుకుంటాను" రాధిక ఎక్కడి నుంచి వచ్చిందో తుఫానులా విసురుగా వచ్చింది.

"చేసుకో! నేను వద్దన్నానా?" అంతకంటే విసురుగా అన్నది రేణుక.

"అంతకంటే నీలాగే ఉండమంటే పోలా. అసలు నాకు పెళ్ళి కావడం నీకిష్టం లేదని నాకు తెలుసు"

"రాధికా!" తల్లి రాధిక చెంప చెళ్ళుమనిపించింది.

రాధికకు కళ్ళముందు రంగులు కన్పించాయి.

రేణుకకు రాధిక అన్నమాట అంతకంటే తీవ్రంగానే గుండెకు తగిలింది. చలన రహితంగా కూర్చుండిపోయింది.

రాధిక కుర్చీమీద కూర్చుని ముఖం చేతులలో దాచుకొని వెక్కివెక్కి ఏడవసాగింది.

"నా కర్మ! నా రాత! ఆయన దారిన ఆయన పోయాడు. ఇంకా ఈ పాపిష్టిదాన్ని ఎన్ని చూడమని వెళ్ళిపోయాడో! ఎందుకే ముండా ఏడుస్తావ్! ప్రేమించావుగా? వెళ్ళు! వెళ్ళి వాణ్ణే అడుగు. వాడు చేసుకోనంటే ఎందులోనన్నా పడి చావు. నా దగ్గిర లక్షలు లేవు. నీకు కట్నం గుమ్మరించి పెళ్ళి చేయడానికి"

రాధిక ఏడుస్తూనే ఉన్నది.

రేణుక తల్లి కేసి చూసింది.

"అమ్మా! ఏమిటమ్మా ఆ మాటలు?"

"అనండి తల్లీ? అందరికీ నేనే లోకువైపోయాను"

ఒక్కొక్కసారి ఆమె అర్థం పర్థం లేకుండా రెచ్చిపోతుంది. ప్రతి మాటకూ పెడర్థాలు తీస్తుంది. ఆమె మనసు మరి కలత చెందినప్పుడు పూర్తి బాలెన్స్ తప్పుతుంది. తనేం మాట్లాడుతుందో తనకే తెలియదు.

ఆ విషయం తెలిసిన రేణుక ఓ క్షణం మౌనంగా ఉండిపోయింది.

అరచేతుల్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న రాధికను చూసింది.

జాలి వేసింది. రాధిక ఏడుస్తున్నది. తను పెంచి పెద్దచేసిన చెల్లెలు తను వాళ్ళకోసమే పెళ్ళి మానేసి సంపాదనలో పడింది. కట్నం ఇవాలనే సరికి తన మనసు ఎందుకు ఎదురు తిరిగింది?

తను తండ్రికి ఇచ్చిన మాట మర్చిపోయిందా?

ఈ రోజు తన తండ్రి ఉంటే...."

మనసులోనే తండ్రికి క్షమాపణ చెప్పుకుంది రేణుక.

చెల్లెలు దగ్గరకు వెళ్ళింది.

"రాధీ" రెండు చేతుల్నీ గోముగా మంచం మీదినుంచి లాగుతూ పిల్చింది.

రాధిక రేణుక చేతుల్ని విసిరికొట్టింది.

రేణుకకు కోపం వచ్చింది. కాని తమాయించుకున్నది.

"రాధి! లే! కాలేజీకి టైం అయింది. సాయంత్రం సుధీర్ని ఒకసారి నేను రమ్మన్నానని చెప్పు!"

రాధిక తలెత్తి అక్క ముఖంలోకి చూసింది.

"ఏమిటి అలా చూస్తావ్?"

"ఎందుకూ? కట్నం అడిగేవాడికి ప్రేమించడం తెలుసా అని నిలదియ్యడానికేనా?" విసురుగా అన్నది రాధిక.

రేణుక నీరసంగా నవ్వింది.

"ఆ మాట అడగాలంటే రమ్మనడం దేనికి!"

"మరి దేనికీ!"

"అధిక ప్రసంగం చెయ్యక నేను చెప్పినట్టు చెయ్యి!" అని అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది రేణుక.

'అక్కను ఎంతమాట పడితే అంతమాట అంటావటే! అది మీకోసం ఎంత త్యాగం చేసిందో ఒక్కనాడైనా ఆలోచించావా? ఎంతసేపూ నీ షోకులూ, నీ ప్రేమలూ..." తల్లి మాటలు పూర్తి కాకుండానే రాధిక విసురుగా లేచి వెళ్ళిపోయింది.

రేణుక ఆసుపత్రికి తయారై బయటకు వచ్చింది!

"అక్కా!" చంద్రం ఎదురుగా నసుగుతూ నిల్చున్నాడు.

"ఏరా? ఏం కావాలి?"

"మా కాలేజి వాళ్ళంతా బొంబాయి ఎక్స్ కర్షన్ కు వెళ్తున్నారు?"

ఓ క్షణం ఆలోచించింది.

"నువ్వు వెళ్ళు!"

చంద్రం కళ్ళు మిలమిల మెరిశాయి.

"ఎందుకురా ఈ మాత్రం దానికి ఇంత నసుగుతావ్?"

"నువ్వు ఇవాళ కోపంగా ఉన్నావ్...అందుకే!"

"కోపమా? ఎవరిమీద?" అనాలనుకుంది.

"ఎంత కావాలి?" అన్నది.

"రెండు వందలు!"

పర్సులోంచి రెండువందలు తీసి ఇచ్చి అన్నది చాలా?"

"చాలు అక్కా!" సంతోషంగా అన్నాడు చంద్రం.

"అమ్మాయ్!"

కారు ఎక్కబోతూ ఆగి నిల్చుంది రేణుక.

"ఇవాళ త్వరగా వస్తావా"

"ఎందుకూ?"

"సుధీర్ ను తీసుకు రమ్మన్నావుగా?"

"ఓ అదా! రాగానే ఆసుపత్రికి ఫోన్ చేయించు" అంటూ కారులో కూర్చుంది రేణుక కార్లో వెనక్కు వాలి కూర్చుంది.

మనసంతా ఏదోగా ఉన్నది.

తను అందరికోసం బ్రతకాలి.

తన గురించి ఆలోచించేవాళ్ళు ఎవరూ లేరు.

రేణుక కళ్ళు చెమ్మగిల్లాయి.

ఛ! ఏమిటి ఈమధ్య తను ఇలా ఆలోచిస్తున్నది. ప్రతిచిన్న విషయానికి ఇరిటేషన్ వస్తోంది. అందరూ స్వార్ధపరులుగా కన్పిస్తున్నారు.

ఎందుకని?

అందరూ మారారా?

లేదు. ఆ మార్పు తనలోనే వచ్చినట్టుగా అన్పిస్తోంది.

తనకు ఏదో కావాలి?

తనలో ఏదో అశాంతి బయలుదేరింది.

తను జీవితంలో ఎంతో దూరం ప్రయాణం చేసిన అలసిపోయిన బాటసారిలా తయారైంది. తనకు విశ్రాంతి కావాలనిపిస్తోంది. ఎవరైనా తన భుజాల మీద బరువును చేతులు చాచి అందుకోవాలని ఉంది. అలా అందుకున్న ఆ చేతుల్లో తన జీవితాన్ని పెట్టి సేద తీర్చుకోవాలని ఉంది.

అంటే...అంటే...తనలో ఫ్రస్టేషన్ అంటే... అసంతృప్తి... బయలుదేరింది.

తనను ఒంటరితనం బాధిస్తోంది.

మనసులో ఏదో ఖాళీ ఏర్పడింది. ఆ ఖాళీ పూడాలి. ఎలా? ఎలా?

ఎవరూ మారలేదు.

తనే మారింది.

అవును! తనే మారింది!

కాని తనకు అందరూ మారినట్టూ, అందరూ తనను తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నట్టూ అనిపిస్తోంది.

ఆసుపత్రి వచ్చింది.

రేణుక ఆలోచనలకు బ్రేక్ పడింది.

## 18

ఆ రాత్రి రేణుక ఎనిమిది గంటలకే ఇంటికి వచ్చింది. బాగా అలసిపోయి వున్నది. రెండు కాన్పులు సిజేరియన్ చేసింది. మిగతా కేసులు జూనియర్ ను చూసుకోమని చెప్పి వచ్చేసింది. హాలులో అందరూ కూర్చుని ఉన్నారు. వాళ్ళముందు రకరకాలు చీరెలు ఉన్నాయ్. రాధతోపాటు సుజాతా రామం కూడా కూర్చుని ఉన్నాడు.

"అక్కయ్య వచ్చింది" చిన్న చెల్లెలు సరళ సంతోషంగా అన్నది.

"రామ్మా! ఈ చీరెలు చూడు!" అన్నది తల్లి.

రేణుక ఖాళీ కుర్చీలో అలసటగా కూలబడింది.

"ఈ చీర ఎలా ఉంది అక్కయ్యా?" రాధ సంతోషంగా అంది.

ఈ మధ్య రాధ అక్కను చాలా గౌరవిస్తోంది.

రాధ తల్లి చిన్నపాటి జమిందారిణిలా ప్రవర్తిస్తోంది.

ఐశ్వర్యం అనుభవంలోకి వస్తే అలవాట్లు మారుతాయి. స్వభావంలోనూ, వ్యక్తిత్వంలోనూ కూడా మార్పు వస్తుంది.

"మీరు వచ్చి ఎంతసేపయింది?" సుజాతనూ, రామాన్నీ ఉద్దేశించి అడిగింది రేణుక.

"అవునమ్మా! రామం పెళ్ళికి మనం పెద్దగా ఏమీ పెట్టలేదు. కోడలికి కూడా చీరలు తీసుకుందామని పిల్చాను"

"మంచిపని చేశావు"

"ఈ రెండు చీరలూ చూడు!" అందించింది తల్లి.

"బాగున్నాయి. ఒకేరకం ఎందుకూ?"

"కోడలికి, రాధకూ చెరొకటి!"

"అంత ఖరీదుగల చీర నాకు ఇప్పుడెందుకంటుంటే అత్తయ్య వినడం లేదు"

"నువ్వూ రాధలాంటి దానివే! తీసుకో! రామం నువ్వు కూడా మంచి సూటు కుట్టించుకోరా!"

"నాకెందుకు అక్కా! ఇంకా చాలా ఖర్చులు ఉన్నాయ్"

"ఫర్వాలేదు తీసుకో! చంద్రానికి కూడా బట్టలు తీసుకోమని చెప్పండి"

"ఇంకా ఈ పరికిణీ...." సరళ పట్టు పరికిణీ బట్ట చూపిస్తూ ఆగింది.

"తీసుకో తల్లీ! బాగుంది" అన్నది రేణుక.

"ఈ నాలుగు చీరెలు కూడా రాధకు తీసుకుందామని..." తల్లి రేణుక ముఖంలోకి చూసింది.

"నాకెందుకమ్మా చెప్పడం? రాధకు ఏం కావాలో తీసుకోమను!" అన్నది రేణుక.

"ఆ గాజులూ, నెక్ లెసూ చూపించవే రాధీ!" అన్నది తల్లి.

"రేపు చూస్తాలే. నాకు జ్వరం వచ్చినట్టుంది. కాసేపు పడుకుంటాను" అంటూ లేచి వెళ్ళిపోయింది.

ఎవరి గొడవలో వాళ్ళు పడ్డారు.

రేణుక మంచానికి అడ్డంగా పడింది.

దుఃఖం పెల్లుబికి వస్తోంది.

అమ్మకి కనీసం తనకు కూడా ఒక చీర తియ్యాలనిపించలేదు. తను సంపాదిస్తోంది. ఖరీదైన చీరెలు కట్టదు. కోడలికి చీర కొనాలనే ఆలోచన వచ్చింది అమ్మకి. కాని తన గురించి ఆలోచన ఎవరికీ రాలేదు.

తనూ మనిషేనని, తనకూ కోర్కెలు ఉంటాయనీ అందరూ మర్చిపోయారు. తనను డబ్బు సంపాదించే యంత్రంగా మాత్రమే చూస్తున్నారు.

అమ్మ పూర్తిగా మారిపోయింది.

హోదాలు గురించి మాట్లాడుతోంది.

రాధ పెళ్ళికి ఇల్లు తాకట్టు పెట్టి డెబ్బయ్ ఐదువేలు అప్పు తీసుకుంది. మరో పదివేలు బ్యాంకు నుంచి అకౌంటులో డ్రా చేసింది. ఏభైవేలు కట్నం ముందుగానే ముట్టచెప్పడం జరిగింది. మిగతా డబ్బు అమ్మ చేతిలో పోసింది.

పెళ్ళి తను సింపుల్ గా చెయ్యాలనుకుంది. కాని అమ్మ అంగీకరించలేదు. ఇంట్లో జరిగే మొదటి ఆడపిల్ల పెళ్ళట. ఘనంగా జరగాలట...

రామం పెళ్ళి జరిగినప్పుడు తనను గురించి అమ్మ ఏడ్చింది. ఇప్పుడో!

ఆ మాట మర్చిపోయింది.

ఏమిటి తను ఇలా ఆలోచిస్తున్నది?

అమ్మ తనకు పెళ్ళేం చేస్తుంది?

కనీసం ఆ ఆలోచనైనా రాలేదేం? ఇంకా దానికి పెళ్ళేమిటిలే అనుకుంటూ ఉండి ఉండాలి. అవును! నిజమే! ఇంకా తనకు పెళ్ళేమిటి?"

రేణుక బుర్ర ఆలోచనలతో చదలపుట్టలా ఉన్నది.

తనను గురించి ఆలోచించేవారు లేరా?

ఉన్నారు!

గౌతమ్ ఉన్నాడు.

ఏమో! అతను వెళ్ళాక అమెరికా నుంచి ఒక్క ఉత్తరం కూడా తనకు రాయలేదు. అతనూ మర్చిపోయాడు.

తన రక్తం పంచుకు పుట్టినవాళ్ళు, తన సంపాదన అనుభవిస్తున్న వాళ్ళే తన గురించి ఆలోచించడం లేదు.

గౌతమ్ మాత్రం ఎందుకు ఆలోచిస్తాడు?

## 19

రేణుక మద్రాసు ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్సుకు వెళ్ళింది. ఆమె గైనకాలజీ మీద జరిగే చర్చలో పాల్గొనాలి.

రేణుక క్లాసుమేట్స్ ఎందరో కన్పించారు. హనుమంతరావు జి.హెచ్.లో ఇ.యన్.టి. సర్జెన్ గా ఉన్నాడు. తనను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్ కు వచ్చాడు. తన ఇంటికి తీసుకెళ్ళాడు. ఎంతో ఆప్యాయంగా చూశాడు.

అతనిలో కొంటెతనం ఏమైందో? ఎంత హుందాగా సంస్కారం ఉట్టిపడుతూ ఉన్నాడు? అతని వ్యవహార దక్షత చూస్తుంటే రేణుకకు ఆశ్చర్యం వేసింది.

రేణుకకు గౌతమ్ గురించి ఎవర్నయినా అడగాలని వున్నది. అడక్కుండా ఎవరైనా చెబితే బాగుండును అనుకుంది. కాన్ఫరెన్స్ పూర్తి అయింది. హనుమంతరావు బలవంతం మీద మరో రెండు రోజులు మద్రాసులో వుండిపోయింది. ఎంతోమంది భోజనాలకు పిల్చారు.

హనుమంతరావు, రేణుకా, రంగనాథం ఇంటికి డిన్నర్ కు వెళ్ళారు.

"మీరు పెళ్ళిచేసుకోకుండానే వుండిపోయారు" అన్నాడు రంగనాథం.

రేణుక పేలవంగా నవ్వింది.

"గౌతమ్ ఎక్కడ ఉన్నాడో తెలుసా?" అడిగింది.

హనుమంతరావు తృళ్ళిపడ్డాడు.

రంగనాథం అనబోయి హనుమంతరావు ముఖంలోకి చూసి ఆగిపోయాడు.

"అతని అడ్రసు తెలియదు. మీకు ఉత్తరాలు రాస్తుంటాడా?"

ఎవరూ సమాధానం ఇవ్వలేదు.

"మీకు తెలియదా?" అన్నది రాజరత్నం.

"ఏమిటి?"

"అదే గౌతమ్..." అంటూ ఆగిపోయింది.

"ఎందుకు మీరు అంతగా సందేహిస్తున్నారు. నేను గౌతమ్ కొరకు పెళ్ళి మానుకోలేదు. అతను నన్ను మోసం చెయ్యలేదు. నాన్న అకస్మాత్తుగా పోవడంతో ఇంటి బాధ్యతను తీసుకోవాల్సి వచ్చింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. గౌతమ్ విషయం చెప్పడానికి సందేహించనక్కర్లేదు. అతను పెళ్ళి చేసుకున్నాడా? నామీద కోపం వచ్చి వుంటుంది. అందుకే కనీసం ఈ దేశం నుంచి వెళ్ళాక ఒక ఉత్తరం కూడా రాయలేదు"

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వుండిపోయారని అందరి ముఖాల్లోనూ ఏదో విషాదం కన్పించింది.

"ఏమిటండీ? మాట్లాడరేం?" హనుమంతరావును అడిగింది.

"గౌతమ్ చనిపోయాడు"

రేణుక రాజరత్నం ముఖంలోకి అయోమయంగా చూసింది.

"ఇక్కడ్నుంచి వెళ్ళిన ఆరు నెలలకే కారు యాక్సిడెంటులో పోయాడు" హనుమంతరావు కంఠం జీరపోయింది.

రేణుక చలనరహితంగా కూర్చుండిపోయింది.

"సారీ! మీకు ఈ విషయం తెలియదని ఇప్పుడే తెలిసింది. చెప్పకుండా ఉండాల్సింది" నొచ్చుకున్నాడు రంగనాథం.

రేణుకకు ఏడ్పు రావడం లేదు.

రాయిలా ఉండిపోయింది.

భోజనం ముందునుంచి లేచింది.

కారులో హనుమంతరావు ఇంటికి వచ్చింది.

ఇద్దరూ మౌనంగానే వున్నారు.

ఎవరికీ మళ్ళీ ఆ విషయం ఎత్తాలని లేదు.

ఆ రాత్రి రేణుకకు పీడకలలా గడిచింది.

ఉదయం ప్లేన్ లో బయలుదేరి హైదరాబాద్ వచ్చేసింది.

ప్లేన్ లో కూర్చున్నంతసేపూ కళ్ళనుంచి నీరు ఉబికి వస్తూనే ఉన్నది. బావురుమని ఏడవాలని వున్నది. కాని ఆ పని చెయ్యలేదు. దుఃఖం ఉబికి వస్తున్నా మనసారా ఏడవలేని నిస్సహాయత ఎంత భయంకరమైనదో ఆమెకు మొదటిసారిగా అనుభవంలోకి వచ్చింది.

ఎయిర్ పోర్ట్ నుంచి తిన్నగా ఆసుపత్రికి వెళ్ళింది. గబగబా తన గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకుంది.

మనసారా ఏడ్చింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రపోయింది.

సాయంత్రం పేషెంట్సును చూసి ఇంటికి వచ్చింది.

"పొద్దుటే వచ్చావటగా?" తల్లి ప్రశ్న.

రేణుక సమాధానం ఇవ్వలేదు.

"అలా ఉన్నావేం?"

రేణుక పలకలేదు.

"ఏం జరిగిందమ్మా!"

"ఏమీ లేదు. నేను బాగానే వున్నాను. నన్ను విసిగించకు" అనేసి తన గదిలోకి వెళ్ళిపోయింది.

తల్లి నిట్టూర్చింది.

మద్రాసు వెళ్ళిందిగా? చదువుకున్న రోజులు గుర్తొచ్చి వుంటాయి. దాని ఈడువాళ్ళంతా పిల్లా పాపలతో కన్పించి వుంటారు. దాని బతుకు ఇలా బండ పాలయింది.

తల్లి కూతుర్ని గురించి మధన పడసాగింది.

"అక్కయ్య అలా ఉందేమమ్మా?"

"మీ అక్కయ్య ఎప్పుడైనా నవ్వుతుందా?" అన్నాడు రాధ మొగుడు.

"చాల్లే ఊరుకోండి. మీరు మరీను!" అన్నది రాధ నవ్వుతూ.

"మీ అక్కయ్య ఎప్పుడు చూసినా ఫ్రస్టేటెడ్ సోల్ లా కన్పిస్తుంది"

"సహజమేగా?"

పక్క గదిలోనుంచి మాటలు విన్పిస్తున్నాయ్ రేణుకకు.

"యూ రాస్కెల్స్! గెట్ అవుట్!" అని అరవాలనిపించింది రేణుక తమాయించుకుంది.

## 20

ఉదయం కాఫీ తాగుతూ "అమ్మా! ఇంకెంతకాలం వాళ్ళు ఈ ఇంట్లో తిష్ట వేస్తారు?" అన్నది రేణుక.

"వాళ్ళెందుకు వెళతారూ? హాయిగా జరిగిపోతుంటే?" అన్నాడు చంద్రం.

"నువ్వు నోరు ముయ్యరా!" తల్లి కసురుకుంది.

"ఏం ఎందుకు ముయ్యాలి? బావగారి వాలకం నాకు బొత్తిగా నచ్చలేదు. అల్లుడి బడాయి వెలగబెడుతున్నాడు. అక్కయ్యను కూడా ఎగతాళిగా మాట్లాడతాడు. అక్కా! నిన్ను చూసి ఊరుకున్నాను. లేకపోతే నేనే వెళ్ళిపొమ్మని చెప్పేసేవాణ్ణి!" ఉద్రేకంగా అన్నాడు చంద్రం.

"ఒరేయ్! చిన్నగా మాట్లాడు! వింటారు!" తల్లి చిన్నగా అన్నది.

"వింటే విననియ్! ఏభైవేలు కట్నం తీసుకున్నాడు. పెళ్ళయి ఆరు నెలలు అయింది. తన జీతం బ్యాంకులో వేసుకుంటున్నాడు" చంద్రం మళ్ళీ అన్నాడు.

"నువ్వు నోరు మూస్తావా లేదా?"

"అవునమ్మా! వాడు తప్పు మాటేమన్నాడు? ఇవాళ వాళ్ళతో చెప్పు మొహమాటం అయితే నేను చెబుతాను. చంద్రం నువ్వు చిన్నవాడివి. నువ్వు మాట్లాడకు"

"అలాగే అక్కా!"

రేణుక లేచిస్నానం చెయ్యడానికి వెళ్ళింది.

## 21

రేణుక యాంత్రికంగా ఆసుపత్రి పనులన్నీ సవ్యంగానే చూసుకుంటున్నది. మనసులో ఎవరో "గౌతమ్ లేడు. గౌతమ్ చచ్చిపోయాడు. గౌతమ్ శాశ్వతంగా వెళ్ళిపోయాడు"

అంటున్నట్టు ఏ పని చేస్తున్నా అనిపిస్తూ ఉంటుంది.

గుండెల్లో ఏదో భూగోళమంత ఖాళీ ఏర్పడినట్టు అన్పిస్తున్నది. ఏదో దిగులు నిరంతరం మృగం వెంటాడిన వేటగాడిలా వెన్నాడుతూనే ఉన్నది.

మనసారా ఎవర్నయినా కౌగిలించుకొని ఏడవాలని ఉంటుంది. ఎవరి గుండెల మీదనైనా తల ఆనించి అన్నీ బాధల్నీ మరచిపోవాలనిపిస్తుంది. కాని ఏ ఒక్కటీ చెయ్యలేదు.

"మళ్ళీ ఈ గడప ఆయన తొక్కరు!"

"బాగుందే నీ వరస! అయినా పెళ్ళి అయిన ఆడపిల్ల ఎంతకాలం భర్తతో సహా పుట్టింట్లో ఉంటావు? అది అన్నదాంట్లో తప్పేముంది?"

"నువ్వెప్పుడూ అక్కయ్యనే వెనకేసుకొస్తావ్?"

"దానికి నేనేం చేశాను? దాని సంపాదనతో బతుకుతున్న వాళ్ళం. అదే లేకపోతే ఈ కుటుంబం ఏమై ఉండేది? అది తన స్వార్థం చూసుకొని మీ నాన్న పోగానే పెళ్ళిచేసుకొని వెళ్ళిపోతే"

"ఏమయ్యేదేమిటి? ఎలాగో బతక్కపోము! అసలు మాదే బుద్ధి తక్కువ...మెడబెట్టి గెంటే వరకూ ఈ కొంపలో ఉండటం"

రేణుక తల్లిమధ్య చెల్లెలి మధ్య జరుగుతున్న సంభాషణ వింటూ గడపలోనే నిల్చుండి పోయింది.

"ఆయన అంటూనే ఉన్నారు పాపం!"

"ఏమని?"

"పాపం మీ అక్కయ్యకు పెళ్ళి కాలేదు కదా? అలాంటివాళ్ళు లోలోపల కుమిలిపోతూ ఉంటారు. మనలాంటి అన్యోన్యంగా ఉండే నూతన దంపతులను వాళ్ళు చూడలేరు. ఈర్ష్యలో కాలిపోతారు. మీ అక్కయ్య కళ్ళలో ఈర్ష్య నాకు స్పష్టంగా కన్పిస్తోంది. మనం వెళ్ళిపోదాం..అంటూ ఎన్నోసార్లు అన్నారు"

రేణుక నిలువునా దహించుకు పోసాగింది.

"ఆయన మాటలో ఉన్న వాస్తవం ఇప్పుడు నాకు అర్థం అయింది"

"ఏమిటే నీకు అర్థం అయింది?"

"తనకు పెళ్ళి కాలేదు. మాకాపురం కళ్ళనిండా చూడలేక బాధపడుతోంది."

"రాధా!" బాణం తగిలిన జంతువులా అరిచింది రేణుక.

ఇద్దరూ తృళ్ళిపడ్డారు.

తల్లి తల వంచుకొన్నది.

రాధ బిత్తరపోయి కూర్చుండిపోయింది.

"నాకు పెళ్ళి కాలేదటే? నేను పెళ్ళి చేసుకోలేదు. పెళ్ళి కాకపోవడానికీ, చేసుకోకపోవడానికి ఉన్న భేదం మీకెవరికీ అర్థం కాదు. మీరంతా స్వార్థపరులు. మీకోసం నేను పెళ్ళి మానేశాను. అంతేగాని నీ మొగుడులాంటి మొగుడు దొరక్కకాదు. జాగ్రత్త! ఎవరినోటివెంటయినా మళ్ళీ నాపెళ్ళి మాట వచ్చిందా సహించను వెళ్ళు! ఈ ఇంటినుంచి వెంటనే వెళ్ళిపో! ఒక్క క్షణం ఉండటానికి వీల్లేదు" నిప్పులు కక్కింది రేణుక.

రాధ బిత్తరపోయి కూర్చుంది.

"రేణూ! చిన్నపిల్ల ఏదో తెలియక అన్నది..."

"అమ్మా, నువ్వు కల్పించుకోకు"

"ఇప్పుడిప్పుడే వెళ్ళమంటే ఎక్కడి కెళ్తారమ్మ? ఇల్లు చూసుకోవాలిగా?"

"ఇళ్ళు చూసుకోకపోతే హోటల్లో ఉంటార్లే, ఇళ్ళు దొరికేంతవరకూ"

రాధ చివ్వున లేచి నిల్చుంది.

"ఇవాళే వెళ్ళిపోతాం. ఆయన రాగానే వెళ్ళిపోతాం! నీ ఇంట్లో ఇక అడుగు పెట్టను"

"అంతకంటే నాకు కావాల్సిందేమీ లేదు. వెంటనే మీ ఆయనతో చెప్పి వెళ్ళిపోండి" మరో మాటకు ఎదురు చూడకుండా తనగదిలోకి వెళ్ళిపోయింది.

బయట రాధ ఏడుస్తోంది. తల్లిని సాధిస్తోంది.

రేణుక మనసు భగభగ లాడిపోతోంది.

తన చెల్లెలు...తను పెంచి పెద్దచేసి...కట్నం ఇచ్చి పెళ్ళి చేసిన చెల్లెలు...ఎంత తేలిగ్గా అనేసింది? తనకు పెళ్ళికాలేదా? వాళ్ళను చూస్తే తనకు ఈర్ష్య?

ఎంత అభాండం వేసింది?

సుధీర్ ప్రవర్తన తనకు మొదటినుంచి చిరాకునే కలిగిస్తున్నది. చంద్రం మీద పెత్తనం చేస్తాడు. ఇంటి అల్లుడిగా ఫోజులు కొడ్తాడు. తనంటే కొంచెం కూడా గౌరవం చూపించడు.

అందుకే వాళ్ళు ఇంట్లో ఉండడం తనకు ఇష్టం లేదు. పైగా ఎంతకాలం ఇలా కూర్చుని తింటారు?

తన వాళ్ళంతా ఏమనుకుంటున్నారు?

వాళ్ళకోసం బ్రతికే యంత్రం అనుకున్నారా?

రోజురోజుకూ "ఎవరికోసం పెడుతుంది? ఎవరికోసం చేస్తుంది?" అన్న ధోరణి ఎక్కువై పోతుంది.

ఎవరో తలుపులు బాదుతున్నారు.

రేణుక లేచి తలుపు తీసింది.

తల్లి ఎదురుగా నిల్చుని ఉన్నది.

"ఏమిటి?"

"అల్లుడూ, రాధా అన్నంకూడా తినకుండా వెళ్ళిపోతున్నారు"

"నన్నేం చెయ్యమంటావ్?"

"ఇంత రాత్రిపూట ఎక్కడికెళ్తారు? చూసేవాళ్ళేమనుకుంటారు?"

"ఇంతకీ నన్నేం చెయ్యమంటావ్?"

"ఈ రాత్రికి వెళ్లొద్దని చెప్పు! రెండురోజుల్లో ఇల్లు చూసుకొని వెళ్ళమని చెప్పు!"

"నువ్వే చెప్పు?"

"నా మాట వినడం లేదు. ఇల్లు నీదట. నువ్వు అంత అవమానం చేశాక ఒక్క క్షణం ఉండము అంటున్నారు"

"వెళ్ళమనూ!"

రేణూ!"

"అమ్మా! నన్ను విసిగించకు! నేను చెప్పాల్సింది చెప్పేశాను" అంటూ భళ్ళున తలుపు వేసుకుంది రేణుక.

## 22

భూమి తన చుట్టూ తాను తిరుగుతూ మరో నాలుగుసార్లు సూర్యుడిచుట్టూ తిరిగింది.

ఒక జాతి జీవితంలో నాలుగేళ్ళు చాలా చిన్నది. చెప్పుకోదగిన మార్పులు రాకపోవచ్చును. కాని వ్యక్తి జీవితంలో నాలుగేళ్ళు చాలా ఎక్కువనే చెప్పాలి. అదీ పెరుగుతున్న వయసులో మరో నాలుగేళ్ళు రేణుక జీవితంలో ఎలాంటి మార్పుల్లేకుండా గడిచిపోయాయి. ఆమె గానుగెద్దులా ఆసుపత్రి చుట్టూ, ఇంటిచుట్టూ తిరుగుతూనే ఉన్నది. డబ్బు సంపాదిస్తూనే ఉన్నది. ఆ డబ్బు కోసం చెల్లెళ్ళూ, తమ్ముళ్ళు నిత్యం పోటీలు పడుతూనే ఉన్నారు.

రాధకు ఇద్దరు పిల్లలు పుట్టారు. ఆడపిల్ల పెద్దది. దాని పేరు అమూల్య. కొడుకు చిన్నవాడు వాడి పేరు ఆదిత్య.

రామానికి ఒకే కొడుకు. రామం కొడుకు పేరు గౌతమ్ అని పెట్టాడు. ఆ పేరు పెట్టాలని నిశ్చయించుకుని రేణుక సలహా రామం అడిగినప్పుడు రేణుక తృళ్ళిపడింది.

"ఏం అక్కా నీకు ఆ పేరు ఇష్టం లేదా? మరోపేరు నువ్వే చెప్పు పోనీ!" అన్నాడు.

"నాకు చాలా ఇష్టం! ఆ పేరంటే నాకు చాలా ఇష్టం రామూ! నువ్వు ఆ పేరు పెట్టాలనుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. థ్యాంక్యూ...థ్యాంక్యూ!" ఆవేశం...దుఃఖం ఆమె కంఠంలో నేను ముందు అంటే నేను ముందు అంటూ పోటీపడ్డాయి.

రామం వెర్రివాడిలా అక్క మొహంలోకి చూశాడు. ఆ పేరు అనగానే అక్క ఎందుకు అంత తృళ్ళిపడిందో అర్థం కాలేదు. ఆ తర్వాత అంత ఉద్రేకంగా మాట్లాడిందో అంతకంటే అర్థం కాలేదు. తనకు ధన్యవాదాలు చెప్పేసరికి రామానికి దాదాపు మతిపోయినట్టే అన్పించింది.

రామం ముఖం చూశాకగాని రేణుక తను చేసిన పొరపాటు అర్థంకాలేదు. అలా బయటపడిపోయినందుకు ఆమె మనసు ముడుచుకు పోయింది.

"రామం! నేను ఇంకేదో సీరియస్ కేసు గురించి ఆలోచిస్తూ ఏదో యధాలాపంగా మాట్లాడినట్టున్నాను. నా స్నేహితురాలికి క్యాన్సర్ వచ్చింది. ఆ విషయం నాకు ఇంతకు ముందే తెలిసింది. సారీ! ఆ బాబుకు ఏం పేరు పెట్టాలనుకున్నావ్? గౌతమ్ కదూ? బాగానే ఉంది. కాని అతకంటే సిద్ధార్థ బాగుంటుందేమో?" తమ్ముడి ముందు తను బయటపడిపోకుండా తన తడబాటును తెలివిగా సర్దుకుంది.

"సిద్ధార్థ పలకడం కష్టం అక్కా!"

"గౌతమ్ బాగానే ఉంది. ఆ పేరే పెట్టు"

"సాయంత్రం త్వరగా వస్తావుగా!"

"వస్తాను"

ఆనాటి నుంచి రేణుకకు రామం కొడుకంటే తెలియని మమకారం ఏర్పడింది. గౌతమ్! గౌతమ్! అని నోరారా పిలుస్తూనే వుంటుంది. గౌతమ్ ఎక్కువగా నాయనమ్మ దగ్గిరే వుంటాడు. వాడికి అత్త అంటే మహా ఇష్టం.

ఒక్కోసారి అర్థరాత్రి నిద్రలేచి "రేనత్తకావాలి" అని ఏడుస్తాడు-రామం బయలుదేరివచ్చి రేణుకను చూపిస్తే గాని ఊరుకోడు.

రేణుక గౌతమ్ కు రకరకాల బాబా సూట్లు కుట్టించేది.

రాధకు ఇదంతా బాధగా వుంటుంది.

రాధ భర్త బ్యాంకులో అకౌంటెంటుగా పని చేస్తున్నాడు.

రాధ నాలుగేళ్ళనాడు మళ్ళీ ఆ గడప తొక్కనని వెళ్ళిపోయింది. కాని అందువల్ల నష్టం ఎవరికో అర్థం చేసుకోవడానికి అట్టే కాలం పట్టలేదు.

రాధ కూతురికి నాలుగేళ్ళు నిండుతున్నాయ్. అమూల్య గౌతమ్ కంటే రెండు నెలలు పెద్దది. అమూల్యను తల్లిదగ్గిర వదిలెయ్యాలని రాధ కోరిక. గౌతమ్ అక్కడ ఉండటం ఇష్టం లేదు. తల్లికి గౌతమ్ తోపాటు అమూల్యను కూడా తన దగ్గిరే పెట్టుకోవాలని ఉంటుంది. కాని రేణుక అందుకు అంగీకరించలేదు.

చంద్రం ఎం.ఎస్.సి. పూర్తి చేసి అమెరికా వెళ్ళిపోయాడు. చంద్రం వెళ్ళి ఆరునెలలు అయింది. పెళ్ళిచేసుకోలేదు. చంద్రం వెళ్ళినకొద్ది రోజులలోనే అతని నుంచి అక్కకు ఉత్తరం వచ్చింది. తమ్ముడి ఉత్తరం చదివి రేణుక ఆశ్చర్యంతో తల మునకలైపోయింది. క్షేమ సమాచారాలతోపాటు చంద్రం అక్కను పెళ్ళి చేసుకోమని బోధించాడు. చిన్నవాడై అలా చెబుతున్నందుకు క్షమించమన్నాడు. ఎవరి స్వార్థం వాళ్ళు చూసుకుంటున్నారనే అక్కను గురించీ, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించేవాళ్ళు లేరనీ రాశాడు. రేణుక భవిష్యత్తు గురించి బాధపడుతూ రాశాడు. చివరకు "అక్కా! నీకు ఈ వయసులో పెళ్ళేమిటి అనిపించినా, చేసుకోవడం మరే కారణం వల్లనైనా ఇష్టం లేకపోయినా నీకు ఎవరూ మిగల్లేదని బాధపడకు. నేను వున్నాను. నేను అక్కడే వుంటే నాపెళ్ళి మీరు ఎలాగయినా చేసేస్తారని నాకు తెలుసు. నువ్వు పెళ్ళి చేసుకున్న తర్వాతనే నేనూ చేసుకుంటాను. లేదా ఇలాగే ఉంటాను. నా చదువు పూర్తికాగానే (రెండు సంవత్సరాలేగా) అక్కడికి వచ్చేస్తాను. ఇక్కడ సెటిల్ అవుతానని అందరిలా నువ్వూ భావించి ఉంటావ్. లేదక్కా! నేను వస్తాను. కేవలం నీకోసం వస్తాను. నువ్వు మాకోసం నూరేళ్ళ జీవితాన్ని త్యాగం చేశావు. చిన్నవాణ్ణి...లోలోపల మధనపడేవాణ్ణి. ఏమీ ఎవర్నీ అనలేకపోయేవాణ్ణి.

నువ్వు సంతోషంగా ఉండాలక్కా! ఈ దేశంలో ఏభై ఏళ్ల తర్వాత కూడా ఆడవాళ్ళు పెళ్ళి చేసుకుంటారు. ఇప్పుడు మన దేశంలో కూడా నలభైదాటిన వాళ్ళు చేసుకుంటారు. దుర్గాభాయి చేసుకోలేదు? ఇంటలెక్చుయల్ కంపానియనిష్ షిప్ ఈ వయస్సులో అవసరం. వంటరి జీవితాన్ని ఎంతకాలం గడుపుతావు? నీకు నచ్చినవాణ్ణి చూసుకొని పెళ్ళి చేసుకో. ఇలా రాస్తున్నానని కోపగించుకోకు"

"లేదురా! నీమీద కోపగించుకోను. కనీసం నువ్వయినా నా గురించి ఆలోచిస్తున్నావ్.

అందరిలా నువ్వూ స్వార్థపరుడివే అనుకున్నాను. అన్ననూ, అక్కనూ చూసినంతగా నిన్ను, చిన్న చెల్లినీ చూడలేదు. అప్పటికే నా మనసు విరిగిపోయింది" మనసులోనే అనుకుంది. రేణుక కళ్ళు చెమ్మగిల్లాయి.

తనకంటే పద్నాలుగేళ్ళు చిన్నవాడు. తన గురించి ఆలోచిస్తున్నాడు. తనకోసం పెళ్ళి మానేస్తాడట పిచ్చివాడు. అలా వీల్లేదని, తనకు నచ్చినపిల్లని చేసుకోమని రాయాలి.

రేణుకకు పెద్ద స్నేహితులు లేరు. కాని ఈ మధ్య ఆమె స్నేహితుల సంఖ్య పెరిగింది. తన వంటరితనం నుంచి ఊరట కలిగించు కొనేందుకు స్నేహితుల ఇళ్ళకు భోజనానికి వెళుతూ ఉండేది. సినిమాలకు వెళ్ళేది. లాయర్ లక్ష్మి ఆమెకు ఆప్తురాలు. ఆమెకు ముప్పయ్ ఐదేళ్లు వుంటాయి. చిన్నప్పుడే మేనమామకిచ్చి ఇష్టంలేని పెళ్ళి చేశారు. ఆమె అతనితో

కాపరానికి వెళ్ళలేదు. లా చదివింది. అతను మరో పెళ్ళి చేసుకున్నాడు. లక్ష్మి రేణుక ఇంటికి అప్పుడప్పుడు భోజనానికి వచ్చేది. లక్ష్మి పొరపడలేక రేణుక ఖరీదైన చీరెలు కొన్నది. తన వేష భాషల మీద ఇంతకుముందు లేని శ్రద్ధ వచ్చింది. ఆమెలో వచ్చిన ఆ మార్పు రాధకు రుచించలేదు.

"ఇప్పుడెందుకమ్మా అక్కకు ఆ చీరెలు. డబ్బంతా పాడు చేస్తున్నది. ఆ లక్ష్మి కేం? ఏ బాదరబందీ లేదు. పెద్ద ప్రాక్టీసు లేకపోయినా ఎప్పుడూ టిప్ టాప్ గానే ఉంటుంది. అక్కయ్య స్నేహితులకు దుబారా చేస్తున్నది" అన్నది తల్లితో ఒకరోజు.

"దానిష్టం! అది సంపాదించుకుంటున్నది. ఖర్చు పెట్టుకుంటున్నది. మధ్య మీకెందుకే ఆ బాధ?" అన్నది తల్లి.

రాధ కూతుర్ని తల్లి దగ్గర వదిలేసింది. ఆమె భయం అక్క సంపాదించిందంతా గౌతమ్ కే ఇస్తుందని.

సుందరమ్మకు రాధ కూతురంటే ఎంతో ప్రేమ. గౌతమ్, అమూల్యా ఇద్దరూ రేణుక ఇంట్లోనే ఉంటున్నారు. రేణుక ఒకటి రెండు సార్లు తల్లి మీద విసుక్కుంది. ఆ తర్వాత మానేసింది.

ఆ రోజు రేణుక ఆసుపత్రికి బయలుదేరింది. లక్ష్మి కూడా వచ్చింది. లక్ష్మికి ఆరోజు కోర్టు లేదు" అమ్మా మధ్యాహ్నం భోజనానికి రాను!" అన్నది.

"ఎక్కడ భోజనం చేస్తావ్?"

మా స్నేహితురాలు విమలా, సరోజా, నేనూ, రేణుకా హోటల్లో భోజనం చేసి సినిమాకు వెళ్తాం అనుకుంటున్నాం" అన్నది లక్ష్మి. సరోజ లెక్చరర్. పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. అయినా పిక్ నిక్ లూ, సినిమాలు అంటూ ప్రోగ్రాంలు వేస్తుంది. పిల్లల్ని అత్తగారు చూసుకుంటారు. భర్త చాలా మంచివాడు. దేనికీ అభ్యంతరం చెప్పడు. విమల కూడా లెక్చరరే! ప్రేమించి పెళ్ళి చేసుకుంది. రెండేళ్ళు తిరక్కుండా వుంటుంది. లక్ష్మి క్లాసుమేట్. మమ్మల్ని అందరూ సంతోషంగా ఉంచడానికి ప్రయత్నం చేస్తారు. చాలా అందమైన విమల్ని మళ్ళీ వివాహం చేసుకుంటామని యువకులు ఎందరో ముందుకు వచ్చారు. కాని ఆమె అందుకు అంగీకరించలేదు.

"అమ్మాయ్"

కారు ఎక్కబోయి ఆగి తల్లికేసి చూసింది.

"ఇలా రా ఒక్కసారి!"

రేణుక లోపలకు వెళ్ళింది.

"ఎల్లుండి అమూల్య పుట్టి నాలుగేళ్లు పూర్తయి ఐదోఏడు వస్తుంది."

"అయితే!"

"రాధకు పుట్టినరోజు చెయ్యాలని ఉన్నది"

"చెయ్యమను!"

"ఇక్కడే చేద్దామని!"

"చెయ్యండమ్మా! నేను వద్దంటానా?"

"అన్ని ఏర్పాట్లూ చెయ్యాలి"

రేణుక లోపలకు వెళ్ళి బీరువా తెరచి వెయ్యి రూపాయలు తెచ్చి తల్లి చేతిలో పెట్టింది. తల్లి ముఖంలో సంతోషంతో విప్పారడం చూసింది. గబగబా బయటికి వెళ్ళిపోయింది.

రాధ రెండురోజుల ముందే కొడుకును తీసుకుని పుట్టింటికి వచ్చింది. కూతురి పుట్టినరోజు ప్రయత్నాలు చెయ్యసాగింది. వెయ్యి మాత్రమే రేణుక ఇచ్చినందుకు గొణిగింది.

పుట్టినరోజు వచ్చింది. చాలామందిని పిల్చింది రాధ. భర్త ఆఫీసులో పనిచేసే కొందర్ని పిలిచారు.

"అక్కా త్వరగా వస్తావు గదా?" బయటకు వెళ్తున్న రేణుకతో అన్నది రాధ.

"అలాగే నమ్మా!"

"పెద్దమ్మ కొత్త బట్టలు" తలంటుకొని కొత్తబట్టలు వేసుకుని రేణుక దగ్గిరకు వచ్చి చూపించింది.

"బాగున్నావమ్మా!" రేణుక అమూల్యను ఎత్తుకొని బుగ్గ మీద ముద్దు పెట్టుకొని దించింది.

"అత్తయ్యా!"

"ఏం బాబూ?"

"నాకూ కొత్త బట్టలు"

"నీకు కొనలేదా?"

"ఊహు!"

"ఏమ్మా గౌతమ్ కు కూడా ఒక జత తీసుకోకపోయావూ?"

"వాడికి బోలెడున్నాయ౧ ఎందుకులే అనుకున్నాను, ఇప్పుడు పేచీ పెడుతున్నాడు. ఉన్న బట్టలు ఏమీ వేసుకోడట. కొత్తవి కావాలట!"

"నీకు నేను సాయంత్రం తెస్తాను. అంతవరకూ పెట్టెలోనివి వేసుకో! సరేనా?"

గౌతమ్ తల వూపాడు.

వాణ్ణి కూడా ఎత్తుకుంది. ఎత్తుకోగానే అత్త బుగ్గ మీద ముద్దు ఇచ్చాడు. రేణుక రెండో బుగ్గ చూపించింది. మరో ముద్దు ఇచ్చాడు.

"సాయంత్రం మంచి బట్టలు తెస్తాను! అల్లరి చెయ్యకూడదు. నానమ్మను ఏడిపించకూడదు" అంటూ గౌతమ్ ను దించి పిల్లలిద్దరికీ టాటా చెప్పి వెళ్ళిపోయింది రేణుక.

రేణుక కార్లో కూర్చుంది.

ఎందర్నో అమూల్య పుట్టినరోజుకు పిల్చారు!

"నీ స్నేహితుల్ని కూడా పిలువు!" అని అమ్మగానీ, రాధగానీ అనలేదు.

తన స్నేహితులంటే రాధకు వళ్ళు మంట. అమ్మ పెద్దది. ఆమాత్రం అనకూడదూ? రాధకు కోపం వస్తుందని ఊరుకుందేమో? రాధకు కోపం ఎందుకు రావాలి? పార్టీకి ఊళ్ళో వాళ్ళంతా వస్తారు. తన స్నేహితులు మాత్రం రాకూడదా? ఇల్లు తనది డబ్బు తనది!

ఛ! ఏమిటిది? డబ్బు!డబ్బు! తను కూడా అస్తమానం డబ్బు గురించి ఆలోచిస్తున్నది! పసిదానికి ఏదో సరదాగా పుట్టినరోజు చేస్తుంటే తను ఇంతగా ఆలోచించాలా?

తనకు తెలియకుండానే తనలో చాలా మార్పు వస్తోంది.

"అమ్మా! మీ స్నేహితురాలట, ఎవరో వచ్చారు"

"ఎవరూ?" రోగిని పరీక్షిస్తూ తల ఎత్తకుండానే జూనియర్ ని అడిగింది రేణుక.

"ఎవరోనమ్మా! మీతో చిన్నప్పుడు చదువుకున్నదట. ముసలమ్మలాగుంది.

రేణుకకు నవ్వు వచ్చింది.

"నేను ముసలమ్మలా లేనూ?"

"మీరు చాలాచిన్నగా కన్పిస్తారమ్మా! ఆమెను మీ అమ్మ అని చెప్పినా నమ్ముతారు"

రోగిని పరీక్షించి "ఆమెను రమ్మను" అన్నది సెత్ తీసి పక్కన టేబుల్ మీద పెట్టి.

గడపలో అలికిడి అయింది. రేణుక తలెత్తి చూసింది. చూస్తూనే ఉండిపోయింది.

"ఏమిటోయ్ అలా చూస్తావ్?" నవ్వుతూ వచ్చి ఎదురు కుర్చీలో కూర్చుంది.

పట్టుచీర చుట్టినట్టు కట్టుకుంది. బాగా నలిగి ఉన్నది. అక్కడక్కడ నూనె మరకలు కన్పిస్తున్నాయి. సన్నగా తెల్లగా ఉన్న పిల్లను వళ్ళో కూర్చో పెట్టుకున్నది.

"నేను బాగా మారిపోయానా? గుర్తుపట్టలేదా?"

"మీరు....."

"మీరు ఏమిటేవ్! అంటే గుర్తుపట్టలేదన్న మాతగ నువ్వు మాత్రం పెద్దగా మారలేదు తెలుసా? కాస్త జుట్టు మాత్రం అక్కడక్కడ నెరసింది. కళ్ళు అలసటగా ఉన్నాయ్. చుట్టూ కొంచెం నలుపు వచ్చింది. అప్పటికంటే కాస్త వళ్ళు చేశావ్. పదిహేనేళ్ళయిందే చూసి. నువ్వు ఈ నర్సింగ్ హోం పెట్టిన కొత్తలో చూశాను" గడగడ చెప్పేస్తున్నది.

రేణుకకు ఆ ముఖం సుపరిచితంగానే ఉన్నది. గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది.

"నేను సీతాలక్ష్మిని"

"అరే నువ్వా సీతా!" సంతోషంతో ఎగిరి గంతేసినట్టు అన్నది రేణుక.

"పోనీలే, ఇప్పటికైనా గుర్తించావు!" దెప్పుతున్నట్టు అన్నది.

"క్షమించవే! మరీ అంత లావైపోయావ్! పైగా ఎంత శ్రద్ధగా డ్రెస్ చేసుకొనే దానివి, ముగ్గుబుట్టలా తలా నువ్వాను. కాస్త రంగు వేసుకోకూడదూ? మా జూనియర్ ఏమన్నదో తెలుసా?"

"ఏమన్నది!"

"ఎవరో ముసలమ్మ మీ క్లాస్ మేట్ ను అంటున్నదమ్మా!" అన్నది.

అదేదో నువ్వు తప్పు మాట అన్నట్టు.

సీతాలక్ష్మి గలగల నవ్వింది.

రేణుక కూడా శృతి కలిపింది. ఎంతో కాలానికి రేణుక అంత హాయిగా పెద్దగా నవ్వింది.

"అంత సన్నగా ఉండేదానివి. మూడు సున్నాలు చుట్టినట్టు తయారయ్యావేమిటే?"

"నువ్వు బ్రహ్మచారిణివి. నాకు పిల్లాజల్లా!"

"ఈ పిల్ల నీ కూతురా!"

"ఇంకా నయం. నా మనమరాలు. మనకు వయసు తక్కువా? పైగా నీకంటే నేను రెండేళ్ళు పెద్ద. నీకు నలభైరెండు నిండాయనుకుంటాను.

రేణుక గతుక్కు మన్నది "అవును!" సాలోచనగా అన్నది.

చిత్తూరులో తనూ-సీతాలక్ష్మి ఎనిమిదో క్లాసు నుంచి పదిదాకా కలిసి చదువుకున్నారు. సీతాలక్ష్మి శ్రీమంతుల బిడ్డ. రకరకాలు నగలూ, ఖరీదైన బట్టలూ. ఎప్పుడూ పెళ్ళి పేరంటాలులా తయారై స్కూలుకు వచ్చేది. చదువులో అంతంతమాత్రమే. మగపిల్లలు తెగ ఏడ్పించేవాళ్ళు "ఒసే!ఏమే!" అంటూ పిల్చుకొనేవాళ్ళు. నెలకు పదిహేను రోజులు తను వాళ్ళింట్లోనే భోజనం చేసేది.

పది పూర్తి చెయ్యగానే సీతాలక్ష్మికి పెళ్ళి చేశారు. తల్లిదండ్రులకు చదివించాలని ఉండేది. సీతాలక్ష్మికి చదువు మీద శ్రద్ధలేదు. పెళ్ళి చేసుకుంటానన్నది. అత్తవారింటికి వెళుతూ తనను కౌగిలించుకొని ఎంత ఏడ్చింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఒకసారిగా పాతికేళ్ళు వెనక్కు నెట్టేశావ్ నువ్వు వచ్చి"

నవ్వింది సీతాలక్ష్మి.

"ఈ ఊరు ఎప్పుడొచ్చావ్! అమ్మా నాన్నా పోయారనుకుంటాను"

"ఎవరూ లేరు. ఇద్దరూ పోయారు. మావారికి ఈ ఊరు ట్రాన్స్ ఫర్ అయింది. ఇన్ కంటాక్సు ఆఫీసరు. ఇంకా నాలుగేళ్ళు సర్వీస్ మాత్రమే ఉన్నది. నాకంటే ఆయన ఐదారేళ్ళు పెద్ద"

"ఈ పాప!"

"నా పెద్దకూతురు వనజ కూతురు. దాన్ని నువ్వు ఐదేళ్ళప్పుడు చూశావ్!

"అవును, ఎంతమంది నీకు?"

"ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. అందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. చిన్నదానికీ, చిన్నవాడికీ తప్ప. పెద్దవాడు అమెరికాలో డాక్టరు. చిన్నవాడు యు.కెలో డాక్టరీ చదువుతున్నాడు.

పెద్ద అల్లుడు మొన్ననే అమెరికా వెళ్ళాడు. వనజకు వీసా రాగానే వెళ్ళిపోతుంది. రెండోది కోయంబత్తూరులో ఉన్నది. వాళ్ళ ఆయనకు అక్కడ బిజినెస్. చిన్నది ఇంటర్ చదువుతోంది. పెద్ద వాళ్ళిద్దరికీ పదిహేడు ఏళ్లు నిండకుండానే పెళ్ళిళ్ళు చేశాం. వాళ్ళకు నా చాలే వచ్చింది. చిన్నది మాత్రం పెళ్ళి చేసుకోదట. చదువుతానంటున్నది" గలగలా చెప్పుకుపోతూ ఉన్నది సీతాలక్ష్మి.

రేణుక కాఫీలు తెప్పించింది. పాపకు బిస్కెట్లు తెప్పించింది.

"నాకు చాలా సంతోషంగా ఉన్నదే!"

"ఎందుకూ? ఇంత మంది పిల్లల్ని కన్నందుకా లేక ముసలమ్మలా అయినందుకా?" హాయిగా నవ్వుతూ అన్నది సీతాలక్ష్మి.

సీతాలక్ష్మి ముఖంలోకి పరిశీలనగా చూచింది రేణుక.

ఆ కళ్ళలో, ఆ ముఖంలో ఎంతో సంతృప్తి కన్పించింది.

"నీ మొహం! ఈ ఊరు ట్రాన్స్ ఫర్ అయినందుకు నాకు స్నేహితులు ఎక్కువ ఉండరని తెలుసుగా? ఉన్నా ఒక హద్దు వరకే ఉంటాను. చిన్ననాటి స్నేహితురాలివి. మనసిచ్చి మాట్లాడుకోగలిగిన వ్యక్తి ఇంత కాలానికి మళ్ళీ కలిసినందుకు సంతోషంగా వున్నది"

"నువ్వేం మారలేదు!"

"ఏ విషయంలో!"

"అన్ని విషయాల్లోనూ!"

రేణుక సమాధానంగా చిరునవ్వు నవ్వింది.

"అయితే నువ్వు ఇంకా పెళ్ళి చేసుకోలేదన్నమాట!"

"ఆ విషయాలు తీరిగ్గా మాట్లాడుకుందాం, పేషెంట్స్ ను పంపి వస్తాను. నువ్వు నా యాంటీరూంలో కూర్చో!" రేణుక లేచి సీతాలక్ష్మిని యాంటిరూంలో కూర్చోబెట్టి వచ్చింది.

రోగుల్ని పరీక్షిస్తున్నది. మనసు మనసులో లేదు. సీతాలక్ష్మి గురించి ఆలోచిస్తున్నది. గౌతమ్ తో తన భవిష్యత్తు గురించి కన్న బంగారు కలల గురించి ఆలోచిస్తున్నది.

లక్ష్మిలో ఎంత మార్పు?

మాటతీరులో కూడా మార్పు ఉన్నది.

తనకు అమ్మమ్మ అయ్యే వయసు వచ్చిందా?

ఆలోచనలను బట్టే మనిషిలో మార్పు వస్తుంది. వయసు ప్రభావం అందరి మీదా వుంటుంది. కాని తనలా వయసు గురించి ఆలోచించకుండా, ఎప్పుడూ బిజీగా పనిచేసేవాళ్ళ మీద వయసు ప్రభావం చిన్నగా వుంటుంది.

ఆడవాళ్ళు పెళ్ళి అయి పిల్లలు పుట్టగానే మారిపోతారు. అందరూ కాకపోవచ్చును. ఎక్కువ మంది.

పని పూర్తిచేసి చేతులు కడుక్కొని నాప్ కిన్ తో తుడుచుకుంటూ యాంటీ రూంలోకి వచ్చింది రేణుక.

సీతాలక్ష్మి ఉన్నట్టుండి వళ్ళో ఉన్న పిల్ల మూతిమీదా, ముఖం మీదా ముద్దులు వర్షం కురిపించ సాగింది.

ఆ పిల్ల గింజుకో సాగింది.

రేణుక చిత్రంగా చూసింది.

"అదేమిటోయ్! ఎంత ముద్దొస్తే మాత్రం పిల్లల్ని అలా గింజుకొనేలా ముద్దులు పెట్టుకోవడం? పైగా పెదవులు మీద ముద్దు పెట్టుకోవడం అంత ఆరోగ్యకరమైంది కాదు"

సీతాలక్ష్మి రేణుక ముఖంలోకి విస్మయంగా చూసింది.

"పిల్లల గురించి, ప్రేమలు గురించి నీకేం తెలుసు?" అన్నట్టు ఉన్నాయ్ ఆమె చూపులు.

రేణుక మనసు ఎలాగో అయింది.

"పని అయిపోయిందా?"

"ఆ"

"పద మా ఇంటికి వెళ్దాం!"

"ఇప్పుడా?"

"ఏం? ఏదైనా అర్జంటు పని ఉన్నదా?"

"అదేం లేదు"

"అయితే పద" అంటూ లేచింది సీతాలక్ష్మి.

"ఎలా వచ్చావ్?"

"మావారు ఆఫీసుకు వెళ్తూ డ్రాప్ చేసి వెళ్ళారు"

కార్లో రేణుక పక్కన ముందు సీట్లో కూర్చుంటూ "నువ్వే డ్రైవ్ చేస్తావా? డ్రైవర్ని పెట్టుకోలేదా?"

"డ్రైవరు ఉన్నాడు. ఆరోగ్యం బాగాలేదు. రెండు రోజులు శెలవు పెట్టాడు" అన్నది రేణుక కారు స్టార్ట్ చేస్తూ.

"రేణూ! నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు?"

రేణుక సడన్ బ్రేకు వేసింది. కారు ముందుకు వెనక్కూ కదిలింది.

"వాడు చూడు! అడ్డంగా వచ్చి పైగా నన్ను కొరకొర చూస్తున్నాడు" అన్నది రేణుక.

తను వేసిన ప్రశ్న రేణుకను కల్లోల పరిచిందని అర్థం చేసుకున్నది సీతాలక్ష్మి.

"అమ్మ ఎలా ఉన్నది?"

"బాగానే ఉన్నది"

"తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ....?"

రేణుక అందరి గురించీ చెప్పింది.

"రాధకు ఇద్దరు పిల్లలు కూడానా? ఏ ఊళ్ళో ఉంటున్నది"

"ఇక్కడే!"

"నీ దగ్గరేనా!"

"కాదు. వాళ్ళాయన బ్యాంకులో పనిచేస్తున్నాడు. అరండల్ పేటలో ఉంటున్నారు.

"ఇళ్ళు కట్టించావటగా?"

"ఊ"

"బ్యాంకులో ఎన్ని లక్షలు ఉన్నాయ్!"

రేణుక చిరునవ్వు నవ్వింది. సమాధానం ఇవ్వలేదు.

కారు ఒక ఇంటిముందు ఆగింది.

"అతి కష్టం మీద ఈ పోర్షన్ దొరికింది. పెద్దింటికోసం వెదుకుతున్నాం. హైదరాబాద్ బంజారాహిల్స్ లో ఇల్లు కట్టించుకున్నాం. అద్దె రెండు వేలు. మావారు రిటైర్ అయ్యాక అక్కడ సెటిల్ అవుతాం!"

రేణుక వింటూ నడిచింది.

ఇల్లంతా చిందర వందరగా వున్నది.

"అమ్మా వీరేనా మీ క్లాస్ మేట్!"

"మా పెద్దమ్మాయి వనజ!"

"నమస్కారమండీ!"

"నమస్కారం! ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. ఇప్పుడు చూస్తుంటే ఇరవై ఏళ్ళ క్రితం నిన్ను చూసినట్టే ఉన్నది సీతా!"

"అమ్మా! ఆంటీ మీ క్లాస్ మేట్ అంటే ఎవరూ నమ్మరు" అన్నది వనజ.

"పెళ్ళయి నాలాగా ఓ అరడజను మందిని కని ఉంటే నాలాగా ఉండేదే!" సీతాలక్ష్మి పకపక నవ్వింది. తన జోకుకు తనే.

రేణుకకు నవ్వు రాలేదు.

రేణుకను పడకగదిలోకి తీసుకు వెళ్ళింది. పెద్ద పెద్దవి నాలుగు ఆల్బమ్స్ తీసి ముందు వేసింది. ఒక్కొక్కటే తెరిచి చూపించసాగింది సీతాలక్ష్మి. రేణుకకు పెద్దగా చూడాలని లేదు. చాలామంది అలాగే చేస్తారు. ఆ ఫోటోలలో ఉన్నవాళ్ళు చాలామంది తెలిసి ఉండరు. అయినా చూపిస్తున్నారు. కనుక ఇంటరెస్టుగా చూస్తున్నట్టు ఎదుటి మనిషి నటించక తప్పదు. ఇదోరకమైన టీజింగ్ గా అన్పిస్తుంది రేణుకకు. అందుకే రేణుక ఎప్పుడూ ఎవరికీ తన ఆల్బమ్స్ చూపించదు. అడిగితే చూసుకోమని ఇచ్చేస్తుంది.

"రేణూ మనం ఎన్ని కబుర్లు చెప్పుకొనేవాళ్లం! ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకున్న రోజులు గుర్తొస్తున్నాయ్"

"కొంపదీసి ఇప్పుడు కూడా ఆపని చేద్దామంటావా ఏమిటి!" రేణుక భయం నటిస్తూ అన్నది.

సీతాలక్ష్మి గొల్లున నవ్వింది.

"అమ్మా వడ్డించాను రండి?"

"లే! రేణూ భోజనం చేద్దాం!"

"ఇప్పుడు భోజనమా....."

"ఒకటిన్నర అయింది. ఇంకా నీకు టైం కాకపోతే ఆగుదాం!"

"అదికాదు ఇంటికి వెళ్దామని"

"వెళ్దువు గానిలే ఇంతకాలానికి కన్పించావ్! భోజనం చెయ్యకుండా ఎలా వెళ్ళనిస్తాననుకుంటున్నావే?"

ఇద్దరూ ఎన్నో కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు.

పడక గదిలోకి వచ్చారు.

"కాసేపు పడుకో!"

"పగటినిద్ర అలవాటు లేదు"

"ఊరికే అలా నడుంవాల్చు" అంటూ సీతాలక్ష్మి రెండో మంచంమీద నడుం వాల్చింది.

రేణుక కూడా పడుకుంది.

"రేణూ!"

"ఆ" కళ్ళుమూసుకొనే అన్నది.

"ఇప్పుడు చెప్పవే!"

"ఏమిటి?"

"నీ గురించి"

"నా గురించా? ఏముంది చెప్పడానికి?"

"రేణూ నేను పరాయి దాన్నిగా కన్పిస్తున్నానా! నా దగ్గిర కూడా నీకు సందేహమేనా?"

రేణుక ఆలోచిస్తూ పడుకుంది.

"నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదే? ఎవర్నో ప్రేమిస్తున్నట్టు ఒకసారి నువ్వు శెలవులకు చిత్తూరు వచ్చినప్పుడు చెప్పావ్"

రేణుక మౌనంగా ఉండిపోయింది.

"అతను మోసం చేశాడా? అందుకే ఇలా ఉండిపోయావు గదూ?"

"చెప్పు రేణూ! ఎవడో ఒకడు మోసం చేసినంత మాత్రాన పెళ్ళి చేసుకోకుండా ఉండడం మూర్ఖత్వం. నీకు నేను చెప్పదగినదాన్ని కాదనుకో! నాకంటే ఎక్కువ చదివిన దానివి. అయినా జీవితానుభావం నాకే ఎక్కువ ఉన్నది. నీ క్షేమం కోరే దాన్ని. అందుకే అడుగుతున్నాను. నీకు బాధ కలిగిస్తే మళ్ళీ ఆ ఊసు ఎత్తను?"

"అతను మోసం చెయ్యలేదు" తనకు తానే చెప్పుకుంటున్నట్టు అన్నది.

"మరి?"

"నాన్నగారు యాక్సిడెంటులో పోవడం గురించి నాకు తెలుసు. ఇంటి బాధ్యత నామీద ఉందని కూడా తెలుసు"

"అవును! నువ్వు ఆసుపత్రి పెట్టిన కొత్తలో చెప్పావు. కొద్దికాలం నువ్వు సెటిల్ అయ్యేంతవరకూ అలా ఉంటావనుకున్నానేగాని ఇలా ఇంత కాలం..."

"నేను సెటిల్ కావడం కాదు సమస్య. నా వాళ్ళను జీవితంలో సెటిల్ చెయ్యడం"

"అదేలే! నువ్వు సెటిల్ అయితే వాళ్ళకు ఆర్థిక సహాయం చెయ్యొచ్చుగా? అమ్మ ఉన్నారాయె? అందుకోసం పెళ్ళి మానుకోవడం ఏమిటి? నువ్వు ప్రేమిస్తున్న అతను ఎక్కడ ఉన్నాడు? పెళ్ళి చేసుకున్నాడా?"

"లేదు"

"ఇప్పుడైనా అతన్ని చేసుకోవచ్చుగా?"

"ఆ అవకాశం లేదు"

"ఎందుకని!"

"అతను చనిపోయాడు"

"రేణూ!"

"అవును! అతను చనిపోయాడు" అన్నది రేణుక నిర్వికారంగా.

"సారీ!"

రేణుక మౌనంగా ఉండిపోయింది.

చాలాసేపు ఇద్దర్లో ఎవరూ మాట్లాడలేదు. అంతలో పక్కన గురక విన్పించింది.

సీతాలక్ష్మికి కునుకు పట్టింది.

"అదృష్టవంతురాలు" రేణుక మనసులోనే అనుకుంది.

రేణుకకు పూర్తిగా నిద్రపట్టలేదు. కాని మగతగా కళ్ళు మూసుకుంది.

సీతాలక్ష్మి ఓ గంట తర్వాత తృళ్ళిపడిలేచింది. "నిద్రపోయాను గదూ! అన్నం తినగానే ఓ గంట పడుకుంటేగాని మనిషిని కాను" అంటూ లేచి వెళ్ళింది.

ఐదు నిముషాల్లో రెండు కప్పుల్లో టీ తెచ్చింది.

ఇద్దరూ కూర్చుని మౌనంగా టీ తాగుతున్నారు.

"ఏది ఏమైనా నువ్వు మాత్రం జీవితాన్ని నాశనం చేసుకున్నావ్."

రేణుక తృళ్ళిపడింది.

కాఫీ ఒలికి చేతిమీదా, చీర మీదా పడింది.

"అయ్యయ్యో! చీర పాడౌతుంది" అంటూ లేచి టవల్ తడిపి తెచ్చి చీర మీద అద్దింది.

"ఫర్వాలేదులే!"

"బాధపెట్టానా!"

"లేదు. నేను జీవితం నాశనం చేసుకున్నానని కదూ అన్నావు? నేను అలా అనుకోవడం లేదు. తనకోసం తను బ్రతకడంలోనే జీవితం సార్థకం ఉంది. ఇంటికి పెద్ద బిడ్డను. నాన్న మాటను నిలబెట్టుకున్నాననే సంతృప్తి నాకుంది. నేను బాధపడటం లేదు.

"అది నేను నమ్మను. అన్నలూ, తమ్ముళ్ళూ, అక్కలూ, చెల్లెళ్ళూ, మమతలూ, మమకారాలూ ఎంతకాలం? ఎవరి స్వార్థం వారిది. ఇవాళ నీ డబ్బుకోసం నిన్ను అందరూ ఆదరించవచ్చును. ఇప్పటికే అందరికీ రెక్కలు వచ్చినయ్. ఎవరి గూటికి వాళ్ళు ఎగిరిపోయారు. నీ చిన్నచెల్లెలు కూడా త్వరలోనే పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతుంది. మీ అమ్మ ఎంతకాలం...?

"లక్ష్మి!"

"వాస్తవానికి భయపడి తప్పించుకోలేం. మీ అమ్మ పెద్దది అయింది. అందరం ఎప్పుడో పోవాల్సిన వాళ్ళమే. నీ మేనల్లుడు నీ దగ్గర ఉన్నాడు. బాగానే ఉంది. నీ చెల్లెలు కూతురు కూడా ఉంది. అదీ బాగానే ఉంది. ఎంతకాలం ఉంటారు? అదీ నువ్వు బాగా రెండు చేతులూ సంపాదిస్తున్నావు కనుక పోటీల మీద వాళ్ళను నీ దగ్గర ఉంచారు."

"లక్ష్మి ప్లీజ్!"

"వినడానికే బాధగా ఉంది కదూ? వంటరి జీవితం... మరో పదేళ్ళు పోయాక ఎంత దారుణంగా ఉంటుందో ఆలోచించు."

"నేను వంటరిదాన్ని కాదు."

"అంతా నీభ్రమ! కన్న తల్లిదండ్రులూ, బిడ్డలూ, కట్టుకున్నవాడూ తప్ప... నిజంగా జీవితంలో..."

"ప్లీజ్ లక్ష్మి అలా మాట్లాడకు" చంద్రం గురించి చెప్పాలనిపించింది. కాని ఎందుకో మళ్ళీ చెప్పబుద్ధి కాలేదు.

"నీ మంచికే చెబుతున్నాను. ఆలోచించు! ఇప్పుడైనా మించిపోలేదు. ఆ మధ్యనే మా ఆడబిడ్డ తోడుకోడలి చెల్లెలు నలభై ఐదేళ్లు నిండాక పెళ్ళి చేసుకున్నది. నలభై ఏడు వచ్చాక ఒక పిల్లవాడిని కూడా కన్నది."

రేణుక మౌనంగా ఉండిపోయింది.

"నా మాట విను. సీరియస్ గా ఆలోచించు. నీకు భర్తను వెదుక్కోవడం రాదని నాకు తెలిసిపోయింది. నీ బాధ్యతలు కూడా పూర్తి అయ్యాయి. ఒక్క చెల్లెలేగా పెళ్ళికి ఉన్నది. నేను నీకు తగిన సంబంధం చూస్తాను."

రేణుక అదోలా పేలవంగా నవ్వింది.

"నీ నవ్వు ఎలా ఉందో తెలుసా? నువ్వెంత పైకి గంభీరంగా ఉన్నా లోపల నీ బోలు తనం నీ నవ్వులో కన్పిస్తూనే ఉన్నది. బాగా ఆలోచించు.

"ఇప్పుడు నాకు పెళ్ళి ఏమిటి!"

"అలా అని నువ్వు అనుకోవడం లేదు. లోకం అలా అనుకుంటుందని నీ భయం! అవునా!"

అరే. సీతాలక్ష్మి తనను తెరచిన పుస్తకంలా చదివేస్తోంది.

ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూసింది.

"నీలా చదువుకొని, స్వయంగా సంపాదించి పదిమందిని పోషించగలవాళ్ళు కూడ లోకం ఏమనుకుంటుందని భయపడటం ఏమిటి రేణూ. నువ్వేం కానిపని చేస్తున్నావ్? అందరూ చేసే పనే. కాకపోతే కొంచెం ఆలస్యంగా చేసుకుంటున్నావ్. అదీ ఎందుకోసం? ఒక మంచి పనికోసం ఇంతకాలం పెళ్ళి మానేశావ్! రోజులు మారుతున్నాయ్. ఎవరి జీవితం వాళ్ళది. ఈ లోకం మళ్ళీ గడిచిపోయిన నీ జీవితాన్ని ఇవ్వగలదా? ఆలోచించు.

ఆలోచిస్తూ కూర్చుంది రేణుక.

"ఆలోచించుకొని నాకు చెప్పు. నేను నీకు తగినవాణ్ణి చూస్తాను. ఇప్పుడు నేను నీ చిన్ననాటి స్నేహితురాల్ని కాదు. మీ అమ్మలాంటిదాన్ని.

## 17వ భాగము

రేణుక కళ్ళు పెద్దవి చేసుకొని చూసింది.

"అవును! నువ్వింకా చిన్నదానివే. నేను జీవితంలో అన్నీ అనుభవించాను. మీ అమ్మలాగే అమ్మమ్మను కూడా అయ్యాను. అందుకే పెద్దరికం నెత్తిన వేసుకుంటున్నాను. పోనియ్! పెద్ద అక్కను అనుకో. నువ్వు నీ తమ్ముళ్ళకోసం, చెల్లెళ్ళకోసం చేసిన పనే నేను నీకోసం చెయ్యాలనుకొంటున్నాను"

"సీతా!" రేణుక సీతాలక్ష్మి రెండు చేతులూ పట్టుకుంది. కళ్ళూ చెమ్మగిల్లాయి. కంఠం గద్గదమైంది.

"నేను చెప్పిన విషయం గురించి ఆలోచిస్తావు గదూ!"

చిన్నపిల్లలా తల ఊపింది రేణుక.

రేణుక ఇంటికి పోకుండా ఆసుపత్రికే వెళ్ళింది.

ఆ రోజు రాధ కూతురి పుట్టినరోజు అనే విషయం పూర్తిగా మర్చిపోయింది.

ఆసుపత్రి పనిలో మునిగిపోయింది.

"అమ్మా!" జూనియర్ పిల్చింది.

"ఏమిటి?"

"మిసెస్ నాయుడికి జ్వరంగా ఉన్నది. ఒక సీరియస్ కేసూ, బహుశా సిజేరియన్ కావచ్చునట. వచ్చిందట. ఆమె మీకు ఫోన్ చెయ్యమన్నారట. నర్స్ ఫోన్ లో ఉన్నది. ఏం చెప్పమంటారు?"

"వస్తున్నానని చెప్పు"

రేణుక కారు డ్రైవ్ చేసుకుంటూ మిసెస్ నాయుడు నర్సింగ్ హోం వెళ్ళింది.

## 24

రాత్రి పది దాటింది. ఎంత ప్రయత్నించినా రేణుక ఒక ప్రాణాన్ని మాత్రమే బ్రతికించ కలిగింది. బిడ్డ పోయింది. తల్లి బ్రతికింది.

అలసిపోయి ఇంటికి వచ్చింది.

హాల్లో పగిలిపోయిన బెలూన్లూ, రంగు కాగితాలూ, శనగలూ, కేక్ ముక్కలూ చిందరవందరగా పడి ఉన్నాయ్.

అరే! రాధ కూతురి పుట్టినరోజు కదూ! అమ్మ త్వరగా రమ్మన్నది.

రాధ ఏమనుకుంటుందో! ఎలా నచ్చచెప్పటం...అనుకుంటూ కుర్చీలో ఆలోచిస్తూ కూర్చుంది.

డైనింగ్ హాలు నుంచి మాటలు విన్పిస్తున్నాయ్.

అందరూ భోజనాలకు కూర్చున్నట్టున్నారు అనుకుంది.

రేణుకకు ఆకలిగా లేదు.

"చూశావా వదినా అక్కయ్య ఇంతవరకూ వచ్చిందేమో!" రాధ అన్నది.

"వస్తేనే బాగుండేది" చిన్నగా వదిలింది రామం భార్య.

"ఏదో అర్జెంటు కేసు వచ్చి ఉంటుంది"

"కేసులు ఎప్పుడూ ఉండేవే" రాధ మొగుడు.

"అది డాక్టరు. ఒక ప్రాణం విలువ దానికి తెలుసు. పోయిన ప్రాణం తిరిగిరాదు. ఇలాంటివి సంవత్సరానికి రెండు కూడా జరుపుకోవచ్చు" అన్నాడు రామం.

"అన్నయ్య ఎప్పుడూ దాన్నే సమర్థిస్తాడు"

"నీవెప్పుడూ అక్కను సాధించడమే పని...."

"చూశావా అమ్మా ఎంతలేసి మాటలంటున్నాడో! అవున్లే నువ్వు అలా కాకాపడితే గాని నీ కొడుక్కు ఆవిడగారి సంపాదన దక్కదు"

"ఓహో అయితే అందుకేనా నీ కూతుర్ని కూడా పోటీకి పెట్టావ్?" వ్యంగ్యంగా అన్నాడు రామం.

"అమూల్యను ఇక్కడ ఉంచడం పాపం బావగారికి కష్టంగా ఉన్నట్టుంది. తీసుకెళ్ళిపోతాం మా బిడ్డ మాకేం బరువు కాదు. అక్కయ్య ముష్టి డబ్బు కోసం మేము ఆశించడం లేదు" అన్నాడు సుధీర్ కోపంగా.

రాధ ముఖం ముడుచుకుంది.

వాళ్ళు! వాళ్ళు ఒకటి. తనే ఈ ఇంటికి పరాయిది. తనకెందుకులే అన్నట్టు రామం భార్య మౌనంగా తలవంచుకొని భోజనం చెయ్యడంలో నిమగ్నమైనట్టు ఉండిపోయింది.

"అమ్మా, నువ్వేం మాట్లాడవేం?"

"కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. నేనేం మాట్లాడనే" అన్నది తల్లి.

"నేను ఏమన్నానని అన్నయ్య అక్కను వెనకేసుకు రావాలి? నాకు మాత్రం అక్క కాదూ? వాడికి మాత్రమే ఈ ఇంటిమీదా, అక్క సంపాదన మీద హక్కు ఉన్నట్టు మాట్లాడుతున్నాడు" దాదాపు ఏడుస్తున్నట్టే అన్నది రాధ.

రామం ఏదో అనబోయాడు.

భార్య "మీరు మాట్లాడకండి" అన్నట్టు కళ్ళతోనే వారించింది.

"మీ అక్కయ్య ఏదీ! మీ అక్కయ్య పిల్లకు ఏం పెట్టింది!" అంటూ వచ్చిన వాళ్ళంతా అడగడమే! ఏం చెప్పాలో తెలియక ఎవరికి సమాధానం చెప్పలేదు. కనీసం ఇంత గౌను గుడ్డన్నా కొన్నదా?" గుణుస్తూ అన్నది రాధ.

"అది గౌను కొనడం ఏమిటే? ఈ ఖర్చంతా ఎవరిదీ? ఆ పులిగోరు కూడా అది ఇచ్చిన డబ్బుతోనేగా కొన్నాను" తల్లి కూతుర్ని మందలించింది.

"అది వేరు! ఇవన్నీ నువ్వు చెయ్యాల్సిన ముచ్చట్లు చెశావం నీకు ఆ డబ్బు ఎవరిచ్చారో నాకు అనవసరం. అక్కయ్య ప్రేమగా చిన్న కానుకైనా ఇచ్చిందా? ఇంతవరకు రాలేదు చూడు. అసలు ఆవిడగారికి పాప పుట్టినరోజు చెయ్యడం ఇష్టంలేదేమో!"

"ఎలా ఉంటుంది? నువ్వొక పిచ్చి మొద్దువి. నేను అందుకే మనింట్లోనే చేద్దామన్నాను. విన్నావు కాదు? సైకాలజీ ప్రకారం... తనకు లేని జీవితం... వేరేవాళ్ళు అనుభవిస్తుంటే..."

"పెద్ద సైకాలజిస్టులా మాట్లాడకు..అక్కయ్యకు ఏదో అర్జంటు కేసు రావడం వల్లనే వచ్చి ఉండదు. ఇక ఈ సంభాషణ ఇంతటితో ఆపుతారా లేదా?" రామం విసుగ్గా అన్నాడు.

రేణుక ఎక్కువసేపు అలా కూర్చుని చాటుగా వాళ్ళమాటలు వినలేకపోయింది. లేచి డైనింగ్ హాల్లోకి వచ్చింది.

రేణుకను చూసి దాదాపు అందరూ తృళ్ళిపడ్డారు. అందరి నోళ్ళు బిగుసుకుపోయాయి.

"ఏమిటిర్రా అలా బిగిసిపోయి కూర్చున్నారు! సారీ రాధా! ఒక సిజేరియన్ కేసు వచ్చింది. బిడ్డ చచ్చిపోయింది. తల్లి బ్రతికింది. ఆ తర్వాత పాపకు గాజులు చెయ్యమని భద్రాచారితో చెప్పాను. అవి తీసుకొని వద్దామని వెళ్ళాను. బాగా ఆలస్యం అవడంతో దుకాణం కట్టేశాడు నవ్వుతూ చెప్పింది రేణుక.

రాధ తల సిగ్గుతో వాలిపోయింది.

సుధీర్ గబగబా పెరుగు అన్నం తినసాగాడు.

"ఇంతసేపూ రాధ నువ్వు రాలేదని మహా సాధిస్తోంది!" అన్నాడు రామం.

"నేనేం సాధించలేదు. అక్క రాలేదని బాధపడ్డాను. అది తప్పా?" రాధ రెట్టించింది.

"నువ్వు కూడా కూర్చో! భోజనం వడ్డిస్తాను" అన్నది తల్లి.

"ఫంక్షన్ బాగా జరిగిందా?" కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"ఆ చాలా బాగా జరిగింది. పిల్చిన వాళ్ళంతా వచ్చారు" తల్లి సంతోషంగా చెప్పింది.

తమ సంభాషణ రేణుక వినలేదనుకున్నారు. అందరికీ రిలీఫ్ గా ఉన్నది.

కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశారు.

రేణుక ఆరోజు చాలా ఉత్సాహంగా ఉన్నట్టు అన్పించింది.

కాని రామానికి మాత్రం అదంతా తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంగానే అనిపించింది.

భోజనం ముగించి మంచం మీద పడుకొని పుస్తకం తెరిచింది. పడుకోబోయే ముందు ఏదో ఒక పుస్తకం చదివితేగాని రేణుకకు నిద్రరాదు కాని పుస్తకంలోకి అక్షరాల మీద చూపులు తిరుగుతున్నాయి. కాని బుర్రకు ఒక్క శబ్దం బోధపడటం లేదు.

రాధకు తాను అబద్ధం చెప్పింది?

ఎందుకు?

తను అలా చెబితే రాధ సంతోషిస్తుందనేగా? అమ్మ చెప్పినట్టు అంతా తన డబ్బు కాదూ? తను ప్రత్యేకంగా బహుమతులు ఎందుకివ్వాలి? అయినా ఆ సమయంలో రాధ మనసును తను నొప్పించలేకపోయింది. రేపు గాజులు కొని ఇచ్చేస్తే సరిపోతుంది.

కాని సుధీర్ ఏమన్నాడు? రాధ కూడా తనకు ఇష్టంలేకనే ఫంక్షన్ కు రాలేదన్నది. తన రక్తం పంచుకొని పుట్టినవాళ్ళు, తను పెంచినవాళ్ళూ తన గురించి, తన సైకాలజీ గురించి మాట్లాడుతున్నారు. సుధీర్ మాట్లాడటంలో ఆశ్చర్యం ఏముంది?

తను పెళ్ళి చేసుకోలేదు కనక తనకు వాళ్ళ కాపురం చూస్తుంటే ఈర్ష్య?

తనకు పిల్లలు లేరు కనక వాళ్ళ పిల్లల్ని పచ్చగా చూడలేకపోతున్నదా?

ఇన్ని మాటలు తను ఎందుకు పడాల్సి వచ్చింది.

సీతాలక్ష్మి గుర్తు వచ్చింది.

మనసులో కసికసిగా ఉన్నది.

అవును!

తను సీతాలక్ష్మి చెప్పినట్టు పెళ్ళి చేసుకోవాలి? అప్పుడు కాని వీళ్ళ తిక్క కుదరదు.

ఎవరో ఏదో అనుకుంటారని తనెందుకు భయపడాలి?

ఇప్పుడు అనుకోవడం లేదూ? అప్పుడు ఒకటే మాట అంటారు. ఇప్పుడో? ఎన్నో రకాల మాటలు తను వినాల్సి వస్తోంది.

తను పెళ్ళి చేసుకోవాలి. చేసుకుని అందరి తిక్కా కుదర్చాలి. ఇక తన డబ్బుకోసం పోటీలు ఎలా పడ్తారో చూడాలి! తన మీద అధికారం ఉన్నట్టు డిమాండ్స్ ఎలా చేస్తారో చూడాలి.

తను వివాహం చేసుకుంటే అమ్మ చాలా సంతోషిస్తుంది.

అవును! రేపే తన నిర్ణయాన్ని సీతాలక్ష్మికి వినిపించాలి.

రేణుక మనసులో ఒకవైపు భయం...మరోవైపు సంతృప్తి... తమాషా అనుభూతి...

ఈ వయసులో పెళ్ళేమిటి?

పెళ్ళికి వయసేమిటి?

అందరూ ఏమనుకుంటారు?

ఎవరేమనుకుంటే తనకేం? రేపు తనకు కాలూ చెయ్యి పడితే వాళ్ళంతా చూస్తారా? ఈ సృష్టిలోని ఏ శక్తి అయినా తన జీవితంలో గడిచిపోయిన ఒక్క క్షణాన్ని తిరిగి ఇవ్వగలదా?

సీతాలక్ష్మి చెప్పినట్టు ఇప్పుడైనా మించిపోయింది లేదు.

రేణుక వెంటనే ఒక నిర్ణయానికి రావడానికి కారణం వంటరితనానికి భయపడి కాదు. వివాహం మీద కాంక్ష ఉండికాదు. ఎవరికోసం తను ఇంత త్యాగం చేసిందో వాళ్ళే తన త్యాగాన్ని గుర్తించడం లేదనే కసి ఆమెలో చాలా కాలంగా చోటు చేసుకున్నది. ఈరోజు వారి సంభాషణ ఆమె మనసును మరీ బాధ పెట్టింది. అగ్నిలో ఆజ్యం పోసినట్టు అయింది.

అందుకే పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చింది.

## 25

"హల్లో!" హనుమంతరావు అడ్డుపడబోయిన జూనియర్ డాక్టర్ను దాదాపు నెట్టుకుంటూనే రేణుక గదిలోకి వచ్చాడు.

రేణుక రోగి మీదనుంచి కళ్ళను ఎత్తి ఎదురుగా నవ్వుతూ నిల్చున్న విగ్రహాన్ని చూసింది.

నల్లగా ఉన్నాడు. బట్టతలయినా ముఖంలో జీవకళ ఉట్టిపడుతూ...హనుమంతరావు రండి! రండి! ఈ ఊరు ఎప్పుడొచ్చారు? మిమ్మల్ని చూసి రెండేళ్ళయింది. అప్పటికీ ఇప్పటికీ ఇంత మార్పా!" నిగనిగలాడుతున్న బట్టతలను చూస్తూ అన్నది రేణుక.

"మీరు కొంచెంకూడా మారలేదు. పైగా రెండేళ్ళు చిన్నగా కన్పిస్తున్నారు" నవ్వుతూ బట్టతల నిమురుకున్నాడు హనుమంతరావు.

"కాఫీ తెప్పిస్తాను"

"అదేం కుదరదు. భోజనం పెట్టాలి. ముందు మీరు రోగుల్ని పంపించెయ్యండి"

"ఫర్వాలేదు. నా జూనియర్ చూసుకుంటుంది లెండి. ఏమిటి చెప్పాపెట్టకుండా వచ్చారు? ఏదైనా పనిమీద వచ్చారా?"

"అవును! మా చెల్లెలు గుడివాడలో ఉంటుంది. దాని కూతురి పెళ్ళి. వెళుతూ వెళుతూ గుంటూరు వచ్చాను. కేవలం మిమ్మల్ని చూట్టానికే సుమా!"

"థ్యాంక్యూ!" సంతోషంగా అన్నది రేణుక.

ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకున్నారు. ఇద్దరికీ గౌతమ్ గుర్తుకు వస్తూనే ఉన్నాడు. కాని ఎవరూ అతని పేరు ఎత్తడానికి ధైర్యం చెయ్యలేకపోతున్నారు.

"ఎక్కడ దిగారు?"

"హోటల్లో!"

"నన్ను చూడటానికి వచ్చి మీరు హోటల్లో దిగడం ఏమిటి?" నొచ్చుకుంటూ అన్నది.

"నాతోపాటు మరో అరవ స్నేహితుడు కూడా వున్నాడు. ఏమిటి ప్రోగ్రాం!"

"మా ఇంటికి వెళ్దాం!"

"నో! బోరింగ్! సినిమాకు వెళ్దాం. అక్కడ్నుంచి ఏదైనా హోటల్లో భోజనం చేద్దాం. ఆ తర్వాత మిమ్మల్ని డ్రాప్ చేసి నేను వెళ్ళిపోతాను."

"సినిమాకా?"

హనుమంతరావు గొల్లున నవ్వాడు.

"సినిమాకు అంటే అంత గాభరా ఏమిటండీ! మనం ఆ వయసుదాటి చాలాకాలం అయింది. అయినా మీ పక్కన నన్ను చూసి మీ నాన్నగారు అనుకుంటారు."

రేణుకకు నవ్వు వచ్చింది.

రేణుకకు ఒంటరిగా మగవాళ్ళతో సినిమాలకూ, హోటళ్ళకూ వెళ్ళే అలవాటు లేదు. అందుకే ఆ మాట వినగానే ఏదోగా అనిపించింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

"ఏం లేదు వెళదాం!"

ఇద్దరూ సినిమా చూస్తున్నారు. కాని సినిమా అంత బాగాలేదు. ఇద్దరి మనసుల్లోనూ కాలేజీ రోజులు మెదులుతున్నాయ్. సినిమాహాల్లో అలా ఒక పురుషుడి పక్కన కూర్చుని సినిమా చూస్తుంటే రేణుకకు అదోలా అనిపించింది. అతని స్థానంలో గౌతమ్ ఉంటే...

"బోరింగ్, వెళ్ళిపోదామా?" ఇంటర్ వెల్ లో అన్నాడు హనుమంతరావు.

"పోదాం! వెధవ సినిమా బొత్తిగా బాగాలేదు. ఇలాంటి సినిమాలు చూట్టానికి ఇంత జనమా?"

"మన టేస్టు!"

ఇద్దరూ ఎయిర్ కండీషన్ గదిలో కూర్చున్నారు. భోజనానికి ఆర్డర్ ఇచ్చారు.

హనుమంతరావు కన్నార్పకుండా రేణుక ముఖంలోకి చూస్తున్నాడు. రేణుక ఇబ్బందిగా ఉన్నది. అతని మీద కోపం కూడా వచ్చింది. మరోవైపు సరదాగానూ ఉన్నది.

"నాకేమనిపిస్తోందో చెప్పనా?"

"చెప్పండి!"

"మీకు పెళ్ళి చెయ్యాలని అనిపిస్తున్నది"

చివ్వున తలెత్తి చూసింది.

అతని కళ్ళలో కాంక్ష లేదు. వాత్సల్యం లాంటి భావం కన్పించింది.

"రేణుకగారూ! ఇప్పటికి మీరు చాలా పోగొట్టుకున్నారు. జీవితంలో ఒంటరిగా చాలా దూరం నడిచారు. మీరు ఎంత చిన్నగా కన్పించినా జాగ్రత్తగా చూస్తే ఆ అలసట మీ కళ్ళలో స్పష్టంగా కన్పిస్తోంది. ఇక మీ వంటరి ప్రయాణాన్ని ఆపండి" రేణుక విస్మయంగా చూసింది.

"మీ బాధ్యతలు చాలావరకు తీరిపోయాయనుకుంటాను"

రేణుక మాట్లాడలేదు.

"ఇప్పుడైనా మించిపోయింది ఏమీ లేదు. పెళ్ళి చేసుకోండి"

"అది అంత సులభమా?"

"లేదనుకోండి. బ్రహ్మచారులు దొరక్కపోవచ్చును. విడోయర్స్ మంచివాళ్ళు చాలామంది ఉంటారు."

రేణుక మనసు చివుక్కుమన్నది.

"నేను ఇలా అన్నందుకు క్షమించండి. మీ క్షేమం కోరేవాడిగా చెబుతున్నాను. అసలు న్యాయంగా తోడు కావాల్సింది ఈ వయసులోనే ఆలోచించండి"

సీతాలక్ష్మి ఇదే మాట అన్నది.
హనుమంతరావు కూడా అదేమాట అంటున్నాడు. చంద్రం కూడా అదే రాశాడు.

అంటే...నిజంగా తన సుఖం కోరే వారంతా చెప్పేది ఇదేనన్నమాట.

ఇందులో ఏదో సత్యం ఉన్నది.

అయితే అమ్మ చెప్పడం మానేసిందేం?

అమ్మ తనను గురించి ఆలోచించడమే మానేసింది. ఎందుకు?

ఇంకా దానికి పెళ్ళేమిటి అనుకుంటూ ఉండవచ్చును! ఆమె అలా ఆలోచించడంలో అసహజత్వం ఏమీ లేదు. అంతే! తను నిజంగా పెళ్ళిచేసుకోపోతున్నట్టు వింటే అమ్మకంటే సంతోషించేవాళ్ళు ఇంకెవరుంటారు?

"సారీ! రేణుకగారూ! తప్పుగా ఏమైనా అన్నానా!"

"అబ్బే! అదేం లేదండీ! ఈ మధ్య నా చిన్నప్పటి స్నేహితురాలు ఒకామె నా ప్రాణం తోడేస్తుంది. పెళ్ళి చేసుకోమని, మీరు అదే అంటున్నారు"

"అందుకే ఆలోచించండి. మీ క్షేమం కోరేవాళ్ళం" అన్నాడు హనుమంతరావు.

ఆ తర్వాత రేణుక టాపిక్ మార్చింది.

భోజనాలు ముగించారు.

"పన్నెండు కావస్తోంది" అన్నది రేణుక కార్లో కూర్చుంటూ.

కారు వచ్చి రేణుక ఇంటిముందు ఆగింది.

"అయ్యగార్ని దించి వెళ్ళిపో!" డ్రైవర్ తో రేణుక అన్నది.

"గుడ్ బై!"

"బై!"

కారు కదిలి వెళ్ళిపోయింది.

తల్లి తలుపు తీసింది వెనక్కు తిరిగింది.

ఆమె ఎందుకంత సీరియస్ గా ఉందో రేణుకకు అర్థం కాలేదు.

నిద్రలో ఉందేమో!

"అన్నం తిన్నావా?" తల్లిని అడిగింది.

"లేదు" ముభావంగా అన్నది.

"నేను తినే వచ్చాను. నువ్వు తిను"

"ఎక్కడ?"

రేణుకకు వళ్ళు మండింది. ఎక్కడో ఒకచోట అనాలనిపించింది. "హోటల్లో" అన్నది.

"సినిమాకు వెళ్ళావా?" అదోలా పలికింది తల్లి కంఠం.

రేణుక గిర్రున తిరిగి చూసింది.

"అవును ఏం?"

"ఇంతకాలం లేని అలవాటు ఇప్పుడేమిటి?"

"ఏమిటి నువ్వనేది?" తీవ్రంగా తల్లి ముఖంలోకి చూసింది.

"ఎంతో మంచిపేరు తెచ్చుకున్నావ్"

"ఇప్పుడేమయింది?"

"ఎవరో మగవాడితో సినిమాకు వెళ్ళావటగా?"

"ఎవరు చెప్పారు?"

"రాధ చెప్పింది. దాని మొగుడు స్నేహితులతో అదే సినిమాకు వచ్చాడట. మీ వదినతో ఉన్నదెవరోయ్ అని వాళ్ళు అడిగారట. అతని తలకొట్టేసినట్టయిందట"

రేణుక తల ఓ క్షణం గిర్రున తిరిగింది.

రేణుకకు ఎక్కడలేని కోపం వచ్చింది.

తల్లి కంఠం నులమాలనిపించింది.

ఇంటికి నిప్పు పెట్టాలనిపించింది.

రాధ మొగుణ్ణీ చీమలమర్రికి కట్టి చింతబరికెతో తన్నాలనిపించింది.

వీళ్ళంతా తనకు నీతులు బోధిస్తారా?

తనను అదుపులో పెడ్తారా?

తనకు బుద్ధులు చెప్తారా?

రేణుకకు తనమీద తనకే కోపం వచ్చింది.

నిలువునా దహించుకుపోసాగింది.

"మంచిపని అయింది. ఇంత సైనేడ్ తిని చావమను. అతనికి దొరక్కపోతే నేనే ఇస్తాను" కసిగా అన్నది రేణుక.

"అదికాదే...."

"ఏదికాదు?" కోపంతో వణికిపోయింది.

"నా వయసేమిటి? చదువుకున్నదేమిటి? నా జీవితం ఏమిటి? నేను డాక్టర్ని. వాళ్ళందరి కోసం డబ్బు సంపాదించి ప్రయోజకుల్ని చేశాను. కట్నం ఇచ్చి పెళ్ళి చేశాను. నా క్లాస్ మేట్ మద్రాసు నుంచి వస్తే సినిమాకు వెళ్ళాను. అంత మాత్రాన మీరంతా నాకు నీతులు చెబుతారా? నాకు...నాకు... మీరందరూ నా జీవితాన్ని నాశనం చేసిన మీరు...పారాసైట్లు, జలగల్లా నా రక్తాన్ని పీలుస్తున్నారు...నేను లేకపోతే బతకలేని మీరు...నన్ను... నన్ను... తప్పులు పడ్తారా? బుద్ధులు చెప్తారా?"

ఆపైన మాటలు పెగల్లేదు రేణుకకు.

తల్లి బిత్తరపోయి చూస్తూ నిల్చుంది.

చరచరా తనగదిలోకి వెళ్ళిపోయింది.

బట్టలు కూడా మార్చుకోకుండా మంచానికి అడ్డం పడింది.

ఇన్ సల్ట్! ఇంత అవమానమా! రాధ వచ్చి ఏదో వాగితే అమ్మ దాని చెంప పగలకొట్టకుండా? తనేదో చెయ్యరాని తప్పు చేసినట్టు ముఖం లావుగా పెట్టుకుంది.

భోరున ఏడవాలని ఉంది.

ఈ రోజున ఆ ఏడుపు కూడా రావడం లేదు.

మంచం మీద అశాంతిగా అటూ ఇటూ కదులుతోంది. నిద్ర రావడం లేదు. గుండెల్లో ఏదో తగలబడిపోతున్నట్టుగా ఉన్నది. బుర్రలో ఏదో పురుగు తొలుస్తున్నట్టు అశాంతిగా ఉన్నది.

వాడు...వాడు ఆ సుధీర్ గాడు ఏమనుకుంటున్నాడు?

బయటకు వచ్చింది.

తల్లి మంచం మీద ముడుచుకొని పడుకొని ఉన్నది.

లైటు వేసింది.

సుందరమ్మ తృళ్ళిపడి లేచింది.

కూతుర్ని చూసింది. ఆమె రూపం చూసింది. కొత్తమనిషి చూస్తున్నట్టు చూస్తూనే ఉండిపోయింది.

"అమ్మా ఇప్పుడే చెబుతున్నాను. ఇక రాధగానీ దాని మొగుడు గానీ ఈ గడప తొక్కడానికి వీల్లేదు. వాళ్ళకు చెప్పు. లేదా నా చేత అవమానం తప్పదు. అమూల్యను కూడా రేపు పంపించివేయ్. ఆ పిల్లలు కూడా రావడానికి వీల్లేదు. నా సంపాదనలో ఒక్క దమ్మిడీ అయినా వాళ్ళకు ఖర్చు పెట్టడానికి వీల్లేదు? అలా చేశావని తెలిసినరోజు నీకు ఈ ఇంట్లో స్థానం ఉండదు" గబగబా అనేసి సుడిగాలిలా వెళ్ళిపోయింది.

సుందరమ్మ కూతురు వెళ్ళిన వైపే పిచ్చి చూపులు చూస్తూ ఉండిపోయింది.

## 26

రెండోరోజు రేణుక ఆలస్యంగా నిద్రలేచింది.

కళ్ళు ఎర్రగా ఉన్నాయ్.

రెప్పలు బరువుగా వాలిపోతున్నాయ్.

జ్వరం వచ్చినట్టూ, వళ్ళు పులిసినట్టు ఉన్నది.

పళ్ళు తోముకొని డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంది.

తల్లి మౌనంగా కాఫీ అందించింది. తల్లి ముఖంలోకి చూసింది. ఆమె బాగా ఏడ్చినట్టు చూడగానే తెలుస్తున్నది. రేణుకకు రాత్రి తను ఆవేశంలో అన్నమాటలు గుర్తుకు వచ్చాయ్.

"పెద్దమ్మా! అవ్వ నన్ను ఇంటికి పంపిస్తానంటోంది. నేను ఇక్కడే ఉంటాను" రేణుక కాళ్ళను చిన్న చిన్న చేతులతో చుట్టివేసింది అమూల్య.

రేణుక గబుక్కున అమూల్యను ఎత్తుకొని వళ్ళో కూర్చోబెట్టుకున్నది.

"లేదమ్మా! ఇక్కడే ఉండు! అవ్వకు నేను చెబుతానులే! గౌతమ్ ఏం చేస్తున్నాడు?"

"బొమ్మతో ఆడుకుంటున్నాడు"

"నువ్వు కూడా వెళ్ళు! ఆడుకో!" వళ్ళో నుంచి అమూల్యను దించింది. ఆ పిల్ల వెళ్ళిపోగానే తల్లి ముఖం చూసింది. "అమ్మా! ఆవేశంలో ఏదేదో అనేశాను. క్షమించమ్మా!" అన్నది రేణుక.

సుందరమ్మ కళ్ళు చెమర్చాయి. కొంగుతో వత్తుకుంది.

"అమ్మా! నేను నిన్ను చాలా బాధపెట్టాను గదూ?"

"లేదు తల్లి! మేమందరం కలిసి నిన్నే బాధ పెడుతున్నాం. నువ్వు ఎంత బాధపడకపోతే, అంత ఆవేశంగా అన్ని మాటలు అంటావ్? నీ మంచి చెడ్డలు నీకు తెలుసు. నువ్వు చేసిన త్యాగాన్ని కూడా మర్చిపోయి ప్రవర్తిస్తున్నారు. నీ తమ్ముళ్ళూ, చెల్లెళ్ళు, నేను కూడా నీ గురించి ఆలోచించడం మర్చిపోయాను. అందుకే బాధపడుతున్నాను."

"పోనియ్యమ్మా! అన్నీ మర్చిపో! రాత్రి నేను అన్నమాటలు మర్చిపో!" అంటూ స్నానం చెయ్యడానికి లేచింది రేణుక.

సుందరమ్మ రిలీఫ్ గా నిట్టూర్చింది. రాధనూ రాధ భర్తనూ నిజంగా రావద్దని చెప్పాల్సి వస్తుందేమోననే భయం పోయింది.

అవును! ఈ వయసులో దాన్ని అలా ప్రశ్నించడం బుద్ధి తక్కువే! తనబిడ్డ బుద్ధి బంగారం. తన జీవితాన్ని నాశనం చేసుకుంది. ఈ వయసులో దానిమీద తన అల్లుడు ఇంత అభాండం వేస్తాడా? రాధకు బుద్ధిలేదు. మొగుడు మాట్లాడే ప్రతి మాటకూ తాళం వేస్తుంది. ఇంకా ఏదో అది తలకెత్తడం లేదని ఏడుపు!

సుందరమ్మ రేణుక గురించి ఆలోచించసాగింది.

తను ఉన్నంత వరకు ఫర్వాలేదు. ఆ తర్వాత దాన్ని వీళ్ళు చూస్తారా? తిన్నావా అని అడిగేవాళ్ళు కూడా ఉండరు. దాని సంపాదన ఎలా చేజిక్కించుకోవాలా అని పోటీలు మాత్రం పడుతున్నారు.

రేణుక ముస్తాబై బయటికి వచ్చింది.

"వస్తానమ్మా!"

"అలాగే తల్లి!"

రేణుక కొంత దూరం వెళ్ళాక ఏదో గుర్తు వచ్చినట్టు "చంద్రమౌళి నగర్ కు పోనియ్!" అన్నది డ్రైవర్ తో.

సీతాలక్ష్మి ఇంటి ముందు కారు ఆగింది.

సీతాలక్ష్మి సంతోషంగా "రావోయ్!" అంటూ ఎదురు వచ్చింది.

"ఏమిటి ఇంత పొద్దుటే వచ్చావ్? ఆసుపత్రికి వెళ్ళలేదా!"

సీతాలక్ష్మి రేణుక పెళ్ళి గురించి ఆరోజు తరువాత మళ్ళీ ఎత్తలేదు. అనవసరంగా రేణుకను బాధపెట్టడమేననీ, రేణుకకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం లేదని మొదటిరోజు సంభాషణలో అర్థం చేసుకున్నది.

"నీకు ఒక విషయం చెప్పి వెళ్దామని వచ్చాను"

"ఉండు కాఫీ తెస్తాను"

"వద్దు! నాకు టైం లేదు. వెంటనే వెళ్ళాలి కూర్చో!"

"చెప్పు!"

రేణుక ఆలోచిస్తూ ఉండిపోయింది. ఏదో చెప్పడానికి సందేహిస్తున్నట్లుగా ఉంది ఆమె వాలకం.

"ఏమిటి రేణూ! నాదగ్గిర సందేహం ఏమిటి? చెప్పు! ఏదో చెప్పాలని వచ్చానన్నావుగా?"

"నేను...."

"చెప్పవోయ్!"

"సీతా! నేను పెళ్ళి చేసుకోవడానికి నిశ్చయించుకున్నాను. అది చెప్పడానికే వచ్చాను" నాలుక మీద అతుక్కుపోతున్న పదార్థాన్ని దేన్నో బలవంతంగా ఊసినట్టు అన్నది రేణుక.

సీతాలక్ష్మి ఓ క్షణం రేణుక ముఖంలోకి విస్మయంగా చూసింది.

"నిజంగా?"

"నిజంగానే!"

"నాకు ఎంత సంతోషంగా ఉన్నదో చెప్పలేనే రేణూ! ఎవర్ని చేసుకోవాలనుకుంటున్నావ్?"

రేణుక చివ్వున తలెత్తి సీతాలక్ష్మి ముఖంలో చూసింది.

"నాకు భర్తను వెదుక్కోవడం రాదని నువ్వే అన్నావుగా!"

సీతాలక్ష్మి ప్రశ్నార్థకంగా చూసింది.

"అలా చూస్తావేమిటి? ఆ బాధ్యత నీమీదే పెడుతున్నాను టైం అయింది వస్తాను"

సీతాలక్ష్మి సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయింది.

"రేణూ! నాకు నిజంగా సంతోషంగా ఉందే. మీ అమ్మకు చెప్పావా?"

"అవన్నీ నువ్వే చూసుకో" చరచరా వెళ్ళి కార్లో కూర్చుంది.

కారు బయలుదేరింది. గడపలో నిల్చున్న సీతాలక్ష్మికేసి రేణుక చూడలేదు. అనడానికైతే అనేసింది. కాని తీరా అన్న తర్వాత రేణుకకు ఏదోగా అన్పించసాగింది. అందుకే సీతాలక్ష్మి ముఖంలోకి సూటిగా చూడలేకపోయింది.

తను తొందర పడడం లేదుకదా?

ఈ వయసులో ముక్కు మొహం తెలియని వాడిని చేసుకోవడం వివేకంతో కూడిన పనేనా?

ఏదో భయం రేణుక మనసును చుట్టి వేసింది.

ఏమైనా సరే...తను సుఖపడ్డా పడకపోయినా పెళ్ళి చేసుకోవాలి. తన డబ్బు కోసం కూర్చున్న తన వాళ్ళమీద కసి తీర్చుకోవాలి!

తనను హనుమంతరావుతో సినిమాలో చూసి ఎంత హంగామా చేశారు? రాధ మొగుడికి తను పెళ్ళి చేసుకుంటుందేమోననే భయం పట్టుకొని ఉండాలి.

అందుకే తను ఇంత త్వరగా ఒక నిర్ణయానికి రాగలిగింది.

కేవలం అందుకేనా.....?

తను మనసును తనే తడిమి చూసుకున్నది.

కాదు...కాదు...తను కూడా ఏదో అసంతృప్తితో బాధపడుతోంది. తన కష్టసుఖాలను పంచుకొనే సహచరుడు కావాలనే భావం తనకు తెలియకుండానే తన మనసులో ఏర్పడింది.అలా జరగనందుకు ఓవైపు తన మనసు పచ్చి పుండులా నలుపుతూనే ఉన్నది.

తను అలసిపోయింది.

తనను ఓ క్షణం సర్వం మరచి విశ్రాంతి తీసుకోవడానికి ఎవరిదైనా నీడ కావాలి.

తన మనసులో ముందున్న ధైర్యం ఇప్పుడు లేదు. అందుకే ప్రతి చిన్న విషయానికి తను ఇరిటేట్ అవుతోంది. దుఃఖం వస్తోంది. తన వాళ్ళంతా తనకు శత్రువులుగా కన్పిస్తున్నారు.

అయినా ఆలోచిస్తే తనకేం కావాలో తను తెలుసుకోగలదు. కాని ఆ విషయం ఆలోచించడానికి భయం వేసేది.

తనకు మనసులో లేకపోతే ఈ వయసులో సీతాలక్ష్మి చెప్పినంత మాత్రం తను వివాహం చేసుకొనేదా? హనుమంతరావు ఇచ్చిన సలహా తనకు ఎందుకు చిరాకు కలిగించలేదు?

ఇతరుల సలహాలను మనం, మన మనసుకు అనుకూలంగా ఉన్నప్పుడే పాటిస్తాం...

## 27

"ఈ ఫోటో చూడు రేణూ!"

రేణుక గుండెలు దడదడలాడాయి.

ఇంకా తన గుండెకు స్పందించే ఆర్ద్రత ఉన్నదా?

తను నలభై రెండేళ్ళ వయసులో పెళ్ళికొడుకు ఫోటో చూడాలంటే సిగ్గు పడుతోందా!

సిగ్గుకాదు. ఏదో అర్థంకాని సందేహం, తను చేస్తున్నది తనకు తగిన పని కాదనే భయం. ఏదో చెయ్యరాని పని చేస్తున్నట్టు సంకోచం.

"చూడవోయ్!"

ఫోటో అందుకున్నది. చెయ్యి కొంచెంగా వణికింది. తమాషా అనుభూతి. సంతోషంగా లేదు. విచారంగానూ లేదు. చెప్పలేని భావాల మిశ్రమ అనుభవం.

"చూడు రేణూ! ఫోటో చేతిలో పట్టుకొని చూడకుండానే ఆలోచిస్తావేం?"

రేణుక ఫోటోకేసి చూసింది. నిర్వికారంగా చూసింది. అంతకు ముందు కలిగిన తడపాటు కూడా ఇప్పుడు లేదు.

"మనిషి కొంచెం నలుపు"

రేణుక మౌనంగా ఉంది.

"నీకు గుర్తుందా రేణూ! మగవాళ్ళు తెల్లగా పప్పులా ఉంటారని చిన్నప్పుడు అనేదానివి!"

"ప్లీజ్ ఆ సంగతులు గుర్తు చెయ్యకు" కళ్ళముందు గౌతమ్ రూపం కన్పించింది. కంఠం వణికింది.

"అది కాదే రేణూ! నీ టేస్టు నాకు తెలుసుగా? ఇతను నీకు తగినవాడనే ఉద్దేశంతో..."

"హు! తగినవాడు!"

ఆ మాటలు రేణుక చెవులకు ఎబ్బెట్టుగా తోచాయి. ఈ వయసులో అరేంజ్ డ్ మ్యారేజ్ ఏమిటి?

పరిచయం ఉండి భావాలు కలిసిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవడం వేరు.

ఫోటో అక్కడే వదిలేసి పారిపోవాలనిపించింది రేణుకకు.

"అతనికి బాధ్యతలు లేవు. నలుగురు పిల్లలకూ పెళ్ళిళ్ళు చేశాడు."

రేణుకకు నవ్వు వచ్చింది.

"ఎందుకు నవ్వుతావ్"

"కష్టపడకుండానే నాకు నలుగురు ఎదిగి ప్రయోజకులైన పిల్లలున్నారని తెలిసి సంతోషం పట్టలేక..." రేణుక కంఠం జీరబోయింది.

"ఛ! సెంటుమెంట్స్ పెట్టుకుంటే ఎలా? ఈ రోజుల్లో పెళ్ళికాని ఆడవాళ్ళు చాలామంది కన్పిస్తున్నారు. కాని ఇలాంటి మగవాళ్ళు కనుచూపుమేరలో కన్పించడం లేదు. నీలాంటివాళ్ళకు విడోయర్స్  తప్ప బ్రహ్మచారులు దొరకడం కష్టం. వాస్తవానికి దగ్గరగా ఆలోచించు రేణూ!"

రేణుక మౌనంగా కూర్చుంది.

"రామచంద్రం భార్యపోయి రెండేళ్ళు అయింది"

"రామచంద్రం ఎవరూ?" యదాలాపంగానే అడిగింది.

"నీ మొహం! నువ్వు ఏ లోకంలోనే ఉన్నావ్! నేను చెప్పేది సరిగా వినడంలేదు.

రామచంద్రం...అదేఫోటోలోని వ్యక్తిపేరు..."

"ఆహా!"

"సిలోన్ మిలటరీ నుంచి రిటైర్ అయ్యాడు. నలబై ఐదేళ్ళకంటే ఎక్కువ ఉండవు."

"ఊ ఇంకా?"

"మాకు దూరం బంధువు"

"నలుగురు పిల్లలు ఉండే ఈ వయసులో ఎందుకు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడో?"

"పిల్లలు ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు. అతని లైఫ్ కంపానియన్ కావాలి. శేష జీవితం భారతదేశంలో గడపాలని ఉన్నదట. మనిషికి కష్టసుఖం చెప్పుకోవడానికి, ముఖ్యంగా ఈ వయసులో ఒకతోడు ఉండాలి. చిన్నప్పుడు నాకు మా ఆయన మీద పెద్దగా ప్రేమ ఉండేదికాదు. ఎప్పుడూ అమ్మ దగ్గిరకే వచ్చేదాన్ని. కాని ఇప్పుడు ఒక్కరోజు కూడా ఆయనను వదలి ఉండలేను"

"అసలు సంగతికి రా!" అనాలనుకుంది రేణుక.

కాని వింటున్నట్టు కూర్చుంది.

"రేణూ! మీ అమ్మ ఎంతకాలం ఉంటుంది. నీకు తోడు కావాలి. అందుకే నిన్ను పెళ్ళి చేసుకోమని ప్రోద్బలం చేశాను. చివరికి అంగీకరించావ్. ఆయనతో సంప్రదించాను. రామచంద్రం సంబంధం బాగుంటుందని ఆయన కూడా అన్నారు."

రేణుక మరోసారి ఫోటోలు కేసి చూసి సీతాలక్ష్మికి అందించింది.

"నచ్చాడా, నచ్చితే చెప్పు! అతన్ని వెంటనే రమ్మని రాస్తాను"

రేణుక పుట్టెడు దిగులు ముంచుకొచ్చింది. ఎందుకో అర్థం కావడంలేదు.

"ఒక వారం రోజులు టైం ఇవ్వు" అన్నది.

"ఈలోగా మీ అమ్మగారితో మాట్లాడనా!"

రేణుక గాభరా పడింది.

"ఇప్పుడే వద్దు! నా నిర్ణయం తెలియజేశాక"

"అలాగే"

"వస్తాను"

కార్లో కూర్చున్న రేణుక బుర్రలో ఆలోచనలు తేనె పట్టును కదిలించినట్టు కదిలాయి.

తన పెళ్ళి మాటవిని అందరూ ఏమనుకుంటారు?

తనవాళ్ళే కాక....తన దగ్గరకు వచ్చే పేషెంట్సు... తన జూనియర్... ఆ వాళ్ళేమనుకుంటారు?

మహా అనుకుంటే ఈ వయసులో పెళ్ళేమిటని అనుకుంటారు. కొద్దిరోజులు మాట్లాడుకుంటారు. ఆ తర్వాత ఎవరూ ఎవర్నీ పట్టించుకోరు. కొత్తకొత్త విషయాలు ఆలోచించడానికి మాట్లాడుకోవడానికి ఎప్పటికప్పుడు దొరుకుతూనే ఉంటాయి.

అయినా ఎవరి గురించో తనెందుకు ఆలోచించాలి?

అమ్మ ఏమనుకుంటుందో?

అమ్మ సంతోషిస్తుంది.

చంద్రం సంతోషిస్తాడు.

సరళ చిన్నపిల్ల. దానికి ఇదేమీ పట్టదు.

ఇకపోతే...వాళ్ళ గురించి...కేవలం తన డబ్బు కోసం తనచుట్టూ తిరిగే వాళ్ళ గురించి ఆలోచించడం అనవసరం.

కాని...కాని...తను ఈ వివాహం చేసుకొని సుఖ పడుతుందా? ఆలోచించడానికి తనకీ బాగాలేదు.

అతని పేరేమిటి?

రామచంద్రం.

అతని స్వభావం ఎలాంటిదో తను పాలిటిక్స్ గురించి మాట్లాడుతుంటే అతను సినిమాల గురించి మాట్లాడే లెవల్ వాడైతే! హారిబుల్!

ఛ! అతను మిలటరీలో ఆఫీసరుగా చేసి రిటైర్ అయ్యాడు. అతన్ని గురించి మరీ అంతగా అండర్ ఎస్టిమెంట్ చెయ్యడం అన్యాయం!

ఏది అన్యాయం!

ఏమిటో? తన ఆలోచనలు ఒక తీరూ తెన్నూ లేకుండా క్యాన్సర్ వ్యాధిలా ఎటు బడితే ఆటే అల్లుకు పోతున్నావ్!

తన మనసు ఈ వివాహానికి ఎదురు తిరుగుతోంది.

మనసులో పుట్టెడు దిగులుగా ఉంది.

తను ముక్కూ మొహం తెలియనివాణ్ణి ఈ వయసులో చేసుకోవడం ఏమిటి?

సుఖంగా ఉన్న ప్రాణాన్ని కష్టపెట్టుకోవడం కాదా ఇది? తను ఈ వయసులో రాజీపడి జీవితాన్ని గడపగలదా?

నో, నో.

తను పెళ్ళి చేసుకోదు.

సీతాలక్ష్మికి ఆమాటే చెప్పేస్తుంది.

ఇంటికి వెళ్ళగానే ఫోన్ లో ఒక ఆ ప్రయత్నం చెయ్యొద్దు అని చెప్పేయాలి.

రేణుక గుండెల నిండుగా గాలి పీల్చుకుంది.

రేణుక ఇంటికి వచ్చేసరికి రాధ, రాధ భర్త కూర్చుని ఉన్నారు. టీపాయ్ మీద జరీ ముద్దలా ఉన్న పట్టుచీర పడేసి ఉన్నది.

"వదినగారు ఇవాళ త్వరగా వచ్చేశారే" అన్నాడు సుధీర్.

రేణుక మాట్లాడలేదు.

"ఆ చీర ఎవరిది"

"ఎవరో పేషెంట్సు నువ్వు ఆపరేషన్ చేశావట, తెచ్చి ఇచ్చాడే అమ్మాయి. ఒక బుట్ట మామిడి పళ్ళు కూడా తెచ్చారు"

రేణుక తల్లి ముఖంలోకి చిరచిర లాడుతూ చూసింది.

"అమ్మా నీకు ఎన్నిసార్లు చెప్పాను. నేను లేనప్పుడు పేషెంట్స్ ఏమైనా తెస్తే తీసుకోవద్దని. ఛ. నా పరువు తీసేస్తున్నారు"

"అదేమిటే అంత విసుక్కుంటావ్. నేను వద్దంటూనే ఉన్నాను. అయినా వాళ్ళ సంతృప్తి కోసం వాళ్ళు బలవంతంగా ఇచ్చారు. ఊరికే ఇచ్చారా ఏమిటి! నువ్వు ఆపరేషన్ చెయ్యలేదూ?" సాగదీసింది సుందరమ్మ.

రేణుక తల్లిముఖంలోకి ఓ క్షణం చూసింది.

"అత్తగారన్నది కరెక్ట్"

"ఏమిటి కరెక్ట్, ఆపరేషన్ చేస్తేదానికి వాళ్ళు డబ్బు చెల్లిస్తారు. అమ్మా ఇప్పుడే చెబుతున్నాను. నేను లేకుండా పేషెంట్స్ తెచ్చే బహుమతులు తీసుకోకు"

"ఒకవేళ తీసుకున్నా వదినగారికి చెప్పకండి" పళ్ళు ఇకిలించాడు సుధీర్.

రేణుకకు వళ్ళు మండిపోయింది.

"నోర్ముయ్!" అని అరవాలనిపించింది.

రాధ ఆ చీర తీసి భుజం మీద వేసుకుంటూ "అక్కయ్యా! ఈ చీర నాకు ఎలా ఉంది?" అన్నది సంభాషణ మరోవైపు తిప్పుతూ.

రేణుక చురచుర చూసింది.

రాధ చీర తీసి టేబుల్ మీద పడేసింది. "నాకు కావాలని కాదు ఊరికే ఎలా ఉందని అడిగాను"

"చూడక్కా! ఆ చీర నాకు కావాలన్నాను. రాధ కూడా తనకు కావాలంటున్నది" ఇప్పుడిప్పుడే చీరలు కడుతున్న చిన్న చెల్లెలు సరళ చదువుతున్న పుస్తకం చేతిలోనే పట్టుకొని స్టడీ రూం నుంచి బయటికి వచ్చి అన్నది.

"మరదలు పిల్లకు అప్పుడే చీరలు మోజు ఎక్కువైంది?" అన్నాడు సుధీర్.

"ఆగండి వెధవ" తిట్టుకుంది రేణుక మనసులోనే.

"పో బావా" మెలికలు తిరిగిపోతూ అన్నది సరళ.

"తిన్నగా నిల్చోలేవూ? ఏమిటా మెలికలు తిరగడం" ఎవర్నీ ఏమీ అనలేక సరళను విసుక్కుంది రేణుక.

సరళ కళ్ళలో నీరు తిరిగింది.

గిర్రున తిరిగి తనగదిలోకి వెళ్ళిపోయింది.

"వెళ్ళొస్తానమ్మా" రాధ లేచి నిలబడిపోయింది.

"ఆ చీర తీసుకెళ్ళు. సరళ చిన్నపిల్ల రేణు ఎలాగూ కట్టుకోదు" అన్నది తల్లి.

రాధ చీరకేసి ఆశగా చూసింది.

"తీసుకో" అన్నాడు సుధీర్.

రాధ అక్క ముఖంలోకి చూసింది.

"తీసుకో రాధా" అన్నది రేణుక.

రాధ గబుక్కున చీర తీసుకుంది. ఆలస్యం అయితే మళ్ళీ ఎవరైనా లాగేసుకుంటారన్నట్టు రేణుకకు నవ్వు వచ్చింది. కాని నవ్వలేదు.

రాధ తల్లిముఖంలోకి చూసింది.

"వద్దులే! అక్కయ్యనే కట్టుకోమను" మళ్ళీ చీర అక్కడే పెట్టింది.

"దానికి అంత పెద్ద చీరలు ఎందుకే? అది కడుతుందా ఏమన్నానా? తీసుకో" అన్నది తల్లి.

"తీసుకో రాధ! అమ్మ చెప్పినట్టు అలాంటి చీరెలు నాకెందుకే!" అన్నది రేణుక.

"తీసుకోమంటుంటే పెద్ద బెట్టు చేస్తున్నావేమేవ్" అన్నాడు సుధీర్.

"వస్తాను" అంటూ రాధ చీర తీసుకుని వెళ్ళిపోయింది.

తను ఎటూ ఆ చీర కట్టుకోదు. కాని తల్లి ముందుగానే ఆమాట అనడం ఎందుకో బాధ అనిపించింది.

"దానికంటే పెద్దవాళ్ళు కట్టుకోవడం లేదూ. నెక్లెస్ లూ, జార్జెట్లూ? పట్టుచీరకట్టుకోవడానికేం" అని ఒక్కమాట అమ్మ ఎందుకు అనలేకపోయింది.

రేణుక ఫోన్ దగ్గిరకు వెళ్ళింది.

"సీతా! నేనే రేణుకను. నాకు అభ్యంతరం లేదు. అతనికి ఉత్తరం రాయండి" అనేసింది.

ఎవరిమీదో కసి తీర్చుకున్నట్లుగా మనసు తేలికపడినట్టుగా అనిపించింది.

# 28

రేణుక ఫోటో రామచంద్రానికి పంపించారు.

రామచంద్రం తనకు ఆమెను చేసుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని రాశాడు. తన బ్యాంకు అకౌంటు గుంటూరుకు మారిపించుకున్నాడు. అన్నీ సెటిల్ చేసుకున్నాడు. పదిహేను రోజుల్లో వస్తున్నట్టు రాశాడు. సీతాలక్ష్మి ఆ విషయం రేణుకకు చెప్పింది.

రేణుక అన్యమనస్కంగా ఉంటున్నది. తను తొందరపడ్డానేమో అనే అనుమానం పీడించసాగింది.

ఆరోజు మధ్యాహ్నం జ్వరంగా అనిపించి రేణుక ఇంట్లో పడుకుంది.

సీతాలక్ష్మి వచ్చింది. సీతాలక్ష్మి అప్పుడప్పుడు రేణుక ఇంటికి వస్తూ ఉంటుంది. కాని రేణుక వివాహం విషయం మాత్రం ఆమె తల్లికి చెప్పలేదు.

"రామ్మా! చాలారోజులకు వచ్చావ్?" ఆప్యాయంగా ఆహ్వానించింది సుందరమ్మ.

"రేణుక లేదా?"

"ఆరోగ్యం బాగాలేదు, పడుకుంది. ఈ మధ్య దానికి వంట్లో బాగుండటం లేదు. డాక్టర్లకు చూపించుకోదు. రాత్రింబవళ్ళు కష్టపడుతుంది బిడ్డ. తనకు సుఖం లేదు" సుందరమ్మ కళ్ళు తుడుచుకుంది.

"రేణుక డాక్టర్! ఆమె ఆరోగ్యం గురించి మీరు అంతగా బాధపడనక్కర్లేదు."

"లేదమ్మా! ఈ మధ్య అన్నం కూడా సరిగా తినడం లేదు. ఎప్పుడూ దిగులుగానే కన్పిస్తున్నది"

సీతాలక్ష్మి పిచ్చాపాటి మాట్లాడుతూ కూర్చుంది.

"దాన్ని లేపనా?"

"వద్దులెండి! నేను మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని వచ్చాను!"

సుందరమ్మ గాభరా పడింది.

"ఏమిటమ్మా! దాని ఆరోగ్యం గురించేనా?"

"కాదండీ! రేణుక తను ఇంతవరకూ తన వాళ్ళకోసం బతికింది. ఇప్పుడు దాదాపు బాధ్యతలు అన్నీ తీరిపోయాయి"

"ఇంకా చిన్నదానికి పెళ్ళి చెయ్యాలి"

"బి.ఏ. చదువుతోందిరా? పూర్తి అయ్యాక చెయ్యొచ్చును. రేణుకను పెళ్ళి చేసుకోమంటున్నాను"

సుందరమ్మ సీతాలక్ష్మి ముఖంలోకి విస్మయంగా చూసింది.

"మాకు తెలిసిన ఒకాయనకు భార్య చనిపోయింది. ఏ బాదరబందీ లేదు. ఏభైవేలు బ్యాలెన్సు ఉంది. మా బంధువులే!"

సీతాలక్ష్మి ముఖంలోకి చూస్తూనే ఉండిపోయింది సుందరమ్మ.

"అతను సిలోన్ లో ఉంటున్నాడు. ఎల్లుండి వస్తున్నాడు. రాగానే రిజిష్టర్ మేరేజ్ చేద్దామని!"

"ఇప్పుడు దానికి పెళ్ళేమిటి? ఎవరన్నా వింటే నవ్విపోతారు."

ఈసారి సీతాలక్ష్మి ఆశ్చర్యం పోయింది.

ఈమె ఇలా అంటుందేమిటి? తల్లి సంతోషిస్తుందనుకుంది.

"నాతో అంటే అన్నావ్? దానితో అనకు!"

సీతాలక్ష్మి బిత్తరపోయింది.

"అమ్మా!" అన్నది రేణుక. రేణుక ఎప్పుడువచ్చి అక్కడ నిల్చుందో ఇద్దరిలో ఎవరూ చూడలేదు.

"నీ స్నేహితురాలు నీకు పెళ్ళి చేస్తుందటే?"

"అవును! చేస్తుంది. నువ్వు చెయ్యలేని పని ఆమె చేస్తుంది.

సుందరమ్మ కొయ్యబారిపోయింది. కళ్ళప్పగించి కూతురి ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

"ఈ వయసులో పెళ్ళేమిటి? ఎవరన్నా వింటే నవ్వుతారు. నేను ఏనాడో అన్నాను. నా నోరు మూయించావు"

"పెళ్ళికి వయసేమిటండీ? ఎవరైనా ఎందుకు నవ్వుతారు?"

"చాల్లేవమ్మా! నీకు మనవలు కూడా పుట్టారు. ఇప్పుడు దాని పెళ్ళి చేసుకోమంటున్నావ్? మేం తలెత్తుకు తిరగడం ఇష్టం లేదా?"

"అమ్మా! అనవసరంగా ఆమెను ఏమీ అనకు. నేను పెళ్ళి చేసుకోవడానికే నిశ్చయించుకున్నాను" ఖచ్చితంగా అన్నది రేణుక. సుందరమ్మకు మాటలు కరువైనాయి.

సీతాలక్ష్మి లేచింది "వస్తాను రేణూ" అంటూ వెళ్ళిపోయింది. రేణుక తన గదిలోకి వెళ్ళిపోయింది.

అమ్మకు కూడా తను పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. ఎందుకు?

తను పెళ్ళి చేసుకుంటే, ఆమెకు తను కొడుకు దగ్గిరపడి ఉండాల్సి వస్తుందని భయమా?

మానవుడు తనకు తెలియకుండానే సుఖం కోసం పాకులాడుతాడు. అమ్మకు రోజులు నిశ్చింతగా గడిచిపోతున్నాయ్! చేతినిండా డబ్బు! ఇంటి పెత్తనం ఇవన్నీ దూరం అవుతాయనా?

ఏమిటి తల్లిని గురించి ఇంత దారుణంగా ఆలోచిస్తున్నది?

ఆమె పాతకాలం మనిషి. నలభై తర్వాత ఆడదాని పెళ్ళి గురించి ఆలోచించడం ఆమె ఊహకు అందని విషయం. అందరూ నవ్వుతారని భయం. అదేదో కానిపనిగా భావిస్తోంది అంతే.

"నిజమేనా నీ స్నేహితురాలు చెబుతున్నది?"

గబుక్కున వెనక్కు తిరిగి చూసింది రేణుక.

తల్లి గడపలో నిలబడి ఉన్నది.

"నిజమే!"

"ఇప్పుడేం పెళ్ళే?"

"ఆ విషయం ఆలోచించుకోవాల్సింది నేను. నా జీవితం గురించి మరొకరు ఆలోచించే సమయం దాటిపోయింది. ఈ విషయంలో మీరెవరూ కల్పించుకోవద్దు. ఇప్పుడే చెబుతున్నాను"

ఆ రాత్రి ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంటినిండా మనుషులు కన్పించారు. రామం వచ్చాడు. రాధ వచ్చింది. సుధీర్ వచ్చాడు. రాధ పిల్లలు ఇద్దరూ ఉన్నారు. సరళ కూడా అక్కడే వున్నది.

రేణుకను చూసి అందరూ ముభావంగా ఉండిపోయారు.

రేణుక ఒకసారి అందర్నీ కలియచూసింది.

వాళ్ళు ఏ విషయం గురించి మాట్లాడుతున్నారో ఇట్టే అర్థం చేసుకుంది.

రేణుక తనగదిలోకి వచ్చింది.

"అత్తయ్యా" ఐదేళ్ళ గౌతమ్ లోపలకు వచ్చాడు.

"ఏరా బాబూ!"

"నువ్వు పెళ్ళి చేసుకుంటావా?"

"ఎవరు చెప్పారు?"

"నానమ్మ!"

"వద్దంటావా?"

"చేసుకో. బాజాలు కూడా మోగుతాయి. నాకు మంచి కొత్తబట్టలు కుట్టించాలి"

"అలాగే బాబూ" అంటూ గౌతమ్ ను ఎత్తుకొని గుండెలకు హత్తుకుంది.

ఎవరికీ రేణుకను ఆమె వివాహం గురించి ప్రశ్నించే ధైర్యం లేదు.

## 29

డాక్టర్ రేణుకాదేవి వివాహం చేసుకోబోతున్నదని చాలా మందికి తెలిసింది.

"ఇప్పుడేం పెళ్ళి?" అన్నారు కొందరు.

"ఇప్పటికైనా సెటిల్ అవుతుంది. మంచిపనే చేస్తున్నది!" అన్నారు మరికొందరు.

"అమ్మా, అక్కయ్య పెళ్ళి చేసుకుంటుందని మా క్లాసుమేట్స్ ఎగతాళి చేస్తున్నారమ్మా! ముసలమ్మకు పెళ్ళేమిటి? మీ బావగారికి మనుమలు కూడా ఉన్నారటగా అంటున్నారు" కాలేజీ బయలుదేరుతూ అన్నది సరళ.

"నన్నేం చెయ్యమంటావే?"

"నాకు కాలేజీకి వెళ్ళాలంటే సిగ్గుగా ఉన్నది"

"సరళా" దెబ్బతిన్న జంతువులా అరిచింది అప్పుడే ఆసుపత్రికి తయారై గదిలోనుంచి బయటకి వచ్చిన రేణుక.

సరళ బిత్తరపోయింది.

"బాగుంది. ఎవరో ఏదో అంటున్నారని అది అంటున్నది చిన్నపిల్ల. తోటివాళ్ళు ఎగతాళి చేస్తుంటే బాధపడుతుంది. సర్దిచెప్పాలి గాని అలా దాన్ని కసురుకుంటావేం?" అన్నది తల్లి.

రేణుక తల్లిముఖంలోకి చూసింది.

తల్లిలో కూడా ముభావంగా ఉంటున్నది రేణుక. తను వివాహం చేసుకోవడం తల్లికి కూడా ఇష్టం లేదని తెలిసినప్పుడు ఆమె మనసు లోతుగా గాయపడింది. ఎవరు సమర్థించినా, సమర్థించకపోయినా తల్లి సంతోష

పడుతుందని ఆశించింది.

"నువ్వు దాన్ని సమర్థించడం లేదు. నీ మనసులో ఉన్న స్వార్థాన్ని బయట పెట్టుకుంటున్నావ్. అసలు నేను పెళ్ళిచేసుకోవడం నీకే ఇష్టం లేదు"

"రేణూ!"

"అవును! నీకు పెత్తనం చెయ్యడం బాగా అలవాటయింది. నేను కష్టపడి సంపాదించే డబ్బుతో అల్లుళ్ళనూ, కోడళ్ళనూ చాలా గొప్పగా గౌరవిస్తున్నావ్! నేను పెళ్ళి చేసుకుంటే నువ్వు ఎవరి పంచనో తల దాచుకోవాల్సి ఉంటుందని నీ భయం. ఇప్పుడు నిన్ను ఇంత గౌరవించే అల్లుడింటికి పోయి ఉండు. వాళ్ళు నిన్నెంత గౌరవిస్తారో! నీకా భయం అక్కర్లేదు. నేను పెళ్ళి చేసుకున్నా, చేసుకోకపోయినా నువ్వు నాదగ్గరే ఉంటావు. ఇంటి పెత్తనం నీచేతిలోనే ఉంటుంది" ఓ క్షణం ఆగి సరళకేసి చూసింది.

"సరళా. నువ్వు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నావ్ జాగ్రత్త"

"నేనేమన్నాను?" ఏడుపు గొంతుతో అన్నది సరళ.

"నీ స్నేహితుల వాగుడు నువ్వు పట్టించుకోకు. చేతనయితే హాయిగా వాళ్ళ మాటలకు నవ్వేసేయ్. మళ్ళీ మాట్లాడరు. నీ అక్క నువ్వు సిగ్గుపడేలాంటి పని ఏమీ చెయ్యడం లేదు. కాలేజీ దగ్గిర వదిలేసి వెళతాను" అంటూ చరచర కారుకేసి నడిచింది రేణుక.

సరళ పిల్లిలా ఆమె వెనకే వెళ్ళి కార్లో కూర్చుంది.

సుందరమ్మకు మతిపోయినట్టే అయింది కూతురి మాటలకు.

## 30

రామచంద్రం ఇదుగో వస్తాను, అదిగో వస్తాను ముహూర్తాలు పెట్టించమని రాశాడు.

రేణుకకు అతన్ని చూడకుండా ముహూర్తం పెట్టించడం ఇష్టంలేదు.

"ముహూర్తమేమిటి? నేనేమీ పూలజడవేసుకొని తల వంచుకొని పీటల మీద కూర్చోవటం లేదు" అన్నది రేణుక విసురుగా సీతాలక్ష్మితో.

"అది కాదోయ్ పదిమంది ముందు దండలు మార్చుకొని చిన్న పార్టీ చేస్తే బాగుంటుంది. అదేరోజు రిజిష్టారు దగ్గిర సంతకాలు కూడా పెట్టుకోవచ్చును"

"మీ ఇష్టం!" తన పెళ్ళి గురించి ఎక్కువగా మాట్లాడటం కూడా రేణుకకు ఇష్టం ఉండటంలేదు.

అనేకసార్లు ఆలోచించింది.

తను పెళ్ళి చేసుకోబోతున్నది. కాని తనకు సంతోషంగా ఉండటం లేదేం? ఏదో దిగులుగా ఉంటుందేం?

సీతాలక్ష్మి కార్డులు వేయించింది.

పెళ్ళి కొడుకూ, పెళ్ళి కూతురూ తమ పెళ్ళికి పిలుస్తున్నట్లు అధునాతనంగా కార్డులు వేయించింది.

ఇంట్లో ఎవరూ ఆ విషయం ఎత్తడంలేదు.

రేణుక చంద్రానికి ఉత్తరం రాసింది.

సంతోషిస్తూ సమాధానం ఇచ్చాడు. శుభాకాంక్షలు తెలియజేశాడు. అదే ఉత్తరంలో తను ఒక బెంగాలీ అమ్మాయిని ప్రేమిస్తున్నట్టు, త్వరలోనే పెళ్ళి చేసుకోబోతున్నట్టు తెలియజేశాడు.

రేణుక ఆ వార్త చదివి నవ్వుకుంది.

మరి తనకోసం బ్రహ్మచారిగానే ఉంటానన్నాడుగా?

ఛ! తమ్ముణ్ణి గురించి తను అలా ఆలోచించడం ఏమిటి? ఒకవేళ తను చేసుకోకపోయినా చంద్రాన్ని చేసుకోమని తను బలవంతం చేసి ఉండేది. ఏదో ఆవేశంలో అంటారు. అంతేగాని ఎవరికోసం ఎవరు తమ జీవితాలనూ, సుఖసంతోషాలనూ వదులుకుంటారు?

ఏం చేసేవాళ్ళు లేరా? తనలాంటివాళ్ళు మధన పడసాగింది. తనను పెళ్ళికూతురిగా ఊహించుకోవాలంటే ఆమెకు ఎబ్బెట్టుగా తోచసాగింది.

వివాహం మూడురోజులు ఉందనగా రామచంద్రం గుంటూరు చేరుకున్నాడు.

బొంబాయిలో ఏదో పని ఉందని ఒకవారం ఉండిపోయాడు.

బొంబాయి నుంచి రేణుకకు ఫోన్ చేశాడు. రేణుక ఏం మాట్లాడాలో తోచక తత్తరబిత్తర లాడింది.

అతని మీద చిరాకు కలిగింది. కాని ఫోన్ పెట్టేశాక ఆ కంఠంలోని ఆత్మీయతనూ మెత్తదనాన్ని మళ్ళీ మళ్ళీ తలచుకోకుండా ఉండలేకపోయింది.

సీతాలక్ష్మి ఇంట్లో భోజనాలు ఏర్పాటు చేసి రేణుకను తీసుకెళ్ళడానికి ఆమె వచ్చింది. రామంగాని, రాధగానీ వస్తే బాగుంటుందని సుందరమ్మ దగ్గిర, రామచంద్రం తెల్లవారి వస్తాడనగా అన్నది. ఆమె మాట్లాడలేదు.

రేణుక కారు దిగి సీతాలక్ష్మి లోపలకి వస్తుంటే, కళ్ళలో వణుకులా అనిపించింది. అరచేతుల్లో చమట పట్టింది. గుండె దడదడలాడింది.

కారులో కూర్చున్నప్పుడు కూడా ఏదో అనుభూతి ఆమె మనసుకు చుట్టేసింది.

ఏం మాట్లాడాలి?

తనను కళ్ళప్పగించి చూస్తాడేమో!

అలాంటి చూపులంటే తనకు అసహ్యం!

హాల్లో సీతాలక్ష్మి భర్తతో నల్లగా చింతపండు బస్తాలో ఉన్న వ్యక్తితో మాట్లాడుతూ ఉన్నాడు.

"రండి! రండి!" అంటూ సీతాలక్ష్మి భర్త రేణుకను ఆహ్వానించాడు.

"కూర్చోవోయ్" అంటూ సీతాలక్ష్మి ఖాళీ కుర్చీలో కూర్చుంది. ఆమె పక్కనే రేణుక కూర్చుంది.

"రేణూ! ఈయనే రామచంద్రం! నీ ఉడ్ బీ!"

రేణుక మర్యాదకూడా మర్చిపోయి కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయింది.

ఇతనికి నలభై ఏడు ఏళ్ళా?

అరవై ఐదన్నా ఉంటాయ్!

నల్లగా నిగనిగలాడే రంగు!

బట్టతల!

కాళి పొగబారినట్టున్న చేతులు!

కళ్ళకింద ముడతలుపడి బిరువెక్కిన చర్మం చెట్టు బెరడులాగున్నది.

అతను రేణుకను మెరుస్తున్న కళ్ళతో చూశాడు.

రేణుకకు అతనిని చూస్తుంటే కడుపులో దేవినట్టు అయింది.

ఇతనా రామచంద్రం!

ఇంతకాలం ఉండి ఇప్పుడు ఈ ఎలుగుబంటితో వివాహమా! జీవితమంతా గడపాలా? మోసం!

అన్యాయం!

రేణుక చివ్వున లేచింది.

చరచర బయటికి నడిచింది.

సీతాలక్ష్మి వెనకే పరుగు తీసింది.

"ఏమిటే రేణూ! ఏమైంది."

"మోసం!"

"మోసమా?"

"ఎలుగుబంటిలా అంత ఘోరంగా ఉన్నాడేం?"

"ఫోటోలో చూశావుగా?"

"ఫోటోలో ఉన్నట్టే ఉన్నాడా?"

"నేను చూసి పదిహేనేళ్ళు అయింది. అప్పుడు బాగానే ఉండేవాడు. అయినా ఈ వయసులో అందం కాదే చూడాల్సింది బుద్ధి"

"అయినా ఇంత ఘోరంగానా?"

సీతాలక్ష్మిని అమాంతం మింగేయాలనిపించింది.

"ఈ పెళ్ళి జరగదు. అతనితో చెప్పేయ్!" అంటూ కార్లో కూర్చుని డ్రైవర్ తో "పోనియ్!" అన్నది.

కారు దిగి పరుగులాంటి నడకతో తన గదిలోకి వెళ్తున్న కూతుర్ని చూస్తూ ఉండిపోయింది సుందరమ్మ.

గంట తర్వాతా సీతాలక్ష్మి వచ్చింది.

"ఏం జరిగిందమ్మా?" సుందరమ్మ అడిగింది.

"చూడండి! తీరా ఆహ్వాన పత్రికలు కూడా పంచాక ఇప్పుడు పెళ్ళి వద్దంటోంది"

సుందరమ్మ అయోమయంగా చూసింది.

"అతను తనను అవమానించినందుకు కోర్టుకు వెళ్తానంటున్నాడు"

"వెళ్తే వెళ్ళమను!" విసురుగా బయటికి వచ్చి అన్నది రేణుక.

"ఆలోచించుకోవే! రచ్చకెక్కుతావా? అందరూ నవ్వరూ?"

"అదేమిటి ఇప్పుడు కాదంటే ఎలా? ఇప్పుడు పెళ్ళి ఆగిపోతే ఎంత అప్రదిష్ట!" సుందరమ్మ నెత్తీ నోరు బాదుకుంది.

"అదే నేనూ అంటున్నాను పిన్నిగారూ! అతను కాస్త నలుపు. అనుకున్నదానికంటే రెండేళ్ళు పెద్దగానే కన్పిస్తున్నాడు. ఈ వయసులో అంతకంటే మంచి సంబంధం ఎక్కడ్నుంచి వస్తుంది?"

"సీతా!" గాయపర్చిన వేటగాడి కేసి లేడి చూసినట్టు చూసింది రేణుక.

"కార్డులు కూడా పంచారు. చిన్నదానికి పెళ్ళి కూడా కావాలి" సుందరమ్మ దిగులుగా అన్నది.

సీతాలక్ష్మి రేణుకను బ్రతిమాలింది. కోర్టుకు వెళితే బాగుండదని చెప్పింది. రేణుక ఈ వివాహానికి అంగీకరిస్తూ రాసిన ఉత్తరం అతని దగ్గర వున్నదని చెప్పింది.

"రోగ్! ఉత్తరం దాచుకున్నాడంటే వాడికి ముందు నుండే అనుమానం వుందన్నమాట. అందుకే పెళ్ళి రెండు రోజులు వుందనగా వచ్చాడు" రోషంగా అన్నది రేణుక.

ఆ రాత్రి సుందరమ్మ కొడుకు ఫోన్ చేసింది. కోడలు కూడా వచ్చింది. రాధ వచ్చింది. అందరూ ఒకటే మాట- "కుటుంబాన్ని బజారు పాలు చెయ్యకు!" అని.

రేణుక అంగీకరించక తప్పలేదు.

రిసెప్షన్ కు వచ్చిన వాళ్ళంతా రామచంద్రాన్ని వింత జంతువును చూసినట్టు చూడటం రేణుక గమనించింది. తనను చూసి తనే విషాదంగా నవ్వుకున్నది.

రేణుకకు తను చదువుకొనే రోజుల్లో తన క్లాసుమేట్ సునంద అన్నమాటలు గుర్తొచ్చాయి.

ఆడపిల్ల ఇరవైలోపు పెళ్ళికొడుకు గురించి "ఎలా ఉంటాడు? అని గర్వంగా మెడపైకెత్తి అంటుందట. అంటే ఆ వయసులో అందానికి మాత్రమే ప్రాముఖ్యతను ఇస్తుంది.

ముప్పయ్ తర్వాత "ఏం చేస్తుంటాడు?" అంటుందట గంభీరంగా. అంటే ఆ వయసులో హోదాకు ప్రాముఖ్యతనిస్తుందన్నమాట.

నలభై తర్వాత 'ఎక్కడున్నాడు" అంటుందట ఆత్రంగా. అంటే ఆ వయసు పెళ్ళికాలేదని బాధపడే స్త్రీ అతను ఎలా వుంటాడు, ఏం చేస్తుంటాడనే విషయం కూడా ఆలోచించదన్నమాట.

ఆ మాటలు విన్నప్పుడు తను పొట్ట చెక్కలయ్యేలా విరగబడి నవ్వింది. ఒకసారి మాటల సందర్భంలో గౌతమ్ తో అంటే అతను కూడా విరగబడి నవ్వాడు.

ఇప్పుడు తనను చూసి అందరూ అలాగే అనుకుంటూ వుంటారు.

పెళ్ళి జరిగిపోయింది.

## 31

వివాహం అయిన రాత్రే రామచంద్రం రూపంలోనే కాదు, మానసికంగా కూడా ఎంత వికృతంగా ఉంటాడో అర్థం అయింది.

తనను చూడగానే ముఖం ముడుచుకొని వెళ్ళిపోయినందుకు అనేక మాటలు అన్నాడు.

"నీకు అందగాడు కావాలా?"

"పాతికేళ్ళ బాలాకుమారుడు దొరుకుతాడనుకున్నావా?" అంటూ అర్ధరాత్రి వరకు సాధించాడు.

ఇంకోరోజు

"ఎవర్నో ప్రేమించావటగా?"

"మాట్లాడవేం?"

"నా గతాన్ని త్రవ్వకండి!"

"ఓహో! గతం అంత మధురమైనది అన్నమాట!"

"అవును"

"సిగ్గులేదు?"

"ఎందుకు?"

"పెళ్ళికిముందే ప్రేమ వ్యవహారాలూ నడిపావ్. ఇంకా ఎదురుప్రశ్న వేస్తున్నావా?"

"అయితే ఇప్పుడేమంటారు? ఇష్టంలేకపోతే వదిలేసి వెళ్ళిపోండి"

"ఏం! పాత ప్రియుడ్ని పిలిపించుకుంటావా!"

"ఛ! మీతో మాట్లాడటం నాదే బుద్ధి తక్కువ"

రోజూ ఏదో రకంగా సాధించేవాడు. సినిమాకు బయలుదేర తీసేవాడు.

"పాతచీర కట్టుకున్నావేం? ఈ మొగుడిగాడి వెంట వెళ్ళడానికి ఇది చాల్లే అనా?" అనేవాడు మామూలు చీర కట్టుకుంటే.

"పదహారేళ్ళ బాలాకుమారిలా తయారయ్యావే? ఎవర్ని ఆకర్షించడానికి!" అనేవాడు మంచి చీర కట్టుకుంటే.

అది తను కోరి వరించిన నరకం!

అందుకే ఆమె అన్నీ భరించసాగింది.

"అక్కా!"

రేణుక చివ్వున తలెత్తి చెల్లెలు ముఖంలోకి చూసింది.

"బావ వ్యవహారం ఏమీ బాగాలేదు"

రేణుక చెల్లెలి ముఖంలోకి అయోమయంగా చూసింది.

"వెకిలి జోక్స్ వేస్తాడు. మంచినీళ్ళు ఇవ్వమని పొద్దున చెయ్యి పట్టుకున్నాడు"

రేణుక వెన్నెముకలోకి ఏదో జరజర పాకినట్టు అయింది.

"నేను చూసుకుంటాలే! అతనికి దూరంగా ఉండు. అమ్మకు చెప్పావా?"

"చెప్పలేదు"

"చెప్పకు!"

ఆ విషయం మీద ఆరోజు పెద్ద రభసే అయింది.

రామం రావడం తగ్గించాడు.

రాధ బొత్తిగా రావడం మానేసింది. పిల్లల్ని కూడా పంపడంలేదు.

రామం గౌతమ్ ను తీసుకెళ్ళిపోయాడు. ఆరోజు ఆమె కుమిలికుమిలి ఏడ్చింది.

సంవత్సరం గడిచిపోయింది.

రేణుకకు ఒక యుగం గడిచినట్లు గడిచింది ఆ సంవత్సరం.

భర్త లోపలకు వస్తుంటే ఎలుగుబంటి వెనక కాళ్ళ మీద వస్తున్నట్టు అనిపించసాగింది. అతని రూపం కంటే అతని బుద్ధులే ఆమెకు అతని మీద ఏవగింపు కలిగించాయి.

రేణుక గతజీవితాన్ని గురించి ఒకటే ప్రశ్నలు వేస్తాడు.

రేణుక మొండికేసింది.

అతను ఏమన్నా ఉలకదు! పలకదు!

అమెరికా నుంచి చంద్రం భార్యతో వచ్చాడు. ఆరు నెలలు శెలవు మీద బావగారిని చూసి బిత్తరపోయాడు.

అక్క బాగా చిక్కిపోయి ఉన్నది.

అర్థం చేసుకున్నాడు.

కాని ఏమీ అడగలేకపోయాడు.

చంద్రం స్నేహితుడితో సరళ పెళ్ళి కుదిరింది.

పాతికవేలు కట్నం.

"నీ బ్యాంకు బ్యాలెన్సు బుక్ చూపించు" అడిగాడు అధికార యుక్తంగా రామచంద్రం!

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? నేను నీ మొగుణ్ణి! నీ సంపాదనలో నుంచి నా పర్మిషన్ లేకుండా చిల్లి గవ్వ కూడా ఖర్చు చెయ్యడానికి వీల్లేదు"

"నేను సంపాదించిన డబ్బు మీద మీ అధికారం ఏమిటి?"

"అంతవరకూ వచ్చిందన్నమాట"

రేణుక మాట్లాడలేదు.

"కట్నం నువ్వే ఇస్తున్నావా?"

"నేను కాక మరెవరిస్తారు!"

"నీ చెల్లెలికి ఇద్దరు అన్నలున్నారు"

"వాళ్ళకు ఆ స్తోమత లేదు"

"లేకపోతే గంతకు తగ్గ బొంతను చూసి ముడిపెట్టమను!"

మళ్ళీ ఘర్షణ.

రేణుక చెల్లెలి పెళ్ళి చేసింది.

రామచంద్రం అలిగి మద్రాసు వెళ్ళి పదిరోజుల తర్వాత వచ్చాడు. పెళ్ళికి అత్తగారూ, చంద్రం ఎంత బతిమాలినా ఉండలేదు.

సరళ అత్తవారింటికి వెళ్ళిపోయింది.

"మొత్తం ఎంత డబ్బు తగలేశావ్?" ఆ రాత్రి అడిగాడు రామచంద్రం.

"మీకు అనవసరం!"

"పిచ్చి వాగుడు వాగకు. ఇక నీ ఆటలు సాగవు!"

రేణుక నిప్పులు కురిపిస్తూ చూసింది. మాటలు పెగల్లేదు.

"మీ అమ్మ నీ దగ్గిరే ఉంటుందా!"

"ఇంకెక్కడికి పోతుంది?"

"ఏం? కొడుకులు ఉన్నారు? మరో ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు"

"ఈ ఇంటికి పెద్ద కొడుకుని నేనే!"

రామచంద్రం గొల్లున నవ్వాడు. ఆ నవ్వు చెడిపోయిన ఫ్యాన్ చేసే రోదలా వుంది.

రామచంద్రం రోజూ క్లబ్బులో పేకాటకు వెళ్తున్నాడు. బాగా త్రాగి ప్రొద్దుపోయి ఇంటికి వస్తాడు. అనరానిమాటలు అంటాడు. కాని రేణుక తల్లికీ, చంద్రానికి, అతని భార్యకు తెలియకుండా మసలుకోవడానికి ప్రయత్నిస్తోంది.

రామచంద్రం రేణుకను డబ్బు అడగడం మొదలుపెట్టాడు.

కొంతకాలం ఇచ్చింది.

చంద్రం పదిహేను రోజుల్లో వెళ్ళిపోతాడు.

"మీ అక్క అలాంటివాణ్ణి చేసుకుందేం ఈ వయసులో?" ఒకరోజు చంద్రం భార్య అడిగింది.

"అది నీకు అనవసరం! అక్కను గురించి చిన్నమాట అన్నా నేను భరించలేను" అన్నాడు.

మళ్ళీ ఆమె ఆ విషయం ఎత్తలేదు.

## 32

"నీ తమ్ముడూ, మరదలూ ఇంకెంతకాలం ఇక్కడ తిష్ట వేస్తారు?"

"వాళ్ళకిష్టమున్నంత కాలం?"

"మీ నాన్న సంపాదించిన సంచులున్నాయ్ గా? కూర్చుని తినమను!"

"మీ సంగతి? భార్య సొమ్ము తింటూ కూర్చోలేదూ?"

రామచంద్రం బిత్తరపోయాడు.

"ఏమిటే మరీ పేట్రేగిపోతున్నావ్?"

"ఉసే! అసే! అనకు!"

"మీరు అన్నీ మన్నించాలా?"

"అవును!" మొండిగా అన్నది రేణుక.

రామచంద్రం విసురుగా బయటికి వెళ్ళాడు.

బాగా పొద్దుపోయి తాగి వచ్చాడు.

మాటా మాటా పెరిగింది.

రేణుక చెంపచెళ్ళు మనింది.

"యూ రోగ్! స్టుపిడ్! నన్ను కొడతావా?"

"ఏమన్నావ్?"

జుట్టు పట్టుకొని వంగదీసి ధబీధబీ బాదసాగాడు.

దగ్గిరగా వేసి ఉన్న తలుపులు తెరుచుకొని చంద్రం లోపలకు వచ్చాడు.

చంద్రాన్ని చూసి రామచంద్రం రేణుక జుట్టు వదిలేశాడు.

రేణుక తమ్ముడి ముందు సిగ్గుతో తలదించేసుకుంది.

"సిగ్గులేదూ?" చంద్రం కోపంతో వణికిపోయాడు.

"ఏమిట్రా కుశావ్! నా పెళ్ళాం నా ఇష్టం!"

"యూ షట్ అప్! యూ గెట్ అవుట్!" ఒక్క తోపు తోశాడు చంద్రం.

రేణుక పలకలేదు. సినిమాల్లోని పతివ్రతలా తమ్ముణ్ణి తిట్టి భర్తను వెనకేసుకు రాలేదు.

"ఈ ఇంట్లో ఒక్క క్షణం ఉండను"

"పో! వెళ్ళు! ఈ క్షణంలోనే వెళ్ళు! పెళ్లాం డబ్బు తింటూ కూర్చునే వాడివి ఆమెను కొడతావా? మగవాడిననే అహంకారం తప్ప నీలో ఇంకేమీ లేదు"

"ఏమే! అలా చూస్తావ్? కులతా"

చంద్రం రామచంద్రాన్ని కసిగా అందిన చోటల్లా కొట్టసాగాడు.

తల్లీ, చంద్రం భార్య పరుగెత్తుకొచ్చారు.

"ఒరేయ్ అదేమిట్రా?" లబలబలాడింది సుందరమ్మ.

"మా అక్కను కులత అంటావట్రా" అంటూ ఒక్క తోపు తోశాడు చంద్రం.

రామచంద్రం అరుస్తూ బయటికి వెళ్ళిపోయాడు. వారంరోజులయినా ఇంటికి రాలేదు.

వేరే ఇల్లు తీసుకున్నాడు.

సీతాలక్ష్మి రాజీ చెయ్యాలని వచ్చింది.

ఆ విషయం తప్ప ఇంకేదయినా మాట్లాడమన్నది రేణుక.

చంద్రం ప్రయాణం అవుతున్నాడు.

"అక్కా?"

"నేను తప్పు చేశాను గదూ?"

"ఏ విషయం?"

"అదే? అనవసరంగా కల్పించుకొని మీ ఇద్దర్నీ..."

"ప్లీజ్! చంద్రం ఆ విషయం ఎత్తకు. నేను ఇప్పుడే హాయిగా ఉన్నాను"

చంద్రం మాట్లాడలేదు.

చంద్రం, అతని భార్య వెళ్ళిపోయారు.

సుందరమ్మకు పెద్దకూతుర్ని గురించి దిగులు పట్టుకుంది. అల్లుడు తిరిగివస్తే బాగుండును అని వున్నది. ఆ విషయం రేణుకతో అనే ధైర్యం లేదు.

రామచంద్రం లాయర్ నోటీసు పంపించాడు. తన భార్య తన దగ్గర ఉండటం లేదని.

రేణుకకు అదే సమయంలో జయదేవ్ తో పరిచయం అయింది.

రేణుక మెడికల్ కాన్ఫరెన్సుకు హైదరాబాద్ వచ్చింది. జయదేవ్ బ్రహ్మచారి. జయదేవ్ ఆమెను తన ఇంటికి డిన్నర్ కు ఆహ్వానించాడు.

రేణుకకు కోర్టు సమన్సు వచ్చాయి.

సుందరమ్మ దిగులుతో మంచం పట్టింది.

రేణుక బోన్ ఎక్కాల్సి వచ్చింది.

తన రక్తం పంచుకొని పుట్టినవాళ్ళు, తను పెంచి పెద్దచేసిన వాళ్ళకు తనమీద చిన్నచూపు ఏర్పడిందని తెలుసుకుంది.

డైవర్సు కేసు కోర్టులో నడుస్తున్నది.

అదే సమయంలో రేణుక తల్లి చనిపోయింది.

రేణుక ఇంతటి విశాల ప్రపంచంలో ఏ ఆధారం లేకుండా గాలిలో నిల్చున్నట్టు అన్పించసాగింది.

రేణుక ఆసుపత్రికి ఒకరోజు అనుకోకుండా జయదేవ్ వచ్చాడు.

"హలో!"

రేణుక ముఖం వికసించింది.

"ఏమిటి అంత చిక్కిపోయారు?"

రేణుక మాట్లాడలేదు.

రేణుక గురించి జయదేవ్ విన్నాడు. గుంటూరులో ఆమె కేసు చూస్తున్న లాయర్ జయదేవ్ స్నేహితుడని ఆమెకు తెలియదు.

జయదేవ్ తరచుగా గుంటూరు వస్తున్నాడు.

వచ్చినప్పుడల్లా రేణుకను చూస్తూనే ఉన్నాడు. అసలు ఆమెను చూడటానికే తరచుగా వస్తున్నట్టు అతనికి మాత్రమే తెలుసు.

క్రమంగా యిద్దరి మధ్య చనువు పెరిగింది.

కోర్టు విడాకులు మంజూరు చేసింది.

రామచంద్రం ఆకాశరామన్న ఉత్తరాలు రాయడం ద్వారా, ఫోన్లు చెయ్యడం ద్వారా ఆమెను బెదిరిస్తున్నాడు.

ఒకరోజు ఆమె ఆసుపత్రిర్ గోడలనిండా జయదేవ్ రేణుకకు అక్రమసంబంధం ఉన్నట్టు ఎవరో రాశారు.

రామచంద్రం పనే అని ఆమెకు తెలుసు. అతనిలో అంత నీచత్వం ఉందని ఆమె ఊహించలేదు. ఆ రాతలు చూసి ఆమె తల వాలిపోయింది.

జూనియర్ ఆ రాతల్ని సున్నంతో తుడిపించింది.

రేణుక అది చూసి తనలో తనే నవ్వుకుంది.

తమ్ముడు రావడం మానేశాడు.

రాధ మళ్ళీ రాసాగింది. ఆమె ఎందుకు వస్తుందో రేణుకకు తెలుసు.

రేణుక అలసిపోయింది.

తనకు తానుగా నిలబడకలననే ఆత్మవిశ్వాసం కొరవడింది.

అదే సమయంలో జయదేవ్ వచ్చాడు.

ఆమెను "హైదరాబాద్ రమ్మనీ, తన నర్సింగ్ హోంలో పనిచెయ్యమనీ కోరాడు"

33

మూర్తీభవించిన సంస్కారం వలె కన్పించే జయదేవ్ నుంచి ఆమెకు నిజమైన ఆదరణ లభించింది.

తను వంటరిది కాదనే ధైర్యం వచ్చింది.

కొద్దిరోజులకే ఇద్దరూ పెద్దల ముందు దండలు మార్చుకున్నారు.

రేణుక తన అద్దె ఇల్లు ఖాళీచేసి రాంకోటిలో ఉన్న జయదేవ్ బంగళాలో అడుగుపెట్టింది.

చంద్రానికి ఉత్తరం రాసింది.

చంద్రం తన సంతోషాన్ని వెలిబుచ్చాడు.

పెద్ద పెద్ద వాళ్ళు జయదేవ్ ఇంటికి వస్తుంటారు.

అతను ఉన్నత కుటుంబానికి చెందినవాడు.

అతనికి తల్లిలేదు. కాని ఆమె చిరకాల భారతీయుల మనసుల్లో ఉండిపోయే కవయిత్రి విదుషీమణి. స్వాతంత్ర్యంకోసం జరిగిన పోరాటంలో గాంధీజీ పక్కన నిలబడింది.

ఐదేళ్ళు జయదేవ్ తో జీవితం ఐదురోజుల్లా గడిచిపోయింది.

చంద్రం మాత్రం ఈ మధ్యకాలంలో ఒక్కసారి వచ్చి వెళ్ళాడు.

దగ్గరలో ఉన్న రామంగాని, చెల్లెళ్ళు గానీ ఎవరూ కంటికి కన్పించలేదు.

జయదేవ్ ఆరు నెలలుగా ఉత్సాహంగా కన్పించడం లేదు.

అతనికి క్యాన్సర్ వచ్చింది. ఆ విషయం భార్య దగ్గిర దాచాడు.

34

అర్ధరాత్రి చీకటి ఆ బంగళాను చుట్టివేసింది.

పార్టికోలో మీదినుంచి వేలాడుతున్న లతలూ, బంగళా ముందున్న లానూ, ఆ లానుకు ఇరువైపులా ఉన్న పూల మొక్కలూ, ప్రహరీగోడలకు ఆనుకొని ఉన్న ఎత్తయిన అశోక వృక్షాలూ ఊపిరి బిగబట్టి ఏదో విషాద వార్త చెప్పడానికి వచ్చిన దూతల్లా ఉన్నాయి.

ఆ బంగళా ప్రహరీగోడ ప్రక్కగా కుక్కలు ఏడుస్తూ ఆ అర్ధరాత్రిని స్తబ్దతను భంగ పరుస్తున్నాయి.

ఆ కుక్కలు ఏడ్పు రేణుకాదేవి వెన్నెముకలోకి జరజర పాకుతూ ఉంది. ఆమె గుండె దడదడలాడింది.

వాడు ఆ మాలీ ఏం చేస్తున్నాడూ? కుక్కల్ని అదిలించడేం?

రేణుకాదేవి మాలీని కేక వెయ్యాలనుకుంది, కాని గొంతు పెగల్లేదు.

మాలీ కుక్కల్ని దూరంగా తోలడం వినిపించింది. కుక్కలా ఏడుపు దూరం నుంచి విన్పిస్తూ ఉన్నది.

ఆ బంగళా లోపల ఏదో అదృశ్య శక్తి పిల్లిలా నిశ్శబ్దంగా తిరుగుతున్నట్టు అన్పించింది రేణుకాదేవికి.

ఆమె నిలువెల్లా వణికిపోయింది.

జీరో వాల్టుబల్బ్ వెలుగులో మంచంమీద పడుకొని ఉన్న భర్త ముఖంలోకి తదేకంగా చూసింది.

మూడురోజులుగా మృత్యుదేవత తన కోరలతో క్షణక్షణం అతనిలోని జీవశక్తిని పీల్చడాన్ని చూస్తూనే ఉన్నది.

ఆ బంగళాలో మృత్యుదేవత తచ్చాడుతూ ఉన్నది. పొంచి పొంచి అతనికోసం చూస్తున్నది. అది ఆమె కళ్ళకు కన్పించకపోయినా, మనసుకు కన్పిస్తూనే ఉన్నది. స్పష్టంగా మనసు చూస్తూనే ఉన్నది.

రేణుకాదేవికి తన వెనక ఎవరో నిల్చున్నట్టూ చిరునవ్వు నవ్వుతున్నట్టూ అన్పించింది.

గిర్రున తిరిగి చూసింది.

ఎవరూ కన్పించలేదు.

ఎవరూ లేరు! ఏమిటి తనకీ భ్రమ. భయం! మృత్యు భయం! తన భర్త మరణశయ్య మీద ఉన్నాడు. తను డాక్టర్. ఆయనకు వచ్చింది నయం అయ్యే జబ్బు కాదు. అయినా తనకు ఇంకా ఆశ ఉంది. ఏదో మిరాకిల్ జరుగుతుందనీ, తన భర్త మృత్యుదేవత ఇనుప కౌగిలి నుంచి బయట పడ్తాడనీ అనిపిస్తూ ఉన్నది.

కాని...కాని...తను చదివిన చదువూ, తన సైన్సు పరిజ్ఞానం తన పిచ్చితనాన్ని పరిహసిస్తూ ఉన్నాయి.

"అబ్బా! రేణూ!"

రేణుక తృళ్ళిపడింది.

భర్త ముఖంలోకి ధీనంగా చూచింది.

రేణూ బాధ! భరించలేను!"

రేణుకాదేవి కళ్ళల్లో నీరు తిరిగింది. అసహాయంగా చూసింది.

"ఈ స్పెషలిస్టులూ, ఈ ఖరీదైన మందులూ నన్ను బ్రతికించలేవు. కాకపోతే నా బాధను మరికొన్ని రోజులు పొడిగిస్తాయి ప్లీజ్! నన్ను వీలయినంత త్వరగా ఈ బాధ నుంచి విముక్తుణ్ణి చెయ్యి"

రేణుకాదేవి నిలువెల్లా వణికిపోయింది.

తను వణుకుతున్న చేతిని భర్త చేతిమీద వేసింది. చేతికి మెత్తని చర్మం, ఎముకా తగిలాయి. నిముషం నిముషం కండ కరిగిపోతూ ఉన్నది. మంచినీళ్లు కూడా లోపలకు పోవడం లేదు.

"రేణూ! ఇంజక్షన్! అబ్బా! భరించలేను"

"గంట కూడా కాలేదు. మళ్ళీ ఇంతలోనే మరొకటి ఇవ్వడం మంచిదికాదు."

పేలవంగా నవ్వాడు జయదేవ్.

పాలిపోయిన పెదవుల మీద ఆ నవ్వు ఆమెకు ఎన్నో చెప్పింది.

"పిచ్చి రేణూ నువ్వు డాక్టరువు! నేను బతకనని నీకు తెలుసు అయినా ఏమిటీ పిచ్చి భ్రమ!"

"లేదు లేదు మీరు బ్రతుకుతారు నాకోసం. బ్రతుకుతారు నన్ను మళ్ళీ ఒంటరిదాన్ని చేసి ఇంత త్వరగా మీరు వెళ్ళిపోరు, పోలేరు" దాదాపు హిస్టీరియా పేషెంటులా అన్నది.

"అబ్బా రేణూ! ఈ బాధ భరించలేను. ఇంజక్షన్ ప్లీజ్!"

బాణం తగిలిన పులిలా అరిచాడు జయదేవ్. ఆ అరుపు ఆ బంగళాలోని స్తబ్దతనూ, బంగళా చుట్టూ ఆవరించి ఉన్న చీకటిని చీల్చుకుంటూ దిగంతాలలో కలిసిపోయింది.

రేణుక లేచింది.

సిరంజిలోకి మందు ఎక్కించింది.

యాంత్రికంగా ఇంజక్షన్ ఇచ్చింది.

పదినిముషాల్లో బాధ నెమ్మదించింది. జయదేవ్ కళ్ళు మూతలు పడసాగాయి.

దగ్గరగా కుక్కల ఏడుపు....

"కుక్కలు ఏడుస్తున్నాయి" కనురెప్పల్ని బలవంతంగా ఎత్తుతూ అన్నాడు జయదేవ్.

"మాలీ! మాలీ! ఆ కుక్కల్ని తరుము!" కిటికీ దగ్గరకు వెళ్ళి కర్టెన్ తొలగించి కేకపెట్టింది.

"వాటికి యమ భటులు కన్పిస్తున్నారేమో! అందుకే..." మత్తులోకి జారిపోయాడు.

"ఛ! ఛ! నీయమ్మ...పోండవతలకు..." మాలి కుక్కల్ని తరుముతున్నాడు.

జయదేవ్ ప్రఖ్యాతి వహించిన హోమియోపతి డాక్టర్. అతని ఖ్యాతి హైదరాబాద్ నగరానికి, అంధ్రప్రదేశ్ మాత్రమే పరిమితం కాదు. అతను భారతదేశం ఖ్యాతి వహించిన హోమియోపతి వైద్యుల్లో ప్రముఖుడు.

జయదేవ్ కు అకస్మాత్తుగా కడుపులో భయంకరమైన నొప్పి మూడు రోజుల క్రితమే ప్రారంభం అయింది. అంతవరకూ అతను ఆరోగ్యంగానే కన్పించేవాడు.

పెద్ద పెద్ద ఫిజిషియన్సూ, సర్జన్సూ పరీక్షించి జయదేవ్ కు లివర్ క్యాన్సర్ అని తేల్చారు. అది సెకండరీస్ లో ఉన్నదనీ మరో నాలుగు రోజుల కంటే బ్రతకదనీ తేల్చారు.

ఆ వార్త విని రేణుకాదేవి స్తబ్ధురాలైంది.

మరుక్షణం అలా చెప్పిన డాక్టర్ల మీద కోపం వచ్చింది.

తను కూడా ఒక డాక్టరనీ, తనూ ఎందరి విషయంలోనో మాట రఫ్ ఫాక్ట్ గా ఇలాంటి నిర్ణయాన్నే ఎన్నోసార్లు ఇచ్చిందనీ ఆ క్షణంలో విస్మరించింది.

"మీరు చెప్పేది నిజమేనా! రెండు రోజులక్రితం జ్వరం వచ్చింది. కొద్దిగా కడుపులో నొప్పి అన్నాడు. రెండో రోజుకు ఆ నొప్పి ఎక్కువైంది. నాలుగురోజులకంటే బ్రతకడని చెబుతున్నారు, ఎందుకండీ మన డిగ్రీలు, మన సైన్స్..." పిచ్చిగా అన్నది రేణుకాదేవి.

ముందు డాక్టర్స్ ఆమె ముఖంలో ఆశ్చర్యంగా చూశాడు.

అంతలోనే ఆమె మానసిక స్థితి అర్థం చేసుకొని జాలిగా చూశారు.

రేణుక తనేం మాట్లాడిందో అర్థం చేసుకుంది. సిగ్గుపడింది.

"క్షమించండి!" అని మాత్రం అనగలిగింది.

"పర్వాలేదమ్మా! నేను మీ మానసిక స్థితిని అర్థం చేసుకోగలను" అన్నాడు డాక్టరు సీతాపతి.

మానవుడు భరించలేని బాధ అది. ఆసుపత్రిలో చేరనన్నాడు జయదేవ్. డాక్టరు ఇచ్చిన మందులు మింగలేదు, ఇంట్లోనే రేణుకాదేవి డిస్పెన్సరీ ఉన్నది. సెలైన్ కూడా వరిజెక్టు అవుతున్నది. ఇంజక్షన్స్ మాత్రం ఇస్తూ ఉన్నది. అవి కూడా అవసరం అంటున్నాడు జయదేవ్. బాధకు పెథిడ్రిన్ ఇవ్వమంటున్నాడు. కాని రేణుకాదేవి ఒప్పుకోలేదు. స్పెషలిస్టులు గైడెన్స్ లో వైద్యం చెయ్యడానికి ప్రయత్నిస్తూనే ఉన్నది.

జయదేవ్ ముఖంలోకి చూసింది. రెప్ప వాల్చకుండా చూస్తూనే ఉన్నది.

ఈ ముఖం ఒకటి రెండు రోజుల తర్వాత తనకు మళ్ళీ కన్పించదా?

ఈ కంఠం మళ్ళీ తనకు విన్పించదా?

హి భగవాన్! అతను ఆఖరు క్షణాన్ని తను చూడాలా? ఆ ఆఖరు చూపును... ఏదో చెప్పాలనే బాధను వ్యక్తం చేసే ఆ చూపును తను చూడలేదు. ఆ ఆఖరు శ్వాస ఆగిపోవడాన్ని తను చూడలేదు.

జయదేవ్ ఎలోపతీకి ఎన్నో జబ్బుల్ని నయం చేశాడు.

అతనికి తన క్యాన్సర్ గురించి తెలియదా?

తెలిసే చెప్పకుండా ఉన్నాడా? ఎందుకు తను బాధపడుతుందనా?

కొంతకాలంగా పరధ్యానంగా ఉండటాన్ని తను గమనించింది. అతనిలోని ఏదో మార్పును పసికట్టింది. తను ఎన్నిసార్లు గుచ్చిగుచ్చి అడిగినా ఏమీ లేదని తోసేశాడు.

అవును! ఆ విషయం...తన క్యాన్సర్ విషయం ముందే తెలుసు.

అందుకే తనకేసి, అదోలా జాలిగా చూసేవాడు.

ఎవరి పనుల్లో వాళ్ళు బిజీగా ఉండేవాళ్ళు.

జయదేవ్ వెళ్ళిపోతున్నాడు.

తనను వంటరితనానికి వదిలేసి వెళ్ళిపోతున్నాడు.

ఒంటరితనం నన్ను తరిమింది. మృగం వెంటపడిన వేటగాడిలా నిర్దయంగా తరిమింది.

తను పరుగులు తీసింది.

ఎడారిలో పరుగులు తీసింది.

కనుచూపుమేరలో ఎండమావులు కూడా కన్పించక పరుగులు తీసింది.

పరుగెత్తి పరుగెత్తి అలసిపోయి పడిపోవడానికి సిద్ధంగా ఉన్న తనకు అనుకోకుండా చెట్టు నీడ దొరికింది.

ఆ చల్లటి నీడలో తను అలసటను తీర్చుకోవాలనుకున్నది.

శేష జీవితాన్ని ఆ నీడలోని నిశ్చింతగా గడపాలనుకున్నది.

కాని...పూర్తిగా అలసట తీరనేలేదు.

ఈలోపు చెట్టు కూకటివేళ్ళతో పెగిలి కూలడానికి సిద్ధంగా ఉన్నది.

మళ్ళీ తను ఎప్పటిలా....ఒంటరిగా....

కుక్కలు పిచ్చిగా ఏడుస్తున్నాయి.

రేణుకాదేవి గుండెలు దడదడలాడాయి.

అదిలించినా పోవడంలేదేం? మళ్ళీ మళ్ళీ తన యింటి ముందుకేవచ్చి ఏడుస్తున్నాయేం?

మాలి నిద్రపోతున్నాడేమో!

తన గదిలో ఏదో చప్పుడు కాకుండా అతను కోసం పొంచి కూర్చున్నది.

అది తనకు కన్పించకపోయినా, దాని ఉనికి తనకు స్పష్టంగానే తెలుస్తున్నది.

భయంభయంగా గది నలువైపులా చూపులు సారించింది.

తనకు ఎవరూ లేరు ఈ కష్ట దశలో ఆదుకోవడానికి లేరా? లేకేం ఉన్నారు

తమ్ముళ్ళు ఉన్నారు.

వాళ్ళ భార్యలు ఉన్నారు.

వాళ్ళ పిల్లలు ఉన్నారు.

చెల్లెళ్ళు ఉన్నారు.

వాళ్ళ భర్తలు ఉన్నారు.

వాళ్ళ పిల్లలు ఉన్నారు.

టెలిగ్రాం ఇస్తే అందరూ వస్తారు.

కాని తనకే ఇవ్వాలనిపించడం లేదు.

ఎందుకని?

వాళ్ళకు తను జయదేవ్ ను చేసుకోవడం ఇష్టంలేదు.

తమ్ముళ్ళు మనసులో ఏముందో తెలియదు. పైకిమాత్రం ఎలాంటి భావాలు వ్యక్తం చెయ్యలేదు. చెల్లెళ్ళు మూతులు ముడుచుకుంటే, మరదళ్ళు మూతులు తిప్పారు.

ఇప్పుడు తన భర్త చావు బతుకుల్లో ఉన్నాడని టెలిగ్రాం ఇస్తే అందరూ వస్తారు.

పోటీలుపడి సానుభూతి చూపిస్తారు.

వాళ్ళు అలా చేస్తారో లేదో కాని తనకు మాత్రం అలాగే అనిపిస్తుంది.

జయదేవ్ కు దగ్గిర బంధువులు ఎవరూ లేరు.

ఉన్న ఒక్క చెల్లెలూ ఆ మధ్యనే పోయింది.

దూరం బంధువులు ఉన్నారు. ప్రాణ స్నేహితులు ఉన్నారు. హితైషులున్నారు.

పగలంతా జనం వస్తూ పోతూనే ఉన్నారు.

స్నేహితులూ, సన్నిహితులూ పొద్దుపోయిన దాకా ఉంటున్నారు. అవసరమయితే ఫోన్ చెయ్యమని వెళ్ళిపోయారు.

పక్క గదిలో నర్స్ నిద్రపోతూ ఉన్నది. నర్స్ కు నిద్రవస్తుంది కాని తనకు మూడురోజులుగా కన్ను మూతపడటం లేదు.

"అమ్మా!" నర్స్ వచ్చింది.

రేణుక ఆలోచనల నుంచి ఉలిక్కిపడింది.

"రెండు అయింది. నేను కూర్చుంటాను. మీరు పడుకోండి"

"వద్దులే! నాకు నిద్ర రావడం లేదు. నువ్వెళ్ళి పడుకో!"

"నిద్రపోక పోయినా కొంచెంసేపు అలా నడుంవాల్చండమ్మా!"

రేణుక వచ్చింది.

పక్కనే ఉన్న సోఫామీద పడుకున్నది.

నర్స్ ఆమె ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుంది.

రేణుకాదేవి శారీరకంగా, మానసికంగా బాగా అలసిపోయింది. అయినా నిద్ర రావడంలేదు. ఏడుపు రావడం లేదు. మనసు క్షణక్షణం బరువెక్కిపోతూ ఉన్నది. ఏడవాలని ఉన్నది. మనసారా ఏడవాలని ఉన్నది. మనసులోని బరువును దించుకోవాలని ఉన్నది. కాని కళ్ళలోకి నీరు రావడం లేదు.

కుక్కలు ఏడుపు కొంచెం దూరంగా విన్పిస్తోంది.

కుక్కలు మళ్ళీ ఏడుస్తున్నాయి. కాని వాటి ఏడుపు అంతగా భీతిని కలిగించడం లేదు. ఎందుచేత?

ఈ గదిలో తనకు తోడుగా మరోవ్యక్తిలా కూడా ఉన్నది. అందుకే!

మనిషికి ముఖ్యంగా కావాల్సింది ఇదేనా?

మనిషికి జీవితంలో కావాల్సింది మరో మనిషి తోడేనా?

అవును!

మనసును అర్థం చేసుకోగల మరో మనసు కావాలి.

మనిషి ఒంటరిగా బతకలేడు.

అయినా డబ్బుంటే అన్నీ సాధించుకోవచ్చునని భ్రమపడ్తాడు. సంపాదనలో పడి జీవితాన్ని ప్రేమించడం మర్చిపోతాడు. డబ్బును మాత్రమే ప్రేమిస్తాడు.

తనూ సంపాదించింది.

తనకు తెలియకుండానే తను డబ్బును ప్రేమించడం ప్రారంభించి ఉండాలి. అందుకే తనవాళ్ళంతా తన డబ్బుకోసమే తన చుట్టూ తిరుగుతున్నారనుకుంది. అందులో కొంతైనా నిజం ఉండి ఉండవచ్చును.

ఒకవేళ జయ చనిపోతే?

ఇంత పెద్ద బంగళాలో మళ్ళీ తను వంటరిగా....

"అమ్మా! అమ్మా!"

నర్స్ లేపుతున్నది.

రేణుక తృళ్ళిపడి లేచి కూర్చుంది.

ఇదేమిటి? తను నిద్రపోయింది. ఆలోచిస్తూ సోఫాలో నడుం వాల్చింది. ఏమైంది?

"అమ్మా!"

నర్స్ ముఖంలోకి చూసింది.

రేణుకకు అర్థం అయింది.

అయిపోయింది. అంతా అయిపోయింది. జయదేవ్ వెళ్ళిపోయాడు.

రేణుక జయదేవ్ మంచం దగ్గరకు వెళ్ళింది, చూస్తూ నిలబడిపోయింది.

వారంరోజుల నుంచి తను ఒక్క రాత్రి కూడా జయ మంచం వదిలి దూరంగా వెళ్ళలేదు.

ఇవాళ! తను నిద్రపోయింది.

జయ చివరిసారిగా కళ్ళతోనే తనను వెదికాడేమో!

ఏదో చెప్పాలని ప్రయత్నించాడేమో!

ప్రతి వ్యక్తి చివరిసారిగా ఏదో చెప్పాలని ప్రయత్నిస్తాడు.

పెదవులు కదలవు. కేకలు చూపుల్లోనే చెబుతాడు.

కాని...కాని...తను ఏం కోరుకుంది?

తను తన జయ ఆఖరిచూపును చూడకూడదనుకుంది. అతని ఆఖరి ఊపిరి ఆగిపోవడం చూడకూడదనుకుంది. ఆఖరిసారిగా తల వాలిపోవడం, తను చూడలేననుకుంది. భగవంతుణ్ణి ఆ భయంకరమైన క్షణం తనకు కల్పించకుండా చెయ్యమని ఈ వారంరోజులుగా ప్రార్థిస్తూనే ఉన్నది. చివరకు అదే జరిగింది. వరసగా కార్లు రాసాగాయి. జయదేవ్ బంధుమిత్రులు వస్తున్నారు.

అనేకమంది ప్రముఖ డాక్టర్లు వచ్చారు. రేణుక ఏడవలేదు.

గోడకు చేరబడి కూర్చుండిపోయింది. కర్మకాండ పూర్తి అయింది.

మూడోనాటికి పేపర్లో వార్త చదివి రామం, రామం భార్యా, రేణుక చెల్లెళ్ళూ, మరుదులూ వచ్చారు. తనవాళ్ళందర్నీ చూడగానే రేణుక మనసులో గడ్డకట్టిన దుఃఖం కరగసాగింది. కన్నీరుగా ప్రవహించింది. రేణుక తన వాళ్ళు వస్తారని ఆశించలేదు.

వాళ్లందర్నీ చూశాక తను వంటరిది కాదనిపించింది. జయదేవ్ బంధువులు అతనిపేర ఉన్న బ్యాంకు బ్యాలెన్సు గురించి వాకబ్ చేశారు. జయదేవ్ పేరుమీద ఏమీలేదనీ, ఆరునెలల క్రితమే ఇంటితోసహా రేణుక పేరుమీద మార్పించాడని అంతవరకూ రేణుకకు కూడా తెలియదు.

రేణుకాదేవి బలగాన్ని చూసి జయదేవ్ బంధువులు త్వరగానే వెళ్ళిపోయారు.

తన వాళ్ళను తనే తప్పుగా అర్థం చేసుకున్నది.

రక్త సంబంధం "బ్లెడ్ ఈజ్ థిక్కర్ దన్ వాటర్" అన్నారు. కాని...కాని... అందు కొంతవరకే నిజం ఉందేమో? జయదేవ్ కూ తనకూ ఏ రక్తసంబంధం ఉన్నది.

రామ కొడుకు గౌతమ్ కు పదేళ్ళు నిండాయి. వాడు కూడా వచ్చాడు. సరళ పిల్లలూ, రాధ పిల్లలూ వచ్చారు.

పిల్లలు మధ్య రేణుక తన దుఃఖాన్ని మర్చిపోయింది.

## 34

"రేపు వెళ్తాం అక్కా!" అన్నాడు రామం డైనింగ్ టేబుల్ ముందు కూర్చుని?"

"ఇంత త్వరగానా?"

"శెలవు అయిపోయింది"

"మేము ఇవాళ సాయంత్రమే వెళ్ళాలనుకుంటున్నాం" అన్నది రాధ.

రాధ భర్తకు మద్రాసు ట్రాన్స్ ఫర్ అయింది. ప్రస్తుతం మద్రాసులోనే ఉంటున్నారు.

సరళ భర్త విజయవాడ కాలేజీలో లెక్చరర్ గా ఉన్నాడు.

"మేమూ రేపు కృష్ణాకు వెళ్తాం అక్కా!" అన్నది సరళ.

సరళకు ముగ్గురు పిల్లలు. ముగ్గురూ ఆడపిల్లలే.

రామానికి మరో కూతురు పుట్టింది. ఆ పిల్లకు ఐదేళ్ళు.

"పాపను తీసుకొస్తే చూసేదాన్ని!" అన్నది రేణుక.

"గౌతమ్ ను నీదగ్గర వదిలేద్దామనుకుంటున్నాను! నీకు కొంత కాలక్షేపంగా ఉంటుంది" అన్నాడు రామం.

రేణుక ముఖం సంతోషంతో విప్పారింది.

రాధ భర్త ముఖంలోకి చూసింది.

"బావగారు చాలా తెలివైనవారు. మీకు ఎటూ పిల్లలు లేరు. ఆస్తికి వారసుడౌతాడని కొడుకుని వదిలేస్తానంటున్నాడు. దత్తత కార్యక్రమం కూడా ఇప్పుడే కానిస్తే అందరం చూస్తాం. మళ్ళీ అందరికీ వచ్చే తీరిక ఉండొచ్చు ఉండకపోవచ్చు" అన్నాడు సుధీర్ వ్యంగ్యంగా.

రేణుక తెల్లముఖం వేసింది.

"ఏం? మీ కూతుర్ని కూడా ఇక్కడే ఉంచాలనే ప్రయత్నంలోనే వచ్చారుగా?" రామం భార్య అందుకుంది.

"అక్కకు తోడుగా ఉంటుందని అనుకున్నాం. ఎంతయినా ఆడపిల్ల ఆడపిల్లే! అక్క చెయ్యి కాలూ పడిపోయిన రోజు గౌతమ్ పెళ్లాం చూస్తుందా? ఆడపిల్లను పెంచుకుంటే... ఆడవాళ్ళ అనుబంధమే వేరు" అన్నది రాధ.

రేణుక అందర్నీ మార్చి మార్చి చూసింది.

"మీరందరూ ఎవరి స్వార్థం వాళ్ళే చూసుకుంటున్నారు. ఇంటికి చిన్నదాన్ని ముగ్గురూ ఆడపిల్లలు. మా ఆయన సంపాదన అంతంతమాత్రమే. అక్కయ్య నా పిల్లనే పెంచుకుంటుంది. అక్కయ్య ఎవర్ని ఉంచమంటే వాళ్ళనే ఉంచేద్దామని ముగ్గుర్నీ వెంటేసుకొచ్చాను" అన్నది సరళ.

సరళ భర్త సత్యనారాయణకు ఆ సంభాషణ నచ్చినట్టు లేదు. గబగబా అన్నం తినేసి చెయ్యి కడుక్కుని వరండాలోకి వెళ్ళి కూర్చున్నాడు.

హారిబుల్! ఇందుకా వీళ్ళు వచ్చింది. అసలు తనే గౌతమ్ ను ఉంచమని అడగాలనుకుంది.

సరళ కూతుర్లలో ఒకదాన్ని ఉంచెయ్యమని చెప్పాలని కూడా అనుకుంది. రాధకు ఇద్దరు పిల్లలు. ఆమెకు అభ్యంతరం లేకపోతే అమూల్య చదువు సంధ్యల భారం తనే చూస్తానని తన దగ్గిరకు పంపించమని చెప్పాలనుకుంది.

కాని...కాని....ఇదేమిటి?

వీళ్ళంతా తన కోసం రాలేదు.

తనను కష్టంలో ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో రాలేదు.

"పెంచుకుంటే మగపిల్లవాణ్ణి పెంచుకోవాలి. తలకొరివి పెట్టడానికి ఉపయోగపడ్తాడు. పాపం బావగారికి ఎవరు కర్మ చెయ్యాలనే విషయం మీద ఎంత తర్జనబర్జనలు జరిగాయట" అన్నాడు రామం.

"ఆపండి!" పిచ్చిగా అరిచింది రేణుక.

అందరూ బిగిసిపోయారు.

"తెల్లవారే సరికి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళండి. నేను బ్రతికుండానా మీరెవరూ నాకు కన్పించకండి" రేణుక దాదాపు పిచ్చిదానిలా అన్నది.

"మా పిల్లల్ని మేం పెంచలేమనుకున్నారా? మీ మంచికే ఏదో మీ తమ్ముడు పాకులాడారు. నేను వద్దంటూనే ఉన్నాను. మాకు ఉన్నది ఒకే ఒక మగ పిల్లవాడు" రామం భార్య పంచాంగం విప్పింది.

"మాకు మాత్రం ఏ పదిమంది ఉన్నారు? నీ మాత్రం మా పిల్లల్ని మేమూ పెంచుకోగలం. రక్తసంబంధం తెంచుకోలేక. నీకెందుకుంటుంది?" రాధ రామం భార్యతో ఘర్షణకు తలపడింది.

సరళ పిల్లిలా లేచి భర్త కూర్చున్న వరండాలోకి వెళ్ళింది.

సరళ భర్త ముఖంలోకి చూసి భయపడింది. సత్యనారాయణకు కోపం వచ్చింది.

ఆ సమయంలో వాళ్ళంతా అలా మాట్లాడటం సంస్కారాన్ని వెలిబుచ్చడంలా అనిపించింది. తన భార్య కూడా అదే ధోరణిలో మాట్లాడేసరికి కోపం వచ్చింది.

"బట్టలు సర్దుకో! బయలుదేరు!" అన్నాడు సత్యనారాయణ.

భర్త ముఖంలోకి ఓ క్షణం చూసింది. లోపలకు వెళ్ళిపోయింది.

రామం భార్య, రాధ గొంతులు పెంచారు.

"ఇక ఆపండి!" గట్టిగా అరచి అక్కడ్నుంచి వెళ్ళిపోయింది రేణుక.

రామం చాలా మారాడనీ, భార్య మాటకు భయపడుతున్నాడని రేణుక ముందే అర్థం చేసుకుంది.

సరళ, సత్యనారాయణ వెళ్ళిపోయారు.

రేణుక ఉండమని చెప్పలేదు.

"వెళ్తున్నాం!" అంటే మంచిది!" అన్నది ముక్తసరిగా.

అందరూ వెళ్ళిపోయారు.

## 35

"అమ్మా, ఏదైనా పని ఇప్పించండమ్మా! బాగా బతికినదాన్ని!" రేణుక చివ్వున తలెత్తి చూసింది.

దాదాపు డెబ్బయ్ ఏళ్ళ ముసలమ్మ.

"నువ్వు పని చేస్తావా? ఏం పని చేస్తావ్?"

"ఊడుస్తాను. పక్క వేస్తాను. నువ్వు ఒంటరిగా ఉంటున్నావుగా? నీకు తోడు ఉంటాను" అన్నది ముసలిది.

"నీ పేరేమిటి?"

"బంగారమ్మ?"

"నీకు ఎవరూ లేరా?"

"లేకేం తల్లీ! ఇద్దరు కొడుకులున్నారు. వాళ్ళు మంచివాళ్ళేగాని వాళ్ళ భార్యలే..."

"నీ కొడుకులు మంచివాళ్ళయితే భార్యలు ఏం చేస్తారు అవ్వా? పరాయి తల్లి కన్నవాళ్ళు కనక తప్పంతా వాళ్ళదిగానే కన్పిస్తుంది"

"అవును తల్లీ! నిజమే. మన బంగారం మంచిదయితే...ఆ ధర్మరాజు వెళ్ళిపోయాడు.

ఈరోజు చూడమని నన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. ఇంత బతుకూ బతికి అడుక్కు తినలేక పని కోసం తిరుగుతున్నాను తల్లీ. ఈ వయసులో నాకు పనెవరిస్తారమ్మా?"

"మరి నా దగ్గిరకు ఎలా వచ్చావ్? నేను వంటరిదాన్నని ఎవరు చెప్పారు?"

"ఆ మూడో ఇంట్లో పని అడగటానికి వెళ్ళాను. ఈ బంగళాకు వెళ్ళమన్నారు"

ఆ రోజు నుంచి బంగారమ్మ రేణుక ఇంట్లో ఉండిపోయింది.

బంగారమ్మను చూస్తున్నప్పుడల్లా రేణుక మనసులో ఒక ఆలోచన మెదలసాగింది. ఆమె ఆలోచన కార్యరూపం పొందడానికి అట్టే సమయం పట్టలేదు.

## 36

ఇప్పుడు రేణుక వంటరిది కాదు.

ఆ ఇంటిని ఆశ్రయ హీనులైన వృద్ధుల ఆశ్రమంగా మార్చింది.

దాదాపు వృద్ధుల గృహం ప్రారంభించి రెండేళ్ళు పూర్తి అవుతోంది. అరవైమంది వృద్ధులు ఉన్నారు.

రేణుక తన సంపాదనతో ప్రతిపైసా వాళ్ళకే వినియోగిస్తున్నది. తను అవుట్ హౌస్ ను బాగుచేయించుకొని అందులో ఉన్నది.

హోంలో ఉన్న వృద్ధులను చూడ్డానికి ఒక నర్సునూ, ఒక మేట్రన్ నూ అపాయింట్ మెంటు చేసింది. ఆయాలు ఉన్నారు. పని కుర్రాళ్ళు ఉన్నారు.

రేణుక ఎక్కువ సమయాన్ని వారి మధ్య గడుపుతుంది. వారికి పేపరు చదివి వినిపిస్తుంది. వారిని మానసికంగా, ఉత్సాహంగా ఉండే విధానాలను గురించి ఆలోచిస్తూనే ఉంటుంది.

ఇప్పుడు రేణుకకు ఎందరో తల్లులు, ఎందరో తండ్రులు రాత్రి పొద్దుపోయేదాకా కబుర్లు చెబుతూ వారితోనే ఉంటుంది. కొన్ని సమయాల్లో వాళ్ళతోపాటు కూర్చొని భోజనం కూడా చేస్తుంది.

## 37

"అమ్మా!" ఆయా రేణుక ఆఫీసు గదిలోకి వచ్చింది.

రాస్తున్న పెన్ ఆపి తల పైకెత్తి చూసింది.

"ఒక ముసలాడు వచ్చాడమ్మా!" అన్నది ఆయా.

"అలా అనొద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను?"

"తప్పేనమ్మా!"

"సరే! అతనిని రమ్మను" పెన్ కు కేస్ పెట్టి పక్కన పెట్టింది. రెండు మోచేతులూ బల్లమీద ఆనించి, ఒక అరచేతిని మరో అరచేతి మీద పెట్టుకొని, ఆ చేతుల మీద గడ్డం ఆనించి ఆగంతకుడి కోసం వాకిలి కేసి చూసింది.

లోపలకు వస్తున్న వ్యక్తిని విస్మయంగా చూస్తూ ఉండిపోయింది.

అతను వాకిట్లో నిలబడి చిరునవ్వు నవ్వాడు.

రేణుక చూస్తూనే ఉండిపోయింది.

రేణుక సాయంతో లోపలకు వచ్చాడు. రేణుకకు ఎదురుగా నిల్చున్నాడు.

రేణుక స్థాణువులా బిగుసుకొని ఉండిపోయింది.

ఆగంతకుడు రెండడుగులు ముందుకు వేశాడు.

"రేణూ! బాగున్నావా?"

రేణుక తృళ్ళిపడింది.

ఆమె మెదడు చురుగ్గా పనిచెయ్యసాగింది.

"నన్ను గుర్తించలేదా రేణూ!" నవ్వాడు.

"ఆ నవ్వు అలాగే ఉందే. మార్పేమీ లేదు."

"రేణూ! నన్ను క్షమించగలవా?" ముందుకు వంగి ఆమె చేతులు పట్టుకోబోయాడు.

ఆమె చటుక్కున చేతులు కిందకు దించుకుంది.

"రేణూ!"

"అలా పిలవకు!"

రామచంద్రం ఎదురుగా ఖాళీగా ఉన్న కుర్చీలో ఎక్కువసేపు నిల్చునే ఓపిక లేనట్టు కూలబడ్డాడు.

"ఎవరు నువ్వు? ఎందుకొచ్చావ్?" అతని ముఖంలోకి తీవ్రంగా చూస్తూ అన్నది.

అంత వృద్ధాప్యంలో కూడా అతని ముఖంలో కాఠిన్యం కన్పించింది. ఆ కళ్ళలో కుటిలత్వం కన్పించింది. ఆ పలుకులో నీనితం, ఆ నవ్వులో విషం కన్పించాయి.

"రేణూ! నామీద కోపం తగ్గలేదా?"

"రేణూ కాదు రేణుకాదేవి అను!" ఆవేశంగా అన్నది.

"ఓ క్షణం ఆగి "నీ మీద కోపమా? ఎందుకూ? నీకూ నాకూ సంబంధం ఏమిటి కోపం రావటానికి?"

"అలా అనకు ఎంతలేదన్నా రెండేళ్ళు నాతో కాపురం చేశావ్!"

రేణుక మనస్సు జుగుప్సతో నిండిపోయింది.

"యూ గెట్ అవుట్!" పిచ్చిదానిలా అరిచింది.

అతను కుర్చీలో నుంచి లేవలేదు. తల వంచుకొని విచారంగా కూర్చున్నాడు. అదంతా నటనేనని ఆమెకు అర్థం అయ్యింది.

"ఎందుకొచ్చావ్?"

సమాధానం లేదు.

"చెప్పవేం?"

"నీకు నా అవసరం ఉంటుందనుకున్నాను"

రేణుక గలగల నవ్వింది. గాజు గ్లాసు గచ్చు మీద పడ్డట్టు శబ్దం అయింది.

ఆమె ఎప్పుడో గాని అలా నవ్వదు.

"కాదు! సారీ! నాకు నీ అవసరం ఉన్నది"

"ఏం చెయ్యమంటావ్?"

"నీ ఇంట్లో ఆశ్రయం ఇస్తావనే ఆశతో వచ్చాను"

రేణుక పెదవుల మీద హాస్యరేఖ లీలామాత్రంగా కనిపించి మాయమైంది.

"ఆశ్రయం కావాలా? నా యింట్లోనా?"

"అవును! నువ్వు ఇవ్వకపోతే ఈ వయసులో నాకు ఇంకెవరిస్తారు"

"నా ఇంట్లో ఆశ్రయం నీకు ఏ హోదాలో ఇవ్వాలి? మాజీ భర్తగానా?"

రామచంద్రం మాట్లాడలేదు.

"సారీ! రామచంద్రం! నీకు నాకూ ఎలాంటి సంబంధం లేదు ఇక వెళ్ళొచ్చు"

"రేణూ!"

"యూ షట్ అప్! మరోసారి అలా పిల్చావంటే బాయ్ చేత గెంటిస్తాను జాగ్రత్త?" వెర్రిదానిలా అరిచింది.

రామచంద్రం నిట్టూర్చాడు.

లేచి నిల్చున్నాడు.

ఆశ చావక మరొకసారి రేణుక ముఖంలోకి చూశాడు.

"నా డబ్బంతా అది కాజేసింది. నాకు తిండి పెట్టేవాళ్ళు కూడా కరువైనారు."

డైవర్స్ అయ్యాక అతను ఎవర్తెనో పెట్టుకొని ఉన్నాడని విన్నది. తనతో కలిసి ఉంటున్న రోజుల్లోనే ఆమెతో అతనితో సంబంధం ఏర్పడిందని ఆ తర్వాత రేణుకకు తెలిసింది.

"తిండి కావాలా?" అతనికేసి జాలిగా చూస్తూ అన్నది.

అతను వెంటనే సమాధానం ఇవ్వలేదు.

"తిండి పెడ్తాను"

రామచంద్రం తలెత్తి రేణుక ముఖంలోకి చూశాడు.

"హోంఫర్ ఏజ్డ్ (వృద్ధుల గృహం) నడుపుతున్నానని వినే ఉంటావ్!"

అతను చూస్తూ ఉండిపోయాడు.

"కావాలంటే అందులో అడ్మీషన్ ఇస్తాను"

రామచంద్రం తల దించుకున్నాడు.

"అదికూడా ఒక షర్తు మీద"

ఆమె ముఖంలోకి అతను ప్రశ్నార్థకంగా చూశాడు.

"అక్కడ అందరితోపాటే ఉండాలి. మన గతాన్ని గురించి చెప్పకూడదు. అలా చెప్పిన మరుక్షణంలో నిన్ను అక్కడ్నుంచి గెంటించి వేస్తాను. అలా ఇష్టం అయితే చెప్పు"

రామచంద్రం ఓ క్షణం ఆలోచిస్తూ నిల్చున్నాడు.

అతని సమాధానం కోసం ఆమె చూస్తూ కూర్చుంది.

రామచంద్రం గిర్రున వెనక్కు తిరిగాడు.

కర్రను గట్టిగా నేలమీద తాటిస్తూ బయటికి నడిచాడు.

"హూ! చింత చచ్చినా పులుపు చావలేదు"

పైకే అనేసింది రేణుక.

*** సమాప్తం ***